


KALANILAYAM

CULTURAL AND SOCIAL ORGANIZATION

KARIMNAGAR

కె.వి. నరేందర్





కాలుతున్న పూలతోట

కాలుతున్న పూలతోట

(కథల సంపుటి)

Rajendar- Vagala
Godavarykany.

కె.వి. నరేందర్

కళా నిలయం ప్రచురణలు - 4
కరీంనగర్.

కాలుతున్నపూలతోట
KALUTUNNA POOLATHOTA
(Short Stories)
By **K.V. NARENDAR**
Mothe Road, Jagtial-505 327.
Phone: (08724) 24094

First Edition : August, 2000

Cover Photo
Narayan Panje (Mumbai)

Cover Design
Ramesh Vanamala (Jagtial)

Published by
KALA NILAYAM - KARIMNAGAR

Edited by
Dr. Kaluva Mallaiah,
Dr. G. Laxman Rao, Lecturer

Price : 50-00

Copies Available at :
Vishalandra Book House all Branches

Composed & Printed at :
MEGHA COMPUTERS
Thahasil Chowrastha, Jagtial-505 327
Phone: 26162

రచయిత పరిచయం

(ఆదివారం వార్త దినపత్రికలో "యువ సంతకాలు" శీర్షికన డా॥ నాగభైరవ కోటేశ్వర రావ్ (ఒంగోలు) గారు రాసిన పరిచయం యథాతథంగా...)

ఆధునిక కవిత్వపు వెలుగు జెండాలను చేతబుచ్చుకొని కరీంనగర్ జిల్లాలో ఎందరో యువకులు జైత్రయాత్ర సాగిస్తుంటే-కథానికలదారుల్లో కొత్తకాంతులు ప్రసరింపజేయడానికి ప్రయోగాలు చేస్తూ ఒక యువకుడు సాగిపోతున్నాడు.

అతని పేరే ..... **కె.వి. నరేందర్.**

నరేందర్ సాహిత్యలోకానికి మరీ కొత్తవాడేమీ కాదు. ఆంధ్రదేశపు ఒక టెలివిజన్ ఛానల్‌లో ఎన్నో కార్యక్రమాల్ని తన కలంతో పండించాడు. ఉత్తమ రచయితగా, ఉత్తమ ఉపాధ్యాయుడుగా కీర్తి కిరీటాన్ని శిరస్సుపై అలంకరించుకున్నాడు. గతంలో 'మనోగీతం' అనే 30 కథల సంపుటిని, బేబీ ఓ బేబీ, నల్ల సముద్రం సీరియల్స్‌ని ప్రముఖ దిన పత్రికల్లో ప్రచురించాడు.

అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి అనే మూడు కథా సంపుటాల్ని ప్రచురించాడు. ఇందులోనరేందర్ చేసిన ప్రయోగం తెలుగులో కొత్తది. ఒకే 'కాన్సెప్ట్' మీద కొన్ని కథలు రాసి వాటిని ఒక సంపుటిగా ప్రచురించడం. 'అమ్మ' పేరుతో శిఖామణీ, చీకోలు సుందరయ్య డజన్ల కొద్ది కవితలను సంకలనం చేసారు. అవి వివిధ రచయితలు రాసినవి.

ఇప్పుడు నరేందర్ చేసిన పని అలాంటిది కాదు. తన కథానిక వస్తువును వివిధ కోణాల నించి, వివిధ రసాల్లో దర్శించి, కథనం చేసి కథలల్లి ఒక్కచోట కుప్పవోయడం. ఏడు రంగుల్ని లోపలుంచుకొని ఏక వర్ణాన్ని చిమ్మే ఇంద్రధనస్సు ఈ కవి.

శిల్పంలోనూ, నిర్వహణలోనూ దేనికదే ప్రత్యేకంగా వికసించి నరేందర్ చేయి తిరిగిన తనాన్ని చాటుతుంది ప్రతీకథ. నరేందర్ చేసిన 'సింగిల్ కాన్సెప్ట్'ల ప్రయోగం తెలుగులో కొత్త కావచ్చు. కొన్ని ఇతర భారతీయ భాషల్లో యిలాంటి ప్రయోగాలున్నాయి. నరేందర్ కథలు కొన్ని తమిళ, కన్నడ, ఒరియా భాషల్లోకి అనువదించబడినాయి.

నరేందర్ 'రాష్ట్ర ప్రభుత్వ యువ విశిష్ట అవార్డ్, విశాల సాహితీ అవార్డ్" లతో పాటు సి.నా.రె., గోపీ వంటీ సాహితీ సుగతుల ప్రశంసలు అందుకున్నాడు.

కొందరు యువ రచయితలకు ఏం రాస్తున్నామో తెలిసినంతగా ఎలా రాస్తున్నామో తెలియదు. మరి కొందరిలో యిది తారుమారవుతుంది. ఎలా రాయాలో తెలుస్తుంది కాని ఏమి రాయాలో తెలియదు.

ఏమి రాయాలో, ఎలా రాయాలో రెండూ తెలిసిన సవ్యసాచి రచయిత నరేందర్. కొత్తదనం కోసం మొహం వాచిపోతున్న సాహితీ ప్రియులకు ఇవాళ నరేందర్ లాంటి ప్రయోగశీలురైన యువకులు కావాలి. కంప్యూటర్ పోటీనుంచి కళ తట్టుకొని నిలువ గలగడానికి మార్గాంతరం యువకులు అన్వేషించాలి.

ప్రతిభావంతుడు, ప్రయోగశీలి అయిన నరేందర్‌ని అభినందిస్తున్నాను.

-డా॥ నాగభైరవ.

కళా నిలయం తరపున... ఒక మాట

ఈ కథల సంపుటి చదువుతున్న మీకు మా నమస్సుమాంజలి.

కళానిలయం పేరున కరీంనగర్ జిల్లాలో వేలాది సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కళామతల్లికి నీరాజనాలర్పిస్తున్న మా సాంస్కృతిక సంస్థ అక్షర ఉజ్వల, జన్మభూమి, కుటుంబనియంత్రణ, పచ్చదనం-పరిశుభ్రతతో పాటు ఎన్నో చైతన్యవంతమైన కళారూపాల్ని ప్రదర్శించింది. కలకత్తా, చెన్నయ్ యూత్ ఫెస్టివల్స్‌లోనూ, ఢిల్లీ సాంస్కృతిక స్వర్ణోత్సవాల్లోనూ, హైదరాబాద్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్స్‌లోనూ, ఆగ్రా ఆలిండియా రేడియో ఓపెన్ ఎయిర్ ప్రోగ్రామ్స్‌తో సహా, తెలంగాణా బోనాల నృత్యాన్ని దేశంలో చాలా చోట్ల మా 'కళానిలయం' కళాకారులు ప్రదర్శించి అవార్డులు, రివార్డులు అందుకున్నారు.

దూరదర్శన్, ఈటీవి హృదయాంజలి, సరిగమలు, జెమిని అంత్యాక్షరి కార్యక్రమాల్లో కూడా పాల్గొని మా సంస్థకి ఒక ప్రత్యేక గుర్తింపుని తీసుకొచ్చాం.

సంస్థ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు :

సాహితీపరంగా 'కళా నిలయం' సంస్థ కరీంనగర్ జిల్లాలోని సాహితీ సంస్థల కంటే ఎంతో ముందుండి కేవలం ఆవిష్కరణలకే పరిమితం కాకుండా పుస్తక ప్రచురణలు చేపట్టి పలువురు కవులు, రచయితల్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో మా సంస్థ మొదటి వార్షికోత్సవములో కళ్యాణం శ్రీనివాస్ గారి కవితా సంపుటి హృదయం, రెండవ వార్షికోత్సవంలో పిడికిలి, మూడవ వార్షికోత్సవంలో ఆధ్యాత్మికంగా సాగే సుందరాచార్య గారి 'శ్రీ కృష్ణతత్వం' పుస్తకాలు అచ్చువేసి ఆవిష్కరణ సభలు నిర్వహించడం జరిగింది.

సాంస్కృతిక కార్యక్రమాలన్నీ ఒకరోజుకే ఒక ప్రదేశానికే పరిమితమవుతున్నాయని భావించి, శాశ్వతంగా వుండిపోయేలా, అందరి మనసుల్లో చెరగని ముద్రవేసే మరో మంచి పుస్తకం వేయాలనే సదాశయంతో ప్రముఖ రచయిత కె.వి.నరేందర్ గారి 'కాలుతున్న పూలతోట'ని మీ చేతుల్లో వుంచుతున్నాం. ఈ పుస్తకం చదివి మీ అభిప్రాయాలతో మీ కళానిలయం సంస్థని ఆశీర్వదిస్తారని మనసారా ఆశిస్తున్నాం.

కళారంగంలో మా సంస్థ తెలంగాణా స్థాయి జానపద పాటలు, నృత్యాలు, సినిమా పాటలు, నృత్యాలు మరెన్నో కార్యక్రమాలు ఏటేటా నిర్వహించి క్యాష్ అవార్డ్స్, సత్కారాలతో పలువురిని సన్మానిస్తుంది.

అలాగే సామాజిక సేవారంగంలో కూడా మా కళానిలయం తనవంతు పాత్రని నిర్వహిస్తుంది . కరీంనగర్‌లో బ్లడ్ డొనేషన్ క్యాంప్, పొరండ్ల, ముంజంపల్లిలో మెడికల్ క్యాంప్స్‌తో పాటు యన్.వై.కే. సాంస్కృతిక సేవా కార్యక్రమాలన్నింటినీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో బాలల కళోత్సావాలకు పూర్తి సహకారాన్ని కళానిలయం అందిస్తోంది.

కళానిలయం సంస్థ కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో చిలుకలూరి పేట, తెనాలి, తిరుపతి, ఆత్రేయపురం, రాజమండ్రి, కడప, ఆదిలాబాద్, హైదరాబాద్‌లలో వివిధ సంస్థలు నిర్వహించిన పలుపోటీల్లో బంగారు పతకాలు, ప్రథమ బహుమతులు అందుకోవడం జరిగింది.

ఇలా మా కళానిలయం ఒక సాంస్కృతిక సంస్థగానే కాక, సాహితీ, కళా, సేవా రంగాల్లో తనవంతు పాత్రని పోషిస్తూ ప్రగతి బాటలో పయనిస్తోంది.

అందుకే మా 'కళానిలయాని'కి మీ ఆశీస్సులను కోరుతూ ఈ పుస్తకంపై మీ సమీక్షల్ని, అభిప్రాయాల్ని ఆహ్వానిస్తుంది.

సదా మీ సేవలో....

కళానిలయం
5-6-9, పాతబజార్,
కరీంనగర్-505 001

కోడూరి రవీందర్ గౌడ్
కె. మహేందర్ రాజు
కె. శ్రీనివాసాచారి

నన్ను 'పెన్ను' తట్టి పోత్సహించే పెద్దలు

శ్రీ విజయ బాపినీడు


శ్రీ నూతన్ ప్రసాద్

'కార్టూనిస్ట్' ఆగాచార్య గార్లకు

ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ... నరేందర్

'కథ'న సూచిక

ఈ కథల్ని అచ్చు వేసిన సంపాదకులు
శ్రీ ఎ.బి.కె. ప్రసాద్, వేమూరి బలరాం, పి.డి.పి. వర్మ, గుడిపాటి,
ఉప్పల నరసింహం, యం.వి.ఆర్. శాస్త్రి మరియు నామిని గార్లకు కృతజ్ఞతలతో.....



అతడు అడవిని జయించాడు
అడవేం ఖర్మ...?
అతడు జీవితాన్ని జయించాడు
జీవితమేం ఖర్మ...?
అతడు సాహిత్య-తత్వాన్ని
మథించాడు
అతడి (బి.యస్.రాములు) కి....
మరియు
కరీంనగర్ మట్టికి.......

సభల్లోంచి .... సమీక్షల్లోంచి....

- సాహిత్యంలో ఇప్పుడొక సంచలన కెరటం... మన నరేందర్ !
  -డా॥ సి.నారాయణ రెడ్డి.
- కథకుడు సమాజానికి ఎంత అవసరమో నిరూపిస్తావు. మీరింకా రాయాలి.
  -బాపు (కార్టూనిస్ట్)
- మానసిక సంస్కారంతో చిత్రించే కథలు నరేందర్‌వి. -గోపి (వైస్ ఛాన్సలర్)
- అన్ని రకాలుగా రాయగలిగే సత్తావున్న నిజమైన రచయిత...మా నరేందర్
  -విజయబాపినీడు (దర్శకులు)
- నా జీవితంలో నాకిప్పటివరకూ రెండే కథల పుస్తకాలు నచ్చాయి.
  1) అమరావతి కథలు (సత్యం శంకరమంచి)
  2) అమ్మ కథలు - నరేందర్‌వి. -నూతన్ ప్రసాద్ (నటులు)
- అద్భుత శిల్ప ఖండాలు కె.వి. నరేందర్ కథలు. -కాలువ మల్లయ్య
- మానవ జీవితంలోని సున్నితమైన అంశాల్ని తీసుకొని కథలు రాయడంలో మంచి శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు నరేందర్. -గుడిపాటి (కర్త)
- 'కథ'న రంగంలో కలంయోధుడు మావాడు. - సుద్దాల అశోక్‌తేజ (సినీ గేయరచయిత)
- కథల బడిలో నరేందర్ ర్యాంక్ స్టూడెంట్ - బి.ఎస్. రాములు
- ఈ పోరడు ఓ 'పెన్' సైక్లోపేడియా -డా॥ మలయశ్రీ
- రచనల్లో తనకి అసాధ్యం కానిదేదీ లేదని నిరూపించే రచయిత నరేందర్
  -గుండేటి గంగాధర్
- కథల్లో ప్రయోగాలు చేయడం నరేందర్ ప్రత్యేకత. -డా॥ నలిమెల భాస్కర్
- వాస్తవ జీవితాల దర్పణాలు... కె.వి. నరేందర్ కథలు. -ఆంధ్రజ్యోతి డైలీ
- ఎ బోయ్ విత్ ద గోల్డెన్ పెన్ -దక్కన్ క్రానికల్.
- వాస్తవానుభవాల వలయాలు... నరేందర్ అల్లుకుపోయే కథలు. -ఆంధ్రభూమి.
- వస్తువుకు ప్రాధాన్యమిస్తూ...సామాజిక ప్రయోజనంతో రాసే రచయిత.
  -ఇండియా టుడే.
- అందమైన శైలిని, శిల్పాన్ని కథలో ముడివేసి రాయటం నరేందర్ ప్రత్యేకత.
  -మూసీ సాహిత్య పత్రిక

దొర మల్లా వచ్చిండు

"దొర మల్లా వూర్లెకచ్చిండు. పదహేడేళ్ల తర్వాత దొర వూర్లెకడుగు పెట్టిండు"

వూరంతా ఏదో విచిత్రం జరిగినట్టూ... అందరిలోనూ విస్మయం.

"నక్సలైట్ల భయానికి పట్నం పారిపోయిన దొర ఇన్నేళ్ళకు మల్లా వూర్లెకచ్చిండు. మందలించి వద్దాం".

వూరు కదిలింది.

"ఇంతకీ దొర ఎక్కడున్నాడ్రా?"

"వాళ్ళ బావమరిదింటికి వచ్చిండట. గఢీ ఎప్పుడో పాడువడె"

"దొర వచ్చిండని తెలిస్తే... నక్సలైట్లు వత్తరేమో?"

"ఆళ్లొస్తే పోలీసుల్తో పీకులాట. ఊరు వల్లకాడైతది"

"దొరతోని నలుగురు పోలీసోల్లు కాపలా గచ్చిండ్రట. ఏంకాదు. పొద్దు గూకంగనే మల్లపట్నం బోతడట"

"అయినా దొరని చూసొద్దాం పద"

ఆడమగా, పరిచితులు, అపరిచితులు అంతా పరమేశ్వర్‌రావ్ దొరని చూడటానికి బయల్దేరారు.

అందరూ హడావిడిగా వెల్తుంటే... అరవై ఏళ్ళ మొగిలయ్య మనసు ఎక్కడికోపోయింది. దొరతనం గుర్తొచ్చి ముసలి శరీరం వణికిపోయింది.

పరమేశ్వర్రావ్ దొర...

ఒకప్పుడు ఈ పల్లె శ్రమని గొట్టంతో షర్బత్ పీల్చినంత తేలిగ్గా పీల్చినవాడు. పదహారేళ్ళనించే దొర పెత్తనం మొదలెట్టి దాదాపు పాతికేళ్ళు సాగించిన అకృత్యాలు... గఢీల నించి బయటికి కొద్దిగా పొక్కినా తన, తను కొడుకు ఎన్నింటికో మూగసాక్షులై మిగిలిపోయారు.

కొన్ని దారుణాలు చూసి తను పట్టించుకోకపోయినా పదిహేడేళ్ల తన కొడుకు రాజేందర్‌కు రక్తం సలసలా మరిగిపోయేది.

ఇంటికొచ్చి తల్లితో చెప్పుకొనేవాడు.

గఢీలో జరిగిన అత్యాచారాలు...

గఢీలో జరిగిన హత్యలు...

గఢీలో జరిగిన పంచాయతీలు... అన్నీ చూస్తుంటే నెత్తుటితో తడిసిన తాజ్‌మహల్‌లాగా కన్పిస్తుందిని పద్యాలు రాసుకునేటోడు.

గఢీలో ఎన్నో చూసినవాడు... ఇంట్లోంచి మాయమైపోయాడు. కడుపుతీపితో కన్నపేగులు చించుకొని భోరున ఏడ్చాం. ఆర్నెల్ల తర్వాత వాడు అన్నలల్ల కల్సిండని తెలిసాక భయపడ్డాం. కానీ... అనుకున్నంత జరిగింది. వాడు దళంతో గడి మీదికి దండెత్తాడు. దొరని చంపాలని కాల్పులు జరిపాడు.

కాని... పరమేశ్వర్రావ్ తప్పించుకొని పట్నం పారిపోయాడు.

ఆర్నెల్లలో మరో రెండుసార్లు వూర్లోకి వచ్చిండని తెల్సి మళ్ళీ దాడి చేసాడు. మళ్లీ తప్పించుకొని ఇక పట్నంలోనే వుండిపోయాడు. భూముల్లో జెండాలు పాతినప్పటికీ అక్కన్నించే భూముల్ని అమ్మకానికి పెట్టాడు.

దొర పోయింతర్వాత... వూరు ప్రశాంతమైందని వూరంతా తన కొడుకుని పొగిడారు. రాజేందర్ పుణ్యమాని మంచిగ బతుకుతున్నమని వీళ్లంతా తనతో అంటుంటే గర్వంగా పొంగిపోయేవాడు. ఈలోగా తన కొడుకు ఎన్‌కౌంటర్లో చచ్చిపోయాడు. నక్సలైట్లల్లో కల్సినప్పుడు ఏడ్చినంతగా కూడా ఏడ్పు రాలేదు. ఎందుకంటే వాడు చావుకి సిద్దపడే పోయాడని రోజూ అనుకునేవాళ్ళం కాబట్టి.

కాలక్రమంలో రాజేందర్ పేరుని వూరు మర్చిపోయింది. దొరని కూడా దాదాపు మర్చిపోయారు.

అటువంటిది... 'దొర మల్లా వచ్చిండు' అని వూరంతా చూడ్డానికి పరిగెడుతున్నారు. మొగిలయ్య నులకమంచంలో కూచొని చుట్ట తాగుతూ వచ్చిపోయే వాళ్ల మాటలే వింటున్నాడు.

"దొర ఎంత మంచోడు. ఎంత ప్రేమగా మాట్లాడిండు"

"మునుపటి దొర కాదు. ఇంకా అందర్నీ యాదికి పెట్టుకున్నడు. చచ్చిపోయినోళ్ళను కూడా యాజ్జేసిండు"

"నువ్వు పోశిగాని కొడుకువ్ గదా అని నన్ను దగ్గరికి తీస్కున్నడు. దొరకాళ్లకి మొక్కాలన్పించింది"

"దొరది పెద్ద మనసు. గఢీ మొత్తం బడికి రాసిచ్చిండు"

"ఎందుకో అందర్నీ చూడబుద్దయి వచ్చిన్నని జెప్పిండు. వూర్ని జాసినంక దుఃఖంమాగలేదట. అందరికి దూరమైతి అని బాధపడ్డడు"

మొగిలయ్యకి జనం మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి.

"దొరది పాడుపడ్డ పశువుల దొడ్డి కూడా మంచిగ జేయిస్తనన్నడు. దాన్ని కమ్యూనిటీ హాల్‌గా వాడుకొమ్మన్నడు"

"గట్లనే... చెరువు కింది భూముల్ల చాకలోల్లను దోబీలు కట్టుకోమన్నడు"

"ఒక్కసారిగ దేవుని లెక్కచ్చి... వరాలిచ్చి పోవట్టే. ఇంక వూర్లెనే వుంటె ఎంత మంచిగజేసెటోడో..."

"రాజేందరనేటోడు నక్సలైట్లల్ల కల్సి మననోట్లె మన్నుగొట్టిండు. దొర ఎంత మంచోడో ఇప్పుడు దెల్వలేదా?"

మొగిలయ్య గుండె మీద గుండు సూదులు గుచ్చుతున్నయ్. మాట్లాడేవాళ్ళంతా ఈ తరం వాళ్లు. అయినా మారిపోయిన దొరని తనకీ ఒకసారి చూడాలనిపంచింది. తర్వాత మనసు వద్దంది. అయినా చూసొస్తే తప్పేంటి అని నులక మంచంలోంచి లేచి కట్టె తీసుకొని అడుగులో అడుగేసుకుంటూ పోయాడు. దొర బామ్మర్దింటి నిండా వూరి జనం. లోపలికి వెళ్లాలన్నా సందు లేదు.

"ఈడి కొడుకు చెయ్యంగనే దొర వూరిడిసిపెట్టిండు" ఎవరో అన్నారు. రోజూ చూసేవాళ్ళయినా అప్పుడు మొగిలయ్యని విచిత్రంగా చూసారు. అందరి మధ్యలోంచి మెల్లిగా సందుజేసుకొని లోపలికెళ్ళాడు మొగిలయ్య.

నిండుగా... భారీ విగ్రహంతో... వయసు తెచ్చిపెట్టిన పెద్దరికంతో మసకమసగ్గా కన్పించాడు పరమేశ్వర్రావ్. మొగిలయ్యని చూడగానే గుర్తు పట్టాడు. కుర్చీలోంచి లేచొచ్చి...

"అరే... మాదిగి మొగిలయ్య కదూ... మొగిలీ... మంచిగున్నవా... నన్ను చిన్నప్పుడు ఎత్తుకొని తిరిగెటోనివి. యాదికుందా" అంటూ దగ్గర తీస్కున్నాడు.

మొగిలయ్య కన్నా ముందు చుట్టూ వున్న జనం ఉబ్బితబ్బిబ్బయ్యారు.

"మంచగనే వున్ననయ్యా... మీరు మంచిగున్నరా?" అన్నాడు మొగిలయ్య.

"మంచిగనే వున్న మొగిలీ... అన్నట్టు రాజేందర్‌గాన్ని పోలీసోల్లు చంపిండ్రని తెల్సింది. గీ వయసుల ఆడు నీకు లేనిపొని కష్టంబెట్టె. కండ్లు మంచిగ కనపడుతున్నయా... ఇగో మొగిలీ... చిన్నప్పుడు నీ చేతుల్ల పెరిగినోన్ని. నన్ను కొడుకు లెక్కను కొని ఓసారి పట్నంరా.

కండ్ల డాక్టర్‌కు జూపిత్త" ప్రేమగా చెప్పాడు పరమేశ్వర్రావ్.

"గట్లనే దొర..." మొగిలయ్యకి కూడా దొర బాగా మారిపోయాడనిపించింది.

పరమేశ్వర్రావ్ వాళ్ళ బామ్మర్దిని పిలిచి ఎల్లుండి మొగిలిని సిటీకి తీసుకురమ్మని అందరిముందూ చెప్పాడు.

"నీకొడుకు చంపుటానికి పోయినా కూడా దొర నిన్ను దగ్గర తీసింద్రా మొగిలీ. దొర మునుపటి దొర కాదు" అన్నారు ఒకరిద్దరు.

ఇంకా ఎవరెవరో రావటంతో పరమేశ్వర్రావ్ మాటల్లో పడిపోయి... సాయంత్రం కాగానే హడావిడిగా వెళ్లిపోయాడు. పోతూపోతూ అయిదువేలు కులపెద్దలకిచ్చి వెళ్లాడు. జల్సా చేసుకొమ్మని.

వూరంతా ఆనందంతో నిండిపోయింది.

* * * *

మనవడి సాయంతో పట్నం చేరిన మొగిలయ్యని పెద్ద హాస్పిటల్‌లో చేర్చారు. పరమేశ్వర్రావ్ బామ్మర్ది జాయిన్ చేసి వెళ్ళాడు. అంత పెద్ద హాస్పిటల్ దొరదేనని తెల్సిన మొగిలయ్య ఆశ్చర్యపోయాడు. దొర ఇల్లు, కార్లు, అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు అన్నీ చూసాక మొగిలయ్య తల తిరిగిపోయింది. సిటీకి పోయినంక దొర కన్పించలేదు. కాని డాక్టర్లు ఆపరేషన్ తర్వాత రెండోరోజున కళ్ళకు కట్టిన కట్లు విప్పారు. మొగిలయ్యకి పరమేశ్వర్రావ్ ఆస్తులు ఇప్పుడు మరింత స్పష్టంగా కన్పించాయి.

డిశ్చార్జి అయ్యేరోజున అకస్మాత్తుగా వచ్చాడు పరమేశ్వర్రావ్.

మొగిలయ్య దండం పెట్టాడు.

పరమేశ్వర్రావ్ ఆ చేతుల్ని పట్టుకొని "నీ కొడుకు నాకు గొప్ప పని చేసాడ్రా. వాడే గనక మరో పదేళ్లముందు నన్ను పట్నాలకు పారిపొయ్యేలా చేసుంటే ఈ సిటీనే కొనేసివుండేవాడ్ని.

పట్నం వచ్చాక పైసల్ని పదింతలు చేయటం ఎలాగో తెల్సింది. తెలివి పెరిగింది. లౌక్యం తెల్సింది. ఇక్కడ ప్లాట్ల బిజినెస్ చేసాను. బాగా సంపాదించాను. నేనే కాదు. నాలాంటి దొరలంతా పల్లెలు వదిలాక పారిశ్రామికవేత్తలయ్యారు. ఎవన్ కాంట్రాక్టర్లయ్యారు. కాలేజీలకు, హాస్పిటల్లకు ఓనర్లయ్యారు. ఆనాటి భూస్వామ్య వర్గమంతా ఈనాడు పారిశ్రామిక మాజమాన్యంగా మారిందంతే. విప్లవం వర్ధిల్లాలని పట్నాల్లో దొరలు పూజలు చేసాట్రా. విప్లవం అంటే మాకు ప్రేమరా. అందుకే రాజేందర్ గాడు అప్పుడప్పుడు మనసులో మెదుల్తుంటాడు. అవునూ... నీకిప్పుడు కళ్ళు బాగా కన్పిస్తున్నాయా అన్నాడు ప్రేమగా మొగిలయ్య కళ్ళజోడుని సవరిస్తూ.

"మంచిగా కనపడుతున్నయ్ దొ...రా..." అని మొగిలయ్య మనవడి అసరాతో వెళ్ళిపోవడానికి సిద్దమవుతుంటె.

"మొగిలీ... నయాపైస కూడా ఈ దవాఖాండ్ల నువ్వు కట్టేది లేదు. మంచిగ తిను. ఖర్చులకు ఈ అయిదువందలుంచు" అని బలవంతంగా డబ్బుని మొగిలయ్య చేతుల్లోవుంచాడు.

మొగిలయ్య మనవడు దొరవైపు ఆరాధనాపూర్వకంగా చూసాడు. వాళ్లు వెళ్లిపోబోతుంటే...

"మొగిలీ..." అన్నాడు అనునయంగా.

"నువ్వు వూర్లెబోయినంక ఇప్పట్నించి నాగురించి చెప్పాలె. ఊరంత ఒకటి చెయ్యాలె. ఇంక ఏడెనిమిది నెల్లల్ల ఎలక్షన్లు వస్తున్నయ్. ఈసారి ఎమ్మెల్యే టిక్కెట్ నాకే వచ్చేటట్టుంది. మనూర్లె నుంచి ఒక్క ఓటు కూడా వేరోటోనికి పోవద్దు. నువ్వు కాపాడాలె..." అన్నాడు దగ్గర తీసుకుంటూ.

"మంచిది దొర" అన్నాడు పరమేశ్వర్రావ్ అంతరంగం అర్థమై.

"ఏమోయ్. మనూర్లె నువ్వే యువనాయకుడివి. ఎలక్షన్లో బాగా తిరగాల. మీ తాతని జాగర్తగా దీస్కపో..." అన్నాడు మొగిలయ్య మనవడితో.

వాడిలో కృతజ్ఞతాభావం ఎవరెస్టు శిఖరంలా ఎదిగిపోయింది.

దొర వెళ్లిపోయాడు.

బస్టాండ్‌కి వచ్చాక మొగిలయ్యని మనవడడిగాడు.

"తాతా... కళ్లద్దాలు పెట్టుకున్నాక చూపు బాగా అనుతుందా?"

" ఈ వెలుతురు భరించలేకపోతున్నా బిడ్డా. నాకీ అద్దాలొద్దు. ఆ గుడ్డితనమే కావాలన్పిస్తోందిరా..." మొగిలయ్య కంఠంలో ఏదో జీర.

"దొర గంత మంచిగ ఆపరేషన్‌జేయిస్తే... గట్లనవద్దివేందే"

"నీకర్థంగాదు బిడ్డా. దొర మారలేదు. రంగు మార్చిండు గంతే" అన్నాడు మొగిలయ్య.

అంతలోకే బస్సొచ్చింది.

ఇద్దరూ జనాన్ని తోసుకుంటూ బస్సెక్కారు.

పావుగంట తర్వాత బస్సు కదిలింది.

మనవడు చూడకుండా... మొగిలయ్య నెమ్మదిగా కళ్ళద్దాలు తీసి బస్ కిటికీలోంచి జార విడిచాడు.

అవి బస్ టైర్ల పడి నలిగిపోయాయి. మొగిలయ్య కళ్లల్లో కింద వెనక మళ్లీ మసక చీకటి అలుముకుంది.

అయినా ఆ కళ్లనిండా ఏదో తృప్తి!!

నడిపోడు

అమ్మ చావు బతుకుల్లో వుంది... చింటూగాడు అమెరికాలో వున్నాడు. ఫోన్లో రాలేనంత బిజీ అంటాడు... ఎలా? ఏం చేయాలి? పోనీ... పెద్దన్నయ్యకి కరీంనగర్ ఫోన్ చేసి చెబితే...?"

క్షీణిస్తున్న తల్లి పరిస్థితిని చూస్తూ వీర్రాజు మనసు మనసులో లేదు. ఇవే ఆలోచనలు ముసురుకుంటున్నాయి. అసహనంగా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. రామలక్ష్మి భర్త పరిస్థితిని చూస్తూ..."అమెరికాకి ఫోన్లమీద ఫోన్లు చేయకండి. ఇప్పటికే వేలకొద్ది బిల్లు తగిలేసారు. ఆవిడగారు కన్నుమూసాక ఫోన్ చేయొచ్చు" అంది కాస్త కటువుగా.

ఆమెకు వాళ్లంటే కోపం... ఆస్తి పంపకాల్నించీ ఇప్పటివరకూ తామే నష్టపోయామన్న బాధ. వీర్రాజు ఈ ఇంట్లో నడిపోడుగా పుట్టడమే ఆయన చేసుకున్న పాపమేమో అన్పించేది.

వీర్రాజు అన్న కరీంనగర్ ఆర్ అండ్ బి ఆఫీస్‌లో సూపర్నెంటు. తమ్ముడు అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్. వీర్రాజు మాత్రం పెద్దగా చదువులేక పల్లెలోనే వుండాల్సి వచ్చింది. తల్లిదండ్రుల పెంపకంలోనూ వీర్రాజు పట్ల పక్షపాత ధోరణే ఒరిగింది. మొదట పుట్టిన బిడ్డ అని వాళ్లు పెద్దబ్బాయిని ప్రేమగా పెంచారు. తండ్రికి పెద్దోడంటే అభిమానం. పెద్దోడు పుట్టిన ఏడేళ్లకి వీర్రాజు పుట్టాడు. వీర్రాజు పుట్టిన రెండేళ్లకే చిన్నోడు పుట్టాడు. తల్లికైతే చిన్నోడంటే పంచప్రాణాలు. పట్నంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదివించింది.

తండ్రి పెద్దకొడుకుతో ప్రతివిషయం చర్చించేవాడు. 'కన్నా' అని ముద్దుగా పిలిచేవాడు. చిన్నోడిని తల్లి 'చింటూ' అంటూ పిలిచేది. వీర్రాజుకి ఏ ముద్దుపేరు రాలేదు. 'ఒరే... నడిపోడా...' అనే పిలుపు తప్ప.

చిన్నప్పట్నించి ఈ వ్యత్యాసాన్ని వీర్రాజు గమనిస్తూనే వున్నాడు. పెద్దకొడుకుని తండ్రి పొలాల వెంట తిప్పుకొస్తే... తనూ వెంటవస్తాననే వాడు వీర్రాజు.

"వాడు ఈ ఇంటికి పెద్దకొడుకు వాడికి అన్నీ తెలియాలి. నా తర్వాతిస్థానం వాడిదే. నువ్వు బుద్ధిగా చదువుకో" అని తండ్రి అంటే మనసు గిలగిల్లాడేది.

చిన్నకొడుక్కి తల్లి గారాబంతో అన్నీ పెడుతుంటే... "అదేంటమ్మా... నాకూ సంజీవ్‌గాడిలాగా పెట్టవూ..." అని ప్రాధేయపూర్వకంగా అడిగితే... తల్లి నవ్వేది.

"వాడు ఈ ఇంట్లో చిన్నోడు కదరా... అందుకే కొంచెం గారాబం ఎక్కువుంటుందిలే" అనేది. తననీ ఎవరైనా ఏదైనా ముద్దుపేరుతే పిలిస్తే బావుండేది అని మనసు కోరుకునేది.

'నడిపోడా...' అని పిలిస్తే చివుక్కుమనేది.

ఈభావం వీర్రాజు మనసులో క్రమంగా పెరుగుతూనే వచ్చింది. ఇంట్లో కొడుకులపరంగా ఏ విషయం చర్చించినా 'ఇంటికి పెద్దోడు' 'ఇంటికి చిన్నోడు' అనే పదాలు దొర్లిపోయేవి.

తండ్రి వెంట తిరగటం వల్లనేమో... పెద్దోడికి అప్పుడే 'పెద్దరికం' వచ్చేసింది. మాటల్లో చేతల్లో అది చూపించేవాడు.

'ఒరే వీర్రాజు.... తమ్ముని ఎత్తుకో' అని ఆర్డరేసేవాడు కాని... ఏడుస్తున్న తమ్ముణ్ణి ఎత్తుకునే వాడు కాదు.

అతి గారాబం వల్లనేమో... చిన్నోడికి 'అధికారం' వచ్చేసింది. అది వాడు ఏడ్చి, గిల్లి, కొట్టి, కొరికి చూపించేవాడు. ఏనాడైనా 'ఐస్‌ఫ్రూట్' కొనుక్కుంటే... మీదపడి రక్కి లాక్కునేవాడు. తనేడిస్తే తల్లివచ్చి 'పోనీలేరా... వాడు చిన్నోడు కదా' అని ప్రతిసారీ వాణ్ణి సమర్థించేది.

ఇద్దరికంటే ఎక్కువమంది కొడుకులున్న కుటుంబాల్లో....మధ్యలో పుట్టిన వాళ్లంతా మానసికంగా ఇలాంటి సంఘర్షణలు అనుభవించేవుంటారని వయసు ఎదిగిన కొద్దీ వీర్రాజుకి అన్పించేది.

క్రమంగా అంతా ఎదిగి... పెళ్లిళ్లయ్యాక... పెద్దవాడికి ఉద్యోగమొచ్చి కరీంనగర్ వెళ్లిపోయాడు. చిన్నవాడు అమెరికా వెళ్లిపోయాడు. వాళ్లు వెళ్తూ వెళ్తూ... చాలీ చాలని జీతంతో పట్నంలో మిమ్మల్నెలా పోషించగలం అని పెద్దోడు చెప్పేసి వెళ్తే... అమెరికాకి మిమ్మల్ని తీసికెళ్లటం అస్సలు సాధ్యంకాదు అని చిన్నోడు వెళ్లిపోయాడు.

ఫలితంగా వ్యవసాయం చూసుకుంటూ వీర్రాజే తల్లిదండ్రుల్ని పోషించేవాడు. అయితే

ఆర్నెల్లకోమారు పెద్దకొడుకు వచ్చి తల్లిదండ్రులతో ఆప్యాయంగా గడిపేవాడు. వాడు రాగానే తల్లీతండ్రీ కన్పించే ప్రేమ చూసి వీర్రాజు మనసు మూగవోయేది. ఒక్కరోజు గడిపి వెళ్లిపోతూ "ఒరే వీర్రాజూ... ఈసారి పంటల మీద నావంతు డబ్బు ఎంతొచ్చింది" అని ఒంటరిగా వున్నప్పుడు అడిగేవాడు. వీర్రాజు లెక్కచూసి నాలుగైదు వేలు అప్పజెప్పిన వెంటనే వెళ్లిపోయేవాడు.

అమెరికానించి చిన్నోడి ఉత్తరం అందగానే... తల్లిదండ్రుల కళ్లల్లో కనపడే ఆనందరేఖలు అన్నీఇన్నీకావు.

"ఇంత చాకిరీ చేస్తున్నాం.... ఆప్రేమ కనీసం నాపిల్లల మీద చూపినా నేను సంతోషించేదాన్ని" అని వీర్రాజు భార్య రామలక్ష్మి నొచ్చుకునేది.

పొద్దంతా వ్యవసాయం చేసి వచ్చిన తన భర్త కష్టాన్ని గుర్తించకుండా... అమెరికాలో కొడుకు ఏం కష్టపడుతున్నాడో అని తల్లి తరచూ గుర్తుచేస్తుంటే... అది సహించని రామలక్ష్మి తన అసహనాన్ని, కోపాన్ని పిల్లలమీద చూపించేది. దాంట్లో అందరిమధ్యా ఏదో దూరం పెరుగుతున్నట్టు అన్పించేది. పెద్దోడు వచ్చివెళ్లినప్పుడల్లా... అమ్మానాన్నల్ని బాగా చూసుకొమ్మని నీతివాక్యాలు చెప్పిపోయేవాడు.

ఓరోజు అర్థరాత్రి... తండ్రికి గుండెపోటు రావటంతో వీర్రాజు తల్లడిలిపోయాడు. పల్లెలో సరైన సౌకర్యాలు లేక... నొప్పి ఎక్కువై తెలతెలవారుతుండగా తండ్రి చనిపోయాడు. పెద్దవాడికీ, చిన్నవాడికీ కబురుపంపి వాళ్లు రావడానికి వీర్రాజు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పెద్దకొడుకు వస్తూనే... నొప్పి గురించి రెండు మూడ్రోజుల ముందే తనకి ఫోన్‌చేస్తే సిటీకి తీసికెళ్లేవాన్ని. తండ్రిని బతికించుకునేవాన్ని... అంటూ వూరివాళ్లముందు భోరున ఏడ్చాడు. పెద్దోడికి తండ్రి మీదున్న ప్రేమకి వాళ్లు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు.

చిన్నవాడు అమెరికానించి రాలేకపోయాడు.... ఫోన్ చేసి బాధపడ్డాడు. దశదిన కర్మ అయ్యేంత వరకూ... ఖర్చులన్నీ వీర్రాజే భరించాడు.

ఆ మర్నాడే... "ఆస్తి పంపకాలు చేసుకుందాం రా నడిపోడా... కరీంనగర్‌లో ఇల్లు కట్టుకుంటున్నాను. డబ్బు అవసరంవుంది" అన్నాడు పెద్దన్నయ్య.

"తమ్ముడు తిరిగొచ్చాక పంపకాలు చేసుకోవటం మంచిదేమో అన్నయ్యా" అన్నాడు వీర్రాజు.

"సరే... మరి నేను ఇంటికి పెద్దవాణ్ణి కాబట్టి... జ్యేష్టపుపాలు కింద చెరువుకింది అయిదెకరాల పొలం ఇవ్వాలి" అన్నాడు.

అది విన్న వీర్రాజు భార్య... కోపంగా లేచింది.

"మీకెందుకు జ్యేష్టప్పాలు ఇవ్వాలి? ఈ ఇంటికి మీరేం కష్టపడ్డారని... అసలు

జ్యేష్టపుపాలు ఎందుకిస్తారో, తెల్సా?" అని గయ్‌మని లేచింది రామలక్ష్మి.

రామలక్ష్మి అలా అనగానే పెద్దాయన భార్యకూడా గొడవకి దిగింది.

తోడికోడళ్ల మధ్య ఆరోజు పెద్దగొడవే జరిగింది.

ఫలితంగా... తెల్లవారి ఆస్తిపంపకాల విషయమై వూరి పెద్దలతో పంచాయితీ జరిగింది.

"తండ్రికి తలకొరివి పెట్టినోడు కాబట్టి... ఇంటికి పెద్దదిక్కు కాబట్టి జ్యేష్టపుపాలు ఇవ్వాల్సిందే" అని వాళ్లు తీర్పు చెప్పారు.

వూరి పెద్దలకన్నా... వీర్రాజుతో తల్లికూడా అదేమాటనడం... అతణ్ణి కృంగదీసింది. అతడు అపురూపంగా చూసుకునే పొలం పెద్దవాడికి జ్యేష్టపుపాలు కింద పోగా... మూడ్రోజుల్లో దాన్ని ఎనభైవేలకి అమ్మేసుకున్నాడు.

ఈలోగా ఓ పెద్దమనిషి వీర్రాజుతో "ఒరే వీర్రాజూ... నూరేళ్లయినా చావు తప్పదు. వెయ్యేళ్లయినా వేరు తప్పదని పెద్దలూరికే అన్లేదు. ఓసారి భూములు, మరోసారి ఇల్లు... ఇట్లా ఒక్కొక్కటే పంచేసుకోవడమేమిట్రా.... ప్రతీసారి పంచాయితీలు, దడువతులు, కుల పెద్దలకు తాగిపిచ్చుడు, తినిపిచ్చుడు. ఈ తతంగం కన్న ఇప్పుడే ఇల్లుకూడా పంచేసుకోండి." అని సలహా ఇచ్చాడు.

అది విన్న పెద్దవాడి భార్య 'అవునవును.....ఇల్లు కూడా పంచేసుకొని ఎవరి హద్దులు వాళ్లు పెట్టుకోవడం మంచిది' అని ఉబలాటపడింది.

రామలక్ష్మి కూడా 'ఇంటెడు చాకిరీ తప్పుతుంది...ఎప్పుడైతే ఏమిట్లే' అని వీర్రాజుతో 'సరేననండి....'అన్నట్టుగా సైగ చేసింది.

కాని వీర్రాజు మనసు....ఇల్లు మూడుముక్కలవటం ఒప్పుకోవట్లేదు. మెల్లిగా తల్లి దగ్గరికెళ్లి చెప్పాడు.

"పెద్దోడు ఎట్లా అంటే అట్లాగే కానియ్ బిడ్డా.....చిన్నోడు లేకనేపాయె. వాడికి అన్యాయం జరక్కుండా సూడుండ్రి" అంది.

తను చనిపోయేంత వరకైనా ఈ ఇంటిని చీల్చొద్దని తల్లి ఈ నిర్ణయాన్ని కాదంటుందని ఆశపడ్డ వీర్రాజు మనసు మరోసారి బరువుగా మూలిగింది. తల్లి మాట విన్న పెద్దకొడుకు "సర్లే....వాడు అమెరికాలో వున్నంత మాత్రాన వాడికేం అన్యాయం జరుగదు. పంచాయితి పెద్దలే కొలతలు గీసి పంచుతారు కదా" అన్నాడు.

వీర్రాజుకి అన్నయ్య మనసులో కూడా ఇల్లు పంపకాలు జరగాలనే ఉద్దేశ్యం వుందని ఆ మాటతో అర్థమైంది.

మర్నాడు...

పదిమంది పెద్దల సమక్షంలో ఇల్లు మొత్తంని కొలిచారు. ఇంట్లో గొలుసులు, టేపుల్తో కొలుస్తుంటే తేళ్లు, జెర్రులు పాకుతున్నట్టనిపించింది వీర్రాజుకి.

మూడు గదుల చొప్పున ఇంటిని మూడు భాగాలుగా గీతలు గీసారు. తర్వాత వేప చెట్టుకింద నులక మంచాలేసి కూచున్నారు.

"ఇంక పంచేదేముంది? ఆనవాయితీ ప్రకారం పడమటి దిక్కున పెద్దోడుండాలె. తూర్పు దిక్కున చిన్నోడికి రావలె. మధ్యలో నడిపోడుండాలె" అన్నాడొకాయన.

ఎక్కడైనా అంతేకదా అని తీర్మాణించారు.

ఆ మాటవిని వీర్రాజు గుండె చెమ్మగిల్లింది. వీర్రాజుకొచ్చిన మూడు గదుల్లోనూ ఎప్పుడు వడ్లు, పెసల్లు, జొన్న గింజలు పోసే గదులవి. దాంతో ఆ గదులు ఎలుకలు, పందికొక్కులు చేసిన బొరియల్తో... కనీసం సిమెంట్ కూడా చేయకుండా వుంచారు. పెద్దమనుషుల మాటలతో రామలక్ష్మి గయ్‌న లేచింది.

"ఏం పంచిండ్రు. ధాన్యం పోసుకునే గదులు మాకెందుకు...తూర్పు దిక్కున గదులకు ముప్పయ్ వేలు పెట్టి మంచిగ చేయించినం. మా పైసంత గంగల కల్సినట్లేనా గిదేం పంచాయితీ" అంది.

"అందరు పంచుకునే ఇల్లని తెల్సి మీ పైసల్తోని ఎవరు రిపేర్లు చేయించమన్నరు. పెద్దోనికి చిన్నోనికి చెప్పే చేసిండ్రా? రామలక్ష్మి నువ్వు మాట్లాడద్దు" అన్నాడో పంచాయితీ పెద్ద.

రామలక్ష్మి ఇకలాభం లేదనుకొని భర్తని తిట్టింది.

"అన్నయ్య, తమ్ముడని ఎగవోసుకుంట జేస్తివి. ఇప్పుడు నోట్లె మన్ను కొట్టిండ్రు. ఆ గదుల్ల ఉండే బదులు ఈ చెట్టుకింద ఉన్నది నయం... నువ్వు మాట్లాడక పొయేసరికి ముడ్లేసుకుపోతుండ్రు" అంది.

రామలక్ష్మి ఆరోపణలన్నీ నిజమేనని వీర్రాజుకి తెలుసు.

"గా గదులు నాకెందుకు.... నాకు పడమటి దిక్కుయి కావలె" అన్నాడు.

పంచాయితీలో కొంచెం కలకలం.....

వీర్రాజు పట్టువిడలేదు.

అరగంటసేపు వాదోపవాదాలు జరిగాయి.

అన్నీ వింటున్న పెద్దాయన భార్య....."పెద్దోనికి పెరట్లో పెట్టిన మెచ్చుతడు. చిన్నోడికి చింతకింద పెట్టిన మెచ్చుతడు కాని... నడిపోనికి నట్టింట్ల పెట్టినా మెచ్చడు అని వూరికే అన్నారా... ఇప్పుడు కనవత్తంది" అంది.

ఆ మాట... వీర్రాజు మొహంమీద కొరడాతో చెళ్లున కొట్టినట్టన్పించింది. మనసు గిలగిల్లాడింది...హక్కు కోసం పోరాడితే కూడా.....నడిపొడి మీద అనాదినించీ వేసే అభాండం అది !

"సరే.....ఇలాగే కానివ్వండి" అన్నాడు.

దాంతో పంచాయితీ ముగిసింది. అంతా వెళ్లిపోయారు.

వేప చెట్టుకింద... మంచం మీద వీర్రాజు ఒక్కడే మిగిలిపోయాడు.

నాల్రోజుల్లో... ఆ ఇంట్లో అడ్డుగోడలు మొలిచాయి.

రెండు పోర్షన్‌లకు తాళాలు పడ్డాయి. మధ్యలోవున్న గదుల్లో రామలక్ష్మి వంట చేస్తుంటే... మూసుకుపోయిన కిటికీల్తో ఇల్లంతా పొగజూరి... గాలి, వెలుతురు ఏవీ రాక ఊపిరిసలప నట్టుగా వుంది.

అప్పుడే వచ్చిన ఆడబిడ్డ రాజేశ్వరి 'వీర్రాజన్న...' అంటూ లోపలికొచ్చింది. రామలక్ష్మి ఆమెను సాదరంగా ఆహ్వానించింది. రాజేశ్వరి రాగానే తల్లితో కొంచెం సేపు మాట్లాడి వీర్రాజు రాగానే... "అన్న... నా చిన్న కొడుకు పుట్టు వెంట్రుకలు వేములవాడలో తీస్తున్న. ఈసారి నువ్వు తులం బంగారం పెట్టాలె" అంది. వీర్రాజు నవ్వాడు.

"మేమే వేరుపడి కష్టాల్లో వున్నాం వదినే. అర్థతులం పెడతాం తియ్...పెద్దోల్లు ఎంత పెడ్తరట" అంది రామలక్ష్మి.

"వాళ్ళేం పెడతారు? మేమే పెట్టాలి. పెద్దన్నకి ఓ డ్రెస్సు, వదినెకి ఓ చీరెకొన్నాం. ఎందుకంటే పుట్టు వెంట్రుకలు పెద్దోడే తీయాలె కదా..." అంది.

అంతలోకే రాజేశ్వరిని తల్లి పిలిచింది.

"నాకు ప్రాణం బాగుంటలేదు బిడ్డా... రేపో మాపో అన్నట్టుంది. నేను పోయినంక ఎవరేం పెడ్తరో, పెట్టరో...కొడుకు పుట్టెంటికలు అంటివి. ఎప్పటికైనా తల్లిమీది సొమ్ములన్ని బిడ్డకే చెందాల్నాయె. ఈ రెండు తులాల పుస్తెల తాడు ఇప్పుడే తీసుకుపో..." అంది మెడలోంచి గొలుసు తీసిస్తూ...

"సరేనమ్మా..." అంది రాజేశ్వరి. వీర్రాజు, రామలక్ష్మి ఏమీ అన్లేక పోయారు. రాజేశ్వరి వెళ్లి పోయాక ఆ రాత్రి భోజనం పెడుతూ రామలక్ష్మి అంది.

"మనం పుట్టెడు చాకిరీ చేస్తున్నామన్నా గ్యానమైనా లేదు ముసల్దానికి. బంగారం తీసి బిడ్డ చేతుల పెట్టింది" అంది వీర్రాజుతో...

"అప్పుడే అడగక పోయినవ్" అన్నాడు. అన్నం కెలుకుతూ...

"ఏమనాలె... అమ్మమీది సొమ్ములు బిడ్డకే చెందాలని లోకం అనదా?" అంది.

"అందరికీ అన్నీ చెందుతాయి... ఒక్క నడిపోడికి తప్ప" అన్నం మీంచి లేచిపోయాడు వీర్రాజు.

తర్వాత వీర్రాజు తల్లి జ్వరంతో మంచమెక్కింది.

శాపనార్థాలు పెడుతూనే రామలక్ష్మి ఆమెకు అన్ని సేవలు చేస్తోంది. దాదాపు ఆర్నెల్లుగా ఆమె మంచంలోనే మలమూత్రాలు చేసుకుంటున్నా భరిస్తూ చేస్తున్నారు.

కాని... పరిస్థితి ఇప్పుడు విషమించింది.

తల్లి ఎప్పుడు కన్నుమూసేది. తెలీని స్థితిలో రాత్రుళ్లు కూడా నిద్రమానుకొని తల్లి మంచం దగ్గరే వుంటున్నాడు వీర్రాజు.

ఆ తల్లిమనసు... దూరంగా వున్న చిన్నకొడుకు కోసం పలవరిస్తోంది.

"ఒరే నడిపోడా... ఒక్కసారి చింటూగాన్ని పిలిపించురా..." అని వందలసార్లు అడిగింది.

భార్యకి భయపడి ఏమీ అనకపోయినా... బయటికెళ్లి రెండు మూడుసార్లు అమెరికాకి ఫోన్ చేసొచ్చాడు.... వాడు పొడిపొడిగా మాట్లాడటం తప్పితే... వస్తాను, రాను అని ఏ విషయమూ చెప్పలేదు.

వీర్రాజు మాత్రం తల్లిని ఊరడిస్తూనే వున్నాడు.

చిన్నకొడుకు కోసం పలవరించి... పలవరించి కన్నుమూసిందామె.

వీర్రాజు దు:ఖం కట్టలు తెంచుకుంది. కరీంనగర్‌నించి పెద్దకొడుకు హుటాహుటిన వచ్చాడు.

అమెరికాకి ఫోన్ చేసి విషయం చెప్పారు.

"వాడొచ్చేసరికి రెండు మూడ్రోజులవుతుందేమో... అప్పటివరకూ అమ్మనెలా వుంచుదాం? బాధగా అన్నాడు వీర్రాజు పెద్దమనుషుల్తో.

"అదేంట్రా... తల్లికి చిన్నకొడుకే కొరివి పెట్టాలి. వాడొచ్చేంత వరకూ మంచుగడ్డల్లో శవాన్ని పెట్టి వుంచండి" అన్నారంతా.

"వాడు అందుబాటులో లేనప్పుడు.... నేను పెట్టకూడదా?" వీర్రాజు మనసులో ఏదో సంశయం.

"నువ్వు ఈ ఇంటికి నడిపోడివి... నువ్వెలా తలకొరివి పెడతావ్? అది మన సాంప్రదాయం కాదు" అన్నారు పెద్దమనుషులు.

తల్లిదండ్రులకు బండెడు చాకిరీ చేసినా తలకొరివి పెట్టడానిక్కూడా అర్హతలేని తనమీద తనకే జాలిపుట్టింది వీర్రాజుకి.

'నడిపోడు' అనే ఒక్క పదంతో బాధ్యతలన్నీ నెత్తిమీదపెట్టినా... సంప్రదాయపరంగా ఇవేం అడ్డు తెరలు?? ఆ బాధనే వ్యక్తపరుస్తూ తన ఆప్తమిత్రుడైన సర్పంచ్ రాఘవరావ్‌తో చెప్పుకున్నాడు.

అతడు వీర్రాజుని ఓదారుస్తూ "పిచ్చోడా... రామాయణ కాలంనించీ నడిపోడికి ఈ బాధలు తప్పలేదు. భరతుడు రాముడి పాదరక్షల్ని సింహాసనం మీద చూపిస్తూ తను రాజ్యపాలన చేయాల్సి వచ్చింది. భారతంలో సైతం అర్జునుడే అందరికీ శత్రువయ్యాడు కాని... ధర్మరాజో, సహదేవుడో కాలేదు..." అన్నాడు.

"ఇలా ఎందుకుండాలి? పెద్దవాడు, చిన్నవాడితో పోలిస్తే మధ్యలో పుట్టినవాళ్ల కుటుంబ సంప్రదాయపరంగా వ్యక్తిత్వం లేని వాళ్లవుతున్నారు. డమ్మీ కొడుకులుగా మిగులుతున్నారు. మాలోని ప్రేమలూ, ఆప్యాయతలూ పంచుకొంటూనే...

కట్నకానుకల దగ్గర, ఆస్తి పంపకాలదగ్గర, అంత్యక్రియలదగ్గర భేదాలు చూపించటం ఎంత వరకు సబబు..." అని బాధపడ్డాడు.

అప్పటికే అమెరికా నించి చిన్నవాడు రావటంతో.... హడావిడిగా అంత్యక్రియలు జరిపారు.

పదకొండో రోజున మళ్లీ ఎక్కడివాళ్లక్కడ వెళ్లిపోయారు.

ఇల్లంతా స్మశాన నిశ్శబ్దం...

దిగాలుగావున్న వీర్రాజు దగ్గరికి రామలక్ష్మి వచ్చి కూచుంది.

"నాకు తెలుసయ్యా... నువ్వు తల్లిదండ్రుల్ని ఎంత ప్రేమించిందీ... ఎంత సేవ చేసిందీ... నీచేతులమీదుగా వాళ్లని పంపించాలని ఆశపడావ్.... కాని అలా జరగనందుకు బాధపడుతున్నావా..." అంది.

వీర్రాజు ఏమీ మాట్లాడలేదు.

"మీకు మరో విషయం చెప్పాలి..." అంది కొంచెం సంశయంగా.

"ఏంటి?"

"నాకు మళ్లీ నెల తప్పింది. ఇప్పటికే మనకిద్దరు మగపిల్లలున్నారు కదా. ఈసారి ఆడపిల్ల పుట్టొచ్చు...."

ఆమాటతో వీర్రాజు మొహంలో కలవరం పాకిపోయింది.

"ఆడపిల్లే పుడుతున్న గ్యారంటీ ఏమిటీ? మళ్లీ మగపిల్లాడు పుడితే...?

ఈ ఇంట్లో 'నడిపోడు' అనే పేరుతో మరోకడు నలిగిపోవటం నాకిష్టంలేదు. రేపే దావఖానకెళ్లి అబార్షన్ చేయిద్దాం..." అని చెప్పేసి విసురుగా లేచి వెళ్లిపోయాడు.

అతడు వెళ్లినవైపే విభ్రమంగా చూస్తుండిపోయిందామె.

సూపర్ కిడ్

నాకీ మధ్య మా ఇంట్లో జరుగుతున్న విషయాలు నాలో విస్మయాన్ని, కాసింత భయాన్ని, కొంత ఆందోళననీ కల్గిస్తున్నాయి. మా బాబుకి నాలుగేళ్లు నిండాయి.

అయితే వాడిలో 'ఏదో చూడాలని' నా శ్రీమతి పడుతున్న తాపత్రయం నా ఆందోళనకి ముఖ్యకారణం. ముచ్చటగా బుల్లి బుల్లి కబుర్లు చెబుతూ నా దగ్గర చలాకీగా వుండే మాచింటూ తల్లిని చూడగానే బెంబేలెత్తుతున్నాడు.

దానికి కారణం శ్రీదేవి వాడిని ఏదోరంగంలో సూపర్‌కిడ్‌గా చూడాలనే ఆశతో... ఏదేదో నేర్పించటం, వాడికేదీ రాకపోయేసరికి నాలుగంటించటం, దాంతో వాడిమొహంలో ఏదో దిగులు, బుగులు.

ఆరోజు ఆదివారం కాబట్టి ఏదో రాసుకుంటా కూచున్నాను. నాన్నా అంటూ పరిగెత్తుకువచ్చాడు. శ్రీదేవి వుంటే భయంతో 'డాడీ' అనే పిలుస్తాడు. 'ఏంటీ కన్నా' అన్నాను. వాడిని ఈమధ్యే శాతవాహన స్కూల్లో ఎల్.కె.జీలో చేర్చాం.

"నాకసలుపాడతంరావట్లేదు" అన్నాడు దీనంగా.

"ఏంటి? పాటలు పాడటమా? అయినా నీకిప్పుడు పాడే అవసరం ఏమిట్రా?" అన్నాను దగ్గరకి తీసుక్కుంటూ.

"అదికాదు... ఈటీవీలో పాడుతా తీయగాలో పిల్లలు ఎంతబాగా పాడుతున్నారో చూడు. నువ్వు దేంట్లో లేవు అని మమ్మీ తిట్టింది"

నాకేం మాట్లాడాలో అర్థంకాలేదు.

"అయినా... స్కూల్లో లంచ్ పీరియడ్‌లో పాడతానికి ట్రై చేశాను. మా ఫ్రెండ్స్ అంతా నవ్వారు."

"అవునా..." అన్నాను ఏదో ఆలోచిస్తూ.

"అవున్నాన్నా... నాకు చాలా ఇన్సల్టింగ్ అన్పించింది" వాడి మొహంలో అవమానం పొందిన బాధ స్పష్టంగా కనిపించసాగింది.

"కిరణ్‌గాడైతే డంకీసాంగ్‌లా ఉందన్నాడు"

"కిషోర్‌గాడు మంకీపాప్‌లా ఉందన్నాడు"

వాడి కంఠం కోపంతో కుతకుతలాడుతోంది.

అనునయంగా దగ్గరకి తీస్కుంటూ "ఏం పాట పాడావ్‌రా" అనడిగాను.

"చంకరా... నాద చరీర పరా..."

నాకు నవ్వొచ్చింది. అయినా ఆపుకుంటూ "నీకు బాగానే పాడొచ్చు. కాకపోతే ఇంకాస్త పెద్దయ్యాక ఇంకా బాగా పాడొస్తుంది. సరేనా" అన్నాను.

వాడి కళ్లల్లో మెరుపులు.

ఇంతలో 'చింటూ...' అని శ్రీదేవి పిలవటంతో పరిగెత్తుకెళ్లాడు. వెనకే నేనూ వెళ్లాను. ఏదో ఛానెల్‌లోవస్తోన్న దృశ్యాన్ని ఒడిలో కూచోపెట్టుకుని చూపిస్తోంది.

టీ.వీ.లో నాలుగేళ్ల కుర్రాడు కాబోలు ధైర్యంగా మారుతీకారు నడుపుతున్నాడు.

"భలే...భలే..." చప్పట్లు చరిచాడు చింటూ.

"చూడూ. నీలాగే ఉన్నాడు. నీ అంత వయసే. ఎంత బాగా నడుపుతున్నాడో చూడు" శ్రీదేవి వాడిలో క్యూరియాసిటీని పెంచుతోంది.

"మమ్మీ...మమ్మీ... మరి ఆ అన్నయ్యకి భయమేయట్లేదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

శ్రీదేవి వాడివైపు కోపంగా చూసి "పిరికి వెధవ. నీకైతే అన్నీ భయాలే. ఆ అబ్బాయి ఎంత డేరింగ్‌గా నడుపుతున్నాడో చూడు" అని విసుక్కుంది.

వాడి చిన్నారిమనసు చిన్నబోయింది.

దిగాలుగా నాకేసి చూశాడు.

"శ్రీ... వాడికి ఇంట్రస్టులేని వాటిని చూపిస్తూ వాణ్ణెందుకలా హింసిస్తావ్" అన్నాను కొంచెం సీరియస్‌గానే.

"హింసించడమా? అదేంటండీ... ఈకాలం పిల్లలు ఎంత ఫాస్ట్‌గా ఉంటున్నారో వాడికి చూపిస్తున్నాను. లేకపోతే వీడు ఎంత వెనకబడిపోతాడు?" అంది.

"అది కాదోయ్. టాలెంట్ అనేది ఒకరు నేర్పితే బయటకు రాదు. ఏదో ఒకరోజు

అకస్మాత్తుగా బయటపడుతుంది. అది సాధన చేయడానికి ప్రోత్సహించాలి తప్ప... చూసి నేర్చుకున్నంత మాత్రాన కొన్ని కళలు అబ్బవు" అన్నాను.

"అది కాదండీ... ఈరోజుల్లో ఒక్క చదువు మాత్రమే ఉంటే లాభం ఉండొచ్చుకాని... దాంతోపాటు గుర్తింపు ఉండాలంటే అడిషనల్‌గా ఏదో రంగంలో ప్రవేశం ఉండాలన్నది నా అభిప్రాయం. అందుకోసం నేనేదో ప్రయత్నిస్తే దాన్ని మీరు హింసించడమంటున్నారు" అంటూ కోపంగా వంట గదిలోకి వెళ్లింది.

ఇంతలో ఫోన్ రావటంతో ఆ విషయం మర్చిపోయాను.

రమణ చేశాడు.

"ఇంట్లో ఏం చేస్తున్నావ్? సండే కదా... వచ్చేయ్. సరదాగా కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అనటంతో వాళ్లింటికి బయల్దేరాను.

నేను వెళ్లగానే ఎప్పుడూ పరిగెత్తుకొచ్చేవాళ్ల బేబీ జాహ్నవి ఎదురురాలేదు. రమణని పిలిచి వరండాలో కుచున్నాను. వాళ్లావిడ మిర్చీలు, కారప్పూస తెచ్చి పెట్టింది. రమణ మంచినీళ్లు పట్టుకొచ్చి పెట్టగానే 'జాహ్నవి లేదా' అనడిగాను.

"అయ్యో మీకు తెలీదు కదూ... జాహ్నవి కుడిచెయ్యి విరిగిందన్నయ్యా" అంది రమణ భార్య.

"ఎలా జరిగింది?" అన్నాను కంగారుగా.

"చెప్పినా వినకుండా ఈయనే కరాటే క్లాసులకి పంపిస్తున్నారు" అని చెప్పి లోపలికి వెళ్లింది.

"అంత చిన్నపిల్లని కరాటేకి ఎందుకు పంపుతున్నావ్ రమణా" అన్నాను కొంచెం సీరియస్‌గా.

"బేబీ ప్రత్యూషలాగా కరాటేలో జాహ్నవిని కూడా సూపర్‌కిడ్ చేయాలనివుంది" ఆమాట నాగుండెలమీద కొరడాదెబ్బలా బలంగా తాకింది.

ఏదో అనబోతున్న వాడినల్లా 'హల్లో...' అంటూ మోహన్ రావటంతో విష్ చేశాను.

మేం ముగ్గురం మంచి ఫ్రెండ్స్‌మి.

"ఇంత ఆలస్యమైందేమిటి?" అన్నాడు రమణ.

"మా వాడ్ని కంప్యూటర్‌తో కుస్తీ పట్టించి వస్తున్నాను. అందుకే లేటు" మోహన్ చెప్పాడు.

మోహన్ కొడుక్కి మూడేళ్లు.

"అప్పుడే నీ కొడుకుని బిల్‌గేట్స్ చేయాలనా...?" రమణ చిన్నగా నవ్వాడు. నాకైతే ఓ భయంకరమైన వాతావరణంలో చిక్కుకున్నట్లుంది.

ఏమిటీ వీళ్లంతా...?

బాల్యాన్ని తమ ఇష్టప్రకారం ఎంత దారుణంగా తుంచేస్తున్నారు? కాసేపటికి ఈ టాపిక్ మామధ్య సీరియస్ అయికూచుంది.

"మన పిల్లల్లో ఏ టాలెంట్‌వుందో తెల్సుకోకుండా... మనకిష్టమైంది నేర్చుకొని అందులో రాణించాలని కోరుకోవటం చాలా తప్పు. దీనివల్ల వాళ్లు దేనికీ కొరగాకుండా పోతారు" అన్నాను సీరియస్‌గా.

"మనకాలంలో అవకాశాలు లేక మన తల్లిదండ్రులు మనలో చదువుతప్ప ఇంకేదీ గుర్తించక పట్టించుకోలేదు. అది మన బ్యాడ్‌లక్. కానీ మన పిల్లలకి మనం ఏదైనా రంగంలో ఎదిగేలా చేయకపోతే మనం మంచి తల్లిదండ్రులం ఎలా అవుతాం?" అన్నాడు మోహన్.

"టాలెంట్ అనేది ఒకరు నేర్పితేరాదు. దాస్తే దాగదు. రఘురామయ్యగారు తరగతి గదిలో తరచూ ఈలలు వేస్తుంటే మాస్టార్లు కొట్టేవారట. తర్వాత ఆయన ఈలపాట రఘురామయ్యగా అంతర్జాతీయ కీర్తి సంపాదించాడు. ఏదో చెయ్యాలి అన్నది పక్కన బెడితే... మనం చెయ్యాల్సింది మంచిగుణాలున్న పౌరులుగా తీర్చిదిద్దితే చాలు" అన్నాను కొంచెం రోషంగా.

"టాలెంట్‌కీ... గుణంకీ సంబంధం లేదా?" సీరియస్‌గా అడిగాడు రమణ. "ఖచ్చితంగా లేదు. గొప్ప టాలెంట్‌వున్న వ్యక్తిగుణం కూడా గొప్పగా వుండాలన్న గ్యారంటీలేదు. ప్రపంచంలో చిన్నవయసులోనే డాక్టరైన వ్యక్తి వరకట్నం కేసులో అరెస్ట్ కాలేదా?"

"నేచర్‌ని బట్టే మనిషి తన టాలెంట్‌ని డెవలప్‌చేసుకుంటాడని నేనంటాను. ఇందిరాగాంధీ తన నేచర్ కనుగుణంగానే రాజకీయాల్లో ఎదిగింది. అదే ఆమెలోని టాలెంట్ కాదంటావా?" అన్నాడు మోహన్.

"టాలెంట్ అనేది సార్వజనీనం. నేచర్ వ్యక్తిగతం. ఈరెండూ ఒకే వ్యక్తిలో రైలుపట్టాల్లా వున్నప్పటికీ.... వేర్వేరు అని నా అభిప్రాయం. ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్రాలు అతనిలోని టాలెంట్‌కు నిదర్శనం. అన్నింటిలోనూ అతడు మాధురీదీక్షిత్‌ని ఊహించుకోవటం అతడి గుణానికి సంబంధించిన విషయం" అన్నాను.

"టాలెంట్, గుణం పూర్తిగా వేర్వేరయితే... మరి శోభరాజ్‌లో కన్పించేది దొంగ గుణం. అందులో అతడి టాలెంట్ ఏంటో చూపిన ప్రతిసారీ పోలీసులు నివ్వెరపోయారు. ఓసారి జైల్లోంచి ఒక పుస్తకాన్ని అతడు బయటకి పంపాడు.- పోలీసులు దాన్ని సోదాచేసి ఏమీలేదని వదిలేశారు. కాని పుస్తకంలో ఓచోట రెండు పేజీల అంచుల్ని అతికించి మధ్యలో ఒక లెటర్‌ని పెట్టి పంపించాడట. మరిక్కడ అతడిగుణమూ, టాలెంట్ ముడిపడి వున్నాయా

లేదా?" అన్నాడు రమణ.

"అతడి గుణం అలాంటిది. దాంతో ఎంచుకున్న వృత్తిలో అతడి టాలెంట్ చూపించుకున్నాడు అంటే గుణానికి, టాలెంట్‌కి సంబంధం వుంది" కొంచెం గట్టిగానే అన్నాడు మోహన్.

మా మధ్య రెండు నిమిషాలు మౌనం...

"ఎంతగొప్ప టాలెంట్ వున్నా... మనిషి గుణం ప్రత్యేకంగానే వుంటుంది. మంచి ఫాలోయింగ్‌లో వున్నప్పుడు క్రికెట్‌లో అజహరుద్దీన్ టాలెంట్‌కి మురిసిపోయి దుబాయ్‌వనిత పెళ్లి చేసుకుంది. కాని సంగీతా బిజిలాని వెంటపడతున్న అతడిలోని గుణం నచ్చకే ఆమె విడాకులు తీసుకుంది. మరిక్కడ జరిగిందేమిటి? ప్రపంచవ్యాప్తంగా వున్న టాలెంట్‌కి మురిసివచ్చినామె... అతడికి ఎందుకు విడాకులిచ్చింది? మరో ఆడదాని వెంటపడే గుణం ఏ భార్యకీ నచ్చదు గనక..." అన్నాను.

"అంటే ఎక్కడో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన... టాలెంట్ వున్నవాళ్లందరికీ మంచి గుణం వుండదనా?" మోహన్ అడిగాడు.

"తన టాలెంట్‌మీద గౌరవం పెంచుకున్నవాళ్లు, తమ టాలెంట్‌ని పదిలంగా కాపాడుకోవాలనుకునేవాళ్లు మంచి గుణాలను అలవర్చుకుంటారు. వృత్తిపరంగానే కాక ప్రవృతిపరంగా కూడా హుందాగా వుంటారు. అయినప్పటికీ అదివేరు, ఇది వేరని నేను చెప్పేది. మనిషిలోని టాలెంట్ పదిమందిలో వున్నప్పుడు బయటపడుతుంది. మనిషి యొక్క గుణం ఒంటరిగా వున్నప్పుడు బయటపడుతుంది" అన్నాన్నేను.

ఇంతలో ఎవరో పక్కింటి పిల్లాడు శక్తిమాన్ సీరియల్ చూసి డాబా మీంచి దూకాడని రమణ భార్య రొప్పుతూ చెప్పటంతో అటువైపు పరిగెత్తాం. అప్పటికే అబ్బాయిని హాస్పిటల్‌కి తీసికెళ్లారట.

నాకెందుకో మనసంతా అల్లకల్లోలమైంది.

రమణ, మోహన్ మళ్లీ వాళ్లింటికి వెళ్లి కూచుందామన్నా మనసొప్పలేదు. అప్పటికే రెండుగంటలు గడిచాయి. వాళ్లదగ్గరా సెలవు తీసుకొని బయటపడ్డాను.

ఇంటికొచ్చేసరికి చింటూ నిద్రపోతున్నాడు.

ఎందుకో నాకే తెలీదు. మంచంపై కూచొని వాణ్ణి అలాగే చూస్తుండిపోయాను.

"దిష్టి తగుల్తుంది" శ్రీదేవి మాటతో బయటపడ్డాను.

"ఏమిటి సంగతి? వాణ్ణి అంత తీక్షణంగా చూస్తున్నారేంటీ? వాడు డాక్టరవుతాడా? పైలెట్ అవుతాడా? అని ఆలోచిస్తున్నారా?"

"వాడు మంచిమనిషైతే చాలు అని ఆలోచిస్తున్నాను" అనేసి డ్రెస్ విప్పి లుంగీ

కట్టుకున్నాను.

"అంటే? మీలాగన్నమాట..." మీకు ఏ టాలెంటూ లేదని శ్రీదేవి దెప్పిపొడిచినట్టు తోచింది.

మౌనంగా మంచంమీద వాలిపోయాను.

కాసేపటికి... చింటూ నిద్రలో కాళ్లూ చేతులూ ఆడిస్తూ... వెక్కిళ్లు పడ్డట్టుగా, ఉలిక్కిపడుతూ ఏవో అరుస్తున్నాడు.

ఆ దృశ్యం చూసి శ్రీదేవి భయపడింది.

నాక్కూడా కాళ్లూ చేతులు ఆడలేదు.

వాడు నిద్రలో ఏదో కలవరిస్తున్నాడు.

గాబరాగా 'చింటూ...చింటూ' అంటూ వాణ్ణి నిద్రలేపాము. వాడి లేతముఖం మీద చిన్నగా చెమటపట్టింది. నిద్రలోంచి లేస్తూనే భయంగా చూశాడు.

"ఏంటి కన్నా... కలొచ్చిందా?" అన్నాను.

శ్రీదేవి అక్కున చేర్చుకుంటూ "ఏమైందిరా... ఏం కలొచ్చింది. అలా చేశావేంట్రా?" అంటూ హత్తుకుంది.

మరో పదినిమిషాల వరకూ వాడిలో బెరుకుపోలేదు. స్థిమితపడ్డాక 'ఏమైందిరా?' అని మళ్లీ అడిగాం.

"స్కూల్లో స్విమ్మింగ్ పోటీలు పెట్టారు డాడీ. రాజేష్ ఫస్టొచ్చాడు. నాకూ నేర్చుకోవాలని వుంది కాని మనోహర్‌గాడేమో... నువ్వు దేంట్లోనూ లేవేమిట్రా? స్విమ్మింగైనా నేర్చుకో అంటూ నాకు భయమేస్తుందన్నా వినకుండా ఒక్కసారిగా నీళ్లలోకి తోసేశాడు. ఎన్ని నీళ్లుమింగానో... కాని ఇదికలా డాడీ... నిజంగానే నీళ్లలో మునిగిపోయాను అన్పించింది" అమాయకంగా చెప్పాడు.

ఇద్దరం మొహాలు చూసుకున్నాం.

వాడు చదువుకన్నా ఇలాంటి విషయాలపట్లే ఆందోళన పడుతున్నాడని నాకనిపించింది. దీనివల్ల చదువు దెబ్బ తినొచ్చుకాని... ఈ పరిస్థితుల్ని ఎవరు కల్పిస్తున్నారు?

"స్విమ్మింగ్ చాలా ఈజీ చింటూ... వీలున్నప్పుడల్లా నేను నేర్పిస్తాను సరేనా?" అన్నాను లాలనగా.

"ఓకే డాడీ..." తలూపి తల్లి ఒడిలో నిద్రపోయాడు.

* * * *

వృత్తిరీత్యా నేను జర్నలిస్టుని కాబట్టి మరో రోజు ఉదయమే నాకు మరో ఇన్సిడెంట్ ఎదురైంది. ఓవ్యక్తి ప్రొద్దున్నే మా ఇంటికొచ్చి పరిచయం చేసుకున్నాడు. అతడు ఆర్ అండ్

బి ఆఫీసులో సూపర్నెంట్‌గా పనిచేస్తున్నాడట. వాళ్ల మూడేళ్ల అబ్బాయి మొత్తం దేశాల రాజధానులు, అధ్యక్షుల పేర్లు చెబుతాడని... సూపర్‌కిడ్‌గా వాళ్ల అబ్బాయి గురించి ఓ వార్త రాయమని.

నరేనని అతణ్ణి పంపించి... మధ్యాహ్నం కెమెరా తీసికొని వాళ్లింటికెళ్లాను.

నారాక కోసమే ఎదురు చూస్తున్నారేమో భార్యాభర్తలిద్దరూ గుమ్మంలోనే ఎదురొచ్చి లోపలికి తీసికెళ్లారు. వాళ్లబాబుని పరిచయం చేశారు. ముద్దుగా బొద్దుగా వున్నాడు. నేను రెండు, మూడు స్నాప్స్ తీసి "మన ఇండియా రాజధాని ఏది?" అని అడిగాను.

"ఢిల్లీ" ఠక్కున చెప్పాడు.

"జపాన్ రాజధాని?"

"తోక్యో"

"మలేషియా రాజధాని?"

ఆ అబ్బాయికి జవాబు తట్టలేదు. జవాబుకోసం చాలా ఆతృతపడుతున్నట్టు కన్పించాడు. వయసుకిమించిన జవాబుకోసం చిన్నారి మెదడ్ని చించుకుంటున్నట్టుగా అబ్బాయి ముఖకవళికలు మారుతున్నాయి. తల్లిదండ్రుల మొహాల్లో ఆదుర్దా, అయిదు నిమిషాలయ్యాక "గు...ర్తు...రావట్లేదు" అన్నాడు బాధగా.

"పోనీలే... అమెరికా అధ్యక్షుడి పేరు?"

"బిల్ క్లింతన్" "ఇరాక్ ప్రెసిడెంట్ పేరు?"

చెప్పలేకపోయాడు. అవగాహనతో అర్థంచేసుకున్న జవాబులైతే ఎవరికైనా మెదడు పొరల్లో నిక్షిప్తం అవుతాయి కాని... చిన్నారుల జ్ఞాపకశక్తికి మించి బట్టీ పట్టించటం అనర్థమే అని ఎంతమంది గ్రహిస్తున్నారు?

"మీ అబ్బాయికి మంచి భవిష్యత్తు వుంది" అని చెప్పి అక్కడినుండి బయటపడ్డాను.

ఇంటికొచ్చేసరికి శ్రీదేవి ఆనందంగా టీ.వీ. చూస్తూ కన్పించింది. నన్ను చూడగానే... "ఏవండీ... మన చింటూ క్రికెట్ ఆడుతున్నాడు. వాళ్ల స్కూల్ కాంపిటీషన్స్‌ని... అదిగో సిటీకేబుల్‌లో చూపిస్తున్నారు" అంది.

నేను విస్మయంగా టీ.వీ. చూశాను.

చింటూ బ్యాటింగ్ చేస్తున్నాడు. అంతా చిన్నపిల్లలే. చింటూ కొట్టిన దెబ్బకి బంతి గ్రౌండ్ దాటింది.

"ఏవండీ... వాడిప్పటికే మూడు ఫోర్లు, అయిదు సిక్సర్లు కొట్టాడు" అంది. వెంటనే "అయ్యయ్యో... నేనిన్నాళ్లు గమనించలేదు. వాడు క్రికెట్ ప్లేయర్ అవుతాడన్నమాట" అంది మళ్లీ.

ఈలోపు చింటూ అవుటయ్యాడు.

మొత్తానికి ఆటలో వాణ్ని "బోయ్ ఆఫ్ది మ్యాచ్" గా ప్రకటించారు' వాడు కప్పు అందుకుంటూంటే శ్రీదేవి ఇంట్లోనే చప్పట్లు చరిచింది. నాకు నవ్వొచ్చింది.

అరగంట తర్వాత వాడు ఇంటికిరాగానే శ్రీదేవి దిష్టితీసింది. అప్పుడే మాఫ్రెండ్ ప్రకాష్ వచ్చాడు. చింటూ తెచ్చిన కప్పు చూసి "వెరీగుడ్... నీకు క్రికెట్ అంటే చాలా ఇష్టమా" అన్నాడు క్యాజువల్‌గా.

"కాదు...కానే కాదు... నాకు క్రికెటంటే అసహ్యం"

చింటూ మాటకి ముగ్గురం త్రుళ్లిపడ్డాం.

"అదేంటి... ఇష్టం లేనిదే అన్ని ఫోర్లు, సిక్సర్లు ఎలా కొట్టావ్?" అన్నాడు ప్రకాష్.

"కోపంతో కొట్టాననంతే..."

"కోపమా...? ఎవరి మీదా...?"

"మమ్మీమీద..."

వాడి మాట నెత్తిన పిడుగుపడ్డట్టుగా తగిలింది.

"మమ్మీమీద కోపం... బంతుల మీద చూపించానంతే. నాకు క్రికెట్ అంటే ఇష్టం వుండదు"

"మరి నువ్వేం కావాలనుకుంటున్నావ్" ప్రకాష్ క్యూరియాసిటీగా అడిగాడు.

"నేను గుడ్‌బాయ్‌ని కావాలనుకుంటున్నాను"

వాడి జవాబు ప్రకాష్‌లో గాని, శ్రీదేవిలోగాని ఏ ఉత్సాహాన్నీ కలిగించలేదు. నాలో మాత్రం కొండంత సంతోషాన్ని నింపింది. చింటూ వీపు తట్టాను.

ప్రపంచంలో మంచితనాన్నిమించిన టాలెంట్ మరేదీ కాదని నాలో నేనే గొణుక్కున్నాను.

చింటూ నాదృష్టిలో... ఇప్పుడు సూపర్‌కిడ్!!

రవిగాంచని చోట పైరవిగాంచున్...

చలికి ఇంకా నిద్రలేవని నేను ఉదయాన్నే సిన్మా పేజీ చూస్తూ మాఆవిడ అరచిన అరుపుకి ఉలిక్కిపడి లేచాను. మరోసారి పిలిచింది.

"ఏవండోయ్... ఓసారి పేపర్ చూడండి. మీ మిత్రుడు సుకుందరావుకి విష్ణుమాయ చిత్రంలో నటనకుగాను ఉత్తమ నటుడి అవార్డొచ్చింది. అదేదో ఉల్లిపాయ మూవీ ఆర్ట్స్ సంస్థ ప్రకటించింది" అంది.

నా మనసుని తేనెటీగ కుట్టినట్టు జల్లుమంది.

సుకుందంగాడికి ఉత్తమనటుడు అవార్డా?

విష్ణుమాయ చిత్రంలోనా...?

అసలా చిత్రంలో వాడెక్కడున్నాడు? ఆ సినిమాలో పందొమ్మిది రీళ్లూ బుర్రలో గిర్రున తిరిగిపోయాయి. కాని సుకుందంగాడు కన్పడలేదు. ఇక్కడ సుకుందరావు గురించి కొంచెం ఫ్లాష్ బ్యాక్ చెప్పాలి.

కట్ చేస్తే... వాడి థియరీ ప్రకారం డబ్బు సంపాదించాలంటే రెండే రంగాలు. ఒకటి రాజకీయరంగం, రెండోది సినిమారంగం. అందులోనూ 'కళ అనునది ఒకగుల' అని భావించేవాడు. కాబట్టి సినిమాల్లో ట్రై చేద్దామని నా పెళ్లికి ముందు చెవిలో జనరేటర్ ఆన్ చేసేవాడు. కళ అనే దురద ఏ మెడిమిక్స్ సబ్బుకో, జాలిమ్ లోషన్‌కో వదలదు కాబట్టి... ఇద్దరం హైదరాబాద్‌కి బయల్దేరాం. ధరల్లో మాత్రం హైగా కన్పించే సిటీలో పాండీబజార్ లాంటి కృష్ణానగర్‌లో ఓగది అద్దెకి తీసుకొని కెమెరా రీళ్లలా తిరిగాం.

అంతటా కట్ చెప్పారు. ఏడాది తిరిగినా ఏ ఛాన్సూ రాలేదు సరికదా... కనీసం బుల్లితెర మీద కూడా పిల్లి తలకాయంత మేం కన్పడలేదు. చివరికి నేను తిరిగొచ్చిన ఫిలిండబ్బాలా బ్రీఫ్‌కేస్ సర్దుతుంటే... సుకుందంగాడు ఇండస్ట్రీలో 'టైం' గురించి లెక్చరిచ్చాడు.

ఎల్.వి.ప్రసాద్ నించి... చిరంజీవిదాక.

"అంతెందుకూ... మొన్నటికి మొన్న బాపూగారి సీతాకళ్యాణం సిన్మాలో పదిమంది మేకప్ అసిస్టెంట్‌లలో ఎ.ఎం.రత్నం ఒకడు. శ్రీకాంత్ ఏంటి? పీపుల్స్ ఎన్‌కౌంటర్‌లో నెగటివ్ రోల్‌తో ఎంటరయ్యాడు. ఇప్పుడు ఊహించనంత ఎదిగిపోయాడు. రజనీకాంత్ నీలాగే అనుకుంటే కండక్టర్ నించి కంట్రోలర్‌గానే ఉండేవాడు. అలాంటిది తమిళనాడునే కంట్రోల్‌లో పెట్టే లెవెల్‌కి ఎదిగాడు. దేనికైనా తపన కావాలి, టైం రావాలి" అన్నాడు ఆవేశంగా.

"ఎవరో ఒకరిద్దరు అలా అయినంత మాత్రాన మనకూ అలాగే జరుగుతుందని గ్యారంటీ ఏమిటీ? నే వెళ్లిపోతాన్రా" అన్నాను నిక్కచ్చిగా.

"వందమందిలో ఒక్కడే విజయం సాధిస్తాడు. మనం ఎదగడానికి ఆ ఒక్కణ్ణే స్ఫూర్తిగా తీసుకోవాలి తప్ప మిగతా తొంభై తొమ్మిది మంది గురించి ఆవగింజంత ఆలోచించినా అపజయాల పాలైపోతాం" అన్నాడు కూల్‌గా.

"ఏమోరా... నాకైతే మనకి అవకాశాలు వస్తాయన్న ఆశ ఏ కోశానా కన్పించట్లేదు. మనలాంటి 'కళాగ్రస్తులు' ఈ కృష్ణానగర్‌లో ఎన్ని అగచాట్లు పడుతున్నారో చూస్తుంటే బెంబేలెత్తుతోంది" అన్నాను నీరసంగా.

"అదే మన గ్లామర్‌ని తగ్గిస్తుంది. మనకి రెండు అవకాశాలు వచ్చాయనుకో... నిమ్మరసం తాగకున్నా నిగనిగలాడిపోతాం. సక్సెస్‌తో వచ్చే వెలుగు ఎంత తిన్నారాదు బ్రదరూ. జస్ట్ టైం రావాలి... కనీసం నెల్రోజులు ఓపిక పట్టు. డైరెక్టర్ సూర్యవంశీ సిన్మాలో కేరక్టర్స్ ఉన్నాయంట. అందుకే రేపు జూనియర్ ఆర్టిస్టు సప్లయర్ బాలప్రసాద్ దగ్గరికెళ్తున్నాను" అన్నాడు.

"వేషమివ్వాల్సింది సూర్యవంశీ అయితే బాలప్రసాద్ దగ్గరికెందుకూ?" అనడిగాను.

"అదే బ్రదర్... రవిగాంచని చోట పైరవిగాంచున్..." అంటూ సిగరెట్ వెలిగించి బయల్దేరాడు. నేను ఆలోచనల్తో చాపమీద నడుం వాల్చాను. అరగంటలో తిరిగొచ్చిన సుకుందం 'పద...పద' అని తొందర పెట్టాడు. ఏ ప్రొడక్షన్‌లో ఏ క్యారెక్టరుందో ఎవరికి తెల్సు... బాలప్రసాద్ చెంతకీ" అనటంతో బయటపడ్డాం.

* * * *

జూనియర్ ఆర్టిస్టు సప్లయర్ ఇంటికెళ్లేసరికి అప్పుడే బయటికెల్లాడని తెలియడంతో

రెండు గంటలు ఆ ఏరియాలో తిరిగాం. ఫిలింనగర్‌లో మాలాగే వేషాల వేటలో కనపడ్డ వారిని హల్లోలతో పలకరిస్తూ... టీలుతాగుతూ... ఫ్లాప్‌ల గురించి, స్టోరీలు స్టోరీలుగా చెప్పుకుంటూ, వింటూ రెండు గంటలు గడవగానే బాలప్రసాద్ ఇంటికెళ్ళాం. ఆయన గారి భార్య ఫ్లాప్ సినిమా గురించి ఫ్లాష్ న్యూస్ చెప్పినంత చల్లగా "ఆయనిప్పుడే వచ్చారు. మరో గంటైతేగాని లేవరు. గంటాగి రండి" అంది. గంటే కదాని మళ్లీ రోడ్డున పడ్డాం. ఈ ఏడాదిలో సినిమా ముఖాలు బాగానే పరిచయమయ్యాయి కాబట్టి... ఏయే సినిమాలో ఏయే వేషాలున్నాయో ఆరా తీశాం. మళ్లీ గంట గడిచాక వెళ్తే 'ఆర్టిస్టుల్ని సప్లయ్ చేసి ఆయన బాగా అలసిపోయినట్టున్నారు. మరో గంటయితేనే కచ్చితంగా లేస్తారు" అందావిడ. ఆవిడ భార్యో జూనియర్ ఆర్టిస్టో పోల్చుకోలేకపోయాం. కడుపులో ఆకలి నకనకలాడుతోంది. సాయంత్రం కలుస్తామని చెప్పి బయటపడ్డాం.

సిటీబస్సులో నలిగిపోయి, చితికిపోయి గదికొచ్చేసరికి ఖాళీగిన్నెలు వెక్కిరించాయి. నాకైతే కడుపులో దుఃఖం పొర్లింది. కాని గదిలో పడివున్న రెండు కవర్లపై దృష్టి పడటంతో సుకుందాన్ని వంట చెయ్యమని చెప్పి కవర్లు చించాను.

ఒకటి తమ్ముడి నించి...

మరోటి నాన్ననించి...

"మీకోసం వచ్చిన సిన్మానల్లా చూస్తున్నాం. మీరెళ్లి ఏడాది దాటింది. దేంట్లోనైనా కన్పిస్తారని థియేటర్లో వత్తులు వేసుకొని చూస్తున్నాం. మీరు ఏయే సిన్మాల్లో నటిస్తున్నారో తెలుపగలరు." అంటూ కాబోయే హీరోలుగా మా గురించే కలలు కంటూ రాశాడు తమ్ముడు.

ప్చ్...

నేను నిట్టూరుస్తుండగానే "ఘుమ ఘుమలు... ఘుమఘుమలు... మామిడికాయ పచ్చడితో వంట రెడీ" అన్నాడు సుకుందం. ఆకలి, హిట్ సిన్మాలా పరిగెడుతుండటంతో నాన్న లెటర్ చదవకుండానే జేబులో పెట్టుకొని గబగబా భోంచేశాం. నాన్న ఉత్తరాన్ని చదవాలంటే భయం. దాంట్లో అన్నీ తిట్లే వుంటాయి. అందుకని ఇంట్రస్టు రాలేదు. సాయంత్రం కాగానే మళ్లీ జూ.ఆ.స బాలప్రసాద్ దగ్గరికి పరిగెత్తాం. సుకుందం గాడికి పరిచయం కాబట్టి పలకరించాడు. వేషాల గురించి పెదవి విరిచాడు. చివరికి మేం కాళ్లావేళ్లా పడ్డంత పనిచేయటంతో 'విష్ణుమాయ' చిత్రంలో డైరెక్టర్‌ని ఒప్పించి సుకుందం ఒక్కడికి వేషం ఇప్పించడానికి ఒప్పందం కుదిరింది.

నా మనసు ఫ్లాప్ సిన్మా ప్రొడ్యూసరైపోయింది. నీరసంగా గదికి వచ్చి నాన్న రాసిన లెటర్ తెరిచాను.

"విశ్వ విఖ్యాత నటసార్వభౌములకి... నమస్కారములు.

మన ఇంటావంటాలేని వేషాల పిచ్చి ఎలా తగిలిందిరా అప్రాచ్యుడా... నువ్వు

కడుపులో ఉండగా మీ అమ్మనేదో సిన్మాకి తీసికెళ్లినట్టు గుర్తు. అదే ఇంతదూరం వచ్చినట్టుంది. ఇంకా వెండతెర మీద తమరి బంగారు ముఖారవిందం కన్పించి చావదుగానీ, పెట్టేబేడా సర్దుకొని వెంటనే వచ్చెయ్.

నీకు పెళ్లి సెటిల్ చేసాను.

అమ్మాయిని ప్రీతిజింటాలాగానో, అంజలా జవేరీలాగానో ఊహించుకోకు. ఫర్లేదు. బాగానే ఉంటుంది. మీ మామ జగిత్యాలలో ఫైనాన్స్ పెట్టి, మూసేసి, జనాల కొంపలు ముంచి బాగానే సంపాదించాడు. కట్నం కూడా లక్షరూపాయలిస్తున్నారు. వచ్చే నెల ఆరో తేదీన నీ పెళ్లి... వచ్చి తగలడు. మీ... నాన్న"

ఉత్తరం చదివి నవ్వాలో, ఏడ్వాలో అర్థంకాలేదు. కానీ ఇక్కడ పైకి రావాలంటే మాత్రం సిన్మా చూసినంత ఈజీకాదని ఈ ఏడాదిన్నర కాలం నేర్పింది. అందుకే ఉత్తరాన్ని సుకుందానికి చూపించాను. వాడు కొంచెం బాధగానే "బెస్టాఫ్ లక్" చెప్పాడు.

"నీ పెళ్లికి ఎలాగైనా సిన్మా స్టార్స్‌ని తీసుకొస్తాన్రా. గ్లామరస్‌గా ఉంటుంది" అని భుజం తట్టి బస్సెక్కించాడు. నేను ఇంటికొచ్చి అమ్మాయిని చూసి క్లాప్ కొట్టాను.

ముహూర్తం షాట్ దగ్గర పడింది.

ఇంతలో విష్ణుమాయ చిత్రంలో ఏదో పాత్ర వేస్తున్నట్టు సుకుందం నించి లెటరొచ్చింది. "ఒకరిద్దరు సినిమా మొహాల్ని నీ పెళ్లికి తీసుకొస్తాను. మన లెవల్ అక్కడ పెరగాలి కదా. వాళ్లు రావడానికి ప్రొడ్యూసర్ లింగారావ్‌తో పైరవీ చేస్తున్నాను" అని రాశాడు.

నా పెళ్లి హడావిడి మొదలైమేం పెళ్లిపీటల మీద కూచున్నా సుకుందంగాడు రాలేదు. "ఏరా అన్నయ్య, నీ పెళ్లికి హీరోలు, హీరోయిన్లు వస్తారన్నావ్... ఎవరూ రాలేదేంటీ?" అని తమ్ముడుగాడు శనిలా పీడిస్తూనే ఉన్నాడు. సుకుందంగాడి పైరవి ఫలించలేదనుకున్నాను. పెళ్లిపందిరంతా సందడిగా వుంది.

"అయ్యా... మీరేదో ఆలోచనలో మునిగినట్టున్నారు. ముహూర్త సమయం అయింది తాళి కట్టండి. బాజాలు మోగించండయ్యా" అని పురోహితుడు సాక్షి రంగారావ్ లెవల్లో అరిచాడు.

నేను దిగ్గున లేచి మూడు ముళ్లు వేస్తుంటే... ఆశ్చర్యం... అక్షింతల వర్షమే కురియలేదు. ఒక్కరూ అక్షింతలు వేయకుండానే బయటికి పరుగులు తీయటంతో కంగారుపడ్డాం పెళ్లికూతురు, నేను, పురోహితుడు.

తీరా విషయం ఏంటంటే... అప్పుడే సుకుందంగాడు ఒక ప్రముఖ హీరోని తీస్కొని కార్లో దిగాడట. అంతా అటువైపు పరిగెత్తారు.

పెళ్లిపందిరంతా గోల...గోల...

మమ్మల్ని పట్టించుకున్నవాళ్లే లేరు. అంతా హీరో చుట్టేమూగారు. మా ఆవిడ నావైపు కొరకొరా చూసింది మొదటిసారి, పెళ్లిపీటల మీదే...

ఇరవై నిమిషాల తర్వాత సుకుందం, హీరో మా దగ్గరికి వచ్చి అక్షింతలు వేశారు. సుకుందం నా చెవిలో "హీరోగార్ని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తీసుకువెళ్తానని ఒప్పించి, పెళ్లి కరీంనగర్లోనే కాబట్టి మధ్యలో ఇలా అక్షింతలు వేసి వెళ్దామని నచ్చచెప్పా... నేనూ, ప్రొడ్యూసర్ లింగారావు, హీరోగారి రాకతో, పెళ్లికళ బాగా వచ్చింది కదూ" అన్నాడు.

నేను నవ్వలేక నవ్వాను.

వచ్చినంత హడావిడిగానే వాళ్లు వేములవాడ వెళ్లిపోయారు. పెళ్లికి వచ్చిన వాళ్లంతా డైనింగ్‌హాల్ వైపు పరుగులు తీశారు.

"ఇకనించీ సిన్మా పిచ్చి తగ్గించుకోండి" దండలు సవరించుకుంటూ మా ఆవిడ మొదటి వార్నింగ్ ఇచ్చింది.

ఇక ఈ ఫ్లాష్‌బ్యాక్‌ని ఎండ్ చేస్తే... అర్నెల్ల తర్వాత మళ్లీ మా ఆవిడ డైలాగ్‌తో గబుక్కున లేచివచ్చి సిన్మా పేజీ తీశాను.

నిజమే... విష్ణుమాయ చిత్రంలో ఉత్తమ నటుడు సుకుందం.

నా దగ్గర ఆ సినిమా కాసెట్టు ఉండటంతో నోట్లో బ్రష్ అయినా వేసుకోకుండా క్యాసెట్ ప్లే చేశాను.

అంతా దేవతలు, రాక్షసులు కాబట్టి రిమోట్ చేతిలో పెట్టుకొని స్లోమోషన్‌లో అందరి ఫేసుల్ని తీక్షణంగా నాలుగ్గంటలు చూశాను.

మధ్యలో మొహం వాష్ చేసుకొని వచ్చి మళ్లీ చూశాను.

యజ్ఞాలు భంగం చేస్తున్న రాక్షసుల మొహాల్ని స్టిల్ బటన్ నొక్కుతూ చూశాను. అయినా సుకుందంగాడు ఆ సిన్మాలో కన్పించలేదు. వాడికి ఉత్తమ నటుడేంటని ఆశ్చర్యపోతుంటే... పదకొండింటికి వెదకపోయిన టైటిల్ కథలోనే తగిలినట్టు సుకుందం ఊడిపడ్డాడు. రాగానే మేం 'కంగ్రాట్స్ చెప్పి - "అసలీ సిన్మాలో నువ్వెక్కడున్నావురా" అనడిగాను.

"క్యాసెట్ ప్లేచెయ్... నా నటన చూపిస్తా" అన్నాడు.

టైటిల్స్ మొదలుకాగానే... "నా నటన క్లైమాక్స్‌లో ఉంది ఫార్వర్డ్ చెయ్" అన్నాడు.

సినిమా చివర్లో ఏమీ లేదు. పెద్దగా... భగవంతుడి విశ్వరూపం తప్ప.

"ఇంకెక్కడ్రా" అనడిగాను చిరాగ్గా.

"స్టిల్ నొక్కు" అన్నాడు వాడు. టీవీ స్క్రీన్‌మీద విశ్వరూపం అలాగే ఉండిపోయింది.

"అదెవరో తెల్సా" అన్నాడు.

"భలేవాడివి... విష్ణువేషం వేసింది అనిల్ ఘోష్ కదా"

"అవును కానీ ఆ విష్ణువుకి పదిచేతులున్నాయి చూశావా? కుడిపక్క చక్రాన్ని, ఎడమ పక్క శంఖాన్ని పట్టుకున్న చేతులెవరిలో తెల్సా... నావే" అన్నాడు.

"అదేంట్రా... అది నటనా?" అన్నాను.

"అవునుమరి... అందుకోసం ఆరుగంటలు నిల్చున్నాం"

"ఆ నటనకి అవార్డ్ ఎలా ఇచ్చార్రా బాబూ" అన్నాను తలబాదుకుంటూ.

"అదేమరి... రవిగాంచని చోట పైరవిగాంచున్... తెలీదా?" అనటంతో చివరికి లలితకళల్ని కూడా వైరస్‌లా తొలిచేస్తున్న రికమెండేషన్ 'పవర్'తో షాక్ తినటం నావంతయింది.

పేదోడి 'గడీ'

అప్పుడే స్టీలు గ్లాసులో చాయ తెచ్చి భర్తకిచ్చింది నర్సవ్వ.

"మూడ్రోజుల్నుంచీ వాన జల్లెడవట్టినట్టె పడవట్టె... వరి గడ్డి అంత నానిపాయె. జీవాలు అరువవట్టె. పోనీ విడిచిపెడదామనుకుంటె... పెసరు చేన్లకాలం. ఎవనిచేన్లనన్న పడ్డయంటే మల్ల పంచాయతీలు... దండుగలు..." అన్నాడు ఎల్లయ్య భార్యతో చాయ గ్లాసు పదిలంగా తీసుకుంటూ.

"తుపాను లెక్కనే వున్నది. పసుల మల్లిగాడు బర్లను కూడా కొట్టుకపోతలేడు. ఆనికేం సుకమచ్చింది? పందిరంత రొచ్చు రొచ్చు కావట్టె... చెత్రి పట్టుకపోయి చెరువుకట్ట పొంట ఎడ్లను మేపుకత్తవా?" అంది ఉరుస్తున్న పైకప్పు కేసి చూస్తూ నర్సవ్వ.

"గదే సూత్తన్న... బొంబాయి పోచమ్మ దిక్కు కొట్టుకపోయి మేపుకత్త. ఇల్లంత గిట్ల ఉరిసి పీతిరికుంట లెక్క గావట్టె. గీ ఎండకాలమన్నా బెంగుళూరు గూన ఏయించుకుందామంటే... ఎప్పటి చిప్ప ఏనుగుల్నేనాయె... రైతు మంచిగ బతికే కాలాన్ని మా తాతలు సూల్లేదు. మా అయ్యలు సూల్లేదు. ఇగమేం కూడా చూడం గావచ్చు... థూ... నీ యవ్వబతుకు..." బూతుమాట తిట్టుకున్నాడు ఎల్లయ్య.

" ఆ కాలమోల్లకన్న మనమే నయం తియ్. బుక్కెడంత అన్నం తింటున్నం. గంజి అంటె ఎట్లుంటదో మన పొరగాండ్లకు తెలుస్తదా? మనమేమర్చిపోతిమి" అంది నర్సవ్వ.

"నీయవ్వ... చాయ ఉడుకులేదేందే?"

"మరి నేనేం జెయ్యాలె... కట్టెలు మండుతలెవ్వు."

అప్పుడే నిక్కరంతా బురద పూసుకుని... తడిసిపోయి పరిగెత్తుకొచ్చాడు. వాళ్ల చిన్న కొడుకు.

వస్తూనే... "బాపూ... భాస్కరన్నోల్లింట పెద్ద నాగుంబాము జొచ్చింది. కట్టె దీస్కోని నిన్ను రమ్మంటుండ్రు" అన్నాడు ఎగపోస్తూ.

ఎల్లయ్య లేచి కట్టె కోసం వెతుకుతుంటే...

"నువ్వు సంపుతవా ఏంది? గా పాపం మనకెందుకు ? ఆల్లు ఈయేడు మల్లన్న దేవునికి పెట్టుకోలే... అందుకే అచ్చిందేమో... నేను బాయిమీదికి వోయి చాయె గిన్నెలు కడుక్కత్త. నువ్వు జెల్దినచ్చి ఎడ్లను మేపుకురా..." అని చెప్పి బావి వైపు పోయింది.

కర్ర దొరక్క పోవడంతో ఎల్లయ్య కొడుకుని తీసుకుని భాస్కర్ ఇంటివైపు వెళ్లిపోయాడు.

అప్పుడు...

అతి గంభీరంగా.. చిట్ చిట్ మన్న శబ్దాలు... ఆ వెంటనే దభిల్లుమన్న శబ్దంతో... వర్షంలో తడిసి తడిసి... ఆ ఇల్లు కూలిపోయింది.

బావి మీంచి ఆ శబ్దం విన్న నర్సవ్వ "అయ్యో... కొంపకూల్తంది..." అన్న అరుపులు పందిరి కింది పశువుల అరుపుల్లో కల్సిపోయింది."

నర్సవ్వ ఏడుస్తూ... 'అయ్యో... రాండ్రి... రాండ్రి... మా ఇల్లు కూలింది. పందిరి కూలింది. వసువులు చచ్చిపోయినయ్..." అని అరుస్తుంటే... నిమిషాల్లో అంతా పరిగెత్తుకొచ్చారు.

ఎల్లయ్య విషయం తెల్సి పరిగెత్తుకొచ్చాడు.

ఇల్లు కూలిపోయింది. ఇల్లుతోపాటు పందిరి... దాని కింద చచ్చిపోయిన మూగజీవాలు...

బీభత్సంగా ఉందా దృశ్యం.

పన్నెండు వేల విలువ జేసే రెండు ఎడ్లు, సూడి బర్రె, చిన్నోడు పొరుపెడితే ఈ మధ్యే మూడొందలు పోసికొన్న చిన్న లేగదూడ. రెండు కోళ్లు, ఒక మేక పిల్ల... అన్నీ చచ్చిపోయాయి.

ఎల్లయ్య గుండె పగిలింది.

ఒక్కసారిగా బావురుమన్నాడు.

పక్కింటి యశోదమ్మ పరిగెత్తుకొచ్చి నర్సవ్వని పట్టుకుని శోకం పెట్టింది.

"గిదే అదృష్టమనుకో బిడ్డా... ఇంకా నయం. మీకేం కాలేదు. దేవుడు మనందున్నడు. బిడ్డో. మీకేమన్నయితే ఎట్లుండునే తల్లీ..." అంటూ ఏడుస్తోంది. కొందరు ఆడవాళ్లు నర్సవ్వని

ఓదారుస్తున్నారు.

ఎల్లయ్య బాధగా... కన్నీళ్లతో ఆకాశం వైపు చూశాడు. మేఘాలు భయంగా పరిగెడుతున్నాయి.

అప్పుడే వచ్చిన సర్పంచ్ ఎల్లయ్య భుజం మీద చేయి వేశాడు. ఎల్లయ్య కన్నీళ్లతో చూస్తుంటే...

"బాధపడకు ఎల్లయ్యా... గిట్ల ఇండ్లు కూలిపోతే గవర్నమెంటు ఆరువేల రూపాయలిస్తది. రేపొసారి మనం ఎం.ఆర్.వో. ఆఫీస్‌కెళ్దాం" అన్నాడు బాధగా. సర్పంచ్‌ని చూసిన నర్సవ్వ ఏడుస్తూ వచ్చి అతడి కాళ్లమీద పడవోయింది.

"వద్దు... వద్దు... నాతోని అయ్యేంత నేను జేస్త" అన్నాడు వెనక్కి జరుగుతూ.

ఊరు తరలి రావడం మొదలెట్టింది. ఇంకా తుంపర రాలుతూనే ఉంది.

* * * *

మర్నాడు-

ఎల్లయ్య, సర్పంచ్ మండలానికి పోయి ఎం.ఆర్.వో. ను కలిసి విషయం చెప్పారు. ఆయన వి.ఏ.వో.కి విషయం చెప్పమన్నాడు. అదే రోజు జగిత్యాలలో ఉండే వి.ఏ.వో. దగ్గరకి వచ్చి ఇల్లు కూలిపోయనట్లు చెప్పారు.

అతడు వర్షం వెలిసిన మూడ్రోజులకి ఆయన కూలిపోయిన ఇంటిని పంచనామా చేయడానికి వచ్చాడు. ఏవేవో ఫారాలు నింపుకున్నాడు. వేలిముద్రలు వేయించుకున్నాడు.

"రేపొసారి ఆర్.ఐ. (రెవిన్యూ ఇన్‌స్పెక్టర్) సాబ్‌ని కలువుండ్రి" అన్నాడు. సర్పంచ్ అతడికి వంద రూపాయలిప్పించాడు ఎల్లయ్యచేత. అప్పటికే దాచిపెట్టుకున్న నూటయాభై రూపాయలు ఖర్చయిపోయాయి.

పోస్ట్‌మాన్ ప్రభాకర్ దగ్గర పదిహేనువందలు అప్పు తీసుకున్నాడు. సర్పంచ్‌కి తీరిక లేకపోవడంతో ఎల్లయ్యే రెవిన్యూ ఆఫీస్ చుట్టూ తిరగడం మొదలెట్టాడు.

వారం... పది... పదిహేను... ఇరవై రోజులూ గడిచాయి.

అటెండర్‌కి, జూనియర్ అసిస్టెంట్‌కి, ఆరైకి, ఆ పదిహేను వందలూ ముట్టాయి.

పక్కింటి యశోదమ్మ ఇంట్లో ఓ గది ఖాళీగా ఉండడంతో దాంట్లోనే తలదాచుకుంటున్నారు. ఓరోజు సడెన్‌గా స్కూటర్ మీద ఊడిపడ్డ వి.ఏ.వో. లచ్చిరెడ్డి "ఎల్లయ్యా... నాకు అర్జెంటుగా అయిదు వందల రూపాయలు కావాలె..." అన్నాడు.

"ఇప్పుడు లేవుగద సారూ..." ఎల్లయ్య నసిగాడు.

"లేవు గీవు అనొద్దు... నీపని కోసం నేనెంత తిరుగుతున్ననో నీకు కనపడ్తలేదా? నాక్కూడా పెండ్లాం, పొరగాండ్లున్నరు. ఎట్లమరెలేవంటే..." చిరాగ్గా అడిగాడు.

"కొంచెంసేపు ఆగుండ్రి... గా ఉప సర్పంచ్ నడిగిత్త..." అని పరిగెత్తాడు.

పావు గంటలో అయిదొందలు తెచ్చి చేతిలో పెట్టాడు.

లచ్చిరెడ్డి స్కూటర్ స్టార్ట్ చేయబోతూ "ఎల్లన్నా... నీ మనసుల్నే ఉంచుకుంట నంటే నేనోమాట జెప్త. ఆర్.ఐ. గాడు బద్మాష్ ఉన్నడు. నువ్వు అన్ని నమ్మకు. నువ్వు డైరెక్టుబోయి జగిత్యాల్ల ఎం.ఆర్.వో. సాబ్ ఇల్లుంటది విద్యానగర్‌ల. ఆయన లేకున్నా ఆయన పెండ్లాం చేతుల్లన్నా... వెయ్యి రూపాయలు పెట్టిరా. ఇగ తర్వాతి కథంతా నేను జూసుకుంట అని స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడు.

ఎల్లయ్య గుండెల్లో రాయి పడింది.

అలాగే అన్నట్టు బాధగా తలూపాడు. తర్వాత తేరుకుని రామేశం ఇంటివైపు నడిచాడు వెయ్యి రూపాయల అప్పుకోసం.

* * * *

వారం రోజులు గడిచాయి.

ఓ అర్ధరాత్రి... డిటోనేటర్ల శబ్దాలతో ఊరు ఉలిక్కిపడింది.

అంత చీకట్లోనూ... అంత నిశ్శబ్దంలోనూ... భయం భయంగా ఉరంతా పాకిన వార్త.

"దొర గడీని నక్సలైట్లు పేల్చేసింద్రు."

అందరి వూహలూ... పోలీసోల్లతో ఏం ముప్పు వస్తుందోననే...

భయం భయంగా తెల్లవారింది. ఊరంతా కదిలింది.

ఏనాడో దొర విడిచి పెట్టిపోయిన పాడుపడ్డ గడీ...

అక్కడక్కడా పిచ్చి మొక్కలు, ఆకుపచ్చ నాచు పెరిగి... శిథిలమైపోయిన గడీ... నక్సలైట్ల భయానికి పదిహేనేళ్ల క్రింద దొర విడిచి పెట్టిపోతే... కుక్కలకీ, మేకలకీ, ఆడవాళ్ల దొడ్డికీ, పిల్లల దాగుడుమూతలకీ, అక్రమ సంబంధాలకీ, పాముల నిలయమై పెచ్చులూడి భయంకరంగా... ఊరి మధ్యలో కాముని భూతంలా నిలుచున్న గడీ...

నక్సలైట్లు ఎందుకు పేల్చారోగాని... గడీ కుప్పకూలింది.

ఎనిమిదింటి వరకూ పోలీసు బలగాలు, రెవిన్యూ సిబ్బంది దిగారు.

గడీని 'పంచనామా' చేశారు.

గడీని చూడ్డానికి వచ్చిన రెవెన్యూ సిబ్బందిని చూడగానే ఎల్లయ్య ప్రాణం లేచివచ్చింది. ఎం.ఆర్.వో. వెనకాలే వచ్చి నిలుచున్నాడు.

హైదరాబాద్‌లో సెటిలైన నర్సింగ్‌రావ్ దొరకి విషయం ఫోన్‌లో చెప్పడానికి ఎం.ఆర్.వో. సర్పంచ్ ఇంటికి వెళ్లాడు. ఎల్లయ్య కూడా వెనకే వెళ్లాడు.

హైదరాబాద్‌కి డయల్ చేశాడు ఎం.ఆర్.వో.

నర్సింగ్‌రావ్ లైన్లోకి రాగానే "సార్... నేను ఎం.ఆర్.వో.ని, మీ గడీని నక్సలైట్లు పేల్చేసారు"

అని చెప్పాడు.

"సరే... ఎంత వాల్యూయేషన్ కడుతున్నారు?"

"సార్... ఏడు లేక ఎనిమిది అనుకుంటున్నాం."

"దాని వాల్యూయేషన్ ఎనిమిది లక్షలు రాయండి. నేను అటు వచ్చినప్పుడు కలుస్తాను."

"సరే... సార్..."

"నక్సలైట్ల కడుపు చల్లగుండ..." అవతల్నించి దొర నవ్వాడు.

"వుంటాన్సార్" అని ఫోన్ పెట్టాడు ఎం.అర్.వో.

సర్పంచ్ పక్కనే నిలుచున్న ఎల్లయ్యని చూసి.

"ఎల్లయ్యా... నీ ఇంటికి నాలుగు వేలు సాంక్షనయ్యాయ్. రేపు ఆఫీసుకొచ్చి తీసుకెళ్ల" అన్నాడు.

"మంచిది సారూ" అన్నాడు ఎల్లయ్య. అప్పుడే అక్కడికి వచ్చిన వి.ఏ.వో. లచ్చిరెడ్డిని చూసి పక్కకి తీసికెళ్లాడు ఎల్లయ్య.

"సారూ... ఆరు వేలన్నా, ఎనిమిది వేలన్నా వత్తయంటివి. ఎమ్మార్వో సాబ్ ఏమో నాలుగు వేలే అంటుండు" అన్నాడు.

"ఎల్లన్నా... నేనేం జెయ్యాలె చెప్పు. వందసార్లు మొత్తుకున్నా, ఆరైగాడు చేసిండు ఇదంతా. ఇప్పుడైతే అచ్చింది తీస్కోరాదే. టైమచ్చినప్పుడు నీకేదైనా లోన్ ఇప్పిస్త తియ్..." అనేసి వి.ఏ.వో. హడావుడిగా వెళ్లిపోయి రాత పనుల్లో మునిగిపోయాడు.

ఎస్సయ్ కూడా సర్పంచ్ ఇంటికి రావడంతో సర్పంచ్ హడావుడి పడుతున్నాడు.

"ఎల్లయ్య... ఎమ్మార్వో సాబ్ రేపు నీపైసలిత్తడు గనీ... ఇంటెనకకి పోయి మూడు కోళ్లని కొయ్యిపో... ఇయ్యాల్ల అమీన్‌సాబ్, ఎమ్మార్వోసాబ్ మనింట్లనే తింటరు" అన్నారు

ఎల్లయ్యకి కోళ్లని కోయక తప్పింది కాదు.

* * * *

మర్నాడు సాయంత్రం

నీరసంగా వచ్చిన భర్తని చూసి నర్సవ్వ అడిగింది.

"పైసలిచ్చింర్రా?"

నిస్సత్తువగా కూలబడుతూ... జేబులోంచి డబ్బు తీసి నర్సవ్వ చేతిలో పెట్టాడు. పది రూపాయల కాగితాల్ని వదిలంగా లెక్కపెట్టి "గిదేందయా... ఇంట్లోకెల్లి మొదట్లో తీసుకుపోయిన... గదే నూట యాభై రూపాయలు దెచ్చినవ్" అంది ఆందోళనగా.

"పట్వారీ ఖర్చు, సర్పంచ్ ఖర్చు, ఎమ్మార్వో ఖర్చు, ఆరై ఖర్చు, నా బస్ కిరాయిలు

అన్నీ పొంగ నాలుగు వేలల్ల కెల్లిగా... నూట యైబై రూపాయలే మిగిలినయ్..."

ఆవేదన... ఆక్రోశం...దు:ఖం... సమ్మిళితమై నర్సవ్వ గుండెని తాకాయి.

"థూ... నీయవ్వ... దొడ్డికి పోవడాన్కి కూడా పనికిరాని పాడువడ్డ గడీలు కూలితే లచ్చలకు లచ్చలిత్తరు... ఆకుపచ్చటి గూడూ కూలిపోతే లంచాలు దిగమింగి గీ పైసలిత్తరా... ఆల్ల మొఖాలమీదనే కొట్టిరాకమోయనవ్..." నూట యాభై రూపాయల్ని ఎల్లయ్య మొహంపై విసిరికొట్టింది.

నర్సవ్వ మనసులో కూలిపోయిన ఇల్లు మెదిలింది.

గోడకి జేరగిలబడి సన్నగా ఏడ్వడం మొదలెట్టింది.

ఎడ్లు... సూడిబర్రె... లేగదూడ... మేకపిల్ల... ఒక్కొక్కటిగా ఎల్లయ్యకి గుర్తొచ్చాయి. గుండె పగిలింది...

భార్యని దగ్గర తీసుకుని... బావురుమంటూ ఏడుస్తున్నడు. అర్థంకాకపోయినా... అన్నం తింటున్న పిల్లలిద్దరూ ఏడ్వడం మొదలెట్టారు.

వాళ్ల ఏడుపు... నాలుగ్గోడల మధ్యే శిథిలమైపోతోంది.

వాళ్లని ఓదార్చడానికి ఏ ప్రభుత్వ పథకాలూ లేవు... వున్నా లంచమివ్వడానికి మిగిలిందేమీ లేదు...!!

కాలుతున్న పూలతోట

పెళ్ళి ఊరేగింపు...

పడవలాంటి కారులో వధూవరులు... కారు ముందర సెంట్లవాసనల్తో, పట్టుచీరెలు, నగలతో మెరిసిపోతున్న ఆడవాళ్ళు... కారు వెనక హుందాగా నడుస్తున్న మగవాళ్ళు... చిత్రమైన డ్రెస్సులతో భారీ సౌండ్‌తో ముందు బాజాలూదుతున్న బ్యాండ్‌వాళ్ళ మధ్య తాగి వూగుతున్న యువకులు. దాదాపు పదిమంది వరకూ డాన్సులు చేస్తున్నారు. వాళ్ళతో కలిసి ఒకరిద్దరు అమ్మాయిలు కూడా స్టెప్పులేస్తున్నారు.

అప్పటికే రెండున్నర గంటలైనా ఊరెగింపు అరకిలో మీటరు కూడా సాగలేదు. పిల్లలు భారీ ఎత్తున టపాకాయలు పేలుస్తుండటంతో చెవులు హోరెత్తుతున్నాయి.

ఒక పెద్దమనిషి బ్యాండ్‌వాళ్ళ దగ్గరికొచ్చి వాళ్లలోని బ్యాండ్ మాస్టర్‌ని "సలీం... ఇలాగైతే ఆర్నెల్లయినా ఇంటికి చేరం. తొందరగా నడవండి" అని చెప్పాడు. సలీం బాజా వూదుతూనే మిగతావాళ్లకి కదలమని సైగ చేశాడు. దాంతో డాన్స్ చేస్తున్న యువకులు బ్యాండ్‌వాళ్లని కదిలితే బావుండదని హెచ్చరించారు. వాళ్ల చేష్టలు చూసి చెప్పిన పెద్దమనిషి జారుకున్నాడు.

డాన్స్ చేస్తున్న ఇద్దరు యువకులు బాజా వూదుతున్న సలీంని "హిప్‌హిప్ తారారార...." పాప్‌సాంగ్ పాడమన్నారు.

"సినిమా పాటలు తప్ప వేరే పాటలు రావుసార్" ఊదటం ఆపి వినయంగా చెప్పాడు.

సలీంకి యాభై ఏళ్లుంటాయి. "పోని... దిల్ హై హిందుస్థానిలోది షారుఖ్ పాట పాడు. దానిమీద డాన్స్ చేయాలి."

"అదింకా ప్రాక్టీస్ చేయలేద్సార్. ఆ కేసెట్ నిన్నగాక మొన్ననే రిలీజైంది కద్సార్."

"మరి నీకేం పాటలొచ్చుబే... బాడ్‌ఖావ్..." బాగా తాగినవాడొకడు పైపైకొచ్చాడు.

"వచ్చిన పాటలు పాడుతున్నాం కద్సార్. మాటలు జాగర్తగా రానీయండ్రి" సలీం కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"పాప్‌సాంగ్స్ ఏమి పాడట్లేదు. నీకు రెస్పెక్టిచ్చేదేంట్రా... బొచ్చు..." మరొకడు సలీంని తోసేశాడు. సలీం తలపై పెట్టుకున్న ఎర్రటి కుచ్చుటోపి కిందపడింది. డ్రమ్స్ వాయిస్తున్న కుర్రాడు సలీంని తోసేసిన యువకుడ్ని నిలదీసాడు. దాంతో అంతాకల్సి కుర్రాడ్ని కొట్టడం మొదలెట్టారు. బాజాల సౌండ్ ఆగిపోయింది. ఆ పెనుగులాటలో ఎవరో కుర్రాడు టపాకాయలు పేల్చాడు.

అంతా గోల... గోల...

పెళ్ళికి వచ్చిన పెద్దలు బ్యాండ్ వాళ్ళని యువకుల్ని విడదీసారు. అందర్నీ సముదాయించారు. దాంతో యువకులంతా కసితో బ్యాండ్ వాళ్ళని కదలనివ్వకుండా పేట్రేగిపోయి డాన్సులు చేయడం మొలెట్టారు. వాళ్ళు చెప్పినా వినే స్థితిలో లేరని అందరికీ తెల్సు. ఉరేగింపు ముసలి నత్తలా సాగింది. హోరెత్తిన వాయిద్యానికి నాలుగువేల రూపాయల బ్యాండ్ ఛట్‌మని పగిలింది.

*　　　　*　　　　*　　　　*

"రోజురోజుకీ నీకు చెవులు వినపడేలా లేవు. ఎలాగో ఏమో..." సలీం చెవుల్లో ఇయర్ డ్రాప్స్ వేస్తూ అంది కూతురు షబీనా.

పెళ్ళికెదిగిన బిడ్డవైపు బాధగా చూసాడు సలీం. షబీనా నవ్వింది. మల్లెపువ్వులాంటి అ నవ్వు చూసి సలీం బాధనంతా మర్చిపోయాడు. పక్కనే వున్న పీకనందుకొని ఓ పాట ఊదాడు.

"పాట మంచిగుంది... గిదే సిన్మాలోది నాన్నా..."అంది. "సిన్మాలోది కాదు బిడ్డా... ఇన్ని పాటలు వూది వూది నేనే ఓరాగం కట్టిన. ఇది నా షబీనా పెళ్ళికి మాత్రమే నేను ఊదేపాట" అన్నాడు.

పెళ్ళి మాట విని షబీనా సిగ్గుపడి పోయింది.

"ఇన్ని పెళ్ళిళ్ళకు బాజాలూదుతున్నా... నీకు మాత్రం పెళ్ళి చేయలేకపోతున్నా బేటీ... కీబోర్డులొచ్చి మన పొట్టకొట్టినయ్... చాలా పెండ్లిల్లకు రిక్షాలో మైకుసెట్లు, కీబోర్డుపెట్టుకొని వాయిస్తుండ్రు. ఒకప్పుడు సలీంబ్రాస్ బాండ్ అంటే జిల్లాలో గొప్ప పేరుండేది. నలబైమంది వుండేవాళ్ళం. ఇప్పుడు పదహారుమందికి తగ్గింది. అందరూ ఏదేదో పనులు చూసుకుంటూ

వెళ్ళిపోయారు. ఈ వృత్తిని నమ్ముకుంటే పెళ్ళికూడు తప్ప మిగతా రోజుల్లో అన్నం ముద్ద కరువైంది. ముసలితనం వచ్చేసరికి చెవుడుతోపాటు గొంతు నరాలు, ఊపిరి తిత్తులు. పాడవటం తప్ప ఏం మిగిలింది బేటీ. రోజురోజుకూ కొత్తకొత్త పాటలు పుట్టుకొస్తున్నాయ్. ఒక పాట ప్రాక్టీస్ చేసేసరికే మరోపాట పుట్టుకొస్తుంది. నిన్న ఊరేగింపులో పెద్ద గొడవ జేసింఁడు. 'మేరే హిందుస్తాని' పాట మీద డోలు పగిలింది. ఒకప్పుడు ఎంత శ్రావ్యమైన పాటలు పాడేటోళ్లం... సీతమ్మ పెళ్ళికూతురాయెనే పాట జిల్లాలో నా లెక్క ఎవడూ ఊదలేకపోయేవారు. మా బ్యాండుమేళం వినేటోల్లేగాని... మా ఆకలి వినెటోడే లేకపాయే. అందుకే ఇమాంగాని కొడుకు వీడియో దీస్కుంటగని బ్యాండు మాత్రం వాయించనన్న అన్నాడు..." సలీం నోటినించి ఆవేదనగా వస్తున్న మాటలు షబీనా మనసుని కూడా తొలిచేసాయి.

"సరేగాని.. కొంచెంసేపు పడుకో నాన్నా... ఈమధ్య నీకు ఆయాసం కూడా బాగా వస్తుంది" అంది పక్కపరుస్తూ.

"అదికాదు బేటీ... నీ పెండ్లిజేస్తే నాకు బరువు దిగి పోద్ది. రేపు పొద్దుగాల్ల చిల్వాకోడూర్ దాకా పోత. అక్కడ పిల్లగాడు ఉన్నడట. రజాక్‌గాని తీసుకపోయి చూసత్త..." అన్నాడు.

"రేపు పెండ్లిల్లు లేవా మరి?" అడిగింది షబీనా.

"రేపట్నించి తెలుగోల్లకు మూఢం బిడ్డా... మూడు నెల్లదాక ఏమిలేవు. గిప్పుడు మనకు మంచిరోజులాయె" అంటూ పడుకున్నాడు.

షబీనా బావి దగ్గరకెళ్ళి గిన్నెలు తోముతూ పెళ్ళికొడుకు గురించి ఊహల్లో మునిగిపోయింది.

*   *   *   *

మర్నాడు సలీం అబ్బాయిని చూడటానికి వెళ్ళగానే... షబీనా ఇంట్లో ఒంటరి సీతాకోకచిలుకలా ఎగిరింది. ఆకలి వేయలేదు. అన్నం తిన్నట్లు చేసింది. గోడకున్న గడియారం వంక, తండ్రి అలికిడి కోసం దర్వాజా వంక చూస్తూ గడిపింది. 'ఒకవేళ అబ్బాయి రేపే పెళ్ళి చూపులకు వస్తానంటే...' అన్న ఊహరాగానే ఏ సల్వార్ కమీజ్ వేసుకోవాలి అనుకుంటూ పాత సూట్‌కేసులోంఛి బట్టలన్నీ తీసింది.

అన్నీ పాతవే.

కనీసం మంచి చీరెలు కూడా లేవు. అన్నీ వెదుకుతుంటే.. సూట్‌కేసు అడుగున పసుపుపచ్చటి పంజాబీ డ్రెస్సు పట్టుది కనపడింది.

అదంటే షబీనాకి ప్రేమ!

దానిమీది అద్దాల డిజైన్‌లంటే మరీ ప్రేమ!! అది బయటికి తీసింది.

ఆ డ్రెస్సు ఏడాది కిందట ఓ పెళ్ళి కూతురు పెళ్ళయ్యాక చీరేలు తప్ప వీటితో

పనేంటని తన డ్రెస్సులన్నీ బ్యాండ్ వాళ్ళకి పంచిందట. అది ముడతలుగా కనపడటంతో గబగబా బావిదగ్గరికెళ్ళి ఉతికింది. అది ఆరేంతసేపు ఇంట్లో కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వుంది. ఈలోపు ఇస్త్రీపెట్టె రెడీచేసింది. జాగ్రత్తగా ఇస్త్రీ చేశాక తృప్తిగా చూసుకుంది. డ్రెస్సుకి సెంటుపూసి మడిచిపెట్టింది. పాపిటనిండా చల్లుకునే మెరుగుకోసం కిరాణా కొట్టుకి పరిగెత్తింది.

కొట్టునించి వస్తూనే ఇంట్లో తండ్రిని చూసి సిగ్గుల మొగ్గయింది. ఏమీ అడగలేదు. తండ్రికి భోజనం వడ్డించి మొహంలోని భావాల్ని చదవడానికిప్రయత్నిస్తూ ఎదురుగా కూచుంది.

రెండు ముద్దలు తిన్నాక సలీం చెప్పాడు.

"పిల్లగాడు మంచిగానే ఉన్నాడు. మస్కట్‌పోయి సంపాదిత్తండట. కాకపోతే కట్నం బాగా అడుగుతుంఁడు. ఎనభైవేలు కావాల్నట. పదిహేనువేలు, సైకిలు, గడియారం ఇస్తనని నేను చెప్పిన. ఎనభైవేలు సుజుకి బండి గావల్నట. కుండబద్దలు కొట్టినట్టు సెప్పింఁడు. మనం అందుకునే సంభంధంకాదని ఎనుకకు మర్లినం. రజాక్‌భాయ్ ఎల్లుండి చెర్లపల్లెకు పోదామన్నడు. అక్కడో పిల్లగాడున్నడట..." సరిగా తినకుండానే చేయి, కడుక్కొని లేచిండు సలీం.

షబీనా మనసు మూగబోయింది.

పసుపుపచ్చ పంజాబీ డ్రెస్సు కళ్లనిండా కనపడుతోంది.

తూనీగ రెక్కలు విరిచినట్లు... సాగిపోయే పాట తెగిపోయినట్టు... స్తబ్దుగా అయింది. సలీం అలసటతతో పక్కమీద ఒరిగాడు. షబీనా తేరుకుంటూ బావి దగ్గరికెళ్లింది అంట్లు తోమడానికి.

మనసుని గోనెసంచిలో కట్టి పడేసినట్టు స్తబ్దత.

ఎన్నో పెళ్లిళ్లకు వెళ్లొచ్చిన ప్రతిసారీ... తనకీ అదే రీతిలో పెళ్లి చేస్తానని చెప్పి నవ్వించే తండ్రి తన పెళ్లికోసం ఎన్ని గడపలు తొక్కాలోనన్న ఆలోచనతో మెదడు మొద్దుబారుతోంది.

గిన్నెలన్నీ తోమేసి ఇంట్లోకి వచ్చి పంజాబీ డ్రెస్సుని మళ్లీ సూట్‌కేసులో పెట్టబోతూ తండ్రిని చూసి అవాక్కయింది.

"అదేంటయ్యా... బ్యాండ్ డ్రెస్ వేసుకున్నవ్. ఇప్పుడు మూఢం అన్నవ్‌కదా. మరి పెళ్లెవరిది?"

సలీం పేలవంగా నవ్వాడు.

"మూఢం పెళ్లిళ్ళకు గాని... చావులకు వుండదమ్మా" అన్నాడు బాజాని గుడ్డతో తుడుస్తూ.

"చావా... ఎవరు...పో...యా...ర...ట..." అంది కొంచెం ఆంధోళనగా.

"గొప్పోల్ల ఇళ్లల్లో శవయాత్ర కూడా పెళ్లిలాగే సాగుతుందమ్మా. ఇప్పుడే రజాక్ భాయ్ వచ్చి చెప్పి వెళ్లాడు. తొందరగా వెళ్లాలట. కాకాపోతే మాబాధంతా ఒకటే... ఆపిల్ల పెళ్లికి

కూడా మేమే బాజాలు వాయించాం. ఏడాది తిరక్కముందే ఆ పిల్లని కట్నం కోసం చంపేసారట. దొంగ గాడిద కొడుకులు..."

"అయ్యో పాపం... ఎవరు నాన్నా ఆమె" అంది షబీనా బాధగా.

"అదే... పోయిన ఎండాకాలం పట్టుది పంజాబీ డ్రెస్సు తెచ్చానే... ఆ అమ్మాయిచ్చిందే. పాపం ఆ పిల్లే చచ్చిపోయిందట. కాదు కాదు చంపేసింద్రట"

ఆ మాటతో షాక్‌తిన్న షబీనా చేతిలోని పంజాబీ డ్రెస్సు గబుక్కున జారిపోయింది.

"పిల్ల ఎంత ముద్దుగుండె బేటీ... కండ్లల్ల కనపడుతుంది. పొట్టతో వుందని కూడా చూల్లేదట రాక్షసులు. నాకైతే ఇంకా పెళ్లికూతురు లెక్కనే కనపడుతుంది" అంటూ సలీం నెత్తిపై కుచ్చుల టోపీ పెట్టుకున్నాడు.

బాజా తీసుకొని గబగబా వెళ్లిపోతూ "షబీనా బేటీ... తలుపేసుకో నేను వచ్చేసరికి రాత్రి అయితది" అనుకుంటూ వెళ్లిపోయాడు.

'రఘుపతి రాఘవ రాజారాం...'

షబీనా చెవుల్లో చావుమేళం హోరు... కన్నీటి తెరల మధ్య తండ్రి వెళ్లినవైపే చూస్తుండిపోయింది.

పంజాబీ డ్రెస్సు మీద పెంచుకున్న మమకారం... భయంతో విరిగిపోయింది. గుండె చిరిగిపోయింది.

'పెళ్లి...'

ఆ పదం గుర్తొచ్చి మనసు గడగడా వణికిపోయింది.

ఘోస్ట్ రైటర్

రాత్రంతా రాసుకున్న స్క్రిప్ట్ కాగితాల్ని బ్యాగులో కుక్కేసుకొని బయట పడదామనుకొనే టైంలో వచ్చిందా అమ్మాయి... ఇరవై ఏళ్లుంటాయేమో... గులాబీ రంగు పంజాబీ డ్రెస్... గుండ్రని మొహం... పెద్దకళ్లు... సన్నటి ముక్కు... చిన్నిపెదవులు... వీటన్నింటికీ తోడు ఆమె తెలుగమ్మాయి కాదు అనడానికి నుదుటిమీద అడ్డంగా... విభూతి బొట్టు.

నేనున్న గది పక్క పోర్షన్‌లోనే వారం కింద దిగారు. తండ్రీ కూతుళ్లు ఇద్దరేనేమో... తండ్రి పూర్తి రోగగ్రస్థుడిలా మంచాన పడి... దగ్గుతూ వుండటం మినహా వాళ్లింట్లోంచి ఏ అలికిడీ విన్పడదు. కళ్లతో చూసి నవ్వుకోవటం తప్ప... ఆమె మాట్లాడింది ఇప్పుడే.

"ఉంగల్ ఏట్టిల్ కాఫీ ఇరుక్క" (మీఇంట్లో కాపీ పౌడర్ వుందా?) అని తమిళంలో అడిగింది.

సినిమా రైటర్ని కావాలన్న పిచ్చితో మద్రాస్‌లో కూడా కొన్నాళ్లు తిరిగాను కాబట్టి... నాకు తమిళం అర్థమవుతుంది కాని మాట్లాడరాదు.

"నేను బ్యాచిలర్‌ని. నా గదిలో కాఫీ పొడులు, టీపొడులు వుండవు" అన్నాను. నా తెలుగు కొంత అర్థమైనట్టుంది.

"పోగట్టం... షుగర్ ఇరుందల్ రెండు స్పూన్ కుడుక్కరింగలా... అప్పావులి టాబ్లెట్స్ పొడరీనం..." డికాక్షన్ అణాలుం సెజిట్టు కొడుక్కణం ఎన" (పోనీ... షుగర్ వుంటె రెండు స్పూన్‌లు ఇవ్వరా... నాన్న గార్కి టాబ్లెట్స్ వేయాలి. కనీసం డికాక్షన్ అయినా కాచిపోద్దామని...) అంది.

"టీ పొడి, చక్కెర భార్యాభర్తల్లాంటివి. భలేవారే. అదిలేకుండా ఇదెలా వుంటుందండీ. సారీ..." అన్నాను. 'సారీ' అన్నది మాత్రమే అర్థమైనట్టుంది.

లోపల్నించి ముసలాయన దగ్గు విపరీతంగా వినొస్తుంది. ఆ అమ్మాయి కళ్లల్లో సన్నటి నీటిపొర... 'ఓకే సర్...' అంటూ వెళ్లి తలుపులేసుకుంది. నా మనసు మూగవోయింది. కనీసం చెంచాడు చెక్కర కూడా సాయం చేయలేని జీవితాలు...

వాళ్లు సినిమా వాళ్లే కావచ్చు... లేకపోతే 'క్రిష్ణానగర్' లో ఎందుకు దిగుతారు? నిజంగా... ప్రేక్షకులకు ఇదెంతటి రంగుల ప్రపంచం.

ఇక్కడ... గ్లిజరిన్ కన్నీళ్లముందు... అసలు కన్నీళ్లు ఆవిరైపోతున్నాయి.

డిజిటల్ సౌండ్‌ల మధ్య... ఎన్నెన్నో రికార్డ్ చేయని ఆకలికేకలు...

అంగుళం మేకప్ కింద... అంగాంగం తొక్కివేయబడే రంగుల రంగమిది. గదికి తాళంవేసి మెట్లుదిగి వస్తుంటే... ఇంటి యజమాని కొడుకువచ్చాడు పుస్తకంతో.

"అంకుల్... ఈ పద్యానికి అర్థం చెప్పండంటూ... గటగటా చదివేసాడు".

'దొరలు దోచలేరు... దొంగలెత్తుకుపోరు...

విద్య నిగూఢ విత్తము...' అంటూ సాగే పద్యమది. నాకు నవ్వొచ్చింది. దాని అర్థం చెప్పి అబ్బాయిని పంపించాను. పాపం ఆ పద్యం రాసిన కవి ఈనాటి సినిమారంగం గురించి వూహించి వుండడు. కాదేదీ దొంగతనానికి అనర్హం అన్నరీతిలో ఇక్కడ విద్యకూడా దొంగిలించబడుతుంది. అవసరమనుకుంటే... ఇదే పద్యాన్ని సినిమాలో పెట్టేసుకొని తమ పేరులేసుకునే మేధావులున్నారీ రంగంలో... ప్చ్... రోడ్డుపైకొచ్చాను.

మనిషి రోడ్డున పడ్డాడు!!

శివరాం డైరెక్టర్‌ని కల్సి రాత్రి రాసుకున్న స్టోరీ సినాప్సిస్ చెప్పాలి. ఎలాగైనా ఒప్పించాలి అని డైరెక్టర్ ఇంటికి ఫోన్ చేసాను.

"ఆయనిప్పుడే అన్నపూర్ణ స్టూడియోలో జరిగే 'వయసే పూలతోట' చిత్రం ఫిఫ్టీడేస్ ఫంక్షన్‌కి ఛీఫ్‌గెస్ట్‌గా వెళ్లారని" ఓ ఆడగొంతు చెప్పింది.

ఈడ్చుకుంటూ అన్నపూర్ణ స్టూడియోకి వెళ్లాను.

నేను వెళ్లేసరికి సెక్యూరిటీ లోపలికి వెళ్లనివ్వకపోవటంతో... ఓవ్యక్తి ఘర్షణ పడుతున్నాడు. నేనతన్ని చూసి 'హాయ్... భార్గవ్' అన్నాను. అతడు ఫిలింనగర్ రోడ్లమీదేపరిచయమైన సగటు రచయిత.

అతడూ ఎండలోపడి వచ్చాడేమో... చెమటలు పోస్తున్నాయి.

"చూడండ్సార్. ఇన్విటేషన్ లేనిదే లోనికి వెళ్లనివ్వనంటున్నాడు." అతడు నాతో చెప్పేలోగా రెండు కార్లు రాగానే... అలర్ట్‌గా శాల్యూట్ చేసి గేట్‌తీసాడు.

గేటుమీద పెద్ద బ్యానర్... 'వయసే పూలతోట అర్ధశతదినోత్సవం' అని

"ఏమయ్యా... ఆయనెవరో తెల్సా?" అన్నాను సెక్యూరిటీ నుద్దేశించి.

"ఎవరైతే నాకేంటీ సార్. ఇన్విటేషన్ లేనిదే ఎవరూ పోరాదు' కటువుగా అన్నాడు.

"ఈ సినిమా రైటరయ్యా బాబూ... ఈ సిన్మాకథ రాసిందితనే" అన్నాను. నామాట ఆవగింజంతైనా విన్పించుకోలేదు.

ఇక నేను వెళ్లటం కూడా సాధ్యపడదు అన్న విషయం అర్థమైంది.

"రాబాసూ... ఇకవాడు మనల్ని పోనీడు. సిగరెట్టయినా లాగిద్దాం" అని నా భుజం మీద చేయ్యేసి భార్గవ్ కదలటంతో... స్టూడియో రోడ్డుకి అవతలి ప్రక్కన వున్న సిమెంట్ చప్టామీద చతికిలపడ్డాం.

స్టూడియో గేటు దగ్గర మైకు పెట్టినట్టున్నారు. దండల ప్రోగ్రాం కావచ్చు. చప్పట్లు విపరీతంగా విన్పిస్తున్నాయి.

"ఏం గురూ... ఏం రాస్తున్నావ్?" అనడిగాడు భార్గవ్ సిగరెట్ అంటించి

"ప్చ్..." అన్నాను నిర్లిప్తతతో

భార్గవ్ నవ్వాడు.

"నేను ఇండస్ట్రీకొచ్చి పన్నెండేళ్లయింది బ్రదర్. ఇదిగో ఇదే నా ఫుల్‌లెంత్ మొదటి సినిమా. చాలా సంవత్సరాలు డెబ్బయ్ సీన్లతో కథ చెప్తే... ఈ సీనొకటి బావుంది అని ఆ సీన్ తీస్కొని వెయ్యో, రెండువేలో ఇస్తే గడుపుకొచ్చాను. ఇంకొన్నాళ్లు ఓ ప్రముఖ రచయిత దగ్గర నెలకి నాలుగువేల జీతం మీద ఘోస్ట్‌రైటర్‌గా పనిచేసాను. ఆయన రాసిన ఎనభైరెండు సినిమాల్లో పదకొండు పూర్తిగా నావే. ఒక్కో సినిమా కోసం రెండు నెలలు కష్టపడితే ఎనిమిదివేల జీతం. ఆయనకి మాత్రం సినిమాకి ఆరు లక్షలు... కసి బ్రదర్... కసి పెంచుకోవాలి... నువ్వు ఏడాదికే డీలా పడితే ఎలా?" అన్నాడు.

"మరి నీకు ఈ సిన్మా ఫంక్షన్ ఇన్విటేషన్ రాలేదా...?" అన్నాను ఆశ్చర్యంగా.

"నువ్వింకా చాలా అమాయకుడివి బ్రదర్. ఆ మాటలు విను..." అన్నాడుమైకు వైపు కళ్లతోనే చూపిస్తూ...

ఎవరో మాట్లాడుతున్నారు.

"ఈ సినిమాకి కథే హీరో... ఇంత గొప్ప కథ నా జీవితంలో చూళ్లేదు. ఈ కథవల్లే సినిమా ఇన్ని రోజులాడిందంటే ఆశ్చర్యం కాదు. ఇప్పుడే కాదు ఏనాటికైనా సినిమాకి కథే హీరో... మంచి కథలు వచ్చినంత కాలం నిర్మాతలు, నటులు, టెక్నీషియన్లు పచ్చగా వర్ధిల్లుతారు. అలాంటి మంచికథ ఈ చిత్రానికి ప్రాణం పోసింది. అందుకే కథే ఈ సిన్మాకి హీరో అని ఇప్పటివరకూ అందరూ చెప్పారు. నేనింకా నొక్కి చెప్తున్నాను..."

భార్గవ్ మళ్లీ నవ్వాడు.

నాగుండెనెవరో పిండేసినట్లయింది.

"నిజంగా ఎంత బాధాకరమైన విషయం... కాయని పొగుడుతూ చెట్టుపేరుని మర్చిపోతున్నారు...." నా కళ్లల్లో నీటిపొర ఎగిసివచ్చింది.

"తమ్ముడూ... సినిమా రంగానికి రాయాలంటే... స్పందించి రాయటం మానుకో... ఎందుకంటే... గుండెల్లో తడివుంటే మాత్రం... రోజూ ఏడుస్తావ్. ఒకవేళ నువ్వు బాగా రాసినా హీరో బామ్మర్ది దగ్గర్నించి... హీరోయిన్ తల్లివరకూ దాంట్లో కాలుపెడతారు. స్క్రీన్‌మీద నీ కథని నువ్వే చూస్కొని... ఇంటికెళ్లి ఏడుస్తావ్... హీరోల ఇమేజ్‌ల్లోకి వెళ్లి కథల్రాయాలి తప్ప... నీ కథల్లోకి ఏ హీరోరాడు. వాళ్లకేం కావాలో వాళ్లకే తెలీదు... ఎలా నిలదొక్కుకుంటావో... బెస్టాఫ్‌లక్" అన్నాడు సిగరెటు దమ్ము గట్టిగా తీసి.

ఆ తర్వాత హిట్ సిన్మాలు, ఫ్లాష్ సిన్మాలు, ఫ్లాఫ్ సిన్మాల మీద గంటసేపు గడిచింది. ఇంతలో స్టూడియో మేయిన్‌గేట్ తెరవగానే... ఒకదానివెంట ఒకటిగా కార్లన్నీ రయ్‌రయ్‌మంటూ వెళ్లిపోయాయి.

భార్గవ్ దగ్గర సెలవు తీస్కొని... డైరెక్టర్ వేటలో పడ్డాను. కాని ఆయన దొరకలేదు. రోజంతా టీలతో గడిపి... రాత్రి ఎనిమిదింటికి గదికొచ్చాను. బ్యాగ్‌ని నీరసంగా విసిరికొట్టి... చాపమీద కూలబడ్డాను.

తమిళ అమ్మాయి వచ్చింది. "ఏదావదు సాప్టిటీంగలా...?"

(ఏమైనా తిన్నావా?) అడిగింది.

నేనేమీ చెప్పలేదు...

అయిదు నిమిషాల్లో ఒకటిన్నర చపాతీ... టమోట చట్నీ ప్లేట్‌లో పెట్టుకొని వచ్చి నాముందుంచి 'తిను' అని వెళ్లిపోయింది.

ఆకలి భాష... ఎంత తొందరగా అర్థమవుతుంది.

ఆబగా తిన్నాను. కూజాలోని నీళ్లు తాగి... మరో సబ్జెక్టు గురించి ఆలోచిస్తూ పడుకున్నాను.

*   *   *   *

ఎట్టకేలకు నాలుగురోజులకు డైరెక్టర్‌ని దొరకబుచ్చుకొని... ఆయనిచ్చిన అరగంట టైంలో వీలైనంత క్లుప్తంగా రెండు కథలు చెప్పాను. పెదవి విరిచాడాయన. మళ్లీ కలవమన్నాడు. అన్నాడే గాని... మళ్లీ దొరకలేదు. ఓసారి ఆయనకోసం వెళ్లి వస్తుంటే జూనియర్ ఆర్టిస్ట్ సప్లయర్ ఖలీల్ ఇంటిదగ్గర తమిళమ్మాయి కనపడింది. నన్ను చూడగానే తలదించుకుంది. నేను దగ్గరిదాకా వచ్చాక కూడా కనీసం తలెత్తిచూడలేదు. ఆమెను విష్ చేస్తే ఫీలవుతుందని మౌనంగా వచ్చేసాను.

ఆరోజు రాత్రి... పెనం మీద వేయించిన బ్రెడ్‌ముక్కలు ప్లేట్‌లో తీసుకొచ్చి పెట్టింది. "మానాన్న గారి ఆరోగ్యం రోజురోజుకీ పాడవుతోంది. నేను సంపాదించే ఇరవై, ముప్పయ్

రూపాయల్తో ఇంక మందులేమొస్తాయి. అందుకే మందులివ్వటం మానేసాను. చాలీచాలని మా తిండిలోంచే... కొంచెం మాత్రమే పెడుతున్నాను. ఆకలి బాధ నాకు బాగా తెల్సు..." గబగబా తమిళంలో చెప్పేసి వెళ్లిపోయింది.

నాకెందుకో... ఈ సినిమా ఇండస్ట్రీనించి ఇంటికి వెళ్లిపోవాలన్పించింది. తన తోటివాళ్లంతా ఉద్యోగాలు చేస్తు, పెళ్లి చేస్కొని ఎంజాయ్‌గా వుంటే.... రంగుల ప్రపంచమ్మీద రైటర్‌గా వెలిగిపోవాలని రంగురంగుల కలలు కనివచ్చి... రెండేళ్లయినా ఏం సాధించాడు??

నా కడుపులో ఆకలి బదులు దు:ఖం పొర్లింది.

భగవంతుడా... ఓ మనిషిని పిచ్చివాణ్ణి చేయాలనుకుంటే.... వాడికి నీ దగ్గరున్న లలిత కళల్లో ఏదో తగిలిస్తావ్ కదూ....

ఈ ఇండస్ట్రీలో ఎవరు సినిమా మొదలెట్టినా... మొదట బలయ్యేది కథా రచయితే!

ఆ రాత్రి ఈ ఆలోచనల్తో నిద్రపట్టలేదు.... అలాంటి రాత్రులెన్నెన్నో...???

*   *   *   *

మళ్లీ ఓరోజు మరో డైరెక్టర్ సుధీంద్రని ఆయన గెస్ట్‌హౌస్‌లో కలిసాను. మరో రెండు కథలు విన్పించాను. బావున్నాయి. బాగాలేవు ఏదీ చెప్పలేదు. చివరగా "నీకో తమిళ సిన్మా చూపిస్తాను. ఆ సినిమా కాన్సెప్ట్‌ని అర్థం చేసుకొని తెలుగు నేటివిటీకనుగుణంగా... ఇంతకు ముందు నవ్వు చెప్పిన కథల్లోని అయిదారు సీన్స్ పనికొచ్చేవి (చెప్పాడతను) అతికించి... కథని డెవలప్ చేయి. నీకు వెయ్యిరూపాయిలిస్తాను. కథ నాపేరే వేస్కుంటాను." అన్నాడు క్యాజువల్‌గా.

"ఘోస్ట్‌రైటర్‌గా మారుతున్నానేమో" అని మనసులో అనుకుని 'సరే సర్' అన్నాను. ఆయన నన్ను టీవీ ముందు కూచోపెట్టి కేసెట్ ప్లే చేసి వెళ్లిపోయాడు.

రెండున్నర గంటల తమిళ సిన్మా చూసి గుండె ద్రవించిపోయింది.

ఎంత గొప్ప కథ...!!!

మనసు ఒప్పుకోకపోయినా తప్పదనుకొని... కాగితం కలం తీస్కొని ఆరోజు పగలూ, రాత్రి కూచొని సీన్‌వైజ్‌గా రాసి తెల్లారి వచ్చిన డైరెక్టర్‌కి విన్పించాను.

"ఒకే... బాగానే వుంది. మిగతా మార్పులు, చేర్పులు నేను చేసుకుంటాను' అని షేక్‌హ్యాండిచ్చి... వెయ్యి రూపాయలు చేతిలో పెట్టాడు.

ఆ డబ్బుని చూసాక ఏ మాత్రం ఫీలవలేదు. జేబులో పెట్టుకొని బయటికొచ్చాను.

*   *   *   *

ఇంటిముందు ఆటోదిగగానే... ఎక్కువమంది కనపడటంతో... అనుమానంగా మెట్లెక్కసాగాను.

వాడలోని వాళ్లందరి మొహాల్లోనూ విషాదఛ్ఛాయలు.

నా గదిముందుకొచ్చి... పక్కపోర్షన్ వైపు చూసి అవాక్కయ్యాను.

తమిళమ్మాయి వాళ్ల తండ్రి చనిపోయాడు... శవం పక్కనే దీనంగా ఏడుస్తూ ఆ అమ్మాయి.

గుండె కలుక్కుమంది.

"ఎప్పుడు చనిపోయారు?" అనడిగాను ఇంటి ఓనర్‌ని.

"రాత్రి మూడుగంటలకి పోయాడట. ఆ అమ్మాయొక్కర్తేవుంది...." అన్నాడు.

అప్పుడే శవాన్ని చూడటానికొచ్చిన ఓ సీనియర్ కో-డైరెక్టర్

"పాపం... ఒకప్పుడాయన ఎంత గొప్పగా బతికాడు, తమిళంలో ఆయనకు మంచి పేరుంది" అన్నాడు. నేను విస్తుపోయాను.

"అవునా... ఏం చేసేవారు" అన్నాను.

"అదేంటయ్యా బాబూ... ఆయన రాసిన సినిమాలు సూపర్ హిట్. ఆమధ్య ఆయన రాసిన కణ్ణేరిన్ జ్వాలైంగల్ (కన్నీటి మంటలు) సిన్మా తమిళంలో రెండొందల రోజులాడింది.

ఆ మాట విన్న నాగుండె.... బ్లో అవుట్‌లా ప్రేలింది.

'కణ్ణేరిన్ జ్వాలైంగల్ కథ ఆయన రాసారా?" అన్నాను పైకి.

'నిన్న రాత్రంతా తాను తెలుగులో కాపీ చేసిన తమిళ కథ.... ఈ మహాత్ముడు రాసిందా?.

మనసు ముక్కలవుతోంది.

తల బ్రద్దలవుతోంది...

కళ్లగోళాల్ని ఫెటేల్మని ఢీకొంటున్న కన్నీటి కెరటాలు...

దీనంగా ఆమె సన్నటి ఏడ్పు... శూలాల్లా తాకుతోంది.

అప్రయత్నంగానే జేబులోంచి వెయ్యిరూపాయలు తీసి... గదిలోపలికి వెళ్లి ఆ అమ్మాయి చేతిలో పెట్టాను.

దహనం చేయడానిక్కూడా ఆమె చేతిలో చిల్లిగవ్వలేదని నాకు తెల్సు. ఆమె కన్నీళ్లతో చేతులెత్తిమొక్కింది.

నేను శవంవైపు తిరిగి కళ్లు మూసుకొని ప్రార్థించాను.

"నీ కష్టార్జితం నీకే చేరింది... నేను నిమిత్తమాత్రుడిని... అంటే ఘోస్ట్‌రైటర్‌ని... ఓ మహారచయితా.... నన్ను క్షమించు.

ఆయన పాదాలపై మోకరిల్లాను.

మార్పు

స్టాఫ్ రూంలోకి అడుగుపెట్టిన విజయలక్ష్మి టీచర్ చేతిలోని పుస్తకం వైపు చూసి 'ఏం నవల టీచర్?' అనడిగాడు కృష్ణమూర్తి సార్.

'పగటి కల' సౌమ్యంగా చెప్పింది.

'ఎవరిది మేడమ్. యండమూరిదా?' సుజాత టీచర్ అడగ్గా నవ్వి 'కాదు... గిజూభాయ్‌ది' అంది.

'డిటెక్టివా మేడమ్?' సైన్సు టీచర్ రాజారాం అడిగాడు. గిజూబాయ్ ఎవరో తెలీని స్థితిలో ఉన్నవాళ్లని చూసి ఆమెకి జాలేసింది.

'ఇది కమర్షియల్ నవల కాదు. ప్రాథమిక పాఠశాలల్లో బోధించబడుతున్న విధానాలు, విషయాలు 'హానికరమైనవని' చెప్పిన ఉపాధ్యాయ నవల. విద్యార్థులను పరీక్షలతోను, పోటీలతోను, బహుమతులతోనూ కొలిస్తే... వాటి ఫలితాలే పిల్లల మధ్య ఈర్ష్యాద్వేషం, అశాంతి, అసంతృప్తి పెచ్చు పెరుగుతున్నాయని, నూతన విద్యా విధానం కోసం ప్రయోగాలు చేసి రుజువు చేసిన గొప్ప నవల ఇది మన లైబ్రరీలోదే...' అంది.

'రామేశ్వరం పోయిన శనేశ్వరం పోలేదన్నట్లు... మీరు ఇంటి దగ్గర కూడా ఇలాంటి నవల్లే చదువుతారా?' ఆశ్చర్యంగా అడిగారు లెక్కల టీచర్ దేవేందర్ రావు.

'నేనైతే ఇంటి కెళ్లంతర్వాత బడినే మర్చిపోతాను. హమ్మో బోర్...' అన్నాడు హెడ్మాస్టర్

వెంకటయ్య.

'సరే కాని... ఈనెల చిట్టీ పైసలు ఇయ్యుండ్రి. ఈ నెలల ప్రభాకర్ సారు చిట్టి పాడతానన్నాడు. తిరుపతిరెడ్డి సార్... మీరు పోయిన నెలల చిట్టి పైసలు కట్టలే. నాజేబుల్నించి కట్టుకున్న...' ఇంగ్లీష్ టీచర్ సత్యనారాయణ డబ్బులు వసూలు చేయటంలో మునిగిపోయాడు.

ఆ మాటతో అందరూ చిట్టీల ముచ్చట్లలో పడిపోయారు.

విజయలక్ష్మి మనసు బాధగా మూగవోయింది. కుర్చీలో కూచున్నదల్లా కాసేపటికి తేరుకొని...

'సార్... మన విద్యా వాలెంటీర్ రాలేదా?' అనడిగింది హెచ్.ఎం.ని.

'నెలకి రెండు, మూడుసార్లు వస్తుండు, పోతుండు. గవర్నమెంట్ సరిగా జీతం ఇస్తే మనం వత్తిడి చేసే వాళ్లం. వాళ్లనేమీ అనరాకుండా ఉంది' అన్నాడు నిరాసక్తంగా.

'సరే... లీజర్ పీరియడ్‌లో మూడవ తరగతి తేలుగు నేనే తీస్కుంటున్నాను' అంటూ లేచింది. ఆమాటతో అక్కడే వున్న అటెండర్ పోచయ్య ఓ కుర్చీని టవల్‌తో తుడిచి చెట్ల కింద వున్న 3వ తరగతి పిల్లల ముందు వేసొచ్చాడు.

విజయలక్ష్మి క్లాస్‌కెళ్లింది.

'మన అటెండర్ విజయలక్ష్మి టీచర్‌కైతే ఎక్కడలేని మర్యాదిస్తాడు. ఎందుకో మరి?' అంది జబీనా టీచర్.

'మనమంటే వాడికి మర్యాదే లేదు. నిన్న 'టీ'లు తీసుకురారా అంటే రోజుకి ఎన్నిసార్లు తాగుతారు సార్ అనవట్టే... ఇగేంజెప్పాలే..' అన్నాడు రాజారాం సార్.

'వాడికేం తెల్సు... టీచర్ అంటేనే... టీతాగి చరించేవాడని' అంది సుజాత టీచర్. అంతా నవ్వుకున్నారు.

* * * *

విజయలక్ష్మి పాఠం చెబుతోంది.

'తాటిచెట్టు కల్పవృక్షం... కల్పవృక్షం అనగా అన్ని ఇచ్చునది. తాటికమ్మలు నీడనిస్తాయి. తాటిదూలం ఇళ్లకు పనికి వస్తుంది. తాటిదోనె పొలాలకి నీరు వెళ్లడానికి కాలువలా ఉపయోగపడుతుంది. తాటి ముంజలంటే అందరూ ఇష్టపడతారు. తాటిపండ్లు ఎంతో తియ్యగా వుండును. తాటిచెట్టు వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయి కాబట్టి... తాటిచెట్టు మనకి కల్పవృక్షం...' క్లాసంతా నిశ్శబ్దంగా వింటున్నారు.

పాఠం చెబుతూ పిల్లల్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి మోహన్ అనే అబ్బాయి వైపు చూసి ఆగిపోయింది.

ఆ అబ్బాయి మొహంలో కోపం... బాధ... ఎగిసొస్తున్న దు:ఖం... తడిగా మారుతున్న

కళ్లు... ఏవేవో భావ ప్రకంపనలు.

విజయలక్ష్మి పాఠం చెప్పటం ఆపేసి... 'మోహన్... ఏమైనా డౌటా?' అనడిగింది మృదువుగా.

వాడు వెంటనే నిక్కరు పైకి జరుపుకుంటూ లేచి నిల్చుని చేతులు కట్టుకున్నాడు. 'ఏంటి చెప్పు...?'

'తాటిచెట్టు మంచిదా టీచర్? రోజూ మా అయ్య తాటికల్లు తాగొచ్చి మా అమ్మని మస్తు కొడతాడు. తాటిచెట్లతోనే మా అయ్య సెడిపోయిండని మా అమ్మ రోజు ఏడుస్తది.'

పోఖ్రాన్‌లో అణుబాంబు ఎలా పేలిందో కాని... విజయలక్ష్మి గుండెల్లో వాడి ప్రశ్న అణుబాంబులా పేలింది. నిమిషం పాటు నివ్వెరపోయింది. నిజానికి ఆ పాఠంలో... తాటిచెట్టు గురించి రాస్తూ... అసలు 'కల్లు' ప్రస్తావనే రాయలేదు. కాని తాటి చెట్టనగానే ఎవరికైనా గుర్తొచ్చేది 'కల్లే' కదా...

అలాంటి తాటిచెట్టు కల్పవృక్షమవుతుందా...?

వాడు సమాధానం కోసం అలాగే నిల్చున్నాడు.

వాడికేం చెప్పాలి? సంసారాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఒక చెట్టు గురించి వాడు విద్యా వ్యవస్థనే నిలదీసినట్టుందా ప్రశ్న.

మిగతా పిల్లల అమాయకమైన కళ్లల్లో కూడా అవే ప్రశ్నలు!

నిమిషం తర్వాత తేరుకొని... మెల్లిగా, బుజ్జగించినట్టుగా, మృదువుగా సమాధానం చెప్పింది.

* * * *

లంచ్ టైంలో ఈ సమస్యని స్టాఫందరి ముందుచుంది విజయలక్ష్మి.

కొందరు నవ్వారు అదో సమస్యే కాదన్నట్టు మరికొంతమంది తీసేశారు. విజయలక్ష్మి చాలా సీరియస్‌గా అంది.

'డోంట్ థింక్ సిల్లీ... అదొక విద్యార్థి జీవితానికి సంబంధించిన సందేహం'

'ఇంతకీ మీరేం చెప్పారు?' హెచ్.ఎం. అడిగాడు.

'నేను చెప్పింది పూర్తిగా కాకపోయినా, కొంతవరకు కరక్టే అనుకుంటున్నాను. కల్లు తాగటం మంచిదని చెప్పాను. అది కప్పుగాని, అరగ్లాసెడు కాని తాగితే ఏమీకాదు. కాని మీనాన్న చాలా ఎక్కువగా తాగుతున్నాడు. అదే ముప్పు, ఏదైనా అతిగా తిన్నా, అతిగా తాగినా ప్రమాదమే...' అని చెప్పాను.

అందరూ ఆమె సమాధానాన్ని నిశ్శబ్దంగా విన్నారు. అక్కడ అంతకు మించి చెప్పడానికి వేరే ఏం లేదు.

భోజనం ముగిసిన వెంటనే ఆమె కాగితం, కలం తీసుకొని రాయటం మొదలుపెట్టింది.

'లీవ్ లెటరా?' అంది సుజాత టీచర్.

'కాదు... పాఠశాల ఎడ్యుకేషనల్ డైరెక్టర్‌కి లెటర్ రాస్తున్నాను' అంది.

ఆమె వైపు అంతా విచిత్రంగా చూసారు.

* * * *

నెల రోజుల తర్వాత...

విజయలక్ష్మి టీచర్ ఇచ్చిన స్వీట్స్ తింటూ

'మేడమ్... మీ బర్త్‌డేనా?' అన్నారు.

'కాదు'

'మరి మీఎంగేజ్‌మెంట్ అయిఉంటుంది'

'కానే కాదు'

'అడిషనల్ ఇంక్రిమెంట్ సాంక్షన్ అవుతుందని'

'కాదంటే కాదు'

'మరేంటి? స్వీట్స్ పంచేంత విశేషం' అనడిగారంతా.

ఎడ్యుకేషనల్ డైరెక్టర్ నించి. తనకి వచ్చిన లెటర్‌ని వాళ్ల ముందుంచింది. డైరెక్టర్ గారు విజయలక్ష్మిని అబినందిస్తూ... మీలేఖ చదివిన తర్వాత వచ్చే విద్యాసంవత్సరం తాటిచెట్టు పాఠాన్ని తొలగించి ఆ స్థానంలో 'కొబ్బరిచెట్టు' పాఠాన్ని ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నట్టు, ముందు ముందు మరిన్ని మార్పులు విద్యారంగంలో తేవడానికి తోడ్పడవలసిందిగా రాశాడు.

'ఓస్... దీనికేనా మీరు స్వీట్స్ పంచుతున్నది?' అన్నారు. విజయలక్ష్మి మనసు చివుక్కుమంది. చిన్నబోయింది. బాధగా క్లాస్‌రూం వైపు వెళుతుంటే 'విజయా...' అంటూ వచ్చింది సుజాత టీచర్.

'విజయా నాకన్నా చిన్నదానివైనా అభినందిస్తున్నాను. నీలాగే ఓ ఉపాధ్యాయురాలు ప్రతిజ్ఞలో 'అర్హుడనగుటకై' అనే పదాన్ని... ఆడపిల్లలు ఎలా పలకగలుగుతారు 'అర్హురాలగుటకై' అని వాల్లకి వర్తించాలి అని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ఆడ, మగ పిల్లలందరూ పలికేలా' అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేయుదును' అని ప్రతిజ్ఞలో మార్చారు. ఈరోజు నువ్వొక పాఠాన్నే మార్పించావ్. ఎనీవే కంగ్రాట్స్. ఇక నించి నేను నీ అడుగుజాడల్లో నడుస్తాను...' అంది.

విజయలక్ష్మి నవ్వింది. చదువులతల్లి నవ్వినంత హుందాగా... సౌమ్యంగా.

సర్పంచ్ గారి పిల్లి

పెళ్లివారికన్నా పెట్టెలు మోసే వాళ్ల హడావిడి ఎక్కువన్నట్టు - ఈ టైపు మనుషులు ఈ మధ్య బాగా తయారయ్యారు. వీళ్లెప్పుడూ దినపత్రికలు తిరగేసినా అవిశ్వాస తీర్మానాలు పెట్టారా, మధ్యంతర ఎన్నికలు వస్తాయా? అనే వార్తలకోసమే కళ్లల్లో క్యాండిల్లేసుకొని చూస్తుంటారు.

ఎందుకంటే వీళ్లకి ఎలక్షన్లొస్తే... పెద్ద పండగ! మూడు నాలు గు నెలలు... తా.తి.తి.గా అంటే తాగటం, తినటం, తిరగటంలో బిజీ బిజీ అన్నమాట.

పొరుగు దేశంలో ఎలక్షన్లొచ్చినా... ఆ గాలి వీళ్లకి తగిలి ఉబ్బితబ్బిబ్బయిపోయి... 'అయ్యయ్యో మనకెప్పుడొస్తాయో'నని బెంగెట్టుకొని మనకి ఎలక్షన్లొచ్చేంత వరకూ మంచమెక్కేటైపు...

అలాంటి బాపతే సుందరయ్యా, పరంధాములు!

అసెంబ్లీ ఎన్నికలైపోయేసరికి... దిగులుతో మంచమెక్కారు... లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్ని కలిపి పెట్టినందుకు ఎలక్షన్ కమీషన్‌కు శాపనార్థాలు పెట్టి పెట్టి... మళ్లీ అవిశ్వాసం రాకుండా భారీ మెజార్టీ ఇచ్చినందుకు జనాల్ని సైతం తిట్టి తిట్టి... కనుచూపు మేరలో ఎన్నికలు కనపడనందున కోమాలోకి వెళ్లిపోయి మంచమెక్కారు.

ఓ ఆస్పత్రిలో ఇద్దర్నీ పక్కపక్కనే ఉంచి... ముకుల్లో గొట్టాలు జొప్పించి అన్నపానీయాలు పంపిస్తూనే ఉన్నారు. రోజులో రెండు, మూడుసార్లు 'జిందాబాద్' అనో, 'దేశ్ కీ నేత' అనో పలవరిస్తుండటంతో బతికే చచ్చారన్న భరోసాతో ముక్కుల్లోంచి గొట్టాలు తీయట్లేదు.

అప్పటికే నెల్రోజులు గడిచాయి. అందరికీ విసుగొచ్చింది... కనీసం సదరు ఎమ్మెల్యేని, ఎంపీని పిలిపిస్తేనైనా లేచికూచుంటారేమోనని... ఆ పనీ చేశారు.

వాళ్లకి కావల్సింది ఎలక్షన్లుగాని... ఎమ్మెల్యేలు, ఎంపీలు అక్కర్లేదన్నట్టు కుంభకర్ణుడిలాగా లేవలేకపోయారు.

దాంతో బంధుమిత్రులకీ, డాక్టర్లకీ చిరాకేసింది. ముక్కుల్లో గొట్టాలు పీకేయడానికి... తిథి, నక్షత్రాలు చూసి ఓ ముహూర్తం పెట్టారు! కాని ఆ ముహూర్తానికి ముందే... ఆ గదిలోకి వచ్చిన ఓ నర్స్... బెడ్‌మీద పడేసి ఉన్న ఆ రోజు పేపర్‌తీసి 'స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి - మంత్రిగారి పిలుపు' అని కాస్త గట్టిగా చదివింది.

అంతే! గబ్బర్‌సింగ్, ఎస్వీరంగారావు లెవల్లో వికటాట్టహాసాలు చేస్తూ లేచి కూచున్నారు సుందరయ్య, పరంధాములు ఆదృశ్యం చూసి... నర్స్ భయంతో పరుగులు పెట్టింది.

ఇద్దరూ... ప్రమాణస్వీకార పత్రాన్ని ప్రాణంలా చదువుకున్న మంత్రిగారిలా... ఆ న్యూస్‌పేపర్ని ప్రేమగా చదివి పులకించిపోయారు. గొట్టాలు పీకేసుకొని... గట్టిగా శ్వాసపీల్చి వదిలారు. ఆర్తిగా కౌగిలించుకున్నారు. హాస్పిటల్ బయటికి రాగానే "నువ్వో గ్రూపు... నేనో గ్రూపు పద మనూరికి మరో మూణ్ణాల్లుగెల్లు జల్సా చేద్దాం..." అనుకొని బయలుదేరారు.

* * * *

"ఈసారి మీరు తప్పకుండా సర్పంచ్‌గా పోటీ చేయాల్సిందే..." అప్పటికే ఫుల్‌బాటిల్ లాగించిన పరంధాములు భూషణంతో అన్నాడు.

"ఒరేయ్ పరంధాములూ! గెలుస్తానంటావా? అయినా ఇప్పుడు సర్పంచ్‌గా ఉన్న రాజారాంకు, నాకు శత్రుత్వం అని నీకూ తెలుసు... వాడితో పోటీపడి గెలుస్తానంటావా?" అన్నాడు పెగ్గుపోస్తూ.

"ఈ ఎలక్షన్లో ఆడిబతుకు రేడియోలా కనపడకుండా పోవాలండీ... మీరు కలర్ టీవీలా వెలిగిపోవాలండీ... అందుకోసం మీరు ఇప్పట్నించే పాకిస్థానోడి పాలసీలా రాజారాం మీద ఎక్కడపడితే అక్కడ దుమ్మెత్తిపోయడానికి సిద్ధంగా ఉండాలండీ..." అని హింటిచ్చాడు పరంధాములు.

"అదెలారా...?" అడిగాడు భూషణం.

"తెలుగోడి బుర్ర తేలుకొండితో సమానమని మీకు తెలీదు. ఎలక్షన్ల డేటు వచ్చేనాటికి... రాజారాముకి... సరైన ప్రత్యర్థి భూషణంగారే అని జనాలకి అర్థమయ్యేలా 'సీన్'లు పెంచాలండీ..."

అవున్రా... దాంతో మన గ్రూపులో ఉండైవాడెవడో, ఉండని గాడిదకొడుకులెవరో తేలిపోద్ది. ఆ సీన్‌లేవో నువ్వే పెంచెయ్." అన్నాడు భూషణం వెయ్యిరూపాయల్ని తీసి పరంధాములు జేబులో కుక్కుతూ...

"అదెంతసేపండీ... చిటికెలోపని... ఉస్కో..." అన్నాడు పక్కనే పడుకున్న కుక్కనుద్దేశించి.

'ఉస్కో' అనగానే ఛొంగకారుస్తున్న కుక్క ఒక్కఉదుటున లేచి... వాకిట్లోంచి స్కూలుకెళ్తోన్న ఓ అబ్బాయి కాలిని గట్టిగా కరిచింది.

ఆ కుర్రాడు కుయ్యో...మొర్రో అంటూ ఇంటికి పరిగెత్తాడు.

"అదెంట్రా... కుక్కని రెచ్చగొట్టావ్" అనుమానంగా అడిగాడు భూషణం.

"పొలిట్రిక్స్ అంటే అంతే మరి... మీరింకా చాలా నేర్చుకోవాలి" అని ఘంటసాలలా గొంతు సవరించుకొని... భగవద్గీత లెవల్లో చెప్పాడు పరంధాములు.

"ఓటు అనేది... ఎల్లవేళలా గుండెలమీద గునపంపోటులా గుచ్చుతూనే ఉండాలి. అలాంటివాడికే జనం నాడీ, బాడీ రెండూ గోచరిస్తాయి. తేదీ ప్రకటించిన రోజే ఎలక్షన్లలో నిలబడాలనుకునేవాడికి డిపాజిట్టూ దక్కదు. పదవి కోసం పాపాత్ముల్ని చేరదీసైనా... పావుల్ని కదపటం ప్రథమ లక్షణం... ముందు పాముల్లా బుసకొడ్తూనే... వెనక గోవుల్లా కలిసి వుండటం రాజకీయ ఆంతర్యం. ఈ థియరీని అర్థంచేసుకున్న వాడికెప్పుడూ మెజార్టీ... ప్రజార్టీ... ప్రియార్టీ మూడూ దక్కుతాయి"

భూషణం భక్తిపారవశ్యంతో పరంధాములుకి నమస్కరించాడు.

* * * *

"సుందరయ్యా... సమయానికి డాక్టర్‌ని తీసుకొచ్చి... నాబిడ్డని కాపాడావ్. వాడి నాభి చుట్టూ ఇంజక్షన్లు పడటమే బాధగా ఉంది సుందరయ్యా" అన్నాడు సర్పంచ్ రాజారాం.

"నాకైతే గుండే మండుతోందయ్యా... కుక్క కరిచినందుకు. ఆ కుక్క మనబ్బాయినే ఎందుకు కరవాలి?" అన్నాడు వీరావేశంతో.

"అదేంట్రా... కుక్కలకి వీడు సర్పంచ్ కొడుకు, వాడు వార్డు మెంబర్ కొడుకు అని తెలుస్తుందా ఏంటీ?" అన్నాడు నవ్వుతూ.

"కరిచిన కుక్క ఎవరిదో తెలిస్తే... మీకూ నిద్రపట్టదు" అన్నాడు పళ్లు నూరుతూ.

"ఎవరిదిరా?"

"అది భూషణం కుక్క"

ఆ మాట వినగానే రాజారాం గుండె కాలిపోతున్న ట్రాన్స్‌ఫారంలా భగ్గున మండింది.

"అప్పట్నించీ ఈ విషయం ఎందుకు చెప్పలేదురా... ఆ కుక్కని చంపించేవాణ్ణి" అన్నాడు ఊగిపోతూ.

"ఆగండి... వాడు కుక్కతో కొడతే మనం పిల్లితో కొడదాం...' అన్నాడు సాలోచనగా సుందరయ్య.

రాజారాంకి అర్థంకాలేదు.

సుందరయ్య మౌనంగా ఉండటంతో... రెండువేల రూపాయలు తీసి చేతుల్లో పెట్టాడు.

వాటిని జేబుల్లో పెట్టుకుంటూ చిద్విలాసంగా నవ్వేడు సుందరయ్య.

"ఆవేశంలోకన్నా... ఆలోచనతో దెబ్బ కొట్టేవాడే నిజమైన పొలిటికల్ లీడరు. మీరు సర్పంచ్. మీపేరులోనే 'సర్పం' ఉంది. కాటేస్తే వాడికి నామినేషన్ డబ్బులు కూడా ఉండకూడదు" అని రాజారాం రెండు చెవుల్లోనూ పొలిటికలోపనిషత్తుని నూరిపోశాడు.

రాజారాం వివశుడై రెండు ఫుల్‌బాటిల్స్ ఓపెన్ చేశాడు.

*　　　*　　　*　　　*

చిన్నపాటి చిరుతపులిలా... దర్పంగా అడుగులో అడుగేసుకుంటూ తిరిగే సర్పంచ్‌గారి పిల్లి అంటే ఆ ఊరందరికీ పరిచయమే.

అది ఎవరి ఇంట్లో దూరి పాలు తాగినా... దాన్ని ఎవరూ ఏమీ అనకూడదు. అది దానికున్న ప్రాథమిక హక్కు...

దానికి అప్పుడప్పుడు నాన్‌వెజ్ తినాలన్పించి... ఎవరి కోడికి ఎసరుపెట్టినా కనీసం బొచ్చుముట్టడానిక్కూడా వీల్లేదు. అది ఎప్పుడు, ఎవరింట్లో దూరి మలమూత్రాలు విసర్జించినా... వాటిని గొబ్బెమ్మలంత అపురూపంగా తీసేయాలి తప్ప... ఎవరూ అసహ్యించుకోకూడదు. అది దానికున్న నైతికహక్కు...

అది 'మ్యావ్ మ్యావ్'మని భయంకరంగా అరిచినా... అందమైన గజల్ వింటున్నట్టు అనుభూతించాలి తప్ప... ఎవరూ చెవులు మూసుకోకూడదు. అది దానికున్న పౌరహక్కు. అది దానికున్న ప్రజాస్వామ్య హక్కు...

అలాంటి పిల్లి... ఓ అర్ధరాత్రి...

రెండు వేల బ్రాయిలర్ కోళ్లున్న ఫామ్‌లోకి దభిల్లున్న దూకింది. ఆ శబ్దాన్ని ఎప్పుడూ వినని కోళ్లలో రెండొందల కోళ్ల గుండెలు ఠప్ ఠప్ మని ఆగిపోయాయి. దాని భయంకరమైన ఆకారాన్ని చూసిన నాలుగొందల కోళ్లు "కొక్కొక్కరొక్కో...' అని అరవబోతూ... అలాగే చచ్చూరుకున్నాయి.

ఆకాశంలో పాలమబ్బుల్లో తేలిపోతున్నట్లు పీలయిపోయిన సర్పంచ్‌గారి పిల్లి... ఆనందంగా 'మ్యావ్'మంది. అంతే! అసలే బ్రాయిలర్ కోళ్లు కాబట్టి పన్నెండొందల కోళ్లు ఒక్కసారి ఫట్‌మన్నాయి.

పిల్లిగారు విరుచుకొని... పంజా విసిరింది. నాలుకని బయటికి తీసి మీసాల్ని ఓసారి మెలేసింది. కొన్నింటిని చీల్చి చెండాడింది. ఇంకొన్నింటిని చూపుల్తోనే చంపింది.

- గంటలోగా కోళ్ల ఫారమంతా... తుపానొచ్చిన ఒరిస్సాలా మారింది. తెల్లారేసరికి... ఊరంతా గుప్పుమంది.

"సర్పంచ్ గారి పిల్లి భూషణంగారి ఫారంలో రెండువేల కోళ్లని చంపేసిందట..." విషయం

తెల్సిన భూషణం వీరభద్రుడైపోయాడు. ఆ పిల్లిని చంపడానికి పదిమందిని కత్తులు, కర్రలిచ్చి పంపాడు.

వాళ్లు సాయంత్రానికల్లా చచ్చిన పిల్లిని తీసుకొచ్చి భూషణం కాళ్లముందు పడేశారు.

"మీలో ఒక్కడు తగ్గినట్టున్నాడు..." అన్నాడు అనుమానంగా భూషణం. వాళ్లు తొమ్మిదిమందే ఉండటంతో.

"పిల్లిని చంపి తీసికొస్తుంటే... రాజారాం మనుషులు వెంటపడ్డారు. మాలో శేషుగాడు సర్పంచ్ మనుషులకి దొరికిపోయాడు" చెప్పారు- ఒకరిద్దరు.

"హు..." అసహనంగా హూంకరించాడు భూషణం.

మర్నాడు తెల్లారేసరికల్లా... పొలాల్లో శేషుగాడి శవం కన్పించింది.

*　　　*　　　*　　　*

"ఒరేయ్ పరంధాములు... ఉప్పేసి ఊరుకున్నాం... ఊరంటుకొందిరా" అన్నాడు సుందరయ్య పెగ్గుపోస్తూ.

"అసలు రాజకీయమంతా నాయకుల చేతుల్లో ఉండదురా నాయనా... వాళ్లుత్తి యాక్టర్స్, మనలాంటోళ్లం తెరవెనుక ఎంత కష్టపడతామో... జనాలకేం తెల్సు? వాళ్లు లీడర్లకు దండలేసి దండం పెట్టేటప్పుడు నాకు నవ్వొస్తుంటాది". గటా గటా గ్లాసు ఖాళీ చేసి నవ్వాడు పరంధాములు.

"సరేగాని... మన కష్టాల్ని దేవుడు కూడా చూస్తున్నాడు. పేపర్ చూశావా?" అడిగాడు సుందరయ్య.

"ఏమిట్రా?"

"స్థానిక సంస్థల ఎన్నికలకు తేదీల ఖరారు" తన్మయంగా చెప్పాడు సుందరయ్య.

"మరో నెల్రోజులు సుష్టుగా విందు, మందుతోపాటు చెరో పదివేలన్నా దొరుకుతాయ్. ఏంట్రా... సోడా అయిపోయిందా? మొహం దీనంగా పెట్టావ్?" అడిగాడు పరంధాములు.

"ఏంలేదు. సర్పంచ్ ఎలక్షన్‌లయ్యాక... మళ్లీ ఎన్నికలు ఎప్పుడొత్తాయో... ఏంటో..." అన్నాడు నిట్టూరుస్తూ సుందరయ్య.

"ఇలాగే మరో రెండు ఎలక్షన్లు ఏవన్నా వస్తే బ్యాలెట్ బాక్స్‌లా స్ట్రాంగయిపోతాం. అంతా ఎలక్షన్ కమిషన్ దయ..." గ్లాసు ఖాళీచేస్తూ చెప్పాడు పరంధాములు.

'జై ఓటు మాతల్లి' అని తేన్చి, అక్కణ్ణించి వాళ్లిద్దరూ విడిపోయారు...

ప్రజాస్వామ్యం సాక్షిగా!!!

అదే సమయానికి... శేషుగాన్ని చంపారన్న పగతో భూషణం మనుషులు రాజారాం సోదరున్ని వేటాడుతున్నారు.

వెంటాడే పిలుపు

రాజమణి చీకట్లో ఒంటరిగా కూచుంది... వెలుతుర్లోకి రావాలంటే భయం...

ఎప్పుడూ చీకట్లోనే వుండాలన్నా భయం...

బతుకంతా భయం భయం...

భవిష్యత్తు మరీ భయం..

వెనకా ముందూ ఎవరూలేని ఒంటరితనం... తన తోడు పంచుకునే వాడు... నీడనిస్తాడనుకున్నవాడు... అర్థవంతమవుతుందనుకున్న జీవితాన్ని చాలించి అర్థాంతరంగా వెళ్లిపోయాడు.

ఆ మూణ్ణెళ్ల సంసారంలో కడుపులో ఓ నలుసైనా పడితే...

ఆ బిడ్డలో తననీ, తండ్రినీ, చూసుకుంటూనైనా బతికేది. ఈ భయంకరమై ఒంటరి తనానికి అడ్డుకట్టవేసేది.

ఆలోచనల్లో వుండగానే... ఇంటి ముందు 'అంబా' అన్న అరుపు... ఆ అరుపు మూడేళ్లుగా చిరపరిచితమే... పోతురాజు వచ్చాడనుకొంది.

బకెట్లో వున్న కుడితి నీళ్లలో నిన్న మిగిలిపోయిన అన్నం, ఈరోజు వొంపిన గంజి కలిపి బకెట్ తీసుకొచ్చి... ఇంటిముందు నిల్చున్న దున్నపోతు ముందుంచింది.

అది ఆబగా జుర్రుతుంటే... గమనించింది. ఈ మధ్య ఎవరూ కుడితినీళ్లు పెట్టక బక్క చిక్కుతోంది.

మూడేళ్లకింద అది వూర్లోకొచ్చినప్పుడు... ఆడపిల్లలమంతా ముసిముసిగా నవ్వుకున్నాం.

ఆరోజు వాగు దగ్గరికి మంచినీళ్ల బిందెలు పట్టుకొని తను, సుజాత, సంధ్య, ఉమ, లక్ష్మి తామంతా వెళ్తుంటే... గ్రామ పంచాయతీ రచ్చబండ మీద వూరి రైతులంతా పంచాయితీ జరుపుతుంటే ఆగిపోయాం. విషయం తెల్సుకున్న తర్వాత ఎంతగా నవ్వుకున్నామో...

కానీ... 'పాడి'నే నమ్ముకున్న రైతులకి అదెంతటికీ తీరని సమస్య?

"వూర్లో బర్రెలు ఏవీ కూడా రెండేళ్లనించీ సూడికి రావంటం లేదు. అందరం కల్సి బర్రెల మీద పారడానికి దున్నపోతుని కొనాలి. మీరేమంటారు?" సర్పంచ్ అడిగాడు.

"వూరి మీదికి దున్నపోతుని కొనాలని ఎన్నాళ్లనించోమొత్తుకుంటున్నాం. వూర్లో ఇంతమందిమి రైతులముండి, అందరికీ బర్రెలుండి... పాలు పెరుగు పక్కూరి వాళ్లనించి కొనుక్కోవటం సిగ్గనిపిస్తుంది." ఓ మోతుబరి రైతు గట్టిగానే అన్నాడు.

"మంచి పోతుని కొనాలంటే ఆదివారం జగిత్యాల అంగట్లకు బోవాలె. కనీసం వెయ్యి, రెండువేల లోపుది కొంటేనే... మన బర్రెలేమన్నా సూడికత్తయ్. మరి... అంత డబ్బు గ్రామపంచాయితీలకెల్లి తీయటం కుదుర్దు కాబట్టి... రైతులంతా తలా ఇంతని వేస్కోవాలి..." తిరిగి చెప్పాడు సర్పంచ్.

"అందరు రైతులకు ఎలా వేస్తాం.. బర్రెలున్న ఇంటికి ఇంతని వేయాలి" అన్నాడు మరోరైతు.

"అదీ కర్కట్టే... అందరికీ ఎట్లావేస్తాం? ఎవలెవలకు బర్రెలున్నయో చెప్పరాదుండ్రి... లిస్టు రాద్దాం" అన్నాడు ఉపసర్పంచి.

పావుగంటలో పేర్లు తయారయ్యాయి.

"అది సరే... అంతమంచిగనే వున్నది కాని... దానికి మేత ఎట్లామరె?" సందేహంగా అడిగాడో రైతు.

"నీయవ్వ... పోతుకొన్నంక తనుగుకి భయపడతామె రాజన్నా... ఇంటికింత కుడితి నీళ్లో, చలిబువ్వో పడేత్తే... ఊరిమీద పడి అదే ఊరుతది" అన్నడు వెంకన్న అనే రైతు.

"సరే... ఎల్లుండి ఆదివారం జగిత్యాల అంగట్లకు ఎవలెవలు వోతరు?" అనడిగాడు సర్పంచి ఇద్దరు యువ రైతులు "మేం పోతంలే" అన్నారు.

"అంగడంత మంచిగ తిరిగి... బేరం చేయుండ్రి. అంగడికి దగ్గరని సీరామ టాకీసుల సీన్మాజూసి బక్కపోతుని తెచ్చేరు" నవ్వుతూ హెచ్చరించాడు మరో రైతు.

వూరంతా కల్సి దున్నపోతు కొనడానికి ఏకగ్రీవ తీర్మానం చేసారు.

ఆ పంచాయతీని విచిత్రంగా ఖాళీ బిందెలు పట్టుకొని నిల్చుండి చూస్తున్న ఆడపిల్లల్ని చూడగానే... కింద వేసుకున్న పంచెదులుపుతూ లేచిన రంగయ్య తాత...

"ఇగ గీ పెయ్య దూడలకు... మంచి పోతుల్ని చూడాలె" అన్నాడు సరసంగా.

"గా పోతులు వెయ్యి రెండు వేలల్ల దొరుకుతాయె... లచ్చలకు లచ్చలు గావాల్నాయె" నవ్వుతూ అన్నాడు మరో రైతు.

ఆ మాటలు విని "ఛీ తాతా... పోయే..." అంటూ బిందెలతో వాగువైపు పరిగెత్తారంతా. తర్వాత...

నాల్రోజులకి... నల్లగా, దృఢంగా నిగనిగలాడుతూ వచ్చిన దున్నపోతుని చూసి అంతా ముచ్చటపడి దానికి 'పోతురాజు' అనిపేరు పెట్టారు.

కాలం కరిగిపోతూనేవుంది... ఎడాదిలో బర్రెలు సూడికొచ్చాయి.

వూర్లో పుష్కలంగా పాడి దొరుకుతోంది.

ఆనాటి ఆడపిల్లలందరికీ కూడా ఈ మూడేళ్లల్లో పెళ్లిళ్లయ్యాయి...

కాని రాజమణి బతుకే పెళ్లయిన మూణ్ణెళ్లకే చితికి పోయింది. భర్త యాక్సిడెంటులో చనిపోయాడు.

పోతురాజు కుడితి తాగి అంబా అని అరవటంతో రాజమణి ఈ లోకంలోకి వచ్చి పడింది. ఇప్పుడు దాన్ని వూర్లో ఎవరూ పట్టించుకోవట్లేదు. ఆకలితో ఎవరి చేన్లోనైనా పడితే 'దొంగగొడ్డు' అని తిడుతున్నారు, కొడుతున్నారు.

దాంతో అది బాగా చిక్కిపోయింది.

*　　　*　　　*　　　*

రాజమణీ అంతరాంతరాల్లో మొదలైన సంఘర్షణ... సుడిగుండమై సుల్లు తిరుగుతూ గుండెను అతలాకుతలం చేస్తోంది.

ఈ ఒంటరితనాన్ని జయించడానికి...

నిండారుగా నవ్వడానికి...

నింపాదిగా ఆడుకోడానికి...

నిలువెల్లా పులకరించడానికి...

తనకో... బిడ్డ కావాలి!

తనకో బిడ్డ కావాలి!?

మగాడి తోడు అవసరం లేదు... అమ్మతనంలోని ఆత్మీయతని అల్లుకొని వచ్చి... బుడి బుడి నడకలతో ముద్దాడి... తను ప్రతిక్షణం పలవరించేలా... తనని పలకరించేలా... ఈ బ్రతుకుని సంతోషంగా వెళ్లదీయడానికి...

తనకో బిడ్డ కావాలి!!!

నెలరోజులుగా పడుతున్న మథనంతో... భయం, పరువు పోటీపడుతున్నాయి. తనెవరికీ

ద్రోహం చెయ్యటంలేదు. ఆ మాత్రం ఆనందాన్నయినా తన జీవితంలో నింపుకుంటే తప్పేంటి? ఈ ఒంటరి జీవితంలోకి... ఆ వెలుగు ఎలా రావాలి? ఎలా? ఎలా??

ఆమె ఆలోచనల్లో వుండగానే ' రాజమణీ... రాజమణీ... కొంచెం అన్నంపెట్టవూ...' అంటూ వినాయకులు వచ్చాడు. వాడికి వయసూ, శరీరం పెరిగినా మనసు ఎదగలేదు. దాన్ని అవకాశంగా తీసుకున్న రాజమణి... వినాయకులుకి కడుపారా అన్నంపెట్టి... అల్లుకు పోయింది.

అప్పుడే రాజమణి ఇంట్లోకి వచ్చిన అనసూయ అయ్యో... అయ్యో... అని మొత్తుకుంది. కేకలు వేసింది. బిల బిలా ఆడమగా అంతా పరిగెత్తుకొచ్చారు.

"వినాయకులు గాడు అమాయకుడనుకున్నాం... రాజమణి మీద పడ్డాడు" అంది.

అంతే! వినాయకుల్ని కొట్టారు, తన్నారు, రాజమణి మూగవోయి నిల్చుంది. వినాయకులు అరుపులు విన్లేని రాజమణి 'ఆగండీ' అని అరచింది.

అప్పటికే వినాయకుడి ఒళ్లు హూనమైంది.

"వినాయకుడి మీద నేనే పడ్డాను" అంది తలదించుకొని.

ఆ తర్వాత గంటకి... రాజమణి పంచాయితీలో పెద్దల ముందు నిల్చుంది. రకరకాల మాటలు ... నిలువెల్లా చీల్చాయి.

చివరగా... రాజమణి తప్పుకి అయిదు వందల జరిమానా విధించారు.

*　　　*　　　*　　　*

రాజమణి అవమానంతో కుంగిపోయి ఇంట్లోకి అడుగుపెడుతుంటే... మణీ అని పిలిచింది సుజాత. సుజాతని చూడగానే బావురుమంది. వాళ్లిద్దరూ చిన్నప్పట్నించీ స్నేహితులు.

"నీ బాధని నేనర్థం చేసుకోగలనే... నేను మాయింటికి గోదావరిఖని వెళ్తున్నాను. వారం పదిరోజులు మా ఇంట్లో వుండు వద్దువు గాని... రా..." అంది అప్యాయంగా.

కన్నీల్లతో 'సరే' నని తలూపింది రాజమణి.

*　　　*　　　*　　　*

పదిరోజుల తర్వాత గోదావరిఖని నించి వచ్చిన రాజమణికి... మళ్లీ ఒంటరితనం ఆవరించింది. దు:ఖం పెకిలించుకొని కన్నీళ్లు రావడానికి మూగవోయిన గుండె మౌనంగా రోదిస్తోంది. సాయంత్రం కాగానే... ఎప్పటిలాగే 'అంబా' అన్న పిలుపు కోసం చూసింది.

ఆ రోజు చీకటిపడినా 'పోతురాజు' రాలేదు.

ఆరోజే కాదు... రెండు మూడు రోజుల వరకూ ఆ పిలుపూ విన్లేదు. ఎవరి చేనులోనైనా పడితే బంజరుదొడ్డిలో కట్టేసి వుంటారనుకొంది.

రంగయ్య తాత కనపడి పలకరిస్తే "తాతా... పోతురాజు కన్పడటం లేదేంటి?"

అనడిగింది.

"దానికి మేతవేసే వాళ్లెవరు తల్లీ... తిండి దొరక్క అది బక్కగొడ్డులా అయింది. దాని మెడదగ్గర పుండయి ఈగలు ముసిరితే... ఇంటి ముందుకురాగానే చీదరించుకొంటూ తరిమేవాళ్లు. దాంతోని వూరోళ్లంతా కల్సి రెండొందలకు 'కోత'కి అమ్మేసారు. రజాకగాడు దాన్ని కొని అల్‌కబీర్‌కు పట్టుకుపోయిండు. ఈ మనుషులింతే తల్లీ... గొడ్డుకో న్యాయం... మనిషికో న్యాయం... ఏరు దాటంగానే తెప్పతగిలెయ్యటం..." అంటూ వెళ్లిపోయాడు. రాజమణి కూలబడిపోయింది. కాలం ఒంటరిగా అల్లుకుపోతోంది.

అంబా అన్న పిలుపు కోసం..

అమ్మా అన్న పిలుపు కోసం...

రాజమణి రోజూ ఎదిరి చూస్తోంది.

ఆ పిలుపులు... అనుక్షణం ఆమెని వెంటాడుతున్నాయి.

గాలినై పోతాను గగనానికి...

జగిత్యాల బస్‌స్టాండ్ చాలా రద్దీగా వుంది...

వచ్చీపోయే ప్రతి బస్సులోనూ పుట్‌బోర్డ్ దగ్గర వ్రేలాడేంత జనం. ఎవరి పనుల కోసం వారు పరుగులు తీస్తున్నట్లు... ప్రపంచంలో ప్రశాంతత కనుమరుగైందనడానికి నిదర్శనంగా జనం కోలాహలం...

సంధ్య ఆరో నంబర్ బస్టాప్ దగ్గర అసహనంగా నిల్చుంది. కాలేజీకి టైమవుతెంది... అయినా బస్సు జాడలేదు.

బస్సు సరే... ఈరోజు అతడేడీ...?? చప్పున అతడు గుర్తు రాగానే... మనసు తెరదించేసింది. తనేమిటి? అతడి గురించి ఆలోచిస్తుంది. ఈ మధ్య మరీ ఆలోచిస్తుంది...

దాదాపుగా ఎనిమిది నెలల్నించి ఒకే బస్సులో వెళ్ళటం వల్లనేమో... ముందు ముభావంగా చూసుకునేవాళ్లు... తర్వాత కళ్లతో నవ్వుకునేవారు... ఆ తర్వాత పెదాలు విచ్చుకునేవి... ఆ తర్వాత కళ్లూ పెదాలూ విచ్చుకొని విష్ చేసుకునేవి... బస్సు రష్‌గా వున్నప్పుడు ఇద్దరూ ఒకేచోట ఆనీ ఆననట్టు నిల్చోవాలన్న చిలిపి కోరిక మనసులో ఏమూలో పెరిగి పెరిగి... ఆలా నాలుగైదుసార్లు జరిగి పలకరింపు వరకూ వచ్చింది. ఆ పలకరింపులు బస్సు కుదుపులకి శరీరాలు తాకి పులకరింపులు లేపేవి.

ఆ పలకరింపులు... కేవలం పేర్లు తెల్సుకోవటం వరకే ఆగింది.

ఇద్దరికీ గంటల తరబడి మాట్లాడుకోవాలని వుంది. సంధ్యకైతే మరీనూ... బస్సులో గుండె చిక్కబట్టుకొని... మాటలు కూడదీసుకొని పలకరిద్దాం అనేలోపే జగిత్యాల సిటీపొలిమేరల్లోనే అతడు బస్సాపి దిగిపోతాడు.

సంధ్య మరో అరగంట ప్రయాణం చేస్తుంది. ఆమె బి.యస్సి. ఫైనల్ చదువుతోంది. ఆమె చదివే ప్రయివేట్ కాలేజి జగిత్యాలకి పన్నెండు కిలోమీటర్ల దూరం...

బస్సు వేగంగా వచ్చి ఆగింది. శత్రువు మీద దాడి చేసినట్టు ప్రయాణీకులు ఎగదోసుకుంటూ ఎక్కుతున్నారు. గంట, రెండు గంటలు నిల్చోలేక సీటుకోసం పడే ఆతృత. ఆర్టీసి 'ఆక్టోపస్' లా కదిలింది.

సంధ్య బస్సెక్కినా అతడి కోసమే చూస్తోంది. బస్సు బస్టాండ్ మలుపు తిరుగుతున్న టైంలో అతడు వేగంగా వచ్చి బస్సెక్కాడు. అతడు కన్పించగానే సంధ్య రిలీఫ్‌గా ఫీలయ్యింది. లేకపోతే ఆరోజంతా ఏదో దిగులు. సంధ్యని చూసి పుట్‌బోర్డ్‌మీదినించే అతడు నవ్వాడు.

"ఈ రోజైనా అతడి ఉద్యోగమేంటో ఖచ్చితంగా కనుక్కోవాలి. అతడు దిగే స్టేజిలో ఏ ఆఫీసులూ లేవు" అనుకుంది. అతడి ఉద్యోగం గురించి ఓసారి అడిగితే నవ్వాడు. నవ్వి "చెబితే మీరు జడుసుకుంటారు. నాతో మాట్లాడరేమో?" అని చెప్పాడు. ఎన్నిసార్లడిగినా అదేమాట.

సంధ్య ఈరోజు చాలా హుషారుగా వుంది. కారణం తన బర్త్‌డే. హ్యాండ్‌బాగ్ లోంచి రెండు చాక్లెట్లను తీసి పట్టుకుంది. బస్సులో బ్యాలెన్సడ్‌గా నిలబడటం కష్టంగా వుంది. అతడు జనాన్ని తోసుకుంటూ దగ్గరి వరకూ రాగానే... ప్రక్క సీట్లోని ఇద్దరు పాత బస్టాండ్‌లో దిగారు. సంధ్య చప్పున కూచుంటూనే "అనిల్... కూచో" అంది.

"సారీ... ఈరోజు లేటయింది" అంటూ కూచున్నాడు అనిల్.

"ఈ రోజొక విశేషముంది... ఈరోజు నా బర్త్‌డే" సిగ్గుపడుతూ గుప్పెట విప్పింది. అనిల్ ముఖమంతా ఓకొత్త కాంతి... "నిజమా... నిన్న చెబితే మంచి ప్రెజెంటేషన్ ఇచ్చేవాణ్ణి" అంటూ ఒక చాక్లెట్ తీసుకున్నాడు.

సంధ్యని ఓసారి నిశితంగా పరిశీలించాడు.

రోజూ పంజాబీ డ్రెస్‌లే వుండే తను... ఈరోజు నేరెడు రంగు చీరలో తలలో మల్లెపూలతో వసంతం విచ్చుకున్నట్టు... విప్పార్చిన కళ్లమీద వెన్నెల వర్షం కురుస్తున్నట్టు... చాలా... చాలా అందంగా వుంది.

ఆమె మోచేతిని గిల్లటంతో అతడు వాస్తవంలో పడ్డాడు.

టిక్కెట్స్ ఇష్యూ కాలేదని డ్రైవర్ బస్సాపాడు. ప్రయాణికులు ముచ్చట్లలో వున్నారు.

"ఈరోజు మీ బర్త్‌డే అని తెలీకపోయినా... ఎగ్జిబిషన్ అంతా తిరిగి మీకోసం ఓ చిన్న గిఫ్ట్ కొన్నాను" అంటూ జేబులోంచి కీచైన్ తీసిచ్చాడు.

"ఏం బాగాలేదు" తీస్కుంటూ నవ్వుతూ చెప్పింది సంధ్య. తాళం చెవులు తగిలించుకొనే గొలుసుకి ఓ చిన్నగాజు సీసా... అందులో పసుపు రంగు ద్రవం వుంది.

ఆ కీచైన్‌లో ఓ ప్రత్యేకతుంది. సరిగ్గా చూడండి" చాక్లెట్ నోట్లో పెట్టుకుంటూ చెప్పాడతను. ఆమె కీచెయిన్‌ని అటూ ఇటూ త్రిప్పింది.

"ఏమీ లేదే ప్రత్యేకత" అని అనేంతలోనే గాజు సీసాలోని పసుపు రంగు ద్రవంలో ఓ బియ్యంగింజ కనబడింది. దానిమీద I లివీజుని స్త్రవీగీ అన్న అక్షరాలు కన్పించాయి. విభ్రమంగా చూసిందామె. అతడు పెదాలతో శరీరమ్మీద చేప్తున్నట్టు ఒళ్ళంతా తీయగా కంపించింది...

గుండె, గొంతు మూగవోతుంటే అతడి చేతిని గిల్లి 'థాంక్యూ' అంది మెల్లగా. ఆమె కళ్లల్లో సన్నటి నీటి పొరను చూసాడతను. కండక్టర్ టికెట్స్ అనడంతో ఇద్దరూ తేరుకున్నారు. అనిల్ రెండు టికెట్స్ తీసాడు.

కాస్సేపటికి బస్సు కదిలింది...

"ఈ రోజు మీతో చాలా మాట్లాడాలని వుంది. కాలేజికి ఒకపూట డుమ్మా కొట్టి వస్తాను. మీరు పనిచేసే ఉద్యోగం పేరు చెప్పరు. ఈరోజు ఎలాగైనా మీకోసం మీ ఆఫీసుకొస్తాను" అంది చిరుకోపంగా.

అతడు నవ్వి ఆ తర్వాత గంభీరంగా అయిపోయాడు.

"రావద్దు... మీరు మాత్రం అక్కడికి రావద్దు. మీరే కాదు ఎవ్వరూ రావద్దని కోరుకుంటాను" అన్నాడు.

"ఎందుకు?"

"అదంతే... సారీ."

సంధ్య చిన్నబోయింది. ఇద్దరి మధ్యా పది నిమిషాలు మౌనంగా దొర్లిపోయాయి. మరో అయిదు నిమిషాల్లో అతడు దిగిపోతాడు...

అతడు దిగిపోతాడు... అన్న ఆలోచనే ఆమెలో దిగులు నింపింది.

"ఈరోజు మళ్లీ ఎక్కడ కలవాలి మిమ్మల్ని...?" ఎటో చూస్తూ అడిగింది.

"మీకిష్టమైతే సాయంత్రం ఆరున్నరకి పార్క్‌కి రండి. నేను రోజు పార్కులో రెండుగంటలు గడుపుతాను ఒంటరిగా..." చెప్పాడు అనిల్.

"మీరు చేసే జాబ్ ఏంటో మాత్రం చెప్పరు" ఉడుకు మోత్తనంగా అడిగింది.

"చెప్పను" నవ్వుతూ చెప్పాడు.

"చెప్పకపోతే మీతో పాటే బస్సు దిగి తెల్సుకుంటాను" అంది రోషంగా. అంతలోనే అతడు దిగాల్సిన స్టేజి వచ్చింది. అతడు సీట్లోంచి లేస్తూ...

"నువ్వు దిగొద్దు గాని... నా ఉద్యోగం చూసి అసహ్యించుకోవనే మంచి మనసు నీకుందనుకుంటాను. వుంటెనే పార్క్‌లో కలువు" అని దిగిపోతూ తన విజిటింగ్ కార్డ్‌ని ఆమె చేతిలో పెట్టి వెళ్లాడు.

బస్సు కదిలింది...

విజిటింగ్ కార్డ్ చదివిన సంధ్య క్షణం పాటు ఉలిక్కిపడింది...

ఆ తర్వాత నవ్వింది... అది బస్సు అన్న స్పృహ లేకుండా తెరలు తెరలుగా నవ్వింది.

బస్సులోని జనమంతా అవాక్కయి ఆమెనే చూస్తున్నారు.

పసిపిల్ల ఏదో విచిత్రాన్ని చూసి కేరింతలు కొడుతున్నట్టు... ఆమె విజిటింగ్ కార్డ్ చూస్తునే పడీపడీ నవ్వుతోంది. వెనక సీట్లోని ఓ పెద్దావిడ "ఏంటమ్మాయ్... ఏంటా నవ్వు" అని కసురుకోవటంతో ఈ లోకంలో పడినా ఉప్పెనలా వస్తున్న నవ్వుని ఆపుకోవడం ఆమె తరం కాలేదు. నవ్వుకు కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. నవ్వుని ఆపుకోవటం తరంకాక కొంగుని నోటికడ్డంపెట్టుకొని విజిటింగ్ కార్డ్‌ని పదేపదే చదివింది.

పి.అనిల్ కుమార్, ఎం.ఏ., కాటికాపరి, శ్రీ సత్యహరిశ్చంద్ర(రోటరి) స్మశానవాటిక. జగిత్యాల.

* * * *

సంధ్య పార్క్‌కెళ్లే సరికే అనిల్ సరుగుడు చెట్లమధ్య వున్న ఏనుగుబొమ్మ దగ్గర కూచున్నాడు. అనిల్‌ని చూడగానే విజిటింగ్ కార్డ్ గుర్తొచ్చి మళ్లీ నవ్వొచ్చింది. నవ్వుని ఆపుకుంటూ 'హలో మిష్టర్ కె.కె.' అంది ఎదురుగా వచ్చి.

అనిల్ ప్రశ్నార్థకంగా చూసాడు.

"అదేనండి కె.కె. అంటే మీ ఉద్యోగం... దానికో విజిటింగ్ కార్డ్" అనిల్ పక్కనేకూచుంటూ నవ్వింది. అనిల్ నవ్వుతూ చెప్పాడు.

"నా ఉద్యోగం నా నోటితో చెప్పలేక మీకోసం మాత్రమేప్రింట్‌చేయించిన ఒకేఒక్క విజిటింగ్ కార్డది."

"మొత్తానికి భలే ఉద్యోగం... ప్రపంచంలో ఇంకేది దొరకనట్టు...?"

"ఏం... నా ఉద్యోగం మీకు నచ్చలేదా? ఏది దొరకనప్పుడు అదికూడా చేయడం తప్పా?" అనిల్ మొహం కొంత వివర్ణం కావడంతో సంధ్య కూల్‌గా చెప్పింది.

"తప్పుకాదు కాని... ఎందుకో మీలాంటి వారు..."

"ఆ ఉద్యోగం చేయొద్దంటారు... నాపరిస్థితులు నన్ను ఆ ఉద్యోగంలో దింపాయి. ఆరువందల రూపాయల జీతం కోసమే... తప్పదు. దానికైనా మూడొందలు లంచమిచ్చి జాయినయ్యాను తెల్సా?..

"వ్వాట్... కాటికాపరి ఉద్యోగానికి లంచమా...?" ఆశ్చర్యంగా అంది సంధ్య.

"నువ్వింకా బ్రతుకు తెరువు కోసం బయల్దేరలేదు. అప్పుడు తెలుస్తుందిలే. మనం రోజు వెళ్లే బస్సులో కండక్టర్ కుర్రాడు ఎం.టెక్. చదివాడట. అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగానికి ముప్పయివేలు లంచం అడిగారని కండక్టర్‌గా జాయినయ్యాడు. అందుకే ఎవ్వరికీ టికెట్టివ్వకుండా లంచం కూడబెడుతున్నాట్ట..." నడుం వాలుస్తూ అన్నాడు అనిల్. తర్వాత ప్యాంట్ జేబులోని మల్లెపూల పొట్లం తీసి సంధ్య చేతిలో పెట్టాడు.

సంధ్య కళ్లు మెరిసాయి.

"ఆ దండ తమరి హస్తాలతోనే నా కురులను అలంకరిస్తే సంతసిస్తాను" అంది కళ్లు చక్రాల్ల త్రిప్పుతూ. అనిల్ లేచి సంధ్య జడలో దండగుచ్చాడు. సంధ్య సవరించుకుంది.

చప్పున ఆమె మెడ వంపులో ముద్దుపెట్టుకొని 'విష్ యూ హాపి బర్త్‌డే' అన్నాడు చెవిలో.

ఆమె ఒళ్లంతా విద్యుత్ తరంగాలు ప్రాకి... ఎక్కడె దాక్కున్న కోర్కెల తేనెతుట్టె జివ్వున లేచింది. పార్కులో జనం పల్చగా ఉన్నారు.

ఆమె చప్పున వెనుదిరిగి చటుక్కున అనిల్ చెంపమీద ముద్దెట్టుకుంది. సిగ్గుతో ముడుచుకుపోయింది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం...

కళ్లనిండా ఏదో ఉద్వేగం...

పది నిమిషాల తర్వాత 'అనిల్...' అంది సంధ్య. ఆమె స్పర్శతో అతడి గొంతెప్పుడో మూగవోయింది. 'ఊ' అన్నాడు. బలవంతంగా.

"ఏదైనా మాట్లాడు"

"ఏం మాట్లాడను?"

"పోనీ... ఏదైనా చెప్పు"

"ఏం చెప్పను?"

"ఏదైనా జోక్ చెప్పు"

"జోకా... అయితే విను. ఒకాయన రోడ్డంటా వెళ్తూంటే రోడ్డు నానుకొని వున్న ఒక సమాధి మీద కూచొని మరో వ్యక్తి విసనకర్రతో గాలి ఊపుకుంటూ కన్పించాడు. ఈయనకి విచిత్రమనిపించి "ఏమయ్యా... మరీ సమాధి మీద కూచొని గాలి విసురుకుంటున్నావ్.

భయమేయట్లేదా?" అనడిగాడు.

దానికి వాడు "మరేం చేయనయ్యా... లోపల మరీ ఉక్కపోస్తుంది" అనటంతో ఆ వ్యక్తి ఉలిక్కిపడి ఒక్కటే పరుగు..." అనిల్ చెప్పడంతోనే సంధ్య గలగలా నవ్వింది.

నవ్వుతూనే "మొత్తానికి కాటికాపరి అన్పించుకున్నావ్... మాట్లాడితే శవాలు, దయ్యాలు, దహనాలు, మరణాలు..." అంది.

అయిదు నిమిషాల వరకూ అలాగే నవ్వుతూ... సడెన్‌గా నవ్వాపి "అవునూ... మరణం మీద నీ అభిప్రాయం ఏమిటి?" అంది సీరియస్‌గా.

ఆమె అలా అడిగే సరికి అనీల్ సైతం కొంచెం గంభీరంగా అయిపోయాడు.

"మరణం... మల్లెపువ్వులాంటిది.

దానిలోని సౌరభం మనలోని మంచితనాన్ని వెదజల్లుతుంది...

అందుకే... మరణం... జననం కంటే గొప్పది!

మరణిస్తున్నానని దు:ఖంచకు... నీమరణమే మరొకరికి జీవనం..."

సంధ్య ఆలోచనగా భృకుటి ముడించింది... అతడు చెప్తున్నాడు.

"మన మరణం వల్ల ఒక కట్టెలు అమ్మేవాడి కుటుంబం గడుస్తుంది...

ఒక కాటికాపరి జీవితం గడుస్తుంది... తద్దినాలు పెట్టే బ్రాహ్మడి కుటుంబం సాగుతుంది. చిల్లర నాణేలు, మరమరాలు అమ్ముకునే వాడి జీవనం మన మరణంతోనే ముడిపడివున్నాయి. ఆకస్మిక మరణమైనపుడు అది డాక్టర్లనీ, లాయర్లనీ సైతం పోషిస్తుంది.

"మన మరణం కొందరికి జీవితాల్నిస్తున్నప్పుడు... మరణానికి ఎందుకు భయపడాలి' అందుకే మరణం... జననం కంటే గొప్పది!"

సంధ్య నిశ్చలంగా అతడివైపే చూస్తుండిపోయింది. వాళ్లిద్దరి మధ్య స్మశాన నిశ్శబ్దమే అయింది. ఆ వాతావరణాన్ని తేలిక పరుస్తూ అతడు నవ్వి "సారీ... కాటి కాపరి అనుభవంతో...' అన్నాడు.

ఆమె నవ్వింది మళ్లీ.

నవ్వుతూనే "మీరు చాలా గొప్పగా చెప్పారు. కాని నాకు నవ్వొచ్చింది ఆరాధనతో నిండిన ఇద్దరు మనుష్యులు మొదటిసారీ ప్రేమ వ్యక్తీకరించు కోవడానికి కల్సుకున్నపుడు మరణం మీద చర్చ జరగడం..." అంది.

కాటి కాపరినీ ప్రేమిస్తే అంతే మరి..." అతడు నవ్వాడు ఆమెని దగ్గరకు తీస్కుంటూ...

పరీక్షలయ్యాక వేసవి సెలవులకని ఇంటికెళ్లిన సంధ్య లెటర్ కోసం అనిల్ ఎదురుచూపులు ఎక్కువయ్యాయి. చితిమంటల మధ్య ప్రేయసి గుర్తొచ్చి అతడి నవ్వొచ్చేది.

ఓరోజు సడెన్‌గా కార్డొచ్చింది సంధ్యనించి.

"ఇక్కడ బోర్‌గా వుంది. నిన్ను చూడాలన్పించినా రాలేకపోతున్నాను. అనుక్షణం గుర్తొస్తున్నావు. ఎప్పుడో ఓసారి నీముందు ప్రత్యక్షమవుతాను" సంధ్య.

అది చదివిన అనిల్ నిరుత్సాహపడిపోయాడు. ఎన్నో పేజీలు ప్రేమగా రాస్తుందని ఎదురుచూస్తే రెండు గీతలు, అదీ హడావుడిగా మొక్కుబడిగా రాసింది. రానీ చెప్తా... అనుకుంటూనే ఆ ఉత్తరాన్ని పోస్టుమార్టం గదిమెట్ల మీద కూచోని వందసార్లు చదువుకున్నాడు.

అప్పుడే సర్రున శబ్దం చేస్తూ వచ్చి ఆ గదిముందు ఆగిందొగ జీపు.

దాని వెనకే అంబులెన్స్, ఒక అంబాసిడర్ వచ్చి ఆగాయి.

"ఇదేదో మర్డరో, ఆత్మహత్య కేసో అనుకొన్నాడు అనిల్. ఆడాళ్లరోదనలతో మరో జీపొచ్చి ఆగింది. డాక్టర్‌గారు స్కూటర్ మీదొస్తూనే పోస్ట్‌మార్టం గదిలో దూరాడు. మరునిమిషంలో ఆ ప్రదేశం ఏడ్పులు, పెడబొబ్బలు పోలీసుల హడావిడితో నిండిపోయింది. అందరిలోనూ విషాదం. ఆడోమగో కన్పించలేదు. కాని శవాన్ని మాత్రం పోస్ట్‌మార్టం గదిలోకి గబగబా తీస్కెళ్లారు. బంధువుల రోదనలు మిన్నుముట్టాయి.

అనిల్ తనపని గుర్తొచ్చి వెళ్లబోతూ... బీడీ కాలుస్తున్న జీపు డ్రైవర్‌ని అడిగాడు.

"ఏం కేసు గురూ?" అని.

"పెళ్లిష్టంలేక పెళ్లిబట్టల మీదే విషం మింగిందంట. పెద్దింటి కేసే" అన్నాడు.

"అలాగా" అనుకుంటూ వెళ్లాడు అనిల్.

శవాన్ని స్మశానం దగ్గరికి తీసుకువచ్చాడు.

స్మశానం రోదనలతో దద్దరిల్లింది.

ఆ హృదయ విదారకమైన రోదనలు వింటూంటే అనిల్‌కి జీవితంపై విరక్తిలా అనిపించింది.

రోజూ ఇలా ఈ ఉద్యోగంలో శవాలు, ఏడ్పుల మధ్యే కొనసాగితే తనూ ఓ బ్రతికున్న శవంలాగే తయారవుతాడేమో? ఈ ఉద్యోగం విడిచిపెట్టాలి అనుకున్నాడు.

ఇంతలో ఒకాయన వచ్చి "ఏమయ్యా... కట్టెలు మంచివికావా? శవం మీద సరిగా నిలవటం లేదు" అని కసురుకున్నాడు.

అనిల్ అసహనంగా చూసి "సరిగా పేర్చండి... పదండి" అంటూ వచ్చి శవం మీద కట్టెల్ని ఓ పద్ధతిలో పెట్టసాగాడు. అటూఇటూగా 'పోటుమాకు'ల్ని నిలిపాడు.

కట్టెలు పూర్తిగా కప్పబడ్డాయి. ఏడ్పులు, అరుపుల మధ్య స్మశానం చిత్తడిగా వుంది. జారిపోతున్న ఓ కట్టెని సవరించబోతూ... పారాణి దిదుకున్నా ఆ శవం ఎడంచేతి గుప్పిట మూసుకోని... ఏదో తాయిలం దాచినట్టుగా మూసుకొని వుండటం గమనించిన అనిల్ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

ఆ గుప్పిటిలో ఏదో వుంది... అన్పించింది.

కట్టెని సవరిస్తూ... ఎవరూ గమనించకుండా మెల్లిగా బిగుసుకుపోయిన ఆ గుప్పిటను విప్ప దీసాడు. ఏమీలేదు కాని... కాని చేతిమీద ఏవో అక్షరాలు... కళ్లతో చదివాడు.

"నిన్ను చూడాలన్పించి వచ్చాను- సంధ్య."

అతడి గుండె చిట్లిపోయింది... కపాలంలో నెత్తురు పొటెత్తి మెదడు నరాలు మెలితిరిగి పోయాయి... కన్నీళ్లు గొంతులో సుడిగుండాలయ్యాయి. సంధ్య మొహాన్ని చూసేంతలోగానే నిప్పంటిచారేమో...

చితిమంటలు జివ్వున లేచాయి... మంటల జెండాలై...

అందరూ వెనుదిరిగారు... ఒక్క అతడు తప్ప!! ఒక విషాదగీతం అతన్ని వెంటాడుతూనే వుంది. అతడిప్పటికీ అక్కడే వున్నాడు... కాటికాపరిగా మాత్రంకాదు.

పిచ్చివాడిగా !!!

తరతరాల్నించీ... కాలుతున్న పూలతోట

ప్రేమ !!!

ఫైనాన్స్ భూతం

పాలకడలిపై... కర్లాన్‌పరుపులా తేలుతున్న పదితలల నాగేంద్రుడి మీద ఎప్పటిలాగే స్టిల్ ఇచ్చి పడుకున్నాడు శ్రీమహావిష్ణువు. ఏనాడూ నడవని పాదాల్ని ఒత్తుతూ కూచుంది మహాసాధ్వి.

ఉత్తుంగ తరంగాలై లేచిపడే క్షీర(పాల) సముద్రం నిశ్చలంగా వుండిపోవటంతో అనుమానంవేసిన మహావిష్ణువు "దేవీ... క్షీర సముద్రం కెరటాలతో పొంగు లెత్తటం లేదేమిటి?" అనడిగాడు దర్పంగా.

దేవి మూతి మూడు వంకర్లు తిప్పి... వెనకటి సిన్మాల్లో కన్నాంబ లెవల్లో గుర్రుగా చూసింది. పెళ్లాలకు కోపమొస్తే మగాళ్ల పరేషానేందో... మహావిష్ణువుకి దశావతారాల్లో వేలసార్లు గుణపాఠమే కాబట్టి... తత్తరపాటుని కప్పిపుచ్చుకుంటూ కూల్‌గా అడిగాడు. "అదేమిటి దేవీ! పాలసముద్రంపై నీకేమైనా కోపమొచ్చిందా?" అని.

దానికి దేవి సూర్యకాంతం లెవల్లో గయ్‌న లేచి "కోపం రాదామరి? చిరంజీవి అన్నయ్య చీరెలని ఆంధ్రాలో ఈ మధ్యే ఈ చీరెలొచ్చాయి. మురిపెంగా కట్టుకుంటె మీక్షీర సముద్రం కెరటం వచ్చి తడిపేసింది. కోపమొచ్చి పాల సముద్రంలో కాస్తంత తోడు (పెరుగు) వేసాను. దాంతో మీ క్షీర సముద్రం గడ్డకట్టుకుపోయింది" అంది రోషంగా.

"హతోస్మి" అనుకున్నాడు విష్ణువు పెరుగు సముద్రం పులిస్తే కంపువాసన కొడ్తుంది అన్న భయంతో ఇంకా విష్ణులోకానికి కేబుల్ కనెక్షన్ అందలేదు కాబట్టి... ఖాళీగా కూచొని భారీగా ఆలోచించటం దేవతలకి అలవాటే కాబట్టి...

"స్వామి. కాకుల్ని కొట్టి గద్దలకు వేయటమంటే ఏంటో చూపించరూ" అంది డౌటుగా సినిమా చూపించండి అన్నంత తేలిగ్గా.

కాళ్లు పిసుకుతూ డౌట్లు అడగటం తప్ప ఆమెకు మరేంపనిలేదని మనసులో అనుకున్న విష్ణువు. మళ్లీ ఏ నరులకు మూఢిందో... పాపం" అనుకుంటూనే 'ఇదిగోదేవీ... చూపిస్తాను' అన్నాడు. రిమోట్ తన చేతిలోనే కదానన్న ధీమాతో.

అప్పుడే నారదమహర్షి గిటార్ మీటుతూ వచ్చాడు.

జి.ఆర్.వో (గాడ్ రిలేషన్ ఆఫీసర్) గా నారదుడు తెగ బిజీగా వుంటున్నాడీ మధ్య. రాగానే రాగం ఆపేసి "ప్రభూ... పాయింట్ కొస్తాను. ఆమధ్య మద్యనిషేధం వల్ల మధ్యతరగతి కొంపల్లో కొంత ధనం పేరుపోయింది. దాంతో వాళ్లకి అహం పెరిగింది. ఓ... కలర్ టీవీలు, స్కూటర్లు, ఫ్రిజ్‌లు... ఆగట్లేదు ప్రభూ... అహం పెరిగి మనకి భక్తితో కొబ్బరికాయ కొట్టేవాళ్లే కరువవుతున్నారు. చచ్చీచెడీ... ఎవడన్నా టెంకాయ కొడితే కొత్త స్కూటర్ ముందో, కలర్ టీవీ ఆన్‌చేసేముందో, కంప్యూటర్ మానిటర్ ముందో కొడుతున్నారు కాని... భక్తితో మనకి మాత్రం కొట్టట్లేదు. భూలోకంలో నెల్రోజులు మైక్రోలెవల్ సర్వే చేసి ఇది కనిపెట్టా... దీనికంతటికీ మధ్యతరగతి వాడికి పెరుగుతున్న డబ్బు ప్రభూ... డబ్బు" అని హింటిచ్చాడు.

విష్ణువు చిద్విలాసంగా నవ్వాడు.

"పిచ్చి నారదా... మధ్య తరగతివాడు ఎదిగితే మనకి పూజలు కరువవుతాయి. దానికో పరిష్కారం కనిపెట్టాను. అందుకే ఈ బుడ్డీని తీసికెళ్లి ముందు ఆంధ్రాలో విడిచిపెట్టు" అన్నాడు ఓ బుడ్డీని అందిస్తూ...

"ఇందులో ఏముంది ప్రభూ..." క్వొశ్చెన్ మార్కు ఫేసుతో అడిగాడు నారదుడు.

"అందులో ఫైనాన్స్ భూతం వుంది నారదా" చిన్నగా నవ్వుతూ అన్నాడు విష్ణువు.

ఓ ఫైన్ మార్నింగ్ నారదుడు దుర్ముహూర్తం చూసుకొని బుడ్డీని పదిలంగా తెచ్చి హైదరాబాద్ నగరంలో భూతాన్ని విడిచిపెట్టాడు. అక్కన్నించి జగిత్యాల వెళ్లమన్నాడు. పని పూర్తయ్యాక వరంగల్, నిజామాబాద్, ఆంధ్రా, రాయలసీమ ఆర్టీసీవాళ్ల సీజన్ టికెట్ తీస్కొని విచ్చలవిడిగా తిరిగిరమ్మన్నాడు. అలా ఆదేశాలు జారీ చేసి

గిటార్ మీటుకుంటూ కుచ్‌కుచ్‌హోతాహై అని కూనిరాగం తీసుకుంటూ వెళ్లిపోయాడు.

ముందు ఫైనాన్స్ భూతం రూపాయిబిళ్లల ఘల్లుఘల్లుమని శబ్దంతో డాన్స్ చేసింది. తర్వాత ఏం చేయాలో తెలీక దిక్కులు చూస్తుండిపోయింది.

పనీపాటాలేని కొందరు కనపడగానే... వాళ్ల జులాయ్ బాడీల్లోకి చొరబడింది.

క్షణాల్లో... వాళ్ల మెదళ్లు బెలూన్లలా ఉబ్బిపోయాయి.

సెంటు వాసన్లా... వాళ్ల శరీరాల్లోంచి రూపాయినోట్ల వాసన అదరగొట్టింది. చిత్ర విచిత్రమన ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

డబ్బు సంపాదించే సులువైన మార్గం స్కోప్‌లో కనపడింది.

అంతే! లక్ష్మీదేవి, సాయిబాబా, మణికంఠుడు, సూర్యచంద్రుల పేర్లమీద ఫైనాన్స్ భోర్డులు వెలిసాయి.

అందమైన బ్రోచర్లు... ఇంటింటికీ తరలివెళ్లాయి.

వాటిమీద లక్షలనగదు, లక్ష్మీబొమ్మలు, అందమైన మారుతీ కార్ల బొమ్మలు, నెక్లెస్‌లు, అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్స్... ఒక్కటేమిటీ మధ్యతరగతి బుర్రని తొలిచే పురుగులన్నీ మారువేషాల్లో బ్రోచర్లపై సాక్షత్కరించాయి. క్రమంగా ఫైనాన్స్ భూతం కొత్తవందనోటులా కరకరలాడుతూ ఒళ్లు విరుచుకొని... విజృంభించింది. దాంతో మధ్యతరగతి వాళ్ల పోపుల డబ్బాల్లోంచి, నెలజీతాల్లోంచి, పాసుబుక్కుల్లోంచి, అరువుల్లోంచి, ఆత్యాశల్లోంచి... పచ్చనోట్లు కప్పపిల్లల్లా ఎగిరెగిరి పడుతూ... ఫైనాన్స్‌ల్లోకి ఏకధాటిగా వచ్చిపడ్డాయి.

ఫలితంగా... రిజర్వ్‌బ్యాంక్ పేరు తెలినోడు సైతం... షట్టర్లు తెరిచాడు.

ఏ డిగ్రీలేని వాళ్లు... చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లయ్యారు.

సైకిల్‌లేనివాడికి... మారుతీకార్లొచ్చాయి. అద్దాల అరలు మెత్తటికార్పెట్లు... రయ్‌రయ్‌మంటూ కార్లల్లో షికార్లు. హీరోయిన్‌ని చూసి తరిస్తూ ఆ మైకంలో సినిమాలకి పెట్టుబడులు.

లక్షలకు లక్షలకు వచ్చిపడుతున్న డబ్బుతో ఏం చేయాలో తెలీక... బొంబాయి, హైదరాబాద్, బెంగుళూరులలో షేర్లు... ఇండస్ట్రీలకు అధిక వడ్డీలకు అప్పులు సినిమా రంగానికి ఫైనాన్స్‌లు... మంది డబ్బుతో ఎంత జల్సా చేయొచ్చో చూసి ఫైనాన్స్ భూతానికి కూడా మూర్ఛవచ్చింది.

పచ్చి బటానీలు అమ్ముకోవడానిక్కూడా పనికిరాని వాడు ఫైనాన్స్ చైర్మెన్ అయి సెంట్రల్ మినిష్టర్ లెవల్లో తిరుగుతుంటే.... ఉద్యోగుస్తులక్కూడా ఊసురుమంది. చేట్లో బీడీలు చుడుతూ... బ్లాక్ అండ్ వైట్ టీవీని బంగారంలా చూసే వాళ్ల మిస్సెస్సులు అపర లక్ష్మీదైవీలా అవతారమెత్తేసరికి... ఆడాళ్ల గుండెలు బడబాగ్నులైపోయాయి.

'మళ్లీ తిరిగిచ్చే నాటికి చూద్దాంలే...' అన్న లెవల్లో పేట్రేగిపోతున్న ఫైనాన్స్‌ల వ్యక్తుల్ని చూసి భూతానికి సిగ్గనిపించి... మహావిష్ణువు దగ్గరికి మళ్లీ పరిగెత్తుకొచ్చింది. అప్పటికీ అక్కడ సాయిబాబా, అయ్యప్పస్వామి, సూర్యచంద్రులు ఇంకొందరు కోపంగా వున్నారు. "మా షేర్లుపెట్టుకొని... మధ్య తరగతి వాళ్లని దోచుకోవటం భావ్యంకాదు. ఆ ఫైనాన్స్‌ల్ని కూలదోల్చండి" అంటూ మొరపెట్టుకున్నారు.

ఫైనాన్స్ భూతం "ప్రభూ... కొద్దిరోజులైతే ఇక్కడకూడా బ్రాంచీలు ఒపెన్ చేస్తారు. సాక్షాత్తు లక్ష్మీదేవితోనే డిపాజిట్లు చేయించినా ఆశ్చర్యపోకండి. వాళ్ల బుర్రలు బొర్రా గుహలంత పెద్దవి ప్రభూ... హమ్మమ్మ... పరాయి సొమ్ముతో వాళ్ల జల్సాలు చూసి నాకే దిమ్మతిరిగిపోయింది." అంది.

అంతా విని నర్మగర్భంగా నవ్వాడా విష్ణువు. సరే అని మిగతావాళ్లకి హామీ ఇచ్చి ఫైనాన్స్ భూతాన్ని మళ్లీ పొమ్మన్నాడు.

"మహాప్రభూ... నేను వెళ్లలేను. ఆపని ఇక దేవతలు, దెయ్యాలతో అయ్యేదికాదు. ముళ్లని ముళ్లతేనే తీయటం తమరికి ట్రెయినింగే కదా... మీరే థింక్ చేయండి" అంది.

విష్ణువు అయిదు నిమిషాలు ఆలోచించాడు.

ఓ పోలీసాధికారి తక్షణమే మనసులో మెదిలాడు. అతడు వస్తూ వస్తూనే ఫైనాన్స్‌ల మీదనే పడ్డాడు. కొందరి పటాటోపం చూసి ఆశ్చర్యపోయాడు. ఫలితంగా... డ్రాలు బందయ్యాయి.

మారుతీ కార్లు మాయమయ్యాయి.

షట్టర్లు మూతబడ్డాయి.

బోర్డులు తిరగబడ్డాయి.

కార్పెట్లు, కుషన్ ఛైర్లు కనుమరగయ్యాయి.

ఇంట్లో ఆడాళ్లముందు... మళ్లీ బీడీల చేటలు ప్రత్యక్షమయ్యాయి. చాలామంది రోడ్డున పడ్డారు. డిపాజిటర్ల బాధలు పడలేక హైదరాబద్, బొంబాయిలు తిరుగుతున్నారు.

వాళ్ల అవస్థల్ని పైనించి చూసిన విష్ణుభార్య "ప్రభూ... ఫైనాన్స్ భూతాన్ని పంపి మధ్య తరగతి గల్లాడబ్బాల్ని కొల్లగొట్టారు. సరేకాని... ఫైనాన్స్ పెట్టిన వాళ్లకి ఏం ఒరిగింది? ఆ డబ్బంతా షేర్లకు, ఇండస్ట్రీయలిస్టుల చేతుల్లో చేరింది కదా"

"పిచ్చిదానా... కాకుల్ని కొట్టి గద్దలకు పెట్టడమంటే ఏంటని డౌట్ అడిగాడు కదా... ఇదేనన్నమాట" అని చెప్పి ఘంటసాల గొంతుతో నీతి వాక్యం రీసౌండ్‌లో చెప్పాడు.

"కాని కష్టం చేయకుండానే ఎదిగి పోవాలకునే మనుషులు అథపాతాళానికి పోతారు. శ్రమ జీవులకి మాత్రమే శాశ్వత సుఖం లబిస్తుంది. అలా కానివారికి అండర్‌గ్రౌండే

జీవితమవుతుంది.

దేవతలు విష్ణువుపై పూలవర్షం కురిపించారు.

అంతా అయ్యాక ఫైనాన్స్‌భూతం "ప్రభూ నా తక్షణ కర్తవ్యంబేమి?" అనడిగింది. నీ అవసరం ఏ రాష్ట్రంలోనైనా రావచ్చు. అంతవరకూ ఈ బుడ్డీలో దూరు" అని ఆజ్ఞాపించాడు శ్రీ మహావిష్ణువు.

సరిగ్గా... ఆ సమయానికే విచ్చేసిన నారదుడు "ధన్యోస్మి ప్రభూ... మధ్యతరగతి వాళ్లని సరే... ఉన్నవాడి డబ్బుని సైతం కొల్లగొట్టే భూతాన్నేదైనా సృష్టించపోతున్నారా?" అనడిగాడు.

"పూర్‌నారదా... అదెప్పుడో సృష్టించాను. దాన్ని 'సైబర్ భూతం' అంటారు" అని చెప్పాడు.

"మరి దాని కేరాఫ్ అడ్రసెక్కడ స్వామీ?"

"అది ప్రస్తుతం కోలావెంకటకృష్ణమోహన్ అనే వాడి కంప్యూటర్‌లో నిద్రపోతోంది నారదా!" చిరుదరహాసంతో చెప్పాడు మహావిష్ణువు. (కథ కేవలం కల్పితం... ఎవర్నీ ఉద్దేశించి రాసింది కాదు... రచయిత)

రంగుల కల

"వాళ్ల తనని చూసి వెళ్లి మూణ్రోజులు దాటింది...

వెళ్ళగానే ఉత్తరం రాస్తామన్నారు కదా... బహుశా ఈరోజు ఉత్తరం వస్తుందేమో?" ఎంత వద్దనుకున్నా సులోచన మనసులో ఇవే ఆలోచనలు హోరెత్తుతున్నాయి. తెల్లవారు ఝామున ఐదు గంటలకి మెలకువ వచ్చిన వెంటనే... చుట్టు ముట్టిన ఆలోచనలు...

సీల్డ్ టెండరు కవర్‌లా వచ్చే అలాంటి ఉత్తరాల కోసం ఎదురుచూసి... తీరా వచ్చాక తండ్రి విప్పుతుంటే గుండెలు దడదడలాడి... అందులోని పదాలు తలుపు చాటుగా వింటే...

"అన్నీ నచ్చాయి... కాని... అమ్మాయికి రంగు తక్కువని వద్దనుకుంటున్నాము. అందుకు సరిపడా మరో రెండులక్షలు ఎక్కువ సర్దితే సంబంధం ఖాయం చేసుకుందాం..." అనే సారంశం విని... అద్దం ముందుకుల పరుగెత్తి... తన శరీరాన్ని ఆవరించిన నల్లరంగుని బాధగా... దుఖంగా... అవమానంగా... అసహ్యంగా... చూసుంకుంటూ రోధించిన రోజులెన్నో...

ఆడదాని పెళ్లికి రంగు అనేది ఎంత అడ్డంకిగా తయారవుతుందో అనుభవించిన వాళ్లకే తెలుసు...

భగవంతుడు మనిషికి రెండు రంగుల్ని ఎందుకు పులిమాడు? రక్తమాంసాల ఈ అస్థిపంజరానికి లక్షల రోగాలిచ్చింది చాలక... మళ్ళీ ఈ రంగులెందుకు?

శరీరం నల్లగా వుంటే ఏవగింపు...?

వెంట్రుకలు తెల్లబడితే ఏవగింపు???

ఎందుకీ రంగుల తారతమ్యం? ఎర్రతోలు ఏడువంకల్ని కప్పిపెడితే... నల్లరంగు నాలుగురకాల అందాల్ని తొక్కిపెడుతుందేమో? నిజానికి తనలోని అవయావాలన్నీ సక్రమంగా, పొందిగ్గా వున్నాయి. కాలేజి రోజుల్లో 'బ్లాక్ బ్యూటీ' అని కొంటెగా ఎవరైనా పిలిచిన్నప్పుడు... మనసులో ఎంత పొంగిపోయేది?

రోజూ వచ్చే చీకటిది నలుపురంగైనా ప్రేమించట్లేదా?

ఆ 'నలుపు'లోనే కదా... అసలు పునఃసృష్టి జరుగుతోంది. మరి నలుపంటే వీళ్ళకెందుకింత అసహ్యం?

"సులోచనా... పదకొండయింది... స్నానం చేయవే. బహుశా ఈ రోజు కరీంనగర్ వాళ్ళనుంచి లెటరొస్తుందేమో..." తల్లి మనసుని కూడా తొలిచేస్తున్న భావం మాటల్లో బయటికి రానే వచ్చింది.

"వెళ్తున్నానమ్మా... అయినా వాళ్ళుకూడా రంగు తక్కువనే రాస్తారేమో...." గొణుక్కున్నట్టుగా అంది.

"అబ్బాయి కూడా నలుపుగానే వున్నాడు కదే. తప్పకుండా ఒప్పుకుంటాడని నా కనిపిస్తుంది" అంది బట్టలారవేస్తూ...

"ఇద్దరం నల్లగా అవుతే... పుట్టబోయే పిల్లలుకూడా కాకిపిల్లల్లా వుంటారు. అందుకే నాకైతే ఈ సంబంధం అంతగా ఇష్టం లేదు..." కాస్త కోపంగా అంది సులోచన.

"ఎర్రటి మొగుడొచ్చినంత మాత్రాన పిల్లలకి తండ్రి రంగే వస్తుందన్న గ్యారంటీ ఏమిటే పిచ్చిదానా?" నవ్వుతూ అంది తల్లి.

"అసలు నీకు బుద్ధిలేదమ్మా... నువ్వేమో ఎర్రగా బుర్రగా బాగానే వున్నావు. నాన్నేమో నల్లగా వున్నాడు. నాన్న రంగే నాకొచ్చింది. అదే తమ్ముడికి మాత్రం నీ రంగొచ్చింది. నీ పెళ్ళప్పుడే ఎగ్రా ఉన్నాయన్ని చేసుకోవాల్సింది" అంది ఉక్రోషంగా.

"మాకాలంలో పెళ్ళికొడుకు ఎలా ఉన్నాడు? ఎ రంగులో ఉన్నాడు అనీ చూశారూ? నేను ఎర్రగా వున్నాననే మా నాన్న ఆ కాలంలో ఐదువేల కట్నానికి చేసుకున్నాడు. తముడి కలరు నీకొచ్చిన... ఇప్పటికి ఇద్దరు బిడ్డల తల్లయ్యే దానివి. మన ఖర్మ ఏం చేద్దాంగాని... స్నానంచేసి రా... అన్నం తిందాం..." అంది అనునయంగా.

సులోచన గుండె బరువైంది.

బాత్రూంలో తన శరీరాన్ని చూసుకోవాలన్న ఆసక్తే పోయింది. వయస్సు పెరిగిన కొద్దీ నలుపు ఎక్కువవుతుందే తప్ప తగ్గలేదు.... ఈ నలుపు గురించి ఎన్ని రోజులు ఆలోచించింది?

ఎన్ని క్రీములు వాండింది? చివరికి ఉండబట్టలేక స్కిన్ స్పెషలిస్టుని కలిసి అసలు రంగు ఇలా రావడానికి కారణమేంటని కూడా అడిగింది.

డాక్టర్ చెప్పాడు "మనిషి చర్మంలో మిలినోసైట్స్ అనేవి ఎక్కువగా వుంటే... ఎరుపు రంగొస్తుంది... తక్కువగా వుంటే నలుపు రంగొస్తుంది" అని అప్పట్నించీ 'భగవంతుడా... నాకు మిలినోసైట్స్ ఎందుకు తక్కువగా ఇచ్చావ్?' అనిమొరపెట్టుకునేది.

ఎరుపుగా తెల్లగా ఉన్నవాళ్ళని చూడగానే మనసు మూగవోయేది? ఒక్కోసారి జెలసి పుట్టేది.

తను మర్చిపోయినా... తన రంగుని ఎందరు గుర్తు చేసేవాళ్ళు??? బట్టల షాపులోకెళ్లి చీరెలు చూస్తుంటే... "మీది నలుపు రంగు కదమ్మా... ఈ శారీ బావుంటుంది..." అనే షాపువాడు.

లేడిస్ ఎంపోరియంలో కెళితే "మీలా రంగు తక్కువగా ఉన్న వాళ్ళకి లక్మే పౌడర్‌తో ఈ రకం బెటర్‌గా ఉంటుందండి" అనే సేల్స్ గర్ల్.

కాలేజీ లంచ్ అవర్‌లో మొహం కడుక్కుంటే... "ఎలుక లోలుపట్టి ఎడాది ఉతికినా..." అని నవ్వుతూ పాడే ప్రణీతి.

"నీ కాలికి వెండి పట్టగొలుసులు కొటొచ్చినట్టు కన్నపడుతున్నాయమ్మా" అనే పక్కిటి రాధికమ్మా.

"జోరు మీదున్నావు తుమ్మెదా... ఆ జోరెవరికోసమే తుమ్మెదా..." అని వెటకారంగా పాడే సుందరంగాడు.

ఇలా ఎందరెందరు...

ఒక్కోసారి శరీరాన్ని బ్లేడ్‌లలో తోసేసుకోవాలన్నంత దుఃఖం కలిగే మాటలు ఒక్క రంగువల్ల భరించింది.

ఇప్పుడు పెళ్ళికొచ్చేసరికి... ఇది తీవ్రమైన సమస్య అయింది.

ఈ నలుపు రంగుకి బదులు... ఆ దేవుడి నీలం రంగు వచ్చినా బావుండేదేమో? ఈ ఆలోచనల మధ్య స్నానం పూర్తి చేసి వచ్చింది.

అప్పుడు గుమ్మంలో 'పోస్టు' అన్న కేక విన్పించటంతో ఉలిక్కిపడింది. తల్లికూడా ఆ కేక విని వంటిట్లోంచి వచ్చింది. పోస్ట్‌మాన్ కవర్ చేతిలో పెట్టి వెళ్ళాడి.

"నాన్నఆగరు లేరు కదమ్మా... విప్పాలా? వద్దా?" అనడిగింది. తల్లికూడా కాసేపు సందిగ్దపడి... "నాన్న గారేమంటారు? ఏం కాదు. విప్పి చదువు" అంది.

ఆ కవర్ చించుతుంటే... భయం ఆతృత... భాద... టెన్షన్... భగవంతుడా ఏం న్యూస్ వుందో... ఒప్పుకున్నారా...

మనసునిండా అలజడి తుఫానై రేగుతుంటే... కాగితం విప్పింది. ఆ వెంటనే ఆమె

కళ్ళు 'రంగు' అనే పదం కోసం మెరుపులా జివ్వున శోధించాయి.

ఎక్కడా కన్పించలేదు.

"ఏం చూస్తావే... చదువరాదూ" తల్లి అడగడంతో ఈ లోకంలోకొచ్చిపడింది. ఉత్తరాన్ని జాగ్రత్తగా చదివింది.

పేజి తిప్పాక ఆ వాక్యం కనబడింది.

"మా అబ్బాయి నేనూ తక్కువే వున్నాను. కట్నం లేకపోయినా నాకు ఎరుపురంగు అమ్మాయే కావాలి అని గొడవ పెడుతున్నాడు. మీ అమ్మాయికూడా రంగు తక్కువని ఈ సంబంధం వద్దనుకుంటున్నాం..." అసలు విషయ్యాన్ని నిర్మొహమాటంగా, నిష్కరంగా రాసారు.

మొదట్నించీ ఊహించిందే కాబట్టి... అది చదవగానే సులోచన మునపటిలా ఫీలవలేదు.. కానీ ఆ అబ్బాయికూడా తనలాగే రంగు సమస్యని ఎదుర్కొంటున్నాడని గ్రహించింది.

తల్లి నిశబ్దంగా లేచి వెళ్లడంతో... ఉత్తరాన్ని తండ్రి వాలు కుర్చిలో పడేసింది సులోచన.

అలాంటి ఉత్తరాలు వచ్చి ప్రతిసారీ ఇంట్లోంచి శవం తరలిపోయినంత నిశ్శబ్దత... ఆ మౌనం కూడా నలుపురంగు పులుముకున్నట్టు... గంభీరమై శాసిస్తుంది...

* * * *

"మరో సంబంధం వస్తోంది... అబ్బాయి మొన్నగుళ్లో అమ్మాయిని చూసాడట... తనకి నచ్చిందని వాళ్ళ అమ్మా నాన్నలతో చూడ్డానికి వస్తున్నారు" అన్నాడు తండ్రి.

ఆ మాట విని సలోచన నివ్వెరపోయింది.

ఎన్నేళ్ళ తరువాత ఒక మంచిమాట... తను నిజంగా నచ్చిందా? నల్లగా వున్న తను నచ్చడమేంటి? ఒకవేళ కట్నం ఎక్కువిస్తారని ఆశేమో? అంతే అయివుంటుంది. ఇలాంటి కేసులు ఎన్ని వచ్చిపోలేదు... అనుకుంది నిర్లిప్తంగా.

తల్లితోకూడా అదేమాట అంది.

"ఏమోనే... నచ్చిందని చూడ్డానికొస్తున్నారు వచ్చాకగాని తెలీదు. వరకట్నం ఎంత అడిగేదీ?" అంది భయపడుతునే.

అప్రమత్తంగా ఆమె చూపులు దేవుళ్ళ పటాల మీదికి మాటి మాటికి వెళ్తున్నాయి. అనుకోకుండా... వాళ్ళ మనసులోని మాటని పసిగట్టినట్టు వచ్చి తండ్రి అన్నాడు.

"అమ్మాయి నచ్చిందన్నారు. కాని... కట్నం ఎక్కువ అడుగుతారేమో? అబ్బాయికూడా చాలా తెల్లగా అందంగా వున్నాడట. మంచి ఉద్యోగం. ఏది ఏమైనా అమ్మాయికి రంగు తక్కువని కొంత ఎక్కువ కట్నం అడిగినా అప్పొ సప్పొ చేసి పెళ్ళి చేసేస్తాను... అవసరమైతే ఇంటినికూడా అమ్మేస్తాను..." అన్నాడు గంభీరంగా.

సులోచన కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

చర్మం ఏ రంగుదైనా స్పర్శ ఒక్కటే... అన్నట్టు పాదాల దగ్గర అప్పుడే చీమ కుట్టింది. ఆ చీమని కొనగోటితో తప్పించింది కాని... దాన్ని చంపాలన్పించలేదు. ఆ సాయంత్రం... పెళ్ళి చూపులకు వాళ్లొచ్చారు... సులోచన నిండుగా తయారై కూచుంది. తలొంచినా... కనురెప్పలు పైకెత్తి అబ్బాయిని చూసింది.

నిజంగా ఎంత అందగాడు?

ముఖ్యంగా ఎంత తెల్లగా ఉన్నాడు?

అతడి పక్కన తను... కాకి ముక్కున దొండపండులా... ఛ... ఈ సామెత్తల్ని ఎవడు కనిపెట్టాడోగాని... ప్రతిదానికి గుర్తొచ్చి కత్తిలా కోస్తాయి.

అతడి తల్లి పెప్తోంది.

"మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చింది. వాడికే కదా. మాక్కూడా కట్న కానుకల ఆసక్తి లేదు. మా వాడు మీ అమ్మాయికి నచ్చితే ముహూర్తాలు పెట్టిద్దాం" అంది. ఆ మాట విని వాళ్ళకి కొంతసేపు ఏమీ అర్థం కాలేదు. తేరుకోవడానికి ఐదు నిమిషాలు పట్టింది.

ఆ తర్వాత ఆనందం, ఆశ్చర్యం కలగలిపి మంచాంగం పుటలు తెరిపించారు. పదిహేను రోజుల్లో పెళ్ళి ముహూర్తం పెట్టారు.

సులోచన సీతాకోకచిలుకే అయింది. కక్కొచ్చినా... కళ్యాణమొచ్చినా మాటమాటికీ గుర్తొస్తుంటే ఛ... వెధవ సామెత ఇలా వెంటాడుతోంది. అనుకుంది అందంగానే.

మర్నాడు చుట్టుపక్కల ఛనెల్స్ అన్నీ తెరుచుకున్నాయి.

వాళ్ళ లైవ్ కాస్టకి... ఇంటిల్లిపాది బెదిరిపోయారు.

'బొగ్గులా ఉన్న అమ్మాయిని కానీ కట్నం లేకుండా ఎందుకు చేసుకుంటారు? ఏదైనా మాయదారి రోగం ఉందేమో?"

"లేదా ఇదివరకే పెళ్ళయి ఏమైనా అయిందేమో?"

"అందం, ఆస్తి, ఉద్యోగం ఉన్న కుర్రాడు రంగులేదని ఇరవై సంబంధాలు తప్పిన అమ్మాయిని ఊరికే చేసుకోవమేంటి? ఇందులో ఏదో తిరకాసుంది."

"అదంతా పెళ్ళయ్యాక బయటపడితే... అమ్మాయి బతుకు ఘోరం" అన్నీ విన్నాక సలోచనకికూడా నిజమే అన్పించింది. అతడు తనను ఒప్పుకోవడం వెనుక మరేదైనా అంతర్యంవుందా?

మనసునిండా భయం పేరుకుపోయింది.

అతడిపట్ల ఏదో భావన... అనుమానం.. అప్పటికే పెళ్ళి ముహూర్తం దగ్గర పడింది. పెళ్ళిలో అతడు మూడుముళ్ళు వేస్తుంటే గజగజా వణికిపోయింది. గుండె చికబట్టుకొని శోభనం గదిలోకి వెళ్ళాక సులోచన అడిగిన మొదటి ప్రశ్న.

"ఇంత తెల్లగా వున్న మీరు... ఇంత నల్లగా వున్న నన్ను కట్నం లేకుండా ఎదుకు చేసుకున్నారు? నిజం చెప్పండి."

అతడు నవ్వాడు.

"పిచ్చి సులోచనా.. నువెంత అందంగా వున్నావో నువ్వే గుర్తించలేదు. ఎవరికైనా అగుపించిన వెంటనే నీలోని నలుపురంగు కనపడేసరికి... నీలోని అందాన్ని చూడలేకపోయారు. కాని నీ కళ్ళలో ఎంత కాంతివుందో తెల్సా? నీ పెద్దాల్లో ఎప్పుడూ ఆరని తడి వుంది. నీ ముక్కుపుడక మీద నాకెంత జెలసి పుట్టిందో... తెలుపు, నలుపు కాని రంగులోని నీ నడుంలోని ఎంత అందాన్ని నేనే పసిగట్టాను. అందుకే నువ్వంటే ఇష్టపడ్డాను..." అన్నాడు నవ్వి దగ్గరకు తీసుకుంటూ.

సులోచనకి పెద్ద బరువు దిగినట్టలయింది. లోకంలో ఇంత మంచి మనుషులుకూడా ఉంటారా అనుకుంది. ఆ రాత్రి తనని తాను అర్పించుకుంది.

* * * *

నాలుగు నెలల తర్వాత...

కడుపులో బిడ్డ రూపానికొస్తుందని డాక్టర్ చెప్పాక అంతా ఆనందపడితే సలోచన ఆందోళన పడింది.

కడుపు మీద భయంగా చెయ్యేసుకొని భర్తతో "ఏవండీ... పుట్టబోయే బిడ్డకి కొంపదీసి నా రంగొస్తే..." అంది బేలగా.

"నీ రంగే రావాలని కోరుకుంట్టున్నాను" అన్నాడు నవ్వుతూ భర్త.

"అదేం కాదు... మీ రంగే రావాలి. ఈరోజునుంచి నేను కొబ్బరి బండాలు, చెర్రిపండ్లు, క్యారెట్ ముక్కలు బాగా తినాలి. ఎర్రటి బాబుని కనాలి" అంది ఆశగా.

"అవేం వద్దు నీలాంటి అమ్మాయే కావాలి నాకు..."

అని భర్త పాడటంతో అతడిలోని అనురాగానికి ఆమె మురిసిపోయింది.

అత్తారింటికి దారేది...?

నీలిమ...

ఒక వెన్నెల కెరటం విరిగిపడ్డట్టు...

ఒక మంచు తుఫాను గ్రీష్మంలో పోటెత్తినట్టు...

ఆమె... నీలిమ!

వరండాలోని కేన్ కుర్చీలో కూర్చొని చూపుల్ని ఎక్కడో శూన్యంలో తగిలేసి... బరువు గుండెల్లోని బాధనంతా కనుకొనల్లోని కన్నీటి బొట్టులోకి చేర్చి... మనసు తగలబడిపోతుంటే... కుప్పకూలుతున్న దుఃఖాన్ని అనుక్షణం అక్కున చేర్చుకున్నదై... జీవితమంటే... మండే గాయాల మైలురాళ్లను దాటి గమ్యమనే శిఖరం చేరి... అదుపు తప్పి అగాధంలోకి జారిపోవటమేనా...?

ఏమిటీ జీవితం...?

జీవితమంటే ఏమిటీ?

ఆమె అంతరంగం నిండా అర్థంకాని ప్రశ్నలు???

ఆ ప్రశ్నల పరంపరలోనే 'గతం' లాగే కన్నీటిబొట్టు చెక్కిలి మీదికి జారిపోయింది.

పోనీ...పోనీ...పోతే పోనీ...

*　　　　*　　　　*　　　　*

నీలిమ పెళ్లిచూపులు ఆరోజు...

ఇంట్లో అంతా హడావిడి. ఉన్నది అమ్మా, నాన్నే అయినా వాళ్లిద్దరి హడావిడి మాత్రం అంతా ఇంతా కాదు.

నీలిమకది రెండో పెళ్లిచూపులు.

మొదటిసారి పెళ్లికొడుకుతోసహా పదిమంది వచ్చి బాగా తిని కట్నం నచ్చలేదని పోయారు. అందుకే నీలిమకి కొంత భయంగా వుంది. ఏ చిన్న అలికిడైనా కిటికీలోంచి బజార్లోకి చూస్తోంది. ఆటో చప్పుడు, జీపు చప్పుడో అయితే గుండె చప్పుళ్లు పెరిగిపోతున్నాయి.

ప్రొద్దున తొమ్మిదిన్నరనించి ఎదురుచూస్తుంటె... మధ్యాహ్నం రెండింటివరకూ ఎవరూ రాలేదు. ఇక రారని నిర్ధారించుకొని వాడిపోతున్న మల్లెపూలదండని జడలోంచి తీసి గేటుప్రక్కన పూలకుండీల్లో పడెయ్యబోతుంటే...

"రామచంద్రంగారిల్లు ఇదేనాండీ?" అన్న స్వరం విన్పించి చూసింది. జిప్సీ బ్యాగు భుజాన తగిలించుకొని, బ్లాక్ ప్యాంటు మీద రోజ్‌కలర్ షర్ట్ టక్‌చేసి నీలిమనే చూస్తు మళ్లీ అడగబోతుంటే... గేటుతీస్తూ " ఇదే... ఇంతకీ మీరెవరు?" అంది.

"నాపేరు చంద్రప్రభాకర్."

ఆమాట వింటూనే ఉలిక్కిపడింది నీలిమ. కనురెప్పలు చప్పున వాలిపోయాయి. బుగ్గలోకి మందారం జరజా పాకిపోయింది. గులాబి పెదవుల్లో సన్నని వణుకు మొదలైంది.

గిరుక్కున వెనుదిరిగి 'అమ్మా' అంటూ ఇంట్లోకి పరిగెత్తింది.

అనసూయమ్మ, రామచంద్రయ్య ఎదురొచ్చి ప్రభాకర్‌ని సాదరంగా లోనికి తీసికెళ్లారు. కాళ్లు కడుక్కొన్న తర్వాత... "మీవాళ్లెవరూ రాలేదా బాబూ?" అనడిగాడు రామచంద్రయ్య.

'రాలేదండీ. అనుకోకుండా వాళ్లకు పనిబడింది. మాటిచ్చాం గదాని నేనొక్కణ్ణే రావల్సివచ్చింది" అన్నాడు ప్రభాకర్ ఇల్లంతా కలియజూస్తూ.

ఇంతలో నీలిమ తలొంచుకొని స్వీట్స్ తెచ్చింది. ప్రభాకర్ ముందు పెడుతూనే అలవోకగా కనురెప్పలు పైకెత్తి క్షణంలో పెళ్లికొడుకు ముఖాన్ని మనసులో క్లిక్‌మన్పించి ఆ వెంటనే వాలు చూపులతో వయ్యారంగా వెనుదిరిగిపోయింది. మొహమాటపడుతూనే స్వీట్స్ తిన్నాడు ప్రభాకర్. అనసూయమ్మకు ఆ అబ్బాయి అమితంగా నచ్చాడు.

రామచంద్రయ్య తన ఇంటిగురించి, నీలిమ గుణగణాల గురించి వివరిస్తున్నాడు. ప్రభాకర్‌లో ఆలసట కన్పిస్తోంది. కిటికీలోంచి గమనిస్తోన్న నీలిమకి అతడీరోజు ఇక్కడే వుండిపోతే బావుండునన్పిచింది.

కాని అప్పటికే అతడు లేచి నిల్చున్నాడు.

"ఎల్లుండి ప్రొద్దుటే ఈ వూర్లోనే ఇంటర్వ్యూ వుందండి. నేను మళ్లీ రావాలి" అన్నాడు బ్యాగు తీస్కుంటూ వినయంగా.

"అంతదూరం నించి మళ్లీ వస్తారా? ఇంటర్వ్యూ ఎల్లుండే కదా. అప్పటివరకూ మా ఇంట్లోనే వుండండి బాబూ" అన్నాడు రామచంద్రయ్య.

"సరేనండీ. మీ ఇష్టం" అన్నాడు ప్రభాకర్ వెంటనే.

కిటికీలోంచి గమనిస్తొన్న నీలిమకు చివుక్కుమంది అడిగిన వెంటనే అతడు ఆగిపోయినందుకు.

నాన్నగారు ఆపవల్సింది కాదేమో అనకుంది. అమ్మ హడావిడిగా అతడి స్నానానికి నీళ్లు తోడడానికి వెళ్లింది. నాన్నేమో గది సర్దడానికి వెళ్లాడు. వరండాలో అతడు... పైకప్పుని, గోడకు తగిలేసిన ఫోటోల్ని, ఇల్లంతా కలియజూస్తున్నాడు.

ఆ చూపులు తనని వెదకడానికి కాదని నీలిమ గ్రహించింది. ఎందుకో మనసు మూగవోయింది.

ఒకసారి ఎదురుపడితే పలకరింపుగా నవ్వాడు కాని మాట్లాడడానికి ప్రయత్నించలేదు.

ఆరెండు రోజులూ... ఆ ఇంట్లో ప్రభాకర్‌కి రాచమర్యాదలు జరిగాయి.

అతడేమీ కోరకముందే అన్నీ సమకూర్చారు. అతడు ఒంటరిగా చదువుకుంటున్న సమయంలో నీలిమ నీళ్లగ్లాసుపెట్టి అయిదు నిమిషాలు అక్కడే నిల్చుంది అతడేమైనా మాట్లాడితే బావుండని. కానీ అతడేమీ మాట్లాడలేదు. సభ్యత కాదని తన గదిలోకి వచ్చింది.

ఇంటర్వ్యూ రోజు ఉదయాన్నే అతడికి అన్నీ అమర్చారు. అమ్మ ప్రత్యేకంగా భోజనం వడ్డించింది. నాన్న రోడ్డుదాకా సాగనంపాడు. ఇంటర్వ్యూ తర్వాత అతడు అట్నించి అటే వాళ్ల వూరెళ్లిపోయాడు.

అమ్మకి అట్లె నమ్మకం కుదిరిపోయింది ఈ పెళ్లి ఖాయమని. నాన్నయితే 'నీలిమ బావుందన్నాడు' అని రోజుకి వందసార్లు గుర్తుచేసుకున్నాడు. నీలిమ మనసులోకైతే వద్దన్నాఅతడొస్తున్నాడు.

తనలో తానే నవ్వుకోవటం... చేస్తున్న పని సగంలో మర్చిపోవటం... మరోసారి ఏదో అనుమానం... మరోసారి నమ్మకం... మనసు తూనీగలా ఎగురుతోంది. అమ్మా నాన్నల ముఖాల్లో ఏదో అద్వితీయమైన వెలుగు...

వారం గడిచింది...

రెండవ వారం...

మూడవ వారం...

నెలరోజులు గడిచాయి...

రామచంద్రయ్య పెళ్లికొడుకు వూరికి బయల్దేరబోతుంటే ప్రొద్దుటే నీలిమ ఫ్రెండ్

శైలజ వచ్చింది.

వస్తూనే నీలిమ చేతిలో పెళ్లి శుభలేఖ వుంచింది.

"ఇంత సడెన్‌గా పెళ్లేంటే.. నాకు చెప్పలేదు?" అంది ఆశ్చర్యంగా నీలిమ.

"అనుకోకుండా కుదిరింది. అరిస్టో మెడికల్ కంపెనీలో రిప్రజెంటేటివ్. రెండువారాల క్రిందటే ఉద్యోగమైందనుకో. కట్నం బాగానే పుచ్చుకుంటున్నాడు. మూడు లక్షలు..."

"ఇంతకీ ఎవరే ఆ ప్రబుద్ధుడు?" నవ్వుతూ అంది నీలిమ.

"చంద్రప్రభాకర్ అని. కరీంనగర్ సంబంధం. సరే. ఇంకా చాలా కార్డ్స్ పంచాలి. వెళ్తాను. పెళ్లికి తప్పక రండి. ఆంటీ, అంకుల్, మీరుకూడా... అంటూ వెళ్లిపోయింది శైలజ.

ఆ ఇంట్లో ముగ్గురి గుండెలు ఒక్కసారిగా ముక్కలయ్యాయి.

కనీసం లాడ్జింగ్ ఖర్చులు కూడా లేనివాడు... మెడికల్ రిప్రజెంటేటివ్ ఇంటర్వ్యూకోసం ఈ ఊరికి 'పెళ్లిచూపుల పేర' వచ్చి అతిథిగా అన్ని అవసరాలు తీర్చుకొని తమ కుటుంబాన్నే దగా చేసాడన్న నిజం వాళ్ల గుండెల్ని కుదిపేసింది.

అందరి మధ్యా స్మశాన స్తబ్దత...

అనసూయమ్మ తలుపువోరగా కూలబడింది. రామచంద్రయ్య వాలుకుర్చీలో ఒరిగిపోయాడు. నీలిమ గోడనానుకొని నిల్చుంది. ఆడపిల్ల కలలతో ఆడుకున్న వాడి రూపం గుర్తొస్తేనే ఒళ్లు జలదరిస్తోంది.

తల్లిదండ్రుల్ని చూసి గుండె కన్నీటి కడలయింది.

చెక్కిలిమీద కన్నీటి బొట్టు జారిపోయింది.

పోనీ...పోనీ...పోతేపోనీ...

* * * *

నీలిమ... ఈసారి పెళ్లిచూపులకి అన్యమనస్కంగానే కూచుంది. వచ్చినవాళ్ల పెత్తనం అంతా ఇంతాకాదు.

పెళ్లికొడుకుతోసహా ఏడుగురొచ్చారు.

"ఏడుగురొచ్చారు. బేసి సంఖ్య. ఈపెళ్లి కుదురుతుందో లేదో?" ప్రక్కింటి మీనాక్షమ్మ అనసూయమ్మతో అనుమానంగా అంది వంటింట్లో.

"ఈ సంబంధమైనా కుదరాలని వేయి దేవుళ్లకు మొక్కుతున్నాను వదినా..." అంటుండగానే... "కాబోయే ఆడబిడ్డ ఉప్మా తినదట. సేమియా అయితే తింటుందట" అని ఎవరో వచ్చి చెప్పారు అనసూయమ్మతో.

అనసూయమ్మ సేమియా వండటంలో నిమగ్నమైంది.

పెళ్లికూతురై చాపమీద కూచున్న నీలిమ నిశ్శబ్దంగా కళ్లు పైకెత్తి అబ్బాయివైపు చూసింది.

అతడూ చూసాడు. ఇద్దరి చూపులూ కలిసాయి...

ఆడపిల్లలా అతడే తడబడ్డాడు. క్షణంపాటు కలవరపడి చూపులు త్రిప్పుకున్నాడు. నీలిమ నవ్వుకుంది గుంభనంగా...

కానీ అతడు ముభావంగా వున్నాడు. గుబులు రేపుతున్న ముఖంతో తలొంచుకొని కూచున్నాడు.

పెళ్లికొడుకు తండ్రి, తల్లి, ఆడపడుచులు ఇద్దరు, పెళ్లికొడుకు అన్న, వదిన రామచంద్రయ్యతో కట్నం గురించి మాట్లాడుతున్నారు.

ఒక ఆడపడచు నీలిమని లేచి అటూ ఇటూ నడవమంది.

వాకింగ్ టెస్ట్... పూర్తయింది.

'నీపేరేంటితో మొదలై... ఏ ఏ వంటలొచ్చు' వరకు మాట్లాడింది. టాకింగ్ టెస్ట్ పూర్తిచేసారు.

లక్ష రూపాయల కట్నం కుదుర్చుకొని... మళ్లీ రావటం కుదరదు గనుక ఇరవై అయిదువేలు పోసి ఈరోజే వరపూజ' చేయమని ఆర్డరేసారు. ఇంత జరుగుతున్నా అతడు మాత్రం తలొంచుకోనే కూచున్నాడు.

పెళ్లి కుదిరినందుకు వాళ్లకు సంతోషంగానే వున్నా.. ఇప్పటికిప్పుడు ఇరవై అయిదువేలు ఎలా తేవాలి? అన్న సమస్య నిలవనీయడంలేదు. నీలిమ తన గదిలోకి వచ్చింది.

పావుగంట తర్వాత రామచంద్రయ్య పెళ్లికొడుకు తండ్రితో బ్రతిమాలుతూ చెప్పాడు. "ఇంట్లో ఇప్పుడు పదిహేనువేలకు మించి లేవు. దయచేసి వాటితోనే ఇప్పుడు సర్దుకోండి" అని. ఈమాటతో వాళ్లల్లో వాళ్లు పదినిమిషాలు సైలెంట్‌గా తర్కించుకున్నారు.

తర్వాత "సరే... త్వరగా బ్రాహ్మణ్ణి పిలిపించండి. మిగతా కట్నం పెళ్లిలో తప్పకుండా ఇవ్వాలి. పెళ్లికూడా పదిహేనురోజుల్లో జరిగిపోవాలి" అన్నాడు పెళ్లికొడుకు తండ్రి.

"పెళ్లికి ఇంకొంచెం టైమివ్వండి అన్నగారూ" అంది.అనసూయమ్మ.

"లేదమ్మా... మాపెద్దవాడికి లీవ్ దొరకదు. మా కూతుళ్లు కూడా వుండలేరు. పదిహేను రోజుల్లో అయితేనే మేం మీ అమ్మాయిని చేసుకోడానికి రెడీ" అంది పెళ్లికొడుకు తల్లి.

"అవునూ... పదహేనురోజుల్లో పెళ్లి జరగాలి" అన్నారు ఆడపడుచులు, అన్న. అబ్బాయి మాత్రం బాధగా, అసహనంగా వుండటం నీలిమ గమనించింది.

సరేనని రామచంద్రయ్య పదినిమిషాల్లో పురోహితుణ్ణి తీసుకొచ్చి పండ్లు, పూలతోసహా కావాల్సిన సరంజామా అంతా అరగంటలో రెడీ చేసారు. -

పెళ్లికొడుకు తల్లి వాడి చెవిలో ఏదో పోరుతోంది. వంటింట్లో నీలిమ తల్లితో అంది- "అమ్మా... ఏమిటే ఈ హడావిడి అంతా?" అని. అనసూయమ్మ నవ్వింది. ఆ

నవ్వులోనే కన్నీళ్లు.

"పిచ్చిదానా... కక్కొచ్చినా, కళ్యాణమొచ్చినా ఆగదంటారే... ఇదేనన్నమాట" అంది.

ఇంతలో అనసూయమ్మకి పిలుపొచ్చింది.

వరండాలో అంతా కూచున్నారు. పురోహితుడు మంత్రాలు చదువుతూ అబ్బాయి ముంజేతికి కంకణం కడుతున్నాడు. అనసూయమ్మ, రామచంద్రయ్య అబ్బాయికి కుంకుమ పెట్టారు. భుజాల మీదుగా టవల్ కప్పారు. తమలపాకులు, పోకవక్కలు, పళ్లతో సహా పదిహేనువేల రూపాయల్ని అబ్బాయి దోసిళ్లలో వుంచారు. అప్పుడు నవ్వాడతడు నిండుగా. అయినా ఏదో కలవరం. గంటసేపు నిశ్చయ తాంబూలాలు హడావిడిగా జరిగాయి.

ఆ తర్వాత ఫిబ్రవరి 15న అంటే... పధ్నాలుగు రోజులకే పెళ్లి నిర్ణయించారు. భోజనాలయ్యేసరికి చీకటిపడిందని... వచ్చినవాళ్లంతా త్వరగానే వెళ్లిపోయారు. జీపెక్కుతూ ఆ అబ్బాయి నీలిమవైపు చూసాడు. నీలిమ సిగ్గుపడింది.

వాళ్లు వెళ్లింతర్వాత... ఇసుక తుఫాను వచ్చిపోయినంత నిశ్శబ్దం!

మర్నాటి నించి...

నీలిమ కలలు కనడానిక్కూడా టైంలేనంత వేగంగా పెళ్లిపనులు జరుగుతున్నాయి. రామచంద్రయ్యకు డబ్బు సమకూరడానికే అయిదురోజులు గడిచింది. అనసూయమ్మ రెండురోజీలు బంధువుల ఇళ్లల్లో చెప్పివచ్చింది. అనసూయమ్మ పెద్దకూతురు అరుంధతి వస్తూనే తల్లిదండ్రుల్ని తిట్టిపోసింది.

"నాకు టి.బి వుందనేగా. పెళ్లి నిశ్చయానికి నన్ను పిలవలేదు. నేనంటే ఎవరికీ ప్రేమలేదు" అని ఏడుస్తూనే గొంతు పొలమారి విపరీతంగా దగ్గుతూ మెలికలు తిరగసాగింది. ఆమెని ఆపటం వాళ్లకు ఇబ్బందిగా మారింది. కొద్దిగా ఆలస్యంగా వచ్చిన ఆమె భర్త శరత్ ఆ దృశ్యం చూడగానే బ్యాగులోంచి సీసాతీసి ఏదో టానిక్ తాగించి ఛాతీపై నిమిరాడు. అరుంధతి దగ్గు కంట్రోల్ కావడానికి పదినిమిషాలు పట్టింది.

శరత్ ఆమెని పడుకోబెట్టి "పర్లేదు మామగారు. టిబి.కి తోడు తనకి హై బి.పి కూడా వస్తోంది. మీ పనులు చూస్కోండి. నాకు ఫంక్షన్ ప్యాలెస్, వంటల పని విడిచిపెట్టండి. అవన్నీ నేను చూస్తాను" అన్నాడు.

అతడి మంచితనానికి వాళ్లందరి కళ్లూ చెమర్చాయి.

"అన్నట్టు... నీలిమ ఎటో రెడీ అయిందేమిటి?" అనడిగాడు.

"వేములవాడలోవున్న వాళ్ల పెద్దమ్మని తీసుకురమ్మని నేనే పంపిస్తున్నానయ్యా" అన్నాడు రామచంద్రయ్య.

"అలాగా... అప్పుడే పెళ్లికళ కూడా వచ్చేసింది" అన్నాడు నవ్వుతూ.

"ఛీ... ఫోబావా" అంది సిగ్గుపడుతూ. బ్యాగు తీసుకొని "అమ్మా నేను వెళ్లొస్తా" అంది.

"వెళ్లిరా... జాగ్రత్తగా వెళ్లిరామ్మా" అంది తల్లి.

"నీలిమా!" అని ఆయాసంగా పిల్చింది అక్క అరుంధతి. నీలిమ దగ్గరకు రాగానే "అతడు... బావగారంతటి మంచి భర్త కావాలని వేములవాడ రాజరాజేశ్వరస్వామికి పూజలు చేసి రావే" అంది ఆయాసంతో రొప్పుతూ.

"అలాగే అక్కా... అమ్మకూడా చెప్పింది. పెళ్లయ్యాక మళ్లీ వస్తామని కూడా మొక్కమంది" అంది.

తర్వాత నీలిమ వేములవాడ వెళ్లిపోయింది.

* * * *

సాయంత్రం ఆరున్నరవుతోంది.

పల్చని చీకట్లు పదిలంగా పరుచుకుంటున్నాయి. కరెంటు కోతవల్ల వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణమంతా కొంత చీకటిగానే వుంది. ముందు శివరాత్రి వుందిగదాని భక్తుల సందడి కూడా పలచగానే వుంది.

నీలిమ వాల్ల పెద్దమ్మతో చెప్పి పూలసజ్జతో గుడికొచ్చింది. చెప్పులు బయటే విడిచి ఎడంచేత్తో చీరకుచ్చిళ్లను పైకెత్తి నిదానంగా గుడిమెట్లెక్కుతూంది.

ఆలోచనలన్నీ అతడి చుట్టే...

నిన్నటివరకూ అతడి పేరే తెల్సుకోలేదు... నిరంజన్!

పెళ్లిపత్రికల్లో చూసాకగాని... పేరు గురించిన ఆలోచనే రాలేదు. ఎంత మంచి పేరు?!

బావలాగా గొప్ప వ్యక్తిత్వముంటే చాలు...

బావలాగా అన్ని పరిస్థితుల్లోను బాగా చూస్కుంటే చాలు...

అల్లుడంటే దశమగ్రహంలా కాక... కుటుంబ సభ్యుల్లో ఒక్కడిగా వుంటే చాలు.

అన్నిటికంటే తనని ప్రేమగా చూస్కుంటే చాలు.. జీవితాన్ని అతడి పాదాలచెంత పాదరసంలా రంగరించి పోయనూ?!

అతడిది ఉన్నత మనస్తత్వమైతే చాలు...

ఆలోచనల అలల్లో కొట్టుకుపోతూనే... ఆ మసక చీకట్లో... గుడిమెట్ల మీంచి ఎవరో ఇద్దరు వ్యక్తులు వేగంగా దిగిరావటం గమనించింది...

ఒకరు చేయి ఒకరు పట్టుకొని వేగంగా దిగిరావటం గమనించింది...

ఒకరు చేయి ఒకరు పట్టుకొని వేగంగా పరిగెత్తుకొస్తున్నారు. నీలిమ ప్రక్కకి జరగేలోపే

వాళ్లిద్దరూ నీలిమను ఢీకొన్నారు. ఆ దెబ్బతో చేతిలోని పూలసజ్జ గుడిమెట్లపై జారిపోయింది.

నీలిమ తూలిపడబోయి చప్పున నిలదొక్కుకుంది. మెట్లుజారి వాళ్లూ పడిపోయేవాళ్లే. నిలదొక్కుకున్నారు. సరిగ్గా అప్పుడే వచ్చింది కరెంటు...

ఆ వెలుగులో నీలిమ వాళ్లని చూసి కొయ్యబారిపోయింది.

వాళ్ల మెడల్లో పూలదండలు...

ముఖ్యంగా... అతడు...

అతడు...

అతడు... నిరంజన్!

తన కాబోయే భర్త. కాళ్లకింది భూమి కదిలిపోతున్నట్లయింది. గుడిగంటలు గుండెను పగలగొడుతున్నాయి. అతడు కూడా నీలిమను చూసి షాక్ తిన్నాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతడు నీలిమ కాళ్లని చుట్టేసుకున్నాడు.

"నన్ను క్షమించండి. నేనీ అమ్మాయిని ప్రేమించాను. మనస్ఫూర్తిగా ప్రేమించాను. ఎక్కడికైన పారిపోవాలనుకున్నాం. కాని చేతిలో డబ్బులేదు. ఆ విషయం తెల్సి మావాళ్లు మీతో బలవంతంగా పెళ్లి చేయాలనుకున్నారు. నేను మాత్రం మేం పారిపోవడానికి డబ్బు కావాలనే తలూపాను. ఏమండీ... ఆ అమ్మాయి లేనిదే నేను బ్రతకలేను. దూరంగా పోతున్నాం. మీరు కట్నం కిందిచ్చిన పదిహేను వేలతోనే పారిపోతున్నాం. మమ్మల్ని క్షమించండి.."

అతడు ఏడుస్తూనే వేడుకుంటున్నాడు.

నీలిమకంతా అయోమయంగా వుంది. నిరంజన్ ప్రక్కనే వున్న అమ్మాయికి నీలిమెవరో అర్థమైనట్టుంది.

చప్పున దగ్గరకొచ్చింది.

"అక్కా... మావాళ్లు వస్తున్నారు. దొరికితే ఇద్దర్నీ చంపేస్తారు. మమ్మల్ని ఆశీర్వదించి పంపండి" అంది

నీలిమ వాస్తవంలోకి వచ్చేసరికి మరో నిమిషం పట్టింది. వాళ్ల మెడలోని దండలోంచి ఒక బంతిపువ్వుని చించి ఆ పూరేకుల్ని వాళ్లపై చల్లింది. గొంతు గాద్గిదమవుతుంటె "వెళ్లండి..." అంది శాసిస్తున్నట్టుగా...

వెళ్లబోతూ అతడు చెప్పాడు- "ఎక్కడున్నా మీకు ఉత్తరం రాసి క్షమాపణ కోరాలనుకున్నాను. కాని మీరే ఎదురుపడతారని అనుకోలేదు. మీరుణం తీర్చుకోలేను."

దూరంగా ఎవరో "అదిగోరా.. అక్కడ.." అని అరిచారు. వీళ్లు ఉలిక్కిపడ్డారు.

ఒకరి చేయినొకరు గట్టిగా పట్టుకొని వేగంగా కళ్యాణకట్ట కిందుగా చీకట్లోకి

కల్పిపోయారు.

గుడిమెట్లమీద నీలిమ స్థాణువులా నిల్చుండిపోయింది.

"ఒక చంద్రప్రభాకర్...

ఒక నిరంజన్...

తను ప్రేమించిన అమ్మాయితో జీవితం పంచుకోవడానికి... పారిపోయే ఖర్చుల కోసం మరో అమ్మాయి జీవితంతో చెలగాటమాడిన నిరంజన్ గుర్తొస్తూ...

మగపురుగులు గుండెను తొలుస్తున్నట్టుగా ధారాపాతమైన కన్నీళ్లు గొంతుకడ్డం పడుతుంటే...

నిస్సహాయంగా ఓ కన్నీటిబొట్టు చెక్కిలిమీదికి జారిపోయింది.

పోనీ...పోనీ...పోతేపోనీ...

*　　　　*　　　　*　　　　*

నీలిమ ఇంటికొచ్చేసరికి పెళ్లిపనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఒకరిద్దరు బంధువులు కూడా దిగారు. ఎవరి పనుల హడావిడిలో వాళ్లున్నారు. 'పెద్దమ్మ రేపొస్తుందట' అని చెప్పి నీలిమ ఆలోచిస్తూ పడుకుంది.

ఎవరికి, ఎలా, ఏం చెప్పాలో అర్థంకావట్లేదు. చెప్పే సందర్భం కూడా రావట్లేదు. సడెన్‌గా చెబితే ఎలా రియాక్ట్ అవుతారో అర్థంకావట్లేదు.

నిరంజన్‌లోని నిజాయితీ గుర్తొస్తుంది.

ఆ అమ్మాయి దీనత గుర్తొస్తుంది.

అంతలోకే తల్లి నీలిమ దగ్గరికొచ్చి అంది-

"నీలిమా... పెళ్లిబట్టలు తీస్కోవాలి. నువ్వు... తయారవుతే బజారుకెళ్దాం" అని. అదే అవకాశంగా తీస్కుంది నీలిమ.

"అమ్మా" అని పిలిచింది లాలనగా.

"ఏంటే... ఈమాత్రం ప్రయాణానికే అలసిపోయావ్' అంటూ దగ్గరికొచ్చి కూచుంది.

"అమ్మా... ఈపెళ్లి నాకిష్టంలేదు" అంది భయంగా.

తల్లి చివ్వున మంచంమీంచి లేచింది.

"ఏం మాటలే ఇవి? తలకాయ వుండే మాట్లాడుతున్నావా? నాన్నకు తెలిస్తే చీరేస్తారు" అంది కోపంగా.

"నిజమమ్మా... నేనీ పెళ్లి చేస్కోను. అస్సలు చేస్కోను. నాకీ పెళ్లి వద్దమ్మా" అంటూ తలగడలో ముఖం దాచుకొని ఏడ్వటం మొదలెట్టింది.

తల్లికిదంతా అయోమయంగా వుండి పెద్ద కూతురి చెవిలో వెయ్యడానికి వెళ్లింది.

పదినిమిషాల్లో ఇల్లు తుఫాను బీభత్సానికి ముందు ప్రశాంతతలా సడెన్‌గా నిశ్శబ్దమైపోయింది. తర్వాత చిన్నగా కలకలం మొదలైంది. ఒక్కొక్కరుగా నీలిమ గదిలోకి రావటం మొదలెట్టారు.

ప్రశ్నల పరంపరతో నీలిమను నిలువునా చీల్చారు.

పరువు ప్రతిష్టల యజ్ఞంలో నీలిమని ఆజ్యం చేసారు.

కుటుంబ విలువల మీద నీలిమను శిలువేసారు.

ఫలితంగా నీలిమ తండ్రి చేతిలో రెండుదెబ్బలు కూడా తింది. ఇంత జరిగినా ఆ ఘరానా మొసగాడు గురించి చెబితే వీళ్లు మరింత దెబ్బతింటారని సందేహించింది. తనకే తెలీని మంచికో, చెడుకో నిజాన్ని నిప్పుకణికెలా గుండెల్లోనే దాచుకుంది. కళ్లల్లో ఆవిర్లు కమ్ముకొని కనుకొసల్లోని శోకం నీటి చుక్కయి చెక్కిలి మీదికి జారిపోయింది.

పోనీ...పోనీ...పోతేపోనీ...

*　　　　*　　　　*　　　　*

రామచంద్రయ్యకి ఆ ఇంటి గడప తొక్కాలంటేనే భయంగా, అవమానంగా వుంది. అయినా దీనంగా వెళ్లి ఆ ఇంటిముందు నిల్చుని 'బాబూ... నిరంజన్' అని పిల్చాడు.

ఆ ఇంట్లో కూడా పెద్దగా పెళ్లిసందడేం కన్పించట్లేదు. రామచంద్రయ్యని చూసి ఆ ఇంట్లో వాళ్లంతా గతుక్కుమన్నారు. వాళ్ల గుండెలు గుభేలుమన్నాయి. అయినా రామచంద్రయ్యని సాదరంగా ఆహ్వానించి కూచోబెట్టారు. ఆ అప్యాయతలకు చలించిపోయిన రామచంద్రయ్య బేలగా దుఃఖాన్ని దిగమింగుకుంటూ చెప్పాడు.

"మమ్మల్ని క్షమించండి. ఈ పెళ్లికి మా అమ్మాయి ఇష్టపడటంలేదు" అని మాటలు కూడబలుక్కొని చెప్పాడు.

వాళ్లకా మాటలు అయోమయంగా అనిపించినా... ఆ తర్వాత ఆనందంగా మొహాలు విప్పారాయి. అయినా దాన్ని బయటపడనీయకుండా అబ్బాయి తండ్రి-

"మీరేం మాట్లాడుతున్నారో అర్థంగావట్లేదు. పెళ్లి క్యాన్సిల్ అవటం ఏంటి?" అనడిగాడు బోల్డంత ఆశ్చర్యంతో.

రామచంద్రయ్య గబుక్కున అతడి చేతులు పట్టుకున్నాడు.

"మమ్మల్ని మన్నించండి. మా గ్రహచారం బాగాలేక ఈ పెళ్లి క్యాన్సిల్ చేస్కుంటున్నాం. తప్పు మాదే కాబట్టి దయచేసి క్షమించండి" అన్నాడు దీనంగా.

అబ్బాయి పదిహేను వేలతో పారిపోయి, గుళ్లో మరో అమ్మాయిని పెళ్లిచేస్కొని పారిపోయి మోసం చేసాడని తెలిసే వచ్చాడేమో... ఆ డబ్బు ఇప్పుడిమ్మంటాడేమోనని ఇంటిల్లిపాది భయపడుతున్న సమయంలో రామచంద్రయ్య మాటలు వాళ్లకు కొంచెం సేపు జీర్ణం కాలేదు.

నిరంజన్ తండ్రి ఒక్కసారిగా సీరియసయిపోయాడు.

"అదేంటండీ... మేం పెళ్లిపనులన్నీ చేస్కున్నాం. మాకెంత ఇన్సల్ట్ ఇది. మీరిచ్చిన పదిహేను వేలు కూడా ఖర్చయిపోయాయి" అన్నాడు.

"పోతేపోనీయండి. ముదనష్టపు డబ్బు. మీరు నాకివ్వక్కర్లేదు. అంతా నాఖర్మనుకుంటాను. నన్ను మన్నించండి." అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

పరిస్థితి గమనించి ఇంట్లోనివాళ్లంతా రామచంద్రయ్య మీద గయ్‌మని లేచారు. "సర్లే...సర్లే... ఇంకోసారి ఇలా జీవితాల్తో ఆడుకోకండి" అని వార్నింగ్ ఇచ్చారు.

అన్నింటినీ సహనంగా భరించి వెనుదిరిగాడు రామచంద్రయ్య.

ఆయనకర్థంగాని దొక్కటే...

నీలిమ ఎందుకిలా చేసింది?

ఇంత మర్యాదగల కుటుంబం మళ్లీ దొరకదేమో...??

నీలిమ చేజేతులారా జీవితాన్ని పాడుచేసుకుందేమిటి??

ఈ ఆలోచనల్తో భుజంమీది కండువా రోడ్డుమీద పడిపోయినా అతడు గమనించలేదు.

* * * *

నెలరోజులు గడిచాయి...

ఇంట్లో మామూలు పరిస్థితి నెలకొంటూంది. నీలిమ మౌనం అందర్నీ బాధిస్తుంది. అరుంధతి క్షయ మరింత ముదురుతోంది. ఒక్కోసారి ఊపిరి తిత్తులు చిట్లిపోతున్నంతగా దగ్గుతోంది. అల్లుడు శరత్ ఓపికని చూస్తుంటే వీళ్ల గుండెలే తరుక్కుపోతున్నాయి.

ఈ పరిస్థితుల్లోనే ఆ వూరి పూజారి మరో పెళ్లిసంబంధం తెచ్చాడు నీలిమకోసం.

మళ్లీ పెళ్లిచూపులనగానే వణికిపోయింది. ఆర్థికంగా కూడా చితికిపోయిన ఆ కుటుంబాన్ని ఆదుకోడానికి... కట్నం లేకుండానే చేసుకుంటాడని పూజారి చెప్పాడు. అప్పటికే పెళ్లయి... నాలుగేళ్ల కిందటే భార్య చనిపోయి ఒక పాపతో వున్న అతడు మంచి ప్రభుత్వోద్యోగి అని కూడా చెప్పాడు.

శుభలేఖల వరకూ వచ్చిన పెళ్లి ఆగిపోవటంతో నీలిమ మీద నీలినీడలు ప్రాకుతున్నాయప్పటికే...

ఇక నీలిమకు పెళ్లికాదేమోనన్న భయంతో వున్న తల్లిదండ్రులకు ఆ సంబంధమే చల్లటి వార్తయింది.

నాల్రోజుల తర్జన భర్జనల తర్వాత... రెండో పెళ్లివాడయితేనేం? అన్న రాజీకి వచ్చారు. ఆ విషయమే నీలిమ దగ్గర కదిపారు. కన్నీటి కడలికి కట్టవేసినట్టు...

నీలిమ అవుననలేదు. కాదనలేదు...

శిలా విగ్రహంలా వుండిపోయింది...

గుండె అనుభూతిని కోల్పోయింది. శరీరం స్పర్శని కోల్పోయింది. రామచంద్రయ్య పూజారికి కబురుపెట్టి నీలిమ పెళ్లి జరిపిస్తాం అని చెప్పాడు.

అప్పుడు...

సరిగ్గా అప్పుడు... కఠిన శాసనాన్ని కదిలించాడు ఆ పూజారి.

పెళ్లికి ముందే ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకోవాలని! అదే కట్నమని తృళ్లిపడ్డారంతా! చేష్టలుడిగిపోయి విన్నారు. కాని ఆ పూజారి విడమర్చి చెబుతూ... "తనకి పిల్లలు పుడితే ఇప్పుడున్న పాపని సరిగా చూసుకోదేమోనని భయమంతే.." అన్నాడు నిదానంగా. ఆ మాటవిని నీలిమ చలించలేదు. నవ్వలేదు... ఏడ్వలేదు...

అంతా మొత్తుకున్నది అరుంధతే... అనసూయమ్మే...

చేతులారా గొడ్రాలితనాన్ని ఆపాదించొద్దని రామచంద్రయ్యని వేడుకున్నారు. కాని కూతురిపట్ల అతడికేదో కోపం... నిస్సహాయత..

"దాన్నే ఆలోచించుకోమనండి" అని చెప్పి బయటికెళ్లిపోయాడు.

మూడుముళ్లు వేయకుండానే గర్భనాళాలు ముడివేయిస్తున్న ఆ దుష్టుణ్ణి అనసూయమ్మ తిట్టిపోసింది.

సవతి తల్లి ద్వేషాగ్నులు బిడ్డపై పడొద్దని అతడి కుత్సిత నిర్ణయాన్ని అరుంధతి తూర్పారబట్టింది.

"ఇరవై ఏళ్లకే గొడ్రాల్ని చేయమన్న ఆ సంబంధం ఒప్పుకోకే నీలిమా" అంటూ ఆ ఇద్దరూ ఏడ్చారు.

కాని నీలిమ మౌనంగా వుండిపోయింది.

ఆ సాయంత్రం... అరుంధతి బాగా ఆలోచించి తండ్రి ముందు తన అభిప్రాయాన్ని చెప్పింది.

"నాన్నా... నీలిమని 'ఆయన' కిచ్చి పెళ్లి చెయ్యండి."

అందరి నెత్తిన ఛలిపిడుగు పడ్డట్టు ఆమాట..

నీలిమ సైతం నివ్వెరపోయింది. బావతో పెళ్లా? అక్కకు సవితిగా... గుండెనెవరో కెలుకుతున్నట్టుగా బాధపడింది.

"అవున్నాన్నా... నావల్ల ఆయనకు ఏ సుఖమూ లేదు. ఇక నాకు పిల్లలు పుట్టే అవకాశం కూడా లేదు. ఆయన రుణాన్ని ఇలా చెల్లెనిచ్చి అయినా తీర్చుకుందాం" అంది ఆయాసం ఎక్కువవటంతో.

వాలుకుర్చీలో కూర్చున్న రామచంద్రయ్యకు అల్లుడు శరత్ గుర్తొచ్చాడు. అతడి ఉత్తమ వ్యక్తిత్వమూ గుర్తొచ్చింది.

"పెళ్లికి ముందే ఆపరేషన్ చేసుకోమంటున్న ఎవరో అనామకుడికి దాన్ని కట్టబెట్టేబదులు నా భర్త సౌఖ్యాన్ని కోరి చెబుతున్నా నాన్నా... ఆయనికిస్తే తప్పేంటి? ఇప్పుడివ్వాలకుంటున్నది కూడా రెండో పెళ్లివాడికేగా" దగ్గు రావటంతో ఆమె చెప్పటం ఆగిపోయింది. ఈ పరిస్థితి ఏ కుటుంబంలోనూ రాదేమో...?

నీలిమ అక్కణ్ణించి లేచి వెళ్లింది.

ఆ తండ్రి గుండెల్లో కడలి ఘోష... ఆ తల్లి మనసులో కన్నీటి రొద...

రామచంద్రయ్య వాలుకుర్చీలో అలాగే కూచుండిపోయాడు. చాలాసేపు. అరగంట తర్వాత నీలిమ నిశ్శబ్దంగా వచ్చి తండ్రి ఎదురుగా నిలబడింది. బిడ్డని చూడగానే అతడికి నిలువెత్తు శోకమూర్తిలా కన్పడింది. కాఠిన్యం కరిగిపోయింది.

"ఏంటమ్మా... ఏదైనా నిర్ణయం తీస్కున్నావా?" అనడిగాడు లాలనగా. ఆమాటలో ఎన్నో అర్థాలు!!

"పూజారిగారి సంబంధం ఖాయం చేయండి నాన్నా... ఆపరేషన్‌కి నేను సిద్ధమే" అంది. ఏ రాయి అయితేనేం తల పగలగొట్టుకోడానికి అనుకుందేమో- గుండె గదుల్లో బాధల బాంబులు ప్రేలి ఎన్ని బీటలువారాయో... కంఠనాళాన్ని సైతం పెరికేసినట్టు జీరబోయిన గొంతుతో చెప్పి తన గదిలోకెళ్లింది... నిశ్శబ్దంగా!

ఆ నిశ్శబ్దం... కడలి తుఫాన్‌ని కూడా భయపెట్టే స్థాయిలోది!!

అప్పుడే 'పోస్ట్' అని కేక విన్పించి.. అందరూ ఆశ్చర్యపోయారు. మగపెళ్లివాల్లనించి ఉత్తరాలు రావటం... ఆదుర్దాగా చదివి నిరాశ చెందటం... కొద్దిరోజులుగా జరుగుతున్నదయితే... కవర్ నీలిమ పేరున రావటంతో...

"నీలిమా. లెటర్ నీకేరా..." అన్నాడు తండ్రి ఉత్తరం తీస్కుంటూ.

* * * *

నీలిమ ఆశ్చర్యపోయింది. ఈ సమయంలో ఎవరు రాసుంటారు? అని. కవరందుకొని చించగానే గుర్తుపట్టింది. అది శైలజ రైటింగని. 'పెళ్లయిన మూణ్ణెళ్లకిగాని గుర్తురాలేదు దీనికి' అనుకుంది.

ఆ వెంటనే చప్పున 'చంద్రప్రభాకర్' గుర్తొచ్చాడు.

ఒక్కక్షణం గుండెల్లో ఏదో వెలితి... ఘర్షణ... వైరాగ్యం... దేనికీ అంతుచిక్కని శూన్యం.

"చంద్రప్రభాకర్ కాబోయే భర్తగా కలలుకంది. వాడుకాస్తా దీని మొగుడై కూచున్నాడు. ఎలావుందో వీళ్ల కాపురం' అనుకుంటూ ఉత్తరాన్ని చదివింది.

"నీలీ... బాగున్నావా?

నా మాణ్ణెళ్ల కాపురం బాగానే వుంది. మాటల మధ్యలో ఈయనగారు మూడ్రోజులు

మీ ఇంట్లో గడిపి... కట్నం ఎక్కువ ఇవ్వలేరనే మీ పొజిషన్ గుర్తించి... నన్ను చేస్కున్నాట్ట... మొదటిసారి మొగుడనేవాడిమీద గౌరవంపోయింది.

ఆయన పూర్తిగా డబ్బుమనిషి.

రెండోనెలనించే మరో లక్ష తెమ్మని బుజ్జగిస్తున్నాడు. దైన్యంగా బ్రతిమాలుతున్నాడు. ఏదో ఇండస్ట్రీ పెట్టాలన్న ఆలోచన. మొన్నోసారి పడగ్గదిలో పాదాల్ని ముద్దెట్టి డబ్బడిగారు దీనంగా. ఆయన మొహం చూడలేక నాన్నగార్కి లెటర్ రాసాను. వాళ్లు అతికష్టంమీద ఇరవై వేలు పంపించారు. ఆయనకు నచ్చలేదు.

మొదటిసారిగా మావాళ్లను బండబూతులు తిట్టాడు. నేనీ ప్రాబ్లెంలో వుండగానే అనుకోకుండా నా జీవితం మరో మలుపు తిరుగుతోంది.

గోదావరిఖని నించి వంశీకుమార్ పేరుతో నాకు ప్రేమలేఖలు వస్తున్నాయి. మాపిన్ని వూరు గోదావరిఖని చాలాసార్లు వెళ్లినప్పటికీ... నాకక్కడ వంశీకుమార్ అనేవాడెవ్వడూ తెలీదు.

వెుదటి ఉత్తరం చదివి గుండె ఆగినంత వనయింది. ఎన్నో ఏళ్ల పరిచయమున్నట్టుగా... ఎన్నో సాయంత్రాలు కల్సి తిరిగినట్టుగా రాసాడువాడు. మా ఆయనలేని సమయంలో ఆ ఉత్తరం రావటంతో చించి లావెట్రీలో పడేసి నీళ్లుపోసాను.

మూడోరోజు... రెండో ఉత్తరం వచ్చింది.

ఎడమ రొమ్ముమీది పుట్టుమచ్చ మరీ మరీ గుర్తొస్తుందని రాసాడు. నేను హతాశురాలయ్యాను. బెడ్డుమీద గుడ్డెద్దు చేలోపడ్డట్టు ప్రవర్తించే నా మొగుడే ఏనాడు ఆ చిన్ని పుట్టుమచ్చని గుర్తించి వుండడనుకుంటాను.

వీడెవడు? వీడికెలా తెలుసు? దుఃఖం పొర్లుకొచ్చింది. మధ్యాహ్నం ఆయన ఇంట్లో వుండడు కాబట్టి సరిపోయింది. గ్యాస్ స్టవ్‌మీద దాన్ని తగలేసాను.

ఆయన ఇంటికి రాగానే నా గుండెల్లో దడ... తొట్రుపాటు ఎక్కువయ్యాయి. మావాళ్లు డబ్బు పంపలేదని మొహం మాడ్చుకొని వుంటున్న ఆయన నన్నెక్కడ గమనించారు గనక!

నాల్రోజుల తర్వాత... మరో ఉత్తరమొచ్చింది.

చించి చదవకుండానే దాన్ని తగులబెట్టాను. ఆ తర్వాత మరో రెండ్రోజులకు వచ్చిన ఉత్తరాన్ని కూడా చించకుండానే తగలేసాను. తీరా అది అమ్మ ఆరోగ్యం బాగాలేదని నాన్నరాసిన ఉత్తరమని ఆ తర్వాత తెల్సి... చాలాసేపు ఏడ్చాను.

ఆయన మొహంలోకి చూడాలంటేనే బెరుకు...భయం...

ఆయన ఇంటిదగ్గర వున్నరోజు ఒళ్లంతా చెమటలు పట్టి వణుకొస్తుంది. అంతటి భయంలోనే ఆరోజు సాయంత్రం ఆయన వరండాలో ఏదో చదువుతుంటె పోస్ట్‌మాన్ వచ్చి లెటరిచ్చాడు...

నా గుండెల్లో ఫిరంగులే ప్రేలాయి... అయింది... అనుకున్నంతా అయింది.

లెటర్ చదువుతూ ఆయన మొహంలో రంగులు మారాయి. వెంటనే పోస్ట్‌మాన్‌ని కేకేసి పిల్చాడు... నేను శిలాప్రతిమలా బెడ్‌రూంలోంచి గమనిస్తున్నాను...

పోస్ట్‌మాన్ రాగానే అయిదు రూపాయలు చేతిలోపెట్టి 'ఈమధ్య ఇంకేమైనా లెటర్స్ వచ్చాయా?' అనడిగాడు సౌమ్యంగా!

"అదేంటండీ... ఈ పది పదిహేను రోజుల్నించి అయిదారు ఉత్తరాలు తెచ్చిచ్చాను గదండీ" అన్నాడు.

ఆమాట విని నా శరీరం ప్రేలిపోయిందేమో? నరాలు చిట్లిపోయాయి... కళ్లు చీకట్లు కమ్మాయి...

ఇంట్లోకొచ్చి... డొక్కలో ఆయన ఈడ్చితన్నితే... కడుపులో పేగులు అల్లకల్లోలమై నెత్తురు మంచులా గడ్డకట్టి ఆగిపోయింది. గుండె పిడచకట్టి గుప్పెడు రక్తం నోట్లోకొచ్చింది.

రెండురోజులు ఆయన చేతిలో చిత్రహింసలు అనుభవించాను. ఆవెనకే... మరో ఉత్తరం వచ్చి ఆయన చేతిలో పడింది.

అది చదివి ఆయన బాగా చలించిపోయారేమో?

నిన్న నాపై చివరి అస్త్రం ఉపయోగించారు.

"మీవాళ్లని పిలిపించి... ఈ ఉత్తరాలు చూపించి నీనించి విడాకులు తీసుకోదల్చాను" అని చెప్పి మావాళ్లకు టెలిగ్రాం చేసారు.

నీలీ... మనస్సాక్షిగా చెప్తున్నాను. వంశీకుమార్ అనేవాడెవడూ నాకు తెలీదు. ఎందుకు నా జీవితాన్ని నాశనం చేస్తున్నాడో కూడా తెలీదు. నా బ్రతుకు ఏం కానుందో నాకే అర్థంకావట్లేదు.

ఎదురుగా నువ్వుంటే... నీ ఒళ్లోదూరి భోరున ఏడ్వాలనుందే... మన 'రేవతి' చెప్తుండేది గుర్తుందా?

సంసారం అనే సంస్థానంలో భార్య అనబడే బానిసగా బ్రతికేబదులు చావే నయం. పెళ్లి అనేది నా డిక్షనరీలోంచి తీసేస్తున్నాను' అనేది. అది అంతే ధైర్యంగా ఇప్పటికే ముగ్గురితో కాపురం పెట్టి వాళ్ల మనస్తత్వాలు నచ్చక వదిలేసిందట. ఎప్పుడైనా ఒంట్లో కోరిక పుడితే 'వన్‌డే లవర్' గా ఎవడికో వెళ్లి వేడి చల్లార్చుకుంటుందట. మొన్న కలిసి విపరీతంగా నవ్వుతూ చెప్పింది.

నిన్ను మరీ మరీ గుర్తుచేసింది. చదువుకునే రోజుల్లో...

'త్రివేణీ సంగమం' అని అంతా పిలిచే మన ముగ్గురి జీవితాల్లో ముందుగా నా జీవితమే కడలిలో కల్సిపోయేలా వుందే.

సెలవ్' తో

నీ... శైలజ.

కన్నీళ్లు ఎప్పుడు చేరాయో తెలీదు. చెంపలపైనించి పెదవుల మధ్య ఉప్పగా తగిలేసరికి ఈలోకంలోకొచ్చింది.

"ఎక్కణ్ణించమ్మా" ఆందోళనగా అడిగింది తల్లి.

కళ్లు తుడుచుకుంటూ 'ఫ్రెండ్‌నించిలే' అని గదిలోకెళ్లి పడుకుంది. మెదడంతా మొద్దుబారినట్లయింది. గుండె ఏదో చరణాన్ని పలవిరస్తున్నట్టు...

"రానీ... రానీ... వస్తేరానీ...

కష్టాల్ నష్టాల్ కోపాల్ శాపాల్ రానీ..."

* * * *

"నీలిమా... నీలిమా..." అన్న పిలుపుతో కళ్లు తెరిచింది. తలుపు దగ్గర శరత్. చప్పున లేచి "రండి బావా" అంది. అతడు రాకుండానే "నేవన్నిది నిజమేనా?" అనడిగాడు. ఆ అడగటంలో బాధ తప్ప కోపం, అసహ్యం కన్పించలేదు.

ఏం విన్నాడో గుర్తొచ్చి... నిమిషం తర్వాత నిశ్శబ్దంగా తలూపింది. "చదువుకున్నదానివి... నీఆలోచనలు కూడా దిగజారుతున్నాయా? పెళ్లికి ముందు ఆపరేషన్ చేసుకొమ్మన్నాడంటే ... ఛ... ఈ మనుషులు నైతికాన్ని మర్చిపోతున్నారు. నిజమే... నేను రెండ్రోజులుగా ఎక్కడికెళ్లానో తెలుసా? నాకు తెలిసిన ఒక సంబంధం వుంటె నీకోసం వెళ్లాను.

ఆ ప్రబుద్ధుడేమన్నాడో తెల్సా? మీరిచ్చే కట్నం పెళ్లిసందడికే సరిపోతుంది. నా ఉద్యోగం కోసం అరవైవేలు లంచమడుగుతున్నారు. అవసరమైతే అ అమ్మాయి నా ఉద్యోగం కోసం కిడ్నీ కూడా ఇవ్వగలగాలి. అని! వాడి పళ్లు రాలగొట్టాను. అయినా పెళ్లికోసం ఎందుకింత హైరానా పడుతున్నారు..." అన్నాడు ఆవేశంగా.

అతడి మంచి మనసుకి నీలిమ కళ్లల్లో నీళ్లు ఉబికాయి. క్షణంపాటు పరిశీలనగా చూసింది.

మూర్తిమత్వం నిండిన సంపూర్ణ మనిషి...

"బావా... మీరు నన్ను పెళ్లిచేసుకోగలరా?" చప్పున అంది ఎటో చూస్తూ.

ఆగదిలో బాలిస్టిక్ మిస్సయిల్ ప్రేలినంత సడెన్‌గా ఉలిక్కిపడ్డాడు శరత్! గొంతు తడారి మూగవోయింది. ముఖం పాలిపోయింది. అరనిమిషం అచేతనయ్యాడు.

ఎప్పుడూ సరదాగా సరసాలాడే మరదలు పిల్ల సరసమాడుతోందనుకొని ఆశ్చర్యంలోంచి తేరుకొని నవ్వాడు.

నీలిమ నవ్వలేదు. దగ్గరకొచ్చి చప్పున శరత్ చేతిలో... పెట్టి "ఇదేంటో తెల్సా బావా? తెల్లవెంట్రుక. ఎవరిదో తెల్సా? నీలిమ అనబడే వృద్ధకన్యది" అనేసి బయటికెళ్లింది.

శరత్ నివ్వెరపోయాడు. నిర్వీర్యుడయ్యాడు. నిశ్చేష్టుడయ్యాడు. అప్పటికే అరుంధతికి దగ్గుతెర విపరీతంగా రావడంతో శరత్ అటువైపు పరిగెత్తాడు. ఆపాటికి అరుంధతి కఫంతోపాటు నెత్తురు ముద్దకూడా కక్కింది.

శరత్‌ని చూడగానే "మీకెలాగూ నాతో సుఖంలేదు. మీరు నీలిమను చేస్కోండి" అంది ఆయాసంగా.

"ఛ... ఊర్కో" శరత్ కసురుకొని ఆమె మొహం తుడిచి పడుకోబెట్టాడు. అతడిలో విచిత్రమైన ఘర్షణ మొదలైంది...

అతడు మౌనంగా అయిదురోజులు గడిపాడు... పొటెత్తే ఆలోచనల మధ్య... ఆతర్వాత శరత్ భార్యతో చెప్పాడు-

"నీ ఇష్టప్రకారమే కానీయ్..."

ఆమాట ఇల్లంతా పాకి... సమస్యకి శాశ్వత పరిష్కారం దొరికినట్లయింది.

అయినా అందరి గుండెల్లోనూ... అర్థంకాని బాధ... వెలితి... అసంతృప్తి...

అన్నింటినీ అధిగమిస్తూనే... నీలిమ పెళ్లయింది!! నిరాడంబరంగా... భ జంత్రీల ఆర్భాటాలు లేకుండా! పూలవర్షంలా అక్షింతలు కూడా పడకుండా... ముత్యాల పందిరి లేకుండా... ముత్తయిదువుల సరసాల్లేకుండా... ముద్దుగుమ్మల ముచ్చట్లు వినకుండా...

నీలిమ మెళ్లో మూడుముళ్లు పడ్డాయి. నిరాడంబరంగా!!

పెళ్లయింది... కాని 'శోభన కార్యం' నెలరోజులు వాయిదాపడింది బ్రాహ్మడి పంచాంగం రీత్యా...

పెళ్లయిన వెంటనే శోభనం జరిగితే 'అరుంధతి'కి అరిష్టమట!!

* * * *

నీలిమ బయల్దేరింది శరత్‌వెంట...

అరుంధతితోపాటు!!

సామానంతా సర్దాక శరత్ ఆటో తీసుకురావడానికెళ్లాడు. నీలిమ వెళ్లిపోతుందనే దిగులు అనసూయమ్మని కుంగదీసింది.

రామచంద్రయ్య గుండె బరువుగా మూల్గింది. అరుంధతి ఆయాసంగా తండ్రి దగ్గరకొచ్చి గుంజనానుకొని నిలబడి నెమ్మదిగా అంది.

"నాన్నా... నీలిమ పెళ్లికోసం దానిపేర మూడెకరాల పొలాన్ని వుంచావు కదూ..."

"అవునమ్మా..." అన్నాడు తండ్రి భారంగా.

"ఆపొలం కాగితాలిస్తే..." అంటూ నసిగింది.

ఒక్కక్షణం ఆ ఇంట్లో అందరి గుండెలూ ఆగిపోయాయి. అనసూయమ్మ చేతిలోని

గిన్నె అసహాయంగా జారిపోయింది.

నీలిమ నివ్వెరపోయి 'అక్కా' అంటూ పరిగెత్తుకొచ్చింది...

అప్పటికే తండ్రి చెప్తున్నాడు-

"అవునమ్మా... ఆ పొలం దానిదే. ఇప్పుడు మీది. కాని ఆ పొలం మీద బ్యాంకులో కొంత అప్పు వుంది. బాగా గుర్తుచేసావమ్మా... ఇప్పుడిచ్చేవాణ్ణి కాని ఆ కాగితాలు బ్యాంకులోనే వుండిపోయాయి. నెలరోజుల్లో ఆ అప్పు తీర్చేసి పొలం కాగితాలు తెచ్చిస్తాను" అన్నాడు గద్గదంగా.

అక్కడి గంభీర వాతావరణాన్ని భంగపరుస్తూ... ఇంటిముందు ఆటో ఆగింది. శరత్ వస్తూనే...

"అరూ... ఆటో వచ్చింది. త్వరగా తెమలండీ" అంటూ బ్రీఫ్‌కేసు అందుకున్నాడు.

అరుంధతి వెళ్లి ఆటోలో కూచుంది.

నీలిమ నిమిషం పాటు తల్లిమెడవంపులో తలదాచుకొని నిశ్శబ్దంగా ఏడ్చింది. తండ్రి కాళ్లకి మొక్కివచ్చి శరత్ ప్రక్కన కూచుంది.

ఆటో కదిలిపోయింది...

కాని అప్పటికే.. అనసూయమ్మ కాలు బయటపెడితే మాటల తూటాలతో ఎక్కుపెట్టిన మిషన్‌గన్‌లలా ఎదిరుచూస్తున్నారు వాడలోని అమ్మలక్కలంతా...

* * * *

"నీలిమా... నీకు లెటరొచ్చింది. ఫ్రమ్ అడ్రస్‌లో 'రేవతి' అని వుంది" అన్నాడు శరత్. ఆమాట వింటూనే పరగెత్తుకొచ్చింది నీలిమ.

"ఇలా ఇవ్వు బావా" అంది వస్తూనే.

"ఇవ్వను. నువ్వే వచ్చి తీస్కో" అన్నాడు వరండాలోనే పరిగెత్తి. నీలిమ 'ఇవ్వు బావా' అంటూనే వెనకే పరిగెత్తుకొచ్చింది.

శరత్ మరింత పరిగెత్తాడు కవర్ అందకుండా చేతిని పైకెత్తి.

నీలిమ శరత్‌ని దొరకబట్టి కవర్‌కోసం పైకెగిరింది 'ప్లీజ్ ఇవ్వు బావా' అంది గోముగా.

"నేనడిగింది... ఇస్తేనే" నవ్వుతూ అన్నాడు శరత్.

గదిలోవున్న కారణం... శరత్ రెండురోజులుగా తనగదిలోకే రాలేదు.

బాధగా లేచి వరండాలోకి వచ్చింది.

నీలిమ కవరందుకోబోయి శరత్ చేతిలో చిక్కుకుంది. నడుంమీద పడ్డ చేయిద్వారా ఏదో విద్యుత్ తరంగాలు ప్రసరిస్తున్నట్టు.... వింతైన స్పర్శ.

"ప్లీజ్ బావా... లెటరివ్వు" అంది మరింత గారంగా.

"ఏవండీ... లెటరిచ్చేయండి" అరుంధతి చిరాగ్గా అనడంతో నీలిమను విడిచాడు శరత్.

నీలిమ లెటరందుకొని తనగదిలోకి పరిగెత్తింది.

"బ్రాహ్మడు చెప్పిందాని ప్రకారం.. కొద్దిరోజులు దానికి దూరంగా వుండండి" అంది కొంచెం కోపంగా.

"నువ్వు కాపలా కాస్తున్నావా? వెళ్లి రెస్టు తీసుకో" కొంచెం కోపంగా అనేసి వెళ్లిపోయాడు శరత్.

అరుంధతి ఆశ్చర్యంగా... ఆందోళనగా చూసిందతడివైపు.

*   *   *   *

"నీలూ...

నేను రేవతిని...

కుశలమేనా? నీ సెకండ్ హేండ్ మొగుడు బాగున్నాడా? రిపేర్లేమీ లేవు కదా!

నువ్వు రెండోపెళ్లివాణ్ణి చేస్కున్నావని తెలిసింది. మొగుడు ఏ హేండ్ వాడైనా సంసారం బాగుంటే చాలనుకునే పతివ్రతలు మీరు. మన శైలజ కూడా నీలాగే కదా! పొద్దున్నే వంటా వార్పు చేస్తున్నావా? కూరలు కుదరకపోతే 'సూప్ టొమాటో ఫ్రైడ్ జింజర్' అంటూ అర్థంకాని కొత్తపేర్లు పెట్టేయ్. ఇదేదో కొత్త వంటకమని ఇష్టంగా తింటారు మగాళ్లు.

నేనీమధ్య కోర్టుకెళ్తున్నాను. గతంలో పరిచయమున్నవాడొకడు నాకిష్టంలేకుండానే నన్ననుభవించేశాడు. వాడిమీద చిర్రెత్తి రేప్‌కేస్ పెట్టాను.

కోర్టులో నల్లగబ్బిలాలు రెక్కలల్లార్చుకొంటూ వాడిపక్షాన బలంగా వాదిస్తున్నాయి. నా 'శీలం' గురించి వాదనలు వాయిదాల పద్ధతిలో జరుగుతున్నాయి. నీలూ... ఆడదానికి శీలమంటే ఏమిటే?

కన్నెపొర చిరిగిపోవటమేనా?

పచ్చిగా రాస్తున్నాననుకోకు! అదేగనక అయితే... తొమ్మిదో తరగతిలో స్కూల్లో రాజేష్‌గాడితో కబడ్డీ ఆడుతుంటే 'డెత్‌లైన్' తొక్కకుండా వాడు కాలుపట్టి లాగినప్పుడే... శీలం పోయిందనుకుంటాను.

కోర్టులో ఆడదాని శీలం మీద వాదనలు వింటుంటే... 'నైనాసాహ్ని' తందూరి పొయ్యిలో హాయిగా ప్రాణం విడిచివుండాలి. అంతకంటే దారుణం..

మర్మస్థానం కాదది... నీ జన్మస్థానం... మానవత్వం ఉద్భవించే పుణ్యక్షేత్రం... అన్న మహనీయుని పాదాల్ని కన్నీళ్లతో కడగాలన్పిస్తుంది. రేప్ జరిగిందంటే నన్ను డాక్టర్లు (ఆ పుణ్యక్షేత్రాన్ని) పరీక్ష చేసారు.

మరి వాణ్ణెందుకు పరీక్షలు చేయలేదు??

ఆ కన్నెపొరను మొగుడనే మగపురుగు తొలిచినప్పుడే మనం పతివ్రతలుగా సర్టిఫై చేయబడతామా? నా పక్షాన లాయర్ ఎవరూ లేరు. అనుమతితో నేనే వాదిస్తున్నాను.

నా శీలం ఖరీదు అయిదు వందలని ఆ మగజడ్జిగారు భావించి... జరమానాగా వాడికి విధిస్తూ...

"చివరగా నువ్వేమైనా చెప్పుకుంటావామ్మా..." అనడిగారు నన్ను.

"వాడి అంగాన్నికోసి నాకు ప్రెజెంట్ చేయండి యువరానర్" అని అరిచాను. ఆ మగజడ్జికి సింహాసనం మీదే గుండెపోటొచ్చింది.

"అయిదు వందలు మధ్యలో వాడు మీ కోర్టుకెందుకివ్వాలి. రేప్ చేయబడ్డదాన్ని నేను. ఆ డబ్బు నాకివ్వాలి" అని ఆక్రోశిస్తే కోర్టులో వకీళ్లతోసహా జనమంతా జురాసిక్ పార్క్‌లో రాకాసిబల్లిని చూసినంత విచిత్రంగా నన్ను చూసారు. ఐ డోంట్‌కేర్...

ముసుగేసుకొని బ్రతకటం నాకు చేతగాదు...

వాడు కోర్టు బయట దర్జాగా పళ్లికిలించి నవ్వితే... ఆవేశంగా ఛాలెంజ్ చేసాను.

'రేయ్... అవకాశం దొరికినరోజు నీ అంగాన్ని తెగ్గోసి అక్వేరియంలో అందమైన చేపలా నా ఇంటి వరండాలోని గాజుతొట్టెలో భద్రంగా పదిలపరుస్తాను. ఇట్స్ మై ఛాలెంజ్'

దానికే బెదిరిపోయాడు వాడు.

శైలజా, నువ్వూ, నేనూ... గంగ, యమున, సరస్వతిల్లాంటి 'త్రివేణి సంగమం' అనే 'నిక్‌నేమ్' తో పిలువబడ్డ మనలో... గంగానదిలాగా పూర్తి మురికి కూపంలోకి కూరుకుపోయింది నేనే కదూ! నా బాధ నాలోనే వుండనీ...

నా మనస్సాక్షిగా నేను పవిత్రురాలిని. సరే... ఇది చెప్పడానికి లెటర్ రాయలేదు. సెకంహాండ్ మొగుడితో నువ్వేం కొరడా దెబ్బలు తింటున్నావేమోనన్న బాధతో రాస్తున్నాను. రక్తం ద్రవపదార్థం కానట్టే... కన్నీళ్లు నీళ్లుకావు. నిప్పులు అని గుర్తుంచుకో! పురుషాధిక్యతతో ఇంతగా భయపడుతున్న మనం... ముడులు విప్పడం నేర్చుకుంటే మగాడి జీవితంలో గొప్పేంలేదు.

వాడికి మనం కూర్చితేనే... శృతి.

వాడికి మనం పేర్చితేనే...చితి.

ఈ 'తెగింపు' మీదే శైలజకి కూడా లెటర్ రాసాను. సెలవా మరి?

నీ రేవతి"

నీలిమ ఉత్తరం చదివి భారంగా నిట్టూర్చింది.

రేవతి ఎంతగా ... ఏమనాలి?

చెడిపోయిందా?

దిగజారిపోయిందా??

స్వేచ్ఛ పేరుతో తెగిన గాలిపటమయిందా??

పురుష ప్రపంచంతో పోరాడుతోందా???

ఏమనుకోవాలి? అర్థంకాని ప్రశ్నలు ఉక్కిరి బిక్కిరి చేసాయి ఆ రోజంతా!

*   *   *   *

"అరూ... ఇంట్లోనే వున్నావా?" అంటూ వచ్చింది సరోజిని ప్రక్కింటావిడ.

"రా అక్కా... ఇంట్లోనే వున్నాను" అంటూ నవ్వింది అరుంధతి. జీవంలేని నవ్వది.

"రెండురోజులుగా నీ దగ్గు విన్పించకపోతేనూ... నువ్వు ఇంట్లో లేవనుకున్నాను."

"కంచికచర్ల స్వామిచ్చిన చెట్లమందులు వాడుతున్నానక్కా... అదేంటో దగ్గు ఎక్కువగా రావట్లేదు. రిలీఫ్‌గా కూడావుంది" అంది ఆనందంగా.

సరోజిని కిందినించి పైదాకా అరుంధతిని చూసి ఆశ్యర్యాలు పోతూ...

"నిజమేనే అరుంధతి... నీ శరీరంలో కూడా మార్పు కన్పడుతోంది. నువ్ సంపూర్ణ ఆరోగ్యవంతురాలివి కావాలనే కదా నేకోరేది. అన్నట్టూ... నీలిమేది?" అనడిగింది.

"గదిలో చదువుకుంటుందక్కా"

"ఆహ... మీ ఆయన ఉద్యోగం ఇప్పించబోతున్నాట్ట కదా... వాళ్లిద్దరూ స్కూటర్ మీద జామ్మని వెళ్లిపోతే... నిన్నెవరు చూస్తారే, ఎవరూలేని టైంలో విపరీతంగా దగ్గొస్తే ఇంకేమైనా వుందా?" అంది సరోజిని గుసగుసగా.

"నీలిమకు ఉద్యోగమా? ఆయన నాతో మాట మాత్రమైనా చెప్పలేదు" స్వగతంగానే ఆందోళనగా అంది అరుంధతి.

"ఇంకా నీతో ఏం పని? రోజంతా నవ్వులు, ఇకఇకలు, పకపకలే వినొస్తున్నాయనుకో. ఏమైనా అరూ... మీ చెల్లెని అంటగట్టి నువ్వు పెద్ద తప్పు చేసావే. ఎంతైనా మగాడు. దాని మోజులోపడి రోజురోజుకీ నీమీద చిరాకులు పరాకులు చూపడా? నువ్వే చూస్తుండు" అంది సరోజిని హెచ్చరికగా.

ఈవారం రోజులుగా ఇంట్లో అడుగుపెడుతూనే అరూ అనిగాక నీలూ అంటూ శరత్ రావటం గుర్తొచ్చింది.

రెండుమూడురోజుల్నుంచి గదిలోకి రాకపోవటం కూడా గుర్తొచ్చింది.

"ఏదైనా మొదట్లోనే సర్దాలి. పాకం గట్టిపడ్డాక విడదీయటం మన తరమా? అయినా నాకేంటిలే. వెళ్లొస్తానే అరూ..." అంటూ వెళ్లింది.

అరుంధతి ఆలోచనల్లో పడింది...

ఎమ్టీ మైండ్ ఈజ్ డెవిల్స్ వర్క్‌షాప్ అన్నట్టుగా ఏలో ఆలోచనలు అరుంధతి మెదడుని తొలచటం ప్రారంభమైంది.

నీలిమని శరత్‌కిస్తే తనకిష్టమైన మూడెకరాల పొలం కూడా తనదవుతుందని ఆశపడింది కాని శరత్ దూరమైతే తను భరించగలదా? రోజంతా చెదపురుగుల్లాంటి ఆలోచనలు... సరోజని మర్నాడు చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఇంకా శోభనం కాలేదుగదా! అదే అయితే గాలికూడా వాళ్లమధ్య చొచ్చేటట్టులేదు. ఇక నువ్వంతే అరూ?"

"ఏదైనా మొదటే చెయ్యాలి. అంత్యనిష్ఠూరం కన్నా ఆదినిష్ఠూరం మేలని ఎందుకన్నారు. రేపు నీకే తెలిసొస్తుందిలే..."

"ఏంటే అరూ... శోభనం కాకముందే చిలకా గోరింకలయ్యారు. రేపు వాళ్లకు పిల్లలు పుడితే నిన్నింక మందలించేవాళ్లు కూడా వుండరేమో?"

సరోజిని మాటాలు క్రమంగా అరుంధతి మనసులో భయాన్ని లోడ్ చెయ్యటం ప్రారంభించాయి.

ఇక శరత్ తనకి దూరమవుతాడా? అన్న వన్వే ఆలోచనల్లోనే అరుంధతి వుండిపోవటం మొదలెట్టింది. తన ఆలోచనకి బలాన్ని చేకూర్చే సంఘటన కూడా ఆ రోజు అనుకోకుండా జరిగింది.

పోస్ట్‌లో వచ్చిన పొలం కాగితాల్ని చూసి శరత్ ఆశ్చర్యపోయాడు. మామగారు రిజిష్టర్డ్ పోస్టులో కాగితాలు తనకు పంపటమేమిటో అర్థంగాక నీలిమనడిగాడు.

నీలిమ విషయం చెప్పగానా కోపంగా ఆ కాగితాన్ని తీసికెళ్లి అరుంధతి ముఖం మీద కొట్టాడు.

"అరూ... బుద్ధుందా నీకసలు? ఈ స్వార్థంతోనా నీలిమని నాకు అంటగట్టింది. అంటే సొంత చెల్లెలిమీద ప్రేమకాదన్నమాట. రోగంతో చచ్చేదానివి నీకింకా భూముల మీద ప్రేమెందుకు? నాకీ విషయం ముందే ఎందుకు చెప్పలేదు? అసలే నీలిమ మనసు గాయపడి వుంది..."

అనేసి "నీలిమా...తొందరగా వచ్చేయ్" అని కోపంగా పిలిచాడు.

"ఎక్కడికి బావా?" అని నీలిమ ప్రశ్నించినా విన్పించుకోకుండా "ముందు స్కూటరెక్కు" అని నీలిమని స్కూటర్ మీద ఎక్కించుకొని వెళ్లిపోయాడు.

స్కూటర్ వీధి మలుపు తిరగ్గానే సరోజిని అడుగుపెట్టింది. "హు... పెళ్లయి ఇరవై రోజులు కూడా కాలేదు. నరకం మొదలైందన్నమాట. ఏమే అరూ... నే చెప్పానా? లేదా?"

అంటూ వచ్చింది.

ఎన్నడూ అంతగా శరత్ కోపాన్ని చూడని అరుంధతి "అక్కా..." అంటూ సరోజిన్ని పట్టుకొని బావురుమంది. ఆ ఏడ్పులోనే ఊపిరితిత్తుల్ని పిసికినట్టు దగ్గుతూ మెలికలు తిరిగింది.

ఓదార్చుతూనే నూరిపోసింది సరోజిని.

"ఇంతకీ పెళ్లికాని తనని అక్క త్యాగం చేసి బావకిచ్చింది అని మీ చెల్లికైనా బుద్ధుండొద్దూ. మొగుడు పిలవగానే తగుదునమ్మా అని స్కూటర్ మీద ఎలా వెళ్లిందో చూసావా? ఇంకా పట్టుమని పదిరోజులు కూడా లేదు శోభనం. అది కాస్తా అయితే పదకొండోరోజున నిన్నీ ఇంట్లో వుంచుతారో లేదో... రోగిష్టిదని తరిమి కొడతారేమోనని వాడంతా బెంగెట్టుకుంది.

"అయినా అరూ... నీ గొంతు నువ్వే కోసుకున్నావ్. ఇప్పుడేడ్చి ఏం లాభం?" అంది టానిక్ స్పూన్‌లో పోసి అందిస్తూ...

అరుంధతిలో ఆయాసం తగ్గింది. దగ్గుతోబాటు నోట్లోంచి పిసరంత రక్తం పడింది.

"నేనిప్పుడు లేకపోతే నీ గతేమయ్యేదే అరూ... సమయానికి మందిచ్చే మొగుణ్ణి చెల్లెలికిచ్చావ్. ఇప్పుడిమ్మంటే ఆవిడ తిరిగిస్తుందా... ఆయన నీవైపు తిరిగొస్తాడా... అయినా నాకెందుకులే. వెళ్తానే అరూ..." అంటూ వెళ్లింది. నిప్పు రాజుకుంటుందని సరోజినికి తెల్సు.

కొందరి గుండెలెప్పుడూ మండుతుంటాయి. ఆ మంట మరో గుండెకు అంటిస్తేతప్ప వీళ్ల మంట చల్లారదు. అది వాళ్ల మనస్తత్వం. సరోజినిదీ అంతే!!

సరోజిని వెళ్లాక ఆ ఇంట్లో అరుంధతి ఒంటరిదైపోయింది.

"శోభనమయ్యాక రోగిష్టిదని నిన్ను తరిమి కొడతారేమో?" సరోజిని మాటకు అరుంధతి మనసు బలహీనపడుతోంది. పదే పదే ఆ మాట గుర్తొస్తోంది.

మొన్న అశ్రద్ధ...

నిన్న నిర్లక్ష్యం...

ఈరోజు చిరాకు...

రేపు కోపం...

ఎల్లుండి ద్వేషం...

ఆ తర్వాత...???

నిజమే... సరోజిని మాటల్లో నిజముంది అనుకుంది. అసహాయత నిండిన గుండెలో నీలిమ పట్ల అనాలోచితంగా అగ్ని రగుల్కొంది...

అక్కా అని పిలిస్తేనే అసహ్యంగా చూడటం మొదలెట్టింది. తల్లిల లాంటి అక్కలో

సడెన్‌గా మొదలైన ఈ మార్పుకు నీలిమ నివ్వెరపోయినా... ఏదో చిరుకోపం అనుకుంది.

అలా నాల్రోజులు గడిచాయి.

ఈలోగా సరోజిని రెండుసార్లొచ్చింది. గత రెండురోజుల్నించి శరత్ కూడా దిగులుగా వుండటం చూసి నీలిమ అడిగింది.

"ఏంటి బావా... రెండురోజుల్నుంచి అప్సట్‌గా కన్పడుతున్నారు? నావల్ల ఏదైనా ప్రాబ్లెమా?" అనడిగింది.

శరత్ మౌనంగా వుండిపోయాడు.

"చెప్పు బావా... ప్లీజ్... చెప్పవూ?" అంది లాలనగా. శరత్ తల పంకించాడు.

"ఎలా చెప్పాలో నాకర్థం కావట్లేదు. మీ అక్కయ్య గురించే. నిన్న డాక్టర్స్ తన స్పూటమ్ టెస్ట్ రిపోర్ట్స్ ఇచ్చారు. మైకో బాక్టీరియం ట్యుపర్క్యులై... కఫంతోపాటు బ్లడ్ కూడా పడుతుంది కదా... డిసీజ్ క్రానికల్ స్టేజికొచ్చింది.. అదీ కంటామినేటెడ్ డిసీజ్ గనక ఇక అరుంధతిని టి.బి హాస్పిటల్లో వుంచడమే మంచిదంటున్నారు. ఈ విషయం అరుంధతికి చెప్పడానికి రెండురోజులుగా మధనపడుతున్నాను. తననిక హాస్పిటల్‌లోనే వుంచెయ్యడానికి మనసొప్పటం లేదు..." మాటలు కూడగట్టుకొని బాధగా చెప్పాడు శరత్.

నీలిమ మనసు ఇసుక తుఫానే అయ్యింది.

"వద్దు బావా... అక్కని హాస్పిటల్లో పడెయ్యొద్దు. అది తట్టుకోలేదు. టీబీ అంటురోగమైనా కాకపోయినా దానికి సేవలు చేయడానికి నేను సిద్ధమే బావా. కాకపోతే దాని బెడ్‌ని ఆ చివరి గదిలోకి మారుద్దాం" అంది బాధగా.

"సరే...నీ ఇష్టం" అన్నాడు శరత్.

* * * *

"అరూ... నీ బెడ్‌ని ఆ గదిలో మారుద్దాం. కొంచెం దూరంగా వుండాలని డాక్టర్స్ చెప్పారు. అందుకని..." బరువుగా చెప్పాడు శరత్.

"అవునక్కా... ఆ గది నీట్‌గా సర్దాను. విశాలంగా కూడా వుంది" అంది నీలిమ. అరుంధతి చిక్కిపోయిన మొహంతో నిర్వికారంగా చూసింది వాళ్లవైపు.

గుండెల్లోంచి దుఃఖం ఎగదన్నుకొస్తుంటే... హిస్టీరియా వచ్చినదాన్ల కీచ్‌చ్‌మని అరుస్తూ టానిక్ సీసాని నీలిమ వైపు బలంగా విసిరింది.

ఆ సీసా గోడకి తాకి భళ్లున బ్రద్దలయింది.

ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు. ఆమె ఎందుకలా ప్రవర్తించిందో అర్థం కాలేదు. ఆ తర్వాత బేలగా ఏడుస్తున్న అరుంధతిని... విశాలమైన గదిలోకి మార్చారు.

మార్చిన మర్నాడే సరోజిని పనిగట్టుకొని వచ్చింది. వస్తూనే "అయిందీ... నేను అన్నంత

పనీ జరిగిందీ... అరూ... నిన్నీ స్టోర్ రూంలో పడెయ్యడానికి వాల్లకు మనసెలా ఒప్పిందే? ఇవ్వాళ స్టోర్ రూంలో .... రేపు పెరట్లో... అయ్యో తల్లీ. చెల్లిని మొగుడి కంటగట్టి నాశనం చేస్కున్నావ్ గదే''' అని కంటతడి పెట్టింది.

అరుంధతి చలించిపోయింది...

"అయినా ఏరి వాళ్లు... నా పిచ్చిగాని ఎల్లుండే శోభనం పెట్టుకొని విడిపోయుంటారా. ఎవరైనా, ఒకళ్లమీది ఒకళ్లకు ఎంత ప్రేమ పొంగుకొస్తుండాలి?" అంది ఇల్లంతా కళ్లతోనే గాలించి.

"ఏం చేయనక్కా..." బాధగా గోడకి చేరగిలబడుతూ నిట్టూర్చింది అరుంధతి.

"ఏం చేయడమేంటే పిచ్చిదానా... అలా అనుకుంటూనే ఇంతదూరం తెచ్చావ్. నిన్ను శాశ్వతంగా టిబి హాస్పటల్లో పడేసే ఆలోచనల్లో వుంది నీ చెల్లెలు. మా ఆయన చెప్పాడులే! దానిదంతా చెల్లెలి ప్రేమ కాదు. సవతి ప్రేమ... నువ్వు ఇంకా దాన్ని వదిలించుకోకపోతే నీది అధోగతే..."

చివరి మాటకి ఉలిక్కిపడి అరుంధతి "ఎలా వదిలించుకోవాలి?" అంది ఆందోళనగా.

"అదే... ఎలాగా?" అరుంధతి కళ్లలో పైశాచికత్వం కదలాడింది.

"ఎన్ని మార్గాల్లేవూ... పాలల్లో విషమిచ్చేయ్" గుసగుసగా చెప్పి భయంగా లేచిపోయింది సరోజిని.

అరుంధతిలో క్రూరత్వం క్రమంగా రూపుదిద్దుకొంది.

సాయంత్రం కాగానే...

ముస్తాబవుతున్న నీలిమ దగ్గరికొచ్చింది అరుంధతి ఆయాసంగా. నీలిమ కంగారుగా "అదేంటక్కా... పాలు త్రాగలేదేంటి?" అంటూ వచ్చింది.

"నాకొద్దే నీలిమా. ఆయాసంగా వుంది. నువ్వే త్రాగు" అని అందించింది.

సర్లే అని గ్లాసు తీసుకొని టేబిల్‌పై పెట్టి... అద్దం ముందు పూర్తి జడ వేసుకోవడంలో నిమగ్నమైంది.

అరుంధతి గుండెదడ పెరుగుతుంటే తన గదిలోకొచ్చింది.

అప్పుడు జరిగింది... ఆసంఘటన.

శరత్ వస్తూనే నీలిమని వెనకనించి ఒడిసి పట్టుకొని ముద్దెట్టుకున్నాడు. నీలిమ విసురుగా త్రోసెయ్యగానే టేబిల్‌పై ఒరిగిపోతూ...

"ఈ పాలేంటి? ఎల్లుండి శోభనం కోసం ఇప్పట్నుంచే రిహార్సల్స్ చేస్తున్నావా? ఒ.కే. థాంక్యూ..." అనేసి గటగటా త్రాగాడు. నీలిమ నవ్వుతోంది.

ఆ దృశ్యం చూసిన అరుంధతి "ఏవండీ..." అని అరిచింది.

కంఠనాళాలు తెగిపోయాయి...

ఊపిరితిత్తులు చిట్లిపోయాయి...

గుండె పగిలి గుప్పెడు రక్తం నోట్లోకొచ్చింది. రక్తచలనం నిశ్చలమైతే నరాలు కుంచించుకుపోయి... తలుపు దగ్గరే కుప్పకూలిపోయింది.

నీలిమ ఆందోళనగా పరిగెత్తింది... అక్కా అంటూ...

శరత్ తూలిపడ్డాడు... కళ్లు బైర్లుకమ్ముతుంటే ఏమైందంటూ వచ్చాడు. అప్పటికే అరుంధతి శవం మీద పడి నీలిమ బావురుమంది.

"ఏమండీ... ఇటు చూడండి" అని రోదిస్తూ శరత్‌ని చూడగానే జీవం చచ్చిపోతున్న జవసత్వాలతో అచేతనంగా అరుంధతి మీద ఒరిగిపోయాడు శరత్.

కట్టలు తెంచుకున్న దుఃఖం ఒక్కసారిగా గొంతులో గడ్డకట్టినట్టు... నోరు తెరిచి పిచ్చిగా చూస్తుండిపోయింది నీలిమ.

ఇద్దరూ... అచేతనంగా...

శరీరం స్పర్శ కోల్పోయి... మెదడు మొద్దుబారి నిర్వకారంగా చూస్తుండిపోయింది. ఓ కన్నీటి చుక్క చెంపమీంచి జారిపోయింది. పోనీ... పోనీ... పోతేపోనీ...

అప్పుడేడ్చింది... వేయి గొంతుకల రోదనతో గుండెను చిదివేసినంత బలంగా...

వాడంతా కలకలంగా...

నీలిమ జీవితం అల్లకల్లోలంగా...

* * * *

నీలిమను చూసి ఆ తల్లిదండ్రుల మనసు తరుక్కుపోయింది.

కళ్లనిండా మౌనం... గొంతునిండా మౌనం... గుండెనిండా మౌనం. ముందూ వెనకా... మౌనం మౌనం! శోకమూర్తి ప్రతిమలా వున్న నీలిమని చూసి పూజారిగారు కూడా కంటతడి పెట్టారు.

"నేను చూపించిన సంబంధం ఏదో దిక్కుమాలిందని మీరనుకుంటిరి. నీలిమ జాతకం కూడా మంచిదికాదు. పెళ్లయినా, శోభనం కాకముందే శరత్ చచ్చిపోయాడని లోకమంతా తెలుసు. జాతకరీత్యా మన నీలిమకు మొదట్నించి 'భరణి' సంబంధమే మంచిదని నేను మొత్తుకుంటూనే వున్నాను" అన్నాడు పూజారి.

వాళ్లు తలూపితే ఆపరేషన్ చేయించుకొమ్మన్నవాడి సంబంధం ఇప్పటికీ ఖాయపర్చడానికీ తను సిద్ధమేనన్న ఉద్దేశ్యం పూజారి మాటల్లో వుంది.

"భరణి మంచి ఉద్యోగస్థుడు. నెలకు నాలుగువేల జీతం. దురదృష్టవశాత్తు పాప పుట్టాక భార్యపోయింది. పాపకోసం కూడా చేసుకోవాలనుకుంటున్నాడు కాబట్టి... ట్యూబెక్టమీ

ఆపరేషను..." అంటూ నసిగాడు.

నీలిమ తన గదిలోకెళ్లిపోయింది.

"పూజారిగారూ... పుట్టెడు శోకంతో వుందది. మమ్మల్ని కాస్త ఆలోచించుకోనివ్వండి" అన్నాడు రామచంద్రయ్య.

"పరిస్థితులు నాకు మాత్రం తెలీవా? ఎందుకు చెప్తున్నానంటే... భరణి ట్రాన్స్‌ఫరై మరో నెల్రోజుల్లో హైదరాబాద్ వెళ్లిపోతున్నాడు. అందుకని ఈమాట మీచెవిలో వేద్దామన్పించి..." అని ఏ రెస్పాన్సు రాకపోవటంతో నిదానంగా వెళ్లిపోయాడు పూజారి.

ఆ ఇంటినిండా స్మశాన స్తబ్దత.

విషాదం నిశ్శబ్దంతో చేతులు కలిపి భయంకరంగా తాండవిస్తోంది.

క్షణమొక శకంలా గడుస్తున్న ఆ ఇంట్లో రోజులు దొర్లటం దుర్లభమే అయింది. ఆరోజు... 'టెలిగ్రాం' అన్న కేక విన్పించి నెత్తినేదో పిడుగుపడ్డట్టే భయపడ్డారంతా!

'శైలజ సీరియస్... నీలిమ స్టార్ట్ ఇమ్మిడియట్లీ'

టెలిగ్రాం సారాంశం!

నీలిమ మనసేదో కీడు శంకించింది... అయినా వెంటనే తయారై బయల్దేరింది.

రామచంద్రయ్య కూతుర్ని బస్సెక్కించాడు.

*   *   *   *

కరీంనగర్ హాస్పిటల్లో... ఒళ్లంతా కాలిపోయి గుర్తుపట్టరాకుండా వున్న శైలజని చూసి బావురుమంది నీలిమ.

అప్పటికి శైలజ ఇంకా స్పృహలోకి రాలేదు. శైలజ తల్లిదండ్రులు నీలిమని చుట్టేసుకొని హృదయవిదారకంగా ఏడ్చారు. శైలజ ముఖం కమిలిపోయిన నెత్తుటి ముద్దలా భయంకరంగా వుంది. నెమ్మదిగా కళ్లువిప్పింది. నీలిమని చూడగానే కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"శైలూ... నేను... నీలిమని. ఎలా జరిగిందే?" అనడిగింది దుఃఖాశృవులతో.

అప్పుడే డాక్టర్, నర్స్, పోలీస్ సిబ్బంది కూడా గదిలోకొచ్చారు స్పృహ వచ్చిందని తెలిసి!

"గ్యాస్ స్టవ్... పేలి... మంటలు... చీరకంటుకొని..." శైలజ ఆయాసంతో రొప్పుతోంది. మాటలు మరణ వాంగ్మూలంగా రాయబడుతున్నాయి.

"వంటింట్లో... వాడే గ్యాస్‌లీక్ చేసాడు. ఎందుకో తెల్సా. నన్ను వదిలించుకోవాలని. రేవతి ఉత్తరం నాలో తెగింపునిచ్చిందే. అందుకే మంటలు నన్ను చుట్టుకోగానే వాడ్ని వెంబడించాను. వాడు వీధిలోకి పరిగెత్తాడు. అయినా వేగంగావెళ్లి మంటలతో వాణ్ణి చుట్టేసాను. నా బిగి కౌగిలితో వాడికీ మంటలంటించుకున్నాయి..."

శ్వాస ఆడక కాసేపు చెప్పటం ఆపింది శైలజ.

"కట్నం కోసం కాల్చే ఏ మగాడికైనా ఇదే సరైన శిక్ష. నీలూ... నీకింకో దారుణం తెలుసా..." ఊపిరాడక మళ్లీ ఆగింది.

నీలిమ దుఃఖంతో "ఇంకా ఏం జరిగిందే?" అంటూ దగ్గరగా జరిగింది.

"వంశీకుమార్ పేరుతో నాకొచ్చిన ఉత్తరాలన్నీ వాడే సృష్టించాడు. మావాళ్ల మధ్య నన్ను అప్రతిష్టపాల్జేసి... నాకో ప్రియుడున్నాడని నమ్మించి కట్నం తేలేని నన్ను ఆవిధంగా వదిలించుకోవాలనుకున్నాడే...

ఓరోజు వాడు ఎడంచేత్తో ఆ ఉత్తరం రాస్తుంటే... రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాను. వాడి బండారం బయటపెడతానని గొడవచేసాను. దాంతో ఇలా సిలిండర్ పేల్చి..."

ఆయాసం ఎక్కువవటంతో, దుఃఖం గొంతులో అడ్డుపడడంతో శైలజకి మాటలు రాలేకపోయాయి.

అక్కడున్న అందరి కళ్లలోనూ... ఆవేదన సుడులు తిరిగింది.

ఇంతలో ఓ నర్స్ అక్కడికొచ్చి "డాక్టర్... చంద్రప్రభాకర్ అనే కాలిపోయిన పేషెంట్‌ని నిమిషం కిందే 'నిమ్స్' కి తరలించారు" అంది.

ఒక్కసారిగా అందరూ నర్స్‌వైపు చూసారు.

శైలజ కళ్లు అటు తిరిగాయి.

"వాడు ఇంకా చావలేదా? వాడు చావాలి. వాడు చావాలి..." కాలిన గాయాలతో శైలజ మెలితిరిగింది. చర్మం మీది బొబ్బలు చిట్లిపోతుంటే... అక్కడక్కడా చర్మం వూడి ఆ బాధను భరించలేనట్టు... శైలజ ఊపిరి నిలిచిపోయింది.

ఒక్కపెట్టున ఆగదిలో ఆర్తనాదాలు మిన్నుముట్టాయి.

*   *   *   *

నీలిమ నవ్వుని మర్చిపోయి చాలా రోజులయింది. బయటికెళితే తోటి ఆడవాళ్లు వింత జంతువుని చూసినట్టు చూడటం భరించలేకపోయింది. బయటికెళ్లటమే మానేసింది. ఈలోగా పూజారి రెండుసార్లు వచ్చివెళ్లాడు.

ఆ రోజు... రేవతి నించి ఉత్తరం వచ్చింది.

"నీలూ...

శైలజ చనిపోయిందని తెలిసి ఎంత ఏడ్చానో... మొగుణ్ణి చంపిందని తెలిసి అంత ఆనందించాను. కాని వాడు బతికి బయటు పడ్డాడని తర్వాత తెలిసింది. నువ్వు కూడా భర్తని కోల్పోయావని తెలిసి ఇది రాస్తున్నాను. నీ భర్త పోయినందుకు నేను బాధపడను. నువ్వు జీవితాంతం విధవరాలిగా వుంటే మాత్రం వచ్చి తంతాను.

మధ్యలో వచ్చివెళ్లే మొగుడనే వాడికోసం... మనం వాడిపోవటమేంటి? మనకు మనసుంది... వయసుంది. కోరికలున్నాయి. అందుకే మళ్లీ పెళ్లిచేసుకో... వాడికి వంటా వార్పు చేయడానిక్కాదు. మన శరీరం కూడా సుఖపడాలని గుర్తుంచుకో. 'చలం' పుస్తకాలు చదువు. ఆ గాడ్‌ఫాదర్‌ని మన ఆడాళ్లింకా గుర్తించకపోవటం శోచనీయమే. 'మైదానం' చదువ్... మళ్లీ పెళ్లిచేసుకో.

నీ అరవయ్యో ఏట కూడా మళ్లీ నీ మొగుడు చస్తే వైధవ్యం స్వీకరించకు. మగాళ్లకేం కరువుండదు. అప్పుడు కూడా పెళ్లిచేసుకో...

నీ
రేవతి.

ఉత్తరంలోని ఆఖరి వాక్యం చదివి నీలిమ పెదాల మీద చిన్నగా చిర్నవ్వు విరిసింది. కన్నీటి పుట్టమీద గొంగళి పురుగులా ముడుచుకున్న పెదాలు సీతాకోకచిలుకలా అరవిచ్చాయి.

అప్పుడే పూజారి అడుగుబెట్టడంతో... నీలిమ మనసు కుదిపినట్లయి కొంత పులకించింది. పూజారి నాన్నగారితో అంటుంటె తలుపువోరగా నిల్చుని వింది.

"భరణికి ప్రమోషనొచ్చి వారంలోగా హైద్రాబాద్ వెళ్తున్నాట్ట. నీలిమ అతడికి బాగా నచ్చిందట. కట్నకానుకలేవీ వద్దు. చివరిసారి అడిగి రమ్మన్నాడు. ఇక మీ ఇష్టం..." అని ఆగాడు పూజారి.

రామచంద్రయ్య అనసూయమ్మవైపు చూసాడు.

అనసూయమ్మ నీలిమ గదిలోకి వచ్చింది.

మళ్లీ పూజారి చెప్పాడు.

"మీరు గనక ఓ.కే. అంటే... పాపని వెంటబెట్టుకొని ఈ సాయంత్రం మీ ఇంటికి వస్తానన్నాడు. కాని ఆపరేషన్ మాత్రం... తప్పనిసరంటున్నాడు..."

చివరిమాట విని అనసూయమ్మ ఆగిపోయింది. కూతురి కళ్లలోకి చూసింది. పూజారి అంటున్నాడు-

"నీలిమకు మళ్లీ పెళ్లి జరగటం చాలా కష్టం. ఈ సంబంధమే మీ అదృష్టమనుకోండి. ఆపరేషన్‌కు మీకు భయమక్కర్లేదు. ఆయన ఫ్రెండ్ ఒకామె గైనకాలజిస్టుంది. అదేదో ఆయనే చూస్కుంటాడు."

నీలిమ కూడా తల్లి కళ్లల్లోకి చూసింది.

నిమిషంపాటు అందరి మధ్య నిశ్శబ్దం...

అనసూయమ్మ అడక్కముందే... నీలిమ వంచుకున్న తలూపింది సరేనన్నట్టుగా.

ఆ ఆమోదం తల్లిని ఆనందపర్చకపోయినా... వరండాలోకొచ్చి పూజారితో చెప్పింది.

"ఆయన్నీ సాయంత్రం రమ్మనండి."

పూజారి 'శుభం' అనేసి వెళ్లిపోయాడు. ఆ ఇంట్లో ముగ్గురి మధ్యా మాటలే కరువయ్యాయి. సాయంత్రం అవుతుంటే నీలిమలో ఏదో ఆందోళన. కాలం ఆగకుండా అయిదు గంటలు కొడుతున్నప్పుడు... పాపతో సహా అడుగుబెట్టారు భరణి, పూజారి.

భరణి వస్తూనే నీలిమకు నమస్కారం చెప్పాడు. నీలిమ కంగారుపడింది.

"ఈ శుక్రవారం ఆఫీసర్ ప్రమోషన్ మీద హైద్రబాద్ వెళ్తున్నాను. స్టాఫంతా స్వాగతం చెబితే నాప్రక్కన మీరుండటం నాకు సంతోషంగా వుంటుంది. గురువారం రోజు ఏ ఆర్భాటాలు లేకుండా రిజిస్టర్డ్ మార్యేజి చేసుకుందామనుకుంటున్నాను. మీరు సోమవారం హాస్పిటల్లో అడ్మిట్ అవుతే...' అని ఆగిపోయాడు.

"సరే బాబు..." అన్నాడు రామచంద్రయ్య.

నాలుగేళ్ల పాప నీలిమ దగ్గరికి వచ్చి పరీక్షగా చూస్తూ నిల్చుంది. ముద్దుగా...బొద్దుగా వుంది. ఆపిల్‌లా... అందంగా వుంది.

"డాడీ... ఈమేనా మమ్మీ... బావుంది" అంది.

ఆ మాటకు నీలిమ మొహం నిండా సంతోషం అలుముకుంది. పాపని దగ్గర తీసుకొని ముద్దెట్టుకుంది.

"ఇలా... ఈ బిడ్డే నీ కన్నకూతురనుకోమ్మా... సవతి తల్లి నీడలు పొడసూపకూడదనే భరణిగారి భయం. అందుకే మీరు ఎల్లుండి ఉదయం జాహ్నవి నర్సింగ్‌హోంకి వస్తే... సరిపోతుంది" అని చెప్పాడు పూజారి.

ఆ అరగంట- పాప నీలిమను అంటిపెట్టుకునే వుంది. తర్వాత వాళ్లు వెళ్లిపోయారు.

* * * *

ఆపరేషన్ బెడ్‌మీద పడుకున్నాక నీలిమకు తన జీవితం విచిత్రంగా తోచింది. తమ 'త్రివేణి సంగమం'లో ఒక నది (శైలజ) అప్పుడ్ సాగరంలో కల్సిపోయింది. మరోనది (రేవతి) పాపాల్ని మోస్తూ మురికిదారులై చీలిపోతోంది. మరోనది(తను) గుండశిలల్ని ఢీకొంటూ లోయల్లోంచి అగాథాల్లోకి పడుతూ... పుడుతున్న నిప్పుని గుప్పెడంత గుండెలో దాచుకొంటూ సాగుతోంది.

నర్స్ ఇచ్చిన ఇంజక్షన్‌తో కళ్లు మూతలుపడిపోతున్నాయి.

ఏ ఆడదానికీ జరగనంత హేయంగా... పెళ్లికి ముందే ఆమె గర్భనాళాలు ముడిపడ్డాయి! అంతకన్నా దురదృష్టం మరోటి వుండదేమో? నీలిమకు మెలకువ రాగానే కుట్లతోవున్న తన కడువుని చూసుకుంది నిర్వికారంగా...

ఆ గర్భంలో ఇక ఏ కదలికా వుండదు జీవితాంతం! అన్న వూహే మనసుని

నులిపెడుతోంది. కట్నం ఇచ్చుకోలేని తమ అసహాయతకి ఎన్ని కఠిన పరీక్షలు ఎదుర్కోంటూందో తల్చుకుంటె తల పగిలిపోతుంది.

ఆస్పత్రి నించి డిశ్చార్జి అయ్యాక మూడోరోజునే నీలిమ రిజిష్టర్డ్ మ్యారేజి జరిగింది. భరణి, పాపతోపాటు హైదరాబాద్ బయల్దేరింది.

తల్లిదండ్రులు బరువుగానైనా ఊపిరి పీల్చుఉన్నారు.

* * * *

భరణి తీసుకున్న ఇల్లు అందంగా వుంది. అతడు ఆఫీసులో జాయినయ్యాడు. నీలిమ పాపకి స్నానం చేయించడానికి గౌను విప్పి నోరు తెరిచింది. పాప లేత శరీరం మీద అక్కడక్కడా కమిలిపోయిన మచ్చలు...

"మేఘనా... ఈ దెబ్బలేంటి?" అంది ఆశ్చర్యంగా.

"ఇవా... మానాన్న రోజూ రాత్రి తాగి నన్ను బాగా కొడతాడు." అంది బిక్కమొహంతో.

నీలమనేదో అపశృతి తాకిపోయినట్లయింది మళ్లీ.

తన జీవితం మరో సుడిగుండం కాబోతుందా అన్న వూహే నిలువెల్లా వణికించింది.

"నాన్నగారు... త్రాగుతారా?" అంది ఆందోళనగా, అనుమానంగా.

"ఓ... చాలా... సిగరెట్లు కూడా!" అంది బేలగా. మేఘనకి స్నానం చేయిస్తూ కొన్ని విషయాలు తెల్సుకుంది. తల్లిని పొగొట్టుకుందన్న కోపంతో కొడతాడేమోనన్న భావంతో సర్దుకుంది.

భరణి రోజూ రాత్రి పదకొండు తర్వాత తాగివచ్చేవాడు.

ఆరోజు రాత్రి... మగత నిద్రలో నిలిమ భరణిపై చెయ్యేసింది.

చెయ్యి తీస్తూ చెప్పాడు భరణి-

"నీకు ఆపరేషనయ్యిందని పూరుకుంటున్నాను. మనిద్దరి మధ్య ఇప్పుడప్పుడే సెక్సు మంచిదికాదు" అన్నాడు.

నీలిమ నివ్వెరపోయింది. భరణి ప్రవర్తన అర్థంకావట్లేదు. రోజూ తాగి రావటం...మొదటి భార్యని విపరీతంగా తిట్టి నిద్రపోవటం జరుగుతోంది. మేఘన మాత్రం నీలిమకు బాగా దగ్గరయింది.

ఆరోజు మందు దొరకలేదని చిరాగ్గా వచ్చాడు భరణి. నీలిమ కాఫీ తెవడానికి వంటింట్లోకెళ్లింది. భరణి మేఘనని లాలనగా పిలిచాడు.

"బేబీ... ఇలారా..." అని దగ్గర తీసుకొని "అమ్మ ఇంట్లోనే వుంటుందా? పక్కింట్లోని ఎవరైనా మగాళ్లతో మాట్లాడుతుందా?" అనడిగాడు.

కాఫీ తెస్తున్న నీలిమ నిర్ఘాంతపోయింది.

"నాకలాంటి ఆలోచనలు వుండవులెండి" అంది సీరియస్‌గా కాఫీ ఇస్తూ. భరణి దెబ్బతిన్నట్టుగా చూసాడు.

మరేం మాట్లాడలేదు.

రాత్రి పదకొండు దాటింది...

భరణి అటుతిరిగి పడుకున్నాడు. నీలిమ అసహనంగా అటూ ఇటూ దొర్లింది. భరణివైపు తిరిగి గబుక్కున బలంగా లాక్కుంది తనవైపు.

భరణి ముడుచుకుపోయాడు. ఒళ్లంతా క్షణంలో చెమటలు పట్టాయి. నీలిమని విదిలించకొని మంచం మీంచి లేచివెళ్లి సిగరెట్ వెలిగించుకున్నాడు.

నీలిమ సిగ్గుతో తలొంచుకుంది.

సిగరెట్ పొగ గదంతా ప్రాకుతోంది. భరణి చిన్నగా నవ్వాడు. నీలిమ తలెత్తి చూసింది.

"ఇంకెప్పుడూ ఇలాంటి ఆలోచనలు పెట్టుకోకు. నేను ఫ్రాంక్‌గా చెప్తున్నాను. నాకు... మగతనం... లేదు."

చలిపిడుగు నెత్తిన పడ్డట్టయింది నీలిమకు. గుండెను శరాఘాతమై తాకిన మరోగాయం...

"అందుకే ఈ సొసైటీ గుర్తించకుండా... నాకులేని మగతనం బయటపడకుండా పెళ్లికి ముందు నీకు ఆపరేషన్ అన్న కండీషన్ పెట్టి నిన్ను చేస్కుంది".

నీలిమకి అయోమయంగా వుంది. చీకటి శకలాల కింద నలిగిపోతున్న బతుకుని ఉగ్గిపడుతూ సందిగ్ధంగానే అడిగింది.

"మరి... మరి... మీకు ఈ పాప?"

"అది నా మొదటి భార్య కన్నది. కాని నాకు కాదు. నీలాగే సరసాలాడితే నాకు మగతనం లేదని తెలిసాక... నాకు తెలీకుండా... ఓ కాలేజి కుర్రాడితో సరసాలాడి అక్రమంగా కంది. అందుకే దాన్ని కూల్‌గా చంపేసా..." అన్నాడు.

నీలిమ ఆ మాటతో వణికిపోయింది. భయంగా "చంపేసారా?" అంది.

"అవును. వేరేవాడితో కులికితే మగాణ్ణి నాకు రోషముండదా? నీకెలాగూ ఆపరేషనై పిల్లలు పుట్టరని ఈలోకానికి తెల్సు. మనిద్దరం కాపురం చేస్తున్నామనే లోకానికిలాగే వుండాలి."

చివుక్కున అతడు నీలిమపైకి వంగాడు. బెడ్‌లైట్ వెలుతుర్లో అతడి ముఖం వికృతంగా కన్పడుతోంది. నిజరూపం బయటపడి నికృష్టంగా కన్పడుతున్నాడు.

అతడిలోని శాడిజమంతా ముఖంలోకి ప్రాకింది.

"అదుపు తప్పిందాన్లాగా నువ్వు ఎవడితోనైనా సరసాలాడితే నీకూ సిగరెట్ వాతలు

తప్పవు. సాంపిల్ చూస్తావా?" అన్నాడు.

నీలిమ అరుపు నాలుగ్గోడల మధ్య పగిలిపోయింది. నిజం భరించలేని నీలిమ రాత్రంతా రోధిస్తూనే వుంది.

సూర్యుడు రక్తం కక్కుకుంటూ భళ్లున తెల్లారాడు.

* * * *

రోజంతా... మెదడు పొరల్లో అనంతమైన ఘర్షణ...

సంద్ర కెరటాలై ఢీకొంటున్న గర్జన...

భరణితో కాపురం చేయటం పులిబోనులో సావాసం చెయ్యటమేనని గుర్తించింది. క్రమంగా మొదలైన తెగింపు...

పిరికివాణ్ణి రెచ్చగొడితే తిరగబడే ధైర్యం... మొండి ధైర్యం.

నిస్సహాయ స్థితిలో నిర్జీవుడి నరాల్లో సైతం పొంగే నెత్తుటి గీతం పాడే ప్రతిఘటన.

యజ్ఞం ముందు నిల్చిన బలిపశువు హోమగుండాన్ని ఢీకొన్న తెగింపు...

బాత్రూంలోంచి తల తుడుచుకుంటూ వచ్చిన భరణి... సూట్‌కేస్‌తో నిల్చున్న నీలిమని చూసి స్టన్నయ్యాడు.

"ఎక్కడికే బయల్దేరావ్?" కఠినంగా కంగారుగా అడిగాడు.

"ఏట్లోకి" విసురుగా జవాబిచ్చింది.

"పెళ్లయి నెల్రోజులు కూడా కాలేదు. అప్పుడే విడిపోయేంతవరకొచ్చిందా?"

"మగతనమే లేని వాడివి. నీతో కాపురమేమిట్రా?" వికారంగా మొహం పెట్టి అంది-

దెబ్బతిన్న పులిలా పైకొచ్చాడు భరణి.

"అడుగు ముందుకేస్తే ఈ కత్తిపీటతో చంపేస్తాను" నీలిమ ఉగ్రావతారాన్ని చూసి తగ్గిపోయాడు.

"ఎందుకురా... పదిమందిలో నువ్ పెద్దమనిషివని... నీకో అందమైన భార్య వుందని... దాంతో సంసారం చేస్తున్నానని... ఆపరేషన్‌తో పిల్లలిక చాలని... నీస్వార్థం కోసం నేను గర్భనాళాలు ముడేసుకొని బలయ్యానురా బాస్టర్డ్...

పెళ్లికి ముందు ట్యూబెక్టమీ ఆపరేషన్‌తో ఏ ఆడపిల్లా త్యాగం చెయ్యదురా... కాని నేను చేసాను. త్యాగమే కాదు... అవసరమైతే ఇప్పుడు హత్య కూడా చేయగలను. ఇంకా నా ఛాయలకొచ్చినా నీ నీడ కూడా లేకుండా చేస్తాను. గుడ్‌బై..."

మగజాతి మీదే తిరగబడ్డ కృతనిశ్చయంతో కసి నింపుకున్న బెబ్బులిలా కదిలింది. గేటు తీసి బయటికి అడుగు పెడుతుంటే... 'అమ్మా' అని పిలుపు...

ఆర్తమైన పిలుపు-

అవ్యాజమైన అనురాగపు పిలుపు...

ఆవేదనగా వెనక్కి తిరిగి చూసింది. కన్నీళ్లతో కంపించిపోతూ... మేఘన. ఆ పిలుపులో కదిలించే కరుణం... గర్భకోశంలో కుండపోతయిన వరుణం... తన జీవిత మజిలీలో ఆ పదమే అరుణారుణం...

బ్రీఫ్‌కేస్ వదిలి... వేగంగా పరిగెత్తుకొచ్చింది మేఘనని విడిచి నువ్వుండలేవు" అన్నాడు నవ్వుతూ.

భరణి నవ్వు విని చివ్వున లేచింది.

"నాకు తెలుసు. నువ్వెళ్లలేవు. మేఘనని విడిచి నువ్వుండలేవు" అన్నాడు నవ్వుతూ.

"గుండె గండశిలలా మారిందిరా... మేఘనే కాదు, సూర్యుడు అడ్డమొచ్చినా వుండను" అని వెనుదిరిగింది.

మేఘన దీనమైన పిలుపులకు కాళ్లు వెనక్కి లాగుతున్నా- గుండెకోత పెడుతున్నా నిగ్రహించుకొని గేటు దాటింది.

గేటు దాటాక చప్పున వచ్చిన ఆలోచన...

ఎక్కడికెళ్లాలి???

పుట్టింటికి...!!!

"వద్దు... వద్దు... మళ్లీ ఈ జీవితం ఇలా అయిందంటే వాళ్లు బ్రతకరు. వాళ్లనలాగే సంతోషంగా వుండనీ, పుట్టింటికి వద్దు..." ఆమె మనసు ప్రతిఘటిస్తోంది. గమ్యం తెలీక రోడ్డు మీంచి వెళుతుంటే... ప్రక్కనించి వెళ్లినవాడల్లా పోస్ట్‌మాన్ తిరిగొచ్చాడు.

"మేడమ్, మీపేరు నీలిమ కదూ..." అన్నాడు.

"అవును" అంది నిర్లిప్తంగా.

మీ ఇంటికే వెళ్తున్నాను. మీకు రిజిస్టర్ పోస్ట్ వుంది. మీరు వూరెళ్తున్నట్టున్నారు" అని సంతకం తీసుకొని పెద్దకవర్ ఇచ్చాడు.

ఫ్రమ్ అడ్రస్‌లో 'రేవతి' పేర వుండటంతో రోడ్డుప్రక్కనే వున్న సిమెంట్ బెంచీపై కూలబడి కవర్ విప్పింది.

"నీలూ...

మళ్లీ పెళ్లి చేసుకొని ఆనందంగా వున్నావని తలుస్తాను. రెండు మూడ్రోజుల్నించి డెయిలీ పేపర్లు చదివి నాగురించి ఆందోళన పడ్డావా? ఏం వర్రీ కావద్దు. నేను ఆనందంగా వున్నాను.

నా ఛాలెంజ్ నెరవేరింది. నన్ను రేప్ చేసినవాణ్ణి దగ్గరతీసి వాడి అంగాన్ని తెగనరికాను. వాడు చచ్చిపోతాడేమోనని భయమేసింది. కాని డాక్టర్లు బ్రతికించారు. థాంక్‌గాడ్. వాడు

బ్రతకాలి... ఈ సమాజం అంతా వింతగా, వెర్రిగా, ఎగతాళిగా వాణ్ణి చూస్తుంటే క్రుళ్లి క్రుళ్లి బ్రతకాలి. రేప్ చేయబడ్డ ఆడదాని మానసిక వేదనకన్నా వాడి బాధ ఎక్కువేంకాదు.

ఇప్పుడు రాష్ట్రంలో నేనో సంచలనం వ్యక్తిని. కెమెరాలు, పత్రికలు నామీదే ఫ్లాష్ అవుతున్నాయి. నన్ను అరెస్ట్ చేసాక నేను చేసిన పనికి కోర్టు ఆరు సంవత్సరాల కారాగార శిక్ష వేసింది.

నీలూ... నాకు మగజాతి మీద, ఈ సమాజం మీద విరక్తి పుట్టిందే. జైలులో ఆధ్యాత్మికంగా ప్రిపేరవాలనుకుంటున్నాను. ఆరేళ్లు... ఆ తర్వాత కూడా ఈ మనుషుల మధ్యకు రాను. ఇరవై రెండేళ్లకే నూటయాభై ఏళ్ల అనుభవాన్ని గడించాను. అందుకే ఆశ్రమానికి వెళ్లాలనుకుంటున్నాను. ఈ రంగుల జీవితం వదిలేముందు వరంగల్‌లో నాకున్న చిన్న ఇంటిని నీ పేరున రాసి... ఆఇంటి తాళం చెవుల్ని కూడా రిజిష్టర్ ద్వారా నీకు పంపుతున్నాను. ఎప్పుడైనా...

కట్నం తేలేదని నీ మొగుడు విసుగుపడితే... గర్వంగా ఈ ఇంటిని చూపించు. నా కలల పంటలో వుంటూ నన్ను కలకాలం గుర్తుంచుకో. శైలజ ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థిస్తూ... రాజమండ్రి లేడీస్ సెల్‌కి వెళ్తూ...

నీ రేవతి."

నీలిమ కళ్లు మసకబారి అక్షరాలు సరిగ్గా కన్పించలేదు.

పోస్ట్‌మాన్ ఏడుకొండలెత్తు దేవుడిలా ఎదిగిపోయి కన్పించాడు.

కళ్లు తుడుచుకొని... కవర్‌లోనీ తాళం చెవుల్ని తీసి... ఉత్తరాన్ని గుండెల మధ్య దాచుకొని ఇమ్లిబన్ కొచ్చి వరంగల్ బస్సెక్కింది.

సీటుకి జారగిలబడి 'రేవతీ... రేవతీ... నీకు వేనవేల కృతజ్ఞతలే" అని వందలసార్లు అనుకుంది.

*　　　　*　　　　*　　　　*

ఆ ఇల్లు..! అందంగా, పొందికగా వుంది. సామానేమీ లేకపోయిన అయిదు గదులతో అందంగా వుంది. ఆ ఇంట్లో చేరిన మూడోరోజున నీలిమ బయట అడుగు పెట్టింది ఉద్యోగాన్వేషణలో...

కాజీపేట... హన్మకొండ, వరంగల్... లేడీస్ ఎంపోరియాల్లో, క్లాత్ స్టోర్స్‌ల్లో, ప్రైవేట్ స్కూల్స్‌లో, చివరికి పనిమనిషిగా... అంతటా నిరాశే ఎదురైంది.

\- మరోరోజు...

ఇంకోరోజు...

తిరుగుతూనే వుంది. ఎవరెవరినో కలుస్తూనే వుంది.

హన్మకొండ చౌరస్తాలో సుధా ఫైనాన్స్‌లో అడుగుపెట్టి అక్కడున్న వ్యక్తితో- "ఏమండీ... ఏదైనా పని దొరుకుతుందా?" అనడిగింది. ఆ వ్యక్తి నీలిమని ఎగాదిగా చూసి "మీకు టైపొచ్చా?" అనడిగాడు. ఆయనకి ఏభై ఏళ్లుంటాయి.

"ఇంగ్లీష్ లోయర్ పాసయ్యాను" అంది ఆనందంగా.

"మీ సర్టిఫికెట్స్ ఇవ్వండి. మామేనేజర్‌గార్కి చూపిస్తాను. రేపే టైపిస్టు కావాలని పేపర్లో వేయాలనుకుంటున్నాం" అన్నాడతడు.

నీలిమ గతుక్కుమంది. "సార్... సర్టిఫికెట్స్ లేవు... సారీ... నేను బాగా టైప్ చేస్తాను" అంది ప్రాధేయంగా.

"భలేవారండీ. నాక్కూడా టైపొచ్చు. కాని సర్టిఫికెట్ లేదు" అన్నాడా పెద్ద మనిషి.

"సార్... నేను చాలా కష్టాల్లో వున్నాను. ప్లీజ్! నాకీ ఉద్యోగమిచ్చి పుణ్యం కట్టుకోండి" అంది కళ్లనీళ్లతో. ఆమె కన్నీళ్లు చూసి ఆ పెద్దమనిషి చలించిపోయాడు.

"సర్టిఫికెట్ లేకుండా ఉద్యోగమెలా ఇస్తారమ్మా... మీరే చెప్పండి" అన్నాడు.

"నిజమేసార్... కాని నేను బాగా టైప్ చేయగలను. కావలిస్తే ఏదైనా మ్యాటరివ్వండి. టైప్ చేసి చూపిస్తాను" అంది.

ఆ పెద్దమనిషి కాసేపు ఆలోచనలో పడిపోయాడు.

"చూడమ్మా... ఒక పద్ధతి చెప్తాను. మీరు ఒక వారం రోజులు ఎలాంటి జీతం లేకుండా పనిచెయ్యండి. మీరు టైప్ చేసిన కాగితాల్ని మేనేజర్‌గార్కి చూపి మీ పరిస్థితి చెప్తాను. అప్పటికీ ఆయన్ని ఓకే చేయడానికి ప్రయత్నిస్తాను. తప్పుల్లేకుండా టైప్ చేయాలి. ఏమంటారు?" అన్నాడతడు.

ఈ ఉద్యోగం సంపాదించాలంటే అతడు చెప్పింది నిజమేనన్పించింది. సరే అంది ఆనందంగా.

"రేపట్నించి రండి..." అన్నాడాయన తన పనిలో మునిగిపోతూ.

*　　　　*　　　　*　　　　*

నాలుగు రోజుల్నించి నీలిమ టైపు చేస్తూనే వుంది. టైపు చేస్తున్న మ్యాటర్‌ని బట్టి అది నలభైదిలక్షలతో నడుస్తున్న ఫైనాన్స్ కంపెనీ అని అర్థమైంది. దాదాపు ఇరవైమంది వరకూ పనిచేస్తున్నారు.

ఆరోజు మధ్యాహ్నం క్యాషియర్‌గా పనిచేస్తున్న ఆ పెద్దమనిషి నీలిమ దగ్గరికొచ్చి నాలుగు రంగుల గులాబీలున్న ఫ్లవర్ బోకేనిచ్చి-

"ఇది మా మేనేజర్‌గారు మీకిమ్మన్నారు" అనేసి వెళ్లిపోయాడు. నీలిమకేమీ అర్థం కాలేదు.

మరో మగపురుగు తన జీవితాన్ని తొలచడానికి రాయబారమా అనుకుంది. అందమైన ఫ్లవర్ బొకేలో వున్న చిన్న స్లిప్‌ని తీసి చదివింది-

"నీలిమ గార్కి-

ఈరోజు సాయంత్రం మా ఇంటికి రండి. ఎదురుచూస్తుంటాను" అన్న వాక్యం చదివి త్రుళ్లిపడింది. ఇప్పటివరకు అతణ్ణి చూడనేలేదు. ఇంటికి రమ్మంటాడేమిటి? ఈ ఉద్యోగం ఎరగా... ఏమైనా కోరతాడా? ఛ...ఛ... ఇంకా ఆలోచించలేకపోయింది. ఒకవేళ అదే జరిగితే... తగిన సమాధానం చెప్పాలి.

అవసరమైన ప్రతిసారీ... ఇక పురుష ప్రపంచాన్ని ఎదుర్కోవల్సిందే అని నిశ్చయించుకుంది.

"శర్మగారు... ఎం.డి గారి అడ్రసెక్కడ?" అని వచ్చి అడిగింది.

"3-24-12, వేయి స్థంబాల గుడి ప్రక్కన" క్లుప్తంగా చెప్పి తన పనిలో మునిగిపోయాడు క్యాషియర్.

* * * *

సాయంత్రం ఆరున్నర దాటింది...

ఆ ఇంటి ఆవరణలో అడుగుపెడుతూనే గుండె చిక్కబట్టుకుంది నీలిమ. అందంగా... క్రోటాన్ మొక్కలతో... రకరకాల గులాబీలతో... ఎర్ర మందరాలతో నిశ్శబ్దంగా వుంది. గేటు దాటి రాగానే బొచ్చుకుక్క మూలిగి తిరిగి పడుకుంది. తలుపులు తెరిచే వున్నాయి.

అయిదు నిమిషాలు తలుపు దగ్గరే నిలబడింది. లోపల్నించి ఏ అలికిడీ రాలేదు. ధైర్యంగా వరండాలోకి అడుగుపెట్టి ఇల్లంతా కలియజూస్తూ... ఒక్కసారిగా దిగ్భ్రమతో కళ్లని కట్టేసి చూపుల్ని శిలువవేసినట్టు... గోడమీది లాంగ్‌సైజు ఫొటోని చూస్తుండిపోయింది...

అందమైన 'నీలిమ' ఫొటో...

తన ఫొటో ఇక్కడ... ఈ ఇంట్లో...

నమ్మశక్యంగాక కళ్లు తేలేసి చూస్తూంటే 'నమస్కారం' అని విన్పించి ఈలోకంలోకొచ్చింది. చప్పున తిరిగి చూస్తే... చేతులు జోడించి నవ్వుతూందామె.

ఆమెవరు? ఆమెనెక్కడో చూసింది...?

ఎక్కడ చూసింది? ఎక్కడ? ఎక్కడ?

"నన్నింకా మీరు గుర్తుపట్టలేదా? రండి కూచోండి" అంది సాదరంగా. అసలు తమ మేనేజర్ మగవాడన్నట్టు గుర్తు...

అప్పుడే పైమెట్లు దిగివస్తూ 'నమస్కారం నీలిమగారూ...' అన్న వ్యక్తివైపు చూసి షాక్ తింది.

అతడు... నిరంజన్. ఈమె అతడి భార్య.

నిశ్చయ తాంబూలాల రోజు ఇచ్చిన పదిహేనువేల రూపాయల్తో పారిపోయిన నిరంజన్...

వేములవాడ గుడిమెట్ల మీద క్షమించమని ప్రార్థించిన... నిరంజన్. నీలిమ పదినిమిషాలవరకూ తేరుకోలేకపోయింది.

"పెళ్లిచేసుకొని పారిపోయొచ్చాక మీ డబ్బుతో బ్రతకటం నేర్చి ఈ పీరియడ్‌లోనే ఎదిగి ఫైనాన్స్ పెట్టాను. నా గదిలోని అద్దాల్లోంచి మీరు కన్పిస్తారు. మిమ్మల్ని చూసి... మీ ముందుకొచ్చి తలెత్తుకొనే సంస్కారం లేక మా ఇంటికి ఆహ్వానించాను. మీరు ఇంకా క్షమించకపోయినా... మేం మిమ్మల్ని ఆరాధిస్తున్నాం" అని తన ఫొటోవైపు చూపెట్టాడు.

"రోజూ మేమిద్దరం లేవగానే మీ ఫొటోకి నమస్కరించందే... ఏ పనీ ముట్టుకోం" అంది ఆవిడ. ఆమె పేరు నైమిషగా పరిచయం చేసుకుంది.

నీలిమకింకా కలో, నిజమో అర్థంకావట్లేదు.

"మీరికనించీ మా ఇంట్లోనే వున్నా అభ్యంతరం లేదు" అందావిడ.

"వద్దు... వద్దు... సారీ" అంది నీలిమ. మాట్లాడుతూనే ఆవిడ డైనింగ్ టేబిల్‌పై రకరకాల వంటకాలు వడ్డించింది. వాళ్ల బలవంతంతో నీలిమ భోజనం చేసింది.

భోజనం చేస్తూ నిరంజన్ అన్నాడు-

"మీ వ్యక్తిగత విషయాలడిగి మిమ్మల్ని బాధపెట్టను. క్యాషియర్ శర్మగారు నాకు కొంత చెప్పారు. మీరు చేసే టైపిస్ట్ ఉద్యోగానికి నేనిచ్చేది జీతం అనడానికి నాకే ఇన్సల్ట్‌గా వుంది.

మాకు జీవితాన్నిచ్చిన మీకు నెలకి అయిదువేలు చొప్పున చెక్ పంపిస్తాను. అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తుండండి."

నిరంజన్ భార్య నైమిష నీలిమకి కొసరి కొసరి వడ్డించింది. ఈ ఒంటరి నగరంలో తనకో ఆత్మీయుల్ని చూపించిన దేవుడికి మనసులోనే మొక్కుకుంది.

ఆ సంతోషంతోనే... సెలవ్ తీసుకుంది.

* * * *

నెలరోజులు గడిచాయి.

నీలిమలో ఏదో స్వేచ్ఛ... క్రొత్త ఉత్సాహం... శరీరంలో కూడా మార్పు. ఓరోజు ఫైనాన్స్‌లోకి అడుగుపెట్టిన నీలిమ... మేనేజర్ గదిలో వున్న భరణిని చూసి గతుక్కుమంది. కలవరపడింది... కంగారుపడింది.

నిరంజన్ నీలిమ దగ్గరికొచ్చాడు. నీలిమ తలొంచుకుంది.

"నీలిమగారు... మీకోసం మీ ఆయనొచ్చారు. పాపం మీ కూతురికి చాలా జ్వరంగా

వుందట" అన్నాడు.

ఆవెనకే వచ్చిన భరణి "నిజం నీలిమా. ఏదో భార్యభర్తలం. సరదాగా గొడవపడ్డంత మాత్రాన ఇలా వేరే కాపురం పెట్టేయడమేనా? మేఘన నీకోసం పలవరిస్తోంది. తెల్సా? నన్ను క్షమించు నీలిమా... ఇంటికెళ్దాం పద" భరణి బాధగా అద్భుతంగా చెప్పాడు.

అప్పటికే ఫైనాన్స్‌లోని జనమంతా నీలిమవైపు చూడటం మొదలెట్టారు. నీలిమకి కంపరంగా వుంది.

"నీలిమగారూ... డబ్బు ఇబ్బందులైతే నాకు కబురెట్టండి. కానీ మంచి భర్తని విడిచిపెట్టి..."

"నిరంజన్‌గారూ..." తీవ్రంగా అరిచింది నీలిమ.

"వాడు మంచి భర్తా? కాదు. వాడొక మొగతనం లేని శాడిస్టు. వాడికోసం నా మాతృత్వాన్ని కూడా..." కంఠంలో దుఃఖం సుడులు తిరుగుతుంటే ఇంకా అనలేకపోయింది.

"నీలిమ. ఈమాత్రం గొడవకు భర్తమీద ఇలా నిందలెయ్యటమేనా? నీతో పర్సనల్‌గా మాట్లాడాలి" అంటూ నీలిమ రెక్కబట్టుకొని బయటికీడ్చుకొచ్చాడు.

"వదులు" అంది పెనుగులాడుతూ. ఫైనాన్స్‌లోంచి బయటికొచ్చాక భరణి నవ్వి చెప్పాడు "నీ జీతం అయిదువేలని తెల్సింది. నెల నెలా అందులోంచి నాలుగువేలు పంపిస్తానని మాటివ్వు. సైలెంట్‌గా వెళ్లిపోతాను. లేదంటే చాలా గొడవవుద్ది..." అన్నాడు కూల్‌గా.

నీలిమకేమనాలో పాలుపోలేదు. కొంచెం ఆలోచించి ఆ పరిస్థితిలోంచి బయటపడటానికి 'సరే' అంది సందిగ్ధంగానే.

"వెరీగుడ్... అయితే ఈరోజు నీ జీతం తీస్కుంటున్నావ్. అప్పటివరకూ నేనిక్కడే వెయిట్ చేస్తాను. నీ ఖర్చులకు వెయ్యి వుంచేసుకో. ఆడదానివిగా.. అతిగా ఏముంటాయ్?" అన్నాడు మెట్లు దిగుతూ.

మొదటి జీతం కోసం కలలుగన్న నీలిమకు ఆమాట అశనిపాతమై తగిలింది. ఎలా బయటపడాలో అర్థంకాలేదు. వాడన్నింటికీ తెగించినవాడు. తన ఒంటరి బతుకుని చించేసి పోగల సమర్థుడు.

నిశ్శబ్దంగా ఆఫీసులోకెళ్లి మేనేజర్‌గారి దగ్గర జీతం తీసుకొని క్రిందికొచ్చి భరణి చేతిలో నాలుగువేలు పెట్టింది.

భరణి చిన్న నవ్వాడు.

"వెరీగుడ్ నీలిమా. -వచ్చేనెల ఇదే తారీక్కు వస్తాను. బై..." అని వెళ్లిపోయాడు. నీలిమలో దుఃఖం పొంగుకొచ్చింది. హిమశిఖరంలా కదిలొచ్చి తన సీట్లో కూచొంది. కాని అందరి చూపులు తనవైపే వుండటం గమనించి...

వ్రేళ్లు టైప్ మిషన్ మీద సరగ్గా ఆడలేకపోయాయి.

కన్నీళ్లు రాబోయి వెనక్కిపోయాయి.

పోనీ...పోనీ...పోతేపోనీ...

× × ×

ఇరవై రోజులు జరిగిపోయాయి...

నెల దగ్గిర పడుతుంటే ఇరవై రెండో తేదీన...

పనిలో నిమగ్నమైన నీలిమతో "నీలిమగారు... మీకోసం మీ నాన్న వచ్చాడు" క్యాషియర్ మాటతో ఉలిక్కిపడింది.

తిరిగి చూస్తే దిగులు బొమ్మలా... రామచంద్రయ్య. నీలిమ కళ్లల్లో కన్నీటి నురుగలు బుసలుకొట్టాయి.

"నాన్నా... ఎప్పుడొచ్చావ్? అమ్మ బావుందా? ఇంటికెళ్దాం. ఒక్క నిమిషమాగు నాన్నా..." అమి మేనేజర్‌తో చెప్పి హడావిడిగా తండ్రిని తీస్కొని ఆటోలో ఇంటికి చేరింది.

"ఇంటినించే వచ్చావా నాన్నా?" అంది తాళం తీస్తూ.

"లేదమ్మా. హైదరాబాద్ నించి వస్తున్నాను" అని తండ్రి అనటంతోనే నీలిమకంతా అర్థమైంది.

నీరసంగా కూచుంటూ "అల్లుడొచ్చి రెండురోజులుండి పోయాడమ్మా" అన్నాడు.

గుండె చరియలు విరిగిపడ్డట్టుగా చూసింది నీలిమ.

"వాడు... వాడు మనింటికొచ్చాడా? ఎందుకునాన్నా?"

"నీకు ఆపరేషన్ జరిగాక కడుపులో ప్రేగుకు పుండై హాస్పిటల్‌లో సీరియస్‌గా వున్నావని... ఇరవై వేలు అర్జంట్‌గా కావాలని... నానీలిమని బ్రతిగించండని విపరీతంగా ఏడ్చాడమ్మా."

నీలిమ కాళ్లకింద భూమి కదిలిపోతోంది...

ఒంట్లోని రక్తం సలసలా మరిగిపోతోంది...

"నీకలా అయ్యిందని మీ అమ్మా నేను బావురుమన్నాం. మూడెకరాల పొలాన్ని అమ్మి వాడిచేతిలో ఇరవై వేలు పోసాం. మేమొస్తామంటే నిన్ను మద్రాస్ హాస్పిటల్‌కి తీసికెళ్తున్నట్టు... నాల్రోజుల తర్వాత తిరిగి వచ్చాక రమ్మని చెప్పివెళ్లాడు. కాని నేను హైదరాబాద్ వెళ్లితే... నువ్వసలు వాడతో కాపురమే చెయ్యట్లేదని తెల్సి... నీ అడ్రస్ తెల్సుకొని ఇక్కడికొచ్చాను" పంచెతో కళ్లు తుడుచుకుంటూ చెప్పాడు తండ్రి.

"నాన్నా... వాడిమీద పోలీస్ కేస్ పెడదాం" అంది కళ్లు చంద్ర నిప్పులవుతుంటె ప్రచండమైన క్రోధాగ్నితో వూగిపోతూ.

"నీ బతుకే ఇలా జరిగాక ఏం చేసి ఏం లాభమమ్మా? మీ అమ్మకు ఈ విషయాలన్నీ

తెలుస్తే దాని గుండె పగుల్తుంది" అన్నాడు బాధగా.

"అమ్మకిప్పుడేదీ చెప్పకు నాన్నా. అన్ని పరిస్థితులూ అవే సర్దుకుంటాయి. మీరు స్నానం చేయండి. నా జీవితంలో వాణ్ణి ఒక పీడకలగానే భావిస్తున్నాను" అంది ఆవేశం తగ్గించుకొని ఆలోచిస్తూ...

వాళ్లిద్దరి మధ్యా అగాధం వున్నట్టు మాటలే కరువయ్యాయి. కాని మనసులు ఘోషిస్తున్నాయి.

రెండురోజులుండి రామచంద్రయ్య విధిలేని పరిస్థితిలో వెళ్లిపోయాడు.

* * * *

ఆరోజు... మూడో తారీఖు.

నీలిమకి ఫైనాన్స్ కెళ్లాలంటేనే ఆందోళనగా వుంది. జీతం కోసం వాడు మళ్లీ వస్తాడు. నాలుగు వేలూ పట్టుకుపోతాడు.

నంగనాచిలా ఇంటికెళ్లి తను చావుబతుకుల్లో వున్నట్టు నాటకమాడి పొలం అమ్మించి డబ్బు పట్టుకుపోయిన వాడిపట్ల రగిలిపోయిన మనసు అట్టుడికిపోతోంది.

వాడీరోజు మళ్లీ వచ్చి ఫైనాన్స్‌లో మొగుడిగా నానా రభస చేసి డబ్బులు పట్టుకెళ్తాడు. ఏంచేయాలి? అన్న ఆలోచనల్తోనే పది గంటలయ్యింది.

పోనీ... ఈరోజు ఫైనాన్స్ కెళ్లకపోతే? పిరికిచర్యగా అన్పించినా అదే మంచిదనిపించింది. వెళ్లకూడదని నిర్ణయించుకొని గడియారంవైపు చూస్తుంటె... వాడొచ్చి వుంటాడా? తనకోసం ఆరా తీస్తుంటాడా? డబ్బులకోసం నిరంజన్‌ని అడుగుతాడా?

తన ఇంటి అడ్రస్ తీసుకొని వెతుక్కుంటూ వస్తాడా? వస్తే ఏం చేయాలి? ఆలోచనల్తో మెదడు నరాలు చిట్లిపోతున్నాయి. గుండెల్లో అగ్నిపర్వతాలు ప్రేలుతున్నాయి. కన్నీళ్లు కూడా ఇంకిపోతున్నాయి. సమయం పన్నెండయింది.

"అమ్మగారూ..." ఆఫీస్‌బోయ్ వచ్చి పిలవటంతో ఉలికిపాటుతో చూసింది.

"మీకెసమెవరో ఫైనాన్స్‌కొచ్చారు. ఇంటికి తీసుకొచ్చాను" అన్నాడు వాడు వినయంగా.

శిలాప్రతిమలా లేచి నిల్చుంది నీలిమ.

వాడే. వాడే వచ్చుంటాడు. ప్రేతాత్మలా తోడై తన జీవితాన్ని పీక్కుతింటున్నవాడు. పచ్చి నెత్తురు తాగుతూనే పవిత్రంగా కన్పించేవాడు.

నో... వాడింకా రావటానికి వీల్లేదు. వీల్లేదు. ఆక్రోశిస్తూ అంతం చేయాలన్నంత ఆవేశంగా బయటికొచ్చింది.

కాని బయటెవరో... అపరిచితుడు!

నీలిమని చూడగానే "నమస్కారమండీ. నాపేరు రాఘవ. భరణి ఆఫీసులోనే

పనిచేస్తుంటాను..." అని చెప్పి నేల చూపుల్తో ఆగిపోయాడు.

"చెప్పండి... ఏం కావాలి?" అంది దృఢంగా.

అతడు చెప్పలేదు.

"చెప్పండి... అతడు పంపించాడా?" అంది తీవ్ర స్వరంతో.

"లేదమ్మా... భరణి... భరణి... మూడ్రోజులు కిందట ఎలక్ట్రిక్ షాక్‌తో చనిపోయాడు" అని చెప్పాడు.

శీతల పవనమేదో గుండెని తాకినంత చల్లగా విన్పించిందా మాట!

యుద్ధం మధ్యలోనే శత్రువు చచ్చిపోయాడన్న వేగుల వార్తలా... హాయిగా వుందామాట. నీలిమ ముఖంలో నీలి నీడలేవో తొలగిపోయినట్లయింది.

"ఆపీసువాళ్లమే అంత్యక్రియలు జరిపాం. కాని భరణి కూతుర్ని ఏంచేయాలో తెలీక... ఆఫీసులో అందరం చర్చించుకొని ఆ పాపని మీకు అప్పగించాలని తీసుకొచ్చాను" అన్నాడు.

అప్పటివరకూ అతడి వెనక దాక్కున్న మేఘన దాగుడుమూతలాడినట్టు... అతడి వెనకనించి వంగి 'అమ్మా' అని పిల్చింది.

నీలిమ శరీరం పాదరసమై జారిపోయిందా పిలుపుతో...

గుండె జలపాతమై దూకిందా మాటతో...

ఇంకా ఆగలేనట్టు పరిగెత్తుకొచ్చి... నీలిమని చుట్టేసింది. మేఘన ఒంటినిండా నీలిమ ముద్దులు కురిపించింది.

అతడు సెలవ్ తీసుకొని వెళ్లిపోయాడు.

* * * *

నీలిమ మేఘనకు అన్నం తినిపిస్తూ అయిదోరోజున అడిగింది.

"అసలు నాన్నకు కరెంట్ షాక్ ఎలా తగిలింది? తాగి పడిపోయాడా?" అని.

క్షణాల్లో మేఘనచిన్నారి ముఖం గంభీరంగా మారిపోయింది.

"నేనే కరెంట్ షాక్ ఇచ్చి డాడీని చంపేసాను."

యుద్ధ రాకెట్లేవో మెరుపుదాడి చేసినట్టు త్రుళ్లిపడింది నీలిమ.

"మేఘనా..." అంది అప్రయత్నంగానే.

"అవును... డాడీ రోజూ ఎలక్ట్రిక్ షేవర్‌తో గడ్డం చేస్కుంటాడుగా. మొన్నోరోజు ఆ షేవర్‌ని బ్లేడ్‌తో కోసి దాంట్లోని ఎరుపు వైరుని, పచ్చ వైరుని కలిపేసి స్టిక్కర్ అంటించా. రోజూలాగే షేవ్ చేస్కుంటూ... షాక్ తగిలి చచ్చిపోయాడు. ఇక నిన్నూ, నన్నూ రోజూ కొట్టేవారుండరుగా... అందుకే."

"మేఘనా..." అంటూ ఆ పాప ముఖాన్ని చప్పున గుండెల్లో దాచుకుంది.

"మగాడా... భూమ్మీదపడ్డ మరుక్షణమే జాత్యహంకార మృగానివై ఉక్కుతీగల ముళ్లకంచెను నాటి... శతాబ్దాల బందీని చేసి... ఇంకా శిథిలం చేయాలని ప్రయత్నిస్తే...

అంతమొందించడానికి ఆయుధాలెందుకు?

ఆడదాని అరమోడ్పు కళ్లల్లో ఫెళఫెళమని ప్రాకే ఎఱ్ఱ జీరల్లోంచి కీలాగ్ని రేఖల ప్రళయ ప్రభంజనం చాలు... నీ ఉనికి సైతం కన్పడకుండా స్త్రీత్వం మీద ఉరేయడానికి..."

నీలిమ కళ్లలోంచి వెచ్చటి కన్నీటి బొట్లు చెంపలపై జారిపోయింది.

పోనీ...

పోనీ...

పోతేపోనీ...

*   *   *   *

పదిహేను రోజులు గడిచాయో లేదో...

నీలిమ తల్లి అనసూయమ్మ వచ్చింది. బిడ్డ పరిస్థితి విని బావురుమంది. ఇప్పటికైనా పాపతోసహా ఇంటికెళ్దాం రమ్మని పట్టుపట్టింది.

నీలిమకి తన వూరెళ్లటం ఇష్టంలేదు.

ససేమిరా రానంది. అనసూయమ్మ బ్రతిమాలింది. కోపగించింది.

"ఆడపిల్లకి అత్తగారిల్లంటే అంతఃపురంలోకి వెళ్లే దారులు ఎప్పుడైనా మూసుకుపోవచ్చు. కాని మూతపడ్డ దారులదగ్గరే ఎన్నాళ్లని పడిగాపులు కాస్తాం. పుట్టింటికి దారులు వెతుక్కుంటూ రావల్సిన అవసరం లేదమామ. అమ్మా అని పిలిస్తేనో, నాన్నా అని పలవరిస్తేనో చాలు...

పచ్చటి దారులు ప్రత్యక్షమవుతాయి. నువ్వెప్పుడొచ్చినా మాకు ఆనందమే.

నీకోసం మేం అనుక్షణం ఎదురుచూస్తుంటామని మర్చిపోకు..."

నీలిమ రాదని తెలిసి అనసూయమ్మ కన్నీళ్లతో బయల్దేరింది.

వెళ్లేముందు మరోసారి బ్రతిమాలింది.

"నేనింకా అలిసిపోలేదమ్మా... జీవితంలో పూర్తిగా అలిసిపోయిన రోజు... తప్పకుండా నీదగ్గరికే వస్తాను" అంటూ సాగనంపింది నీలిమ.

*   *   *   *

నీలిమ ఉదయం లేచి మేఘనకి స్నానం చేయిస్తుండగా... కాలింగ్ బెల్ మ్రోగింది. బాత్‌రూంలో మేఘన అల్లరికి చిరుకోపంగా కసురుకుంటున్న నీలిమ అంత ప్రొద్దున్నే 'ఎవరొచ్చి వుంటారబ్బా' అనుకుంటూ వచ్చి తలుపు తీసింది.

తలుపు తీయగానే... కనిపించిన ఆ భార్యభర్తల్ని చూసి ఆశ్చర్యపోయింది. అతడు నిరంజన్, అతడి భార్య నైమిష. వాళ్లిద్దర్నీ చూడగానే నోటమాటరాలేదు.

"మీరు... మీరు..." అంది సందిగ్ధంగా.

"ముందు లోపలికి రానిస్తావా అక్కా" అంది నైమిష. నీలిమ తేరుకొని "రండి... రండి" అంది లోపలికి దారితీస్తూ.

బాత్రూంలోంచి మేఘన కేకలు వేస్తోంది. కుర్చీలు తుడిచి ఇద్దర్నీ కూచోమంది. నిరంజన్ ఇల్లంతా కలియజూస్తున్నాడు. నైమిష కూడా చూసి "చిన్నగా వున్నా అన్నీ పొందిగ్గా, అందంగా అమర్చారు. అవునూ... ఇప్పుడేం చేస్తున్నారు?" అనడిగింది.

"మేఘనకి స్నానం పోస్తున్నాను" నీలిమలో టెన్షన్.

"ముందు స్నానం చేయించిరండి. పిలివని పేరంటంలా మేమిలా చెప్పాపెట్టకుండా వచ్చామేమిటని అనుకుంటున్నారా? ఏమీలేదు. ముందు మీరు పాపకి స్నానం చేయించి రండి" అన్నాడు నిరంజన్.

"ముందు టీ ఇస్తాను. ఒక్క నిమిషం" అంటూ వంటింట్లోకి నడిచింది నీలిమ. వెనకే నైమిష వచ్చి "టీ నేను పెడతాలే అక్కా... ముందు నువ్ పాపకి స్నానం చేయించు" అంది చొరవగా.

నీలిమకి అయోమయంగా వుంది. వీళ్లు అంత ప్రొద్దున్నే రావటం, "ఆఫీస్‌బోయ్‌ని పంపిస్తే నేనే వచ్చేదాన్నిగా" అంది సంశయంగా పాలు గిన్నెలో పోస్తూ "ఏంటక్కా... మీ ఇంటికి మేం రాకూడదా?" స్టవ్ అంటించింది నైమిష.

"రాకూడదని కాదు. నేను మీ ఆఫీస్‌లో ఓ వర్కర్‌ని..." అంటూ ఆగింది.

"మాకు జీవితాన్నిచ్చిన పెద్దదానివి. నిన్ను ఆయనెప్పుడూ వర్కర్ అనుకోవట్లేదు. వర్కర్ అనుకుంటే మా వరండాలో నీ ఫోటో పెట్టి పూజించుకుంటామా? నువ్వో దేవతవి. ఆరోజు వేములవాడ గుడిమెట్లమీద దీవించి పంపిన దేవతని ఈరోజు మరో వరమివ్వమని కోరడానికొచ్చాం" అంది నైమిష.

నీలిమకేమీ అర్థంకాలేదుకాని... టీ మరగగానే వడపోసింది- బాత్రూంలోంచి మేఘన "మమ్మీ... సబ్బు కళ్లల్లోకి పోతుంది. త్వరగా వచ్చేయ్" అని అరుస్తూనే వుంది.

నైమిష ఒక కప్పు నిరంజన్‌కిచ్చి వచ్చింది. తిరిగి వంటింట్లోకి వచ్చి తను ఓ కప్పు తీసుకుంది. నీలిమ నిరాసక్తంగా నవ్వి...

"నేనో శాపగ్రస్తురాలిని... ఆవిషయం నన్ను అనుక్షణం పొడుస్తూనే వుంటుంది. దేవతవంటూ పొగడుతున్నారు మీరేమో."

"అంజనేయుడి బలం ఆయనకే తెలీనట్టు... నీలో దైవగుణమే లేకుంటే ఆరోజు నీ కట్నం పుచ్చుకొని మరో అమ్మాయితో పారిపోతున్నందు ఆయన్ని అక్కడే చంపేసేదానివి. అంత నీచమైన పని ఏ మగాడూ చేసుండడేమో? కాని నువ్వుఉ దీవించావ్. మా తప్పుని

నీపైన వేసుకున్నావ్. నువ్వే కావాలని పెళ్లి కాన్సిల్ చేసుకుంటున్నట్టు చెప్పి మీవాళ్లని ఒప్పించావ్. ఇంతకన్నా ఏం త్యాగం కావాలి? నువ్వు మాలో దేవతగా నిలిచిపోవడానికి..." ఆవేశంగా అంది నైమిష.

"అదంతా జరిగిపోయిన గతం... నాగతమే ఒక బాధల కుంపటి. భరణి చచ్చిపోయాక... మేఘనే నా జీవితంగా ఇలా వెళ్లదీస్తున్నాను. త్యాగం దేవతలాంటి పదాలు తప్ప ఏం మిగలలేదు" నిరాసక్తంగా అంది నీలిమ.

"నీ గతాన్ని తవ్వటం మా ఉద్దేశం కాదక్కా... ఒక విషయం నీతో మాట్లాడాలి. ఓ కోరిక నిన్ను కోరాలని వచ్చాం. ఇప్పటివరకూ ఏ ఆడది మరో ఆడదాన్ని ఇలాంటి కోరిక కోరలేదేమో... ఏ చరిత్రలోనూ, ఏ పురాణాల్లోనూ ఇలాంటి ఘటన కన్పించదేమో. అందుకే ఉదయాన్నే నీకోసం వచ్చాం" అంది నైమిష.

నీలిమ విచిత్రంగా నైమిషవైపు చూసింది.

మెదడ్లో ఆలోచనల సుడులు తిరుగుతుంటే "అంత పెద్ద కోరిక నేనేం తీర్చగలను" అంది.

నైమిష కళ్లల్లో తడి.

ఆ తడి నీలిమ మనసు పొరల్ని కదిలించింది.

నైమిష మౌనం చూసి...

"ఏంటి మీ కోరిక... నాకు చేతనవుతే తప్పక తీరుస్తాను. కానిదైతే మాత్రం నేనేం చేయలేను" అంది.

"నీతో అయ్యేదే... మా జీవితాల్ని నిలబట్టేది. చెప్పక్కా. తీరుస్తావు కదూ!" నైమిష కళ్లు చెలిమలయ్యాయి.

నీలిమ కరిగిపోయింది.

"మీరు అంతగా బాధపడుతున్న సమస్యేంటి? చెప్పు. తప్పకుండా తీర్చడానికి ప్రయత్నిస్తాను" అంది నైమిష ఏదో చెప్పబోయేంతలో...

"మమ్మీ... వ్వా... జారిపడ్డాను" బాత్రూంలోంచి మేఘన కేక విన్పించి "కాసేపయ్యాక మాట్లాడుకుందాం నైమిష" అంటూ బాత్రూంవైపు పరిగెత్తింది.

మేఘన జారిపడి ఏడుస్తూనే వుంది.

"అయ్యో... పడిపోయావా... సారీ చిన్నా..." అంటూ మేఘనని లేవదీసి స్నానం చేయించింది. టవల్తో తుడుస్తుంటే...

"వచ్చిందెవరు మమ్మీ" అనడిగింది.

"నైమిష ఆంటీ..."

"ఆమెవరు?" అనడిగింది మళ్లీ.

"నీకు తెలీదులే."

"మరి... ఏ ఆడది మరో ఆడదాన్ని కోరని కోరిక ఏమిటి? ఆవిడ నిన్నడుగుతోంది కదా?" అంది అమాయకంగా.

నీలిమ మనసు ఆమాటతో త్రుళ్లిపడింది.

నిజమే... ఏమిటది??

ఏ ఆడదీ మరో ఆడదాన్ని కోరని కోరిక...???

ఏ చరిత్రలోనూ... ఏ పురాణాల్లోనూ కన్పించని ఘటన???

ఏమిటది?

ఏమిటదీ ??

ఏమైవుంటుంది???

నీలిమ ఆలోచనలకు ఏమీ తట్టలేదు. అయినా కష్టాల సుడిగుండాలు, సుడిగాలులు ప్రకంపనలు మళ్లీ తన జీవితాన్ని చుట్టేయకపోతే చాలు.

"ఏంటి మమ్మీ ఆలోచిస్తున్నావ్? అదేనా?" అంది మేఘన.

నీలిమ ఈ లోకంలోకొచ్చి 'నీకెందుకమ్మా.. నువ్ తయారై స్కూల్కెళ్లు. పెద్దవాళ్ల విషయంలో పిల్లలు తలదూర్చకూడదు" అంది.

"మరి పిల్లల విషయంలో పెద్దవాళ్లెందుకు తలపెడతారు?" అంది మేఘన.

నీలిమ నవ్వి "నీతో వేగటం నాకు రోజురోజుకీ కష్టమైపోతుంది. మమ్మీని ఇలా సాధించొచ్చా" అంది చిరుకోపంగా.

"సారీ అమ్మా"

మేఘనని రెడీచేసి ఆటోలో పంపించి వచ్చింది నీలిమ. వస్తూనే తనూ కూచుంటూ "సారీ... మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాను. ఇంతకీ మీరు అనేదేమిటి?" అనడిగింది.

నిరంజన్ అయితే తలొంచుకు కూచున్నాడు.

నైమిష మౌనంగానే వుంది. నీలిమ వాళ్లిద్దర్నీ చిత్రంగా చూస్తుండిపోయింది.

రెండు నిమిషాలు గడిచాయి...

"అదేంటి మౌనంగా వుండిపోయారు. ఏంటి నైమిష మీసమస్య" అంది నీలిమ మళ్లీ.

"అక్కా..." నైమిష గొంతులో జీర. కళ్లల్లో కన్నీటి ఊట.

"ఏంటమ్మా... అంత బాధాకరమైన సమస్యా అది" అంటూ లేచివచ్చి నైమిష తలపై చేయి వుంచింది ఆలంబనగా.

నైమిష కళ్లు జలపాతమే అయ్యాయి.

నిరంజన్ ఏమీ మాట్లాడలేదు.

"చెప్పమ్మా... ఏంటి మీ కోరిక... తప్పక తీరుస్తాను. ముందు అదేంటో చెప్పు" అంది.

ఆ మాటతో నైమిష కళ్లు తుడుచుకుంది. అయినా కన్నీళ్లు ఉబికి వస్తుంటే... "నా... నా గర్భసంచి తీసేశారు" అంది.

నీలిమ కళ్లల్లో జాలి కురిసింది.

"నెల తప్పిన నేను డాక్టర్‌కి చూపించుకోగానే... గర్భసంచి పలుచగా వుందని బిడ్డ పెరిగితే తల్లికి ప్రమాదమని పిండాన్ని పిండంతోపాటు గర్భసంచిని తీసేశారు."

"అవునా...!"

"అవునక్కా... ఇక మాకు పిల్లలు పుట్టే యోగం లేదు" అంది కన్నీళ్ల పర్యంతమై.

నీలిమ ఓదారుస్తూ "ఊరుకో నైమిష" అంది. ఆ వెంటనే మనసులో 'మేఘనని దత్తత కోరడానికి గాని వచ్చారా?' అనుకుంది.

తన జీవితంలో అల్లుకుపోయిన తీగలాంటి మేఘన దూరమైతే ఇంకేమైనా వుందా? నో... ఎట్టి పరిస్థితుల్లోనూ మేఘనని వాళ్లకివ్వకూడదు. ఈ విషయంలో రాజీపడకూడదు. ఇప్పటికే జీవితంలో అన్నీ కోల్పోయాను. ఇప్పుడు మేఘనని కూడా పోగొట్టుకుంటే... ఇంకా ఒంటరిగా... వూహూ... ఆవూహే భయంకరంగా వుంది. మేఘనని వీళ్లకివ్వను" అనుకుంది.

"ఇంక మాకు పిల్లలు పుట్టే అవకాశం లేదు. అందుకని..." ఆగిపోయింది నైమిష.

నిమిషంపాటు అందరి మధ్యా మౌనం.

"చెప్పు నైమిష" నిర్లిప్తంగా అడిగింది నీలిమ.

"అందుకని... మాకో బిడ్డని కనివ్వడానికి... నువ్వు తల్లివి కావాలి." నెత్తిమీద మిస్సయిల్లు కురిసినంతగా కంపించిపోయింది నీలిమ.

"నువ్వు... తల్లివి... కావాలి."

ఆ మాట చెవుల్లో హోరెత్తింది.

"నైమిషా... ఏంటి నువ్వనేది" నీలిమ అయోమయంగా అంది.

"అవునక్కా... నాకెలాగూ గర్భసంచి లేదు. మాకు ఒక్క వంశాంకురమైనా కావాలి. అందుకోసం... నువ్వు తల్లివి కావాలని అడగడానికి వచ్చాము."

"నాకేం అర్థం కావట్లేదు. నువ్వు కోరుతున్న కోరిక ఎంత నీచమైందో కొంచెమైనా ఊహించావా? నీభర్త శరీరాన్ని పంచుకొని నేను తల్లిని కావాలా? ఎలా ఊహిస్తున్నావ్ నువ్వసలు?" నీలిమ గుండె బరస్ట్ అయింది.

"ఆయన శరీరాన్ని మరో ఆడది పంచుకోవాలని నేను కలలో కూడా ఆలోచించను. కాకపోతే మా మనసుల్ని పంచుకొని ఆలోచించమంటున్నాను... ప్లీజ్!"

నిరంజన్ ప్రేక్షకుడిలా చూస్తున్నాడు.

"నీ మాటలు నాకర్థంకావట్లేదు. నేను తల్లిని కావడమేంటి? నీకో పచ్చి నిజం తెల్సా? పెళ్లికి ముందే ఏ ఆడదానికి జరగని దారుణం నాకు జరిగింది. మూడుముళ్లు పడకముందే నా గర్భనాళాలు ముడిపడ్డాయి"

ఆ మాటకి... ఇద్దరూ విస్మయంగా చూసారు నీలిమవైపు. అయినా నైమిష తేరుకుంది.

"అది కాదక్కా... కొంచెం నేను చెప్పేది విను. మాకోసం నువ్వు తల్లివి కావాలంటే ఆయన శరీరాన్ని తాకనక్కర్లేదు. టెస్ట్‌ట్యూబ్ పద్ధతులు చాలా వచ్చాయి. ఆయన స్పెర్మ్‌ని నా అండంతో కలిపి టెస్ట్‌ట్యూబ్‌లో పొదిగిస్తారు. పొదిగించిన అండాన్ని... నీ గర్భసంచిలో ప్రవేశపెడతారు. తొమ్మిది నెలలు మాకోసం మోసి... ఓ బిడ్డని కనివ్వమని కోరడానికి వచ్చాం. నీ గర్భనాళాలు ముడేసివున్నా దీనికి సంబంధం లేదు. తొమ్మిది నెలలు నీ కడుపులో మోసి మాకివ్వు... కాదనకు ప్లీజ్ అక్కా" అంది నైమిష.

నీలిమకంతా విచిత్రంగా తోచింది.

అంతా జరిగాక నిరంజన్ నోరు విప్పాడు.

"ఆరోజు వేములవాడ గుడిమెట్లమీద మీ కాళ్లు పట్టుకొని ప్రాధేయపడ్డాం. ఈరోజు అదే స్థితిలో వున్నాం. మీకు పుట్టబోయేది మా బిడ్డే. మీరు తొమ్మిది నెలలు మోసిస్తారు. మమ్మల్ని కాదనకండి. ప్లీజ్..." నిరంజన్ చేతులెత్తి నమస్కరించాడు.

నీలిమ శిలాప్రతిమే అయింది.

"ఖర్చంతా మేమే భరిస్తాం అక్కా. నా భర్త సెమన్, నా ఓవరీ టెస్ట్‌ట్యూబ్‌లో పొదిగించాక... చిన్న ఆపరేషన్‌తో నీ గర్భంలో ప్రవేశపెట్టినప్పట్నించి డెలివరీ అయ్యేంతవరకూ... నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాము. ఒప్పుకో అక్కా... నీకు నమస్కరిస్తున్నాం..."

నీలిమ ఆలోచనలు అచేతనమయ్యాయి.

మెదడు మంచుగడ్డలా చల్లబడింది.

"మాకు బిడ్డని కనివ్వడానికి అంగీకరించక్కా... మా జీవితాల్ని నిలబెట్టు" నీలిమ మనసు ఉద్విగ్నంగా ఊపిర్లందక ఊగిసలాడుతోంది.

"ప్లీజ్..." నిరంజన్ అన్నాడు.

"అక్కా... ప్లీజ్ నైమిష అంది.

పదినిమిషాల తర్వాత నీలిమ తేరుకుంది.

చిన్ని స్వరంతో అంది. "మీరడిగేది... జస్ట్‌లైక్... విదేశాల్లో... రెంటెడ్ మదర్స్‌లాగా..."

"అవునక్కా... కానిక్కడ నీ గర్భసంచిని అద్దెకివ్వమని అడగట్లేదు. దయచేసి అలా అనుకోవద్దు కూడా. మాకోసం దయతో అంగీకరించు" అంది నైమిష.

అంతా అర్థమయ్యాక... నీలిమ ఆలోచనల్లో పడింది.

నిదానంగా కుర్చీలో కూచొని "నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి" అంది. ఆమెని ఆ సమయంలో ఒంటరిగా విడిచిపెట్టడమే సబబనిపించింది ఇద్దరికీ.

"మాకోరిక మన్నిస్తానని ముందుగా మాటిచ్చావ్ అక్కా. ఆలోచించుకోవటమే కాదు. సాయంకాలానికల్లా నీ అంగీకారాన్ని ఫోన్‌లో తెలియజేస్తావని... ఫోన్ దగ్గరే ఎదురుచూస్తుంటాం" అంది నైమిష.

ఇద్దరూ అక్కణ్ణించి కదిలారు.

నీలిమ మనసులో మళ్లీ అనంతమైన సంఘర్షణ.

రెండుమార్లు 'పెళ్లి' జరిగినా... మగాడి స్పర్శలోతులు కూడా తెలీకుండా ఇప్పుడు తల్లి కాబోతుందా??

అసలేంటి తన జీవితం??

నైమిష చెప్పినట్టు... ఇలాంటి కోరిక ఏ పురాణాల్లోనూ, ఏ చరిత్రలోనూ కన్పించదు. తనకి జీవితంలో తల్లినయ్యే యోగం ఇలా రాసుందా? బ్రహ్మ కూడా మద్యం తాగివుంటే... ఆ మద్యం మత్తులో తన తలరాత రాసివుంటాడేమో...

తల్లినయ్యాక... ఆబిడ్డ తనదికాదు.

కాలేజీ రోజుల్లో... మాతృత్వం గురించి, అందులోని గొప్పదనం గురించి ఫ్రెండ్స్‌తో ఎంత వాదించేదాన్ని.

పెరిగే కడుపుని ప్రేమించటంలో వుండే అనుభూతిని గురించి ఎంతగా ఊహించి చెప్పేదాన్ని చివరికి తన జీవితంలో మాతృత్వం ఇలా తొంగి చూడనుందా?

అసలు తను ఒప్పుకోవాలా.... వద్దా...

అనాలోచితంగా ఆమెకు ఓ పాట గుర్తొచ్చింది. కాలేజీ రోజుల్లో పాడిన పాటకి సెకండ్ ప్రైజ్ వచ్చిన పాటది. అప్పుడు ప్రైజ్ కూడా బిడ్డని లాలిస్తున్న తల్లిని బొమ్మనే ఇచ్చారు. ఆ పాటకూడా లాలిపాటే... ఒకప్పుడు రోజూ పాడుకునేది.

జోలాలి... జోలాలి...
నైనా... ఒకటాయె... రెండాయె ఉయ్యాల
రెండు మూడు మాసములాయె ఉయ్యాల
మూడో మాసములోన ఉయ్యాల...
నైనా... ముడికట్లు బిగుతాయె ఉయ్యాల

జోలాలి... జోలాలి...
నైనా... నాలుగు మాసంలోన ఉయ్యల
నడుమంతా పొంగిపోయె ఉయ్యాల.
జోలాలి... జోలాలి...
నాలుగు అయిదు మాసములాయె ఉయ్యాల
ఉవ్విళ్లు ఊరుతుండె ఉయ్యాల
జోలాలి... జోలాలి...
అయిదు... ఆరు మాసములాయె ఉయ్యాల
నైన... ఆరో మాసంలోన ఉయ్యాల
అలసటలే మొదలాయె ఉయ్యాల
జోలాలి... జోలాలి...
ఆరు... ఏడు మాసములాయె ఉయ్యాల
నైన... ఏడో మాసంలోన ఉయ్యాల
వేవిళ్లు మొదలాయె ఉయ్యాల
జోలాలి... జోలాలి...
ఏడాయె... ఎనిమిదాయె ఉయ్యాల
జోలాలి... జోలాలి...
నైనా... ఎనిమిది మాసంలోన ఉయ్యాల
కడుపులోన కదలికలు ఉయ్యాల
జోలాలి... జోలాలి...
ఎనిమిదాయె తొమ్మిదాయె ఉయ్యాల
నైనా... తొమ్మిదో మాసంలోన ఉయ్యాల
శ్రీకృష్ణ జన్మమురా ఉయ్యాల...
ఉయ్యాల...
ఉయ్యాల...

నీలిమ గొంతు సన్నగా పాడుతుంటె ఈలోకంలోపడి ఉలిక్కిపడింది. తనేంటి ఇలా ఆలోచిస్తోంది.

బాధగా కణతలు రుద్దుకుంది.

ఆలోచనల మధ్య అన్నం కూడా సరిగా తిన్లేదు.

మనసంతా గతం, వర్తమానం, భవిష్యత్తు చుట్టూ గిరికీలు కొడుతుంటే

అన్యమనస్కంగా మారింది.

వాళ్ల వంశాంకురం కోసం గర్భం ధరిస్తే... లోకం ఎలా అనుకుంటుంది? తననెంత విచిత్రంగా చూస్తుంది?

సైన్సు కూడా ఎంతగా ఎదిగింది?

ఈ మనుషులు తనని స్వార్థానికి వాడుకుంటున్నారా?

ఏమైనా... నైమిష మొహం చూస్తే ఎంత బాధగా వుంది. ఆ రోజంతా ఆలోచనలే.

చిత్రమైన ఒత్తిడి.

అనంతమైన... సంఘర్షణ. విచిత్రమైన... అనుభూతి.

*　　　*　　　*　　　*

గడియారం అయిదు గంటలు కొట్టేసరికి ఉలిక్కిపడింది.

గుండెల్లో దడ...

మేఘన కూడా స్కూల్‌నించి ఇంకా రాలేదేమిటి? తన ఫోన్ కోసం వాళ్లు ఎదురుచూస్తూంటారా?

ఫోన్‌లో ఏదో ఒకటి చెప్పాలి...

ఏం చెప్పాలి...?

నైమిష ప్రాధేయపూర్వకమైన మాటలు... నిరంజన్ దీనమైన చూపులు. ఆమెలో తీరం చేరని తుపాన్‌ని సృష్టించాయి. చివరికి తన నిర్ణయాన్ని మార్చుకుంది.

పిల్లని కనివ్వడానికి ఆమె మనసు నిరాకరించింది. మనసుని స్థిరపరచుకొని ఇంటికి తాళం వేసి మేఘన ఇంకా రాలేదేమిటా అని ఆలోచిస్తూనే టెలిఫోన్ బూత్‌వైపు నడిచింది.

నైమిష ఫోన్ నెంబర్ని డయల్ చేసింది.

తన తిరస్కారాన్ని ఎలా చెప్పాలా అన్న సందిగ్ధంలో నుదుటిమీద చిరుచెమట పేరుకొంది.

అవతల ఫోన్ రింగవుతుంటే... గుండె వేగం హెచ్చింది. అవతల్నుంచి ఫోనెత్తగానే "హలో..." అంది.

"నీలిమగారా... మీఫోన్ కోసం ఇక్కడే కూచున్నాం"

నిరంజన్ కంఠం విని... ఒళ్లంతా కంపించింది. అతడి శుక్ర కణాలు తన గర్భంలో పిండంగా ఎదుగుతాయా?

మనసంతా చేదుగా మారింది...

బలవంతంగా అక్షరాలు కూడదీసుకొని "సా...రీ..." అని చప్పున ఫోన్ పెట్టేసింది. ఏదో బరువు దిగిపోయినంత రిలీఫ్‌గా వెనుదిరిగింది.

ఇంటికొచ్చేసరికి... ఆటో బోయ్ కన్పించాడు కాని... మేఘన కన్పించలేదు. ఆటో

బోయ్ నీలిమకి ఎదురుగా వచ్చి "మేడమ్... మేఘనకి స్కూల్లో ఆటలాడుతుంటే కాలికి దెబ్బ తగిలింది. బాగా బ్లడ్ బ్లీడింగ్ అవుతుంటే శ్రీదేవి హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. ప్రిన్స్‌పాల్ మీకు చెప్పమన్నారు" అన్నాడు.

ఆ వార్త విని నీలిమ గుండెలదిరాయి. కంగారుగా ఇంటి తాళం కూడా తీయకుండా అదే ఆటో ఎక్కి శ్రీదేవి హాస్పిటల్‌కి చేరింది.

విశాలమైన ఆస్పత్రి.

తెల్లపావురాలు ఎగురుతున్నట్టు... నర్సుల హడావిడి ఎక్కువగా వుంది. మేఘన రూమ్ కనుక్కొని ఆదుర్దాగా పరిగెత్తింది. మేఘన గదిలో ముగ్గురు డాక్టర్లున్నారు. నీలిమని చూడగానే మేఘన మమ్మీ అంటూ ఏడ్వడం మొదలెట్టింది.

"ఏమైందమ్మా"

మేఘన కాలికి తగిలిన చిన్నగాయాన్ని చూస్తూనే ఆందోళనగా అడిగింది. ఒక నర్స్ గాయం దగ్గర కాటన్ అడ్డుపెట్టి పట్టుకుంది.

"వాలీబాల్ ఆడుతుంటే... పడిపోయాను. కాలికి దెబ్బతగిలి రక్తంపోయింది".

"ఏం కాదమ్మా... చిన్నగాయమే కదా. తగ్గిపోతుంది" నీలిమ అనునయంగా చెప్పింది. అయినా మేఘనలో వెక్కిళ్లు వస్తున్నాయి.

గదిలోంచి ముగ్గురు డాక్టర్లు వెళ్లిపోయారు. ప్రక్కగదిలో దాదాపు వాళ్లు పదిహేను నిమిషాలపాటు డిస్కషన్‌లో మునిగిపోయారు.

చిన్నగాయానికి కట్టుకట్టి పంపాల్సిందానికి... ఇంతసేపు మేఘనని ఎందుకు 'ఇన్ పేషెంట్‌గా' జాయిన్ చేసుకున్నారో నీలిమకి అర్థంకాలేదు. ఇంతలో ఒక డాక్టర్ వచ్చి "పాపకి మీరేమవుతారు?" అనడిగాడు.

"తల్లిని..." చెప్పింది నీలిమ.

"పాప వివరాలు చెప్పండి" అంటూ వయసు, చదువు, బ్లడ్‌గ్రూపు, తల్లిదండ్రుల పేర్లు మున్నగు విషయాలన్నీ రాసుకున్నాడు.

"చిన్నగాయమే కదా డాక్టర్... తీసికెళ్లొచ్చా?" అంది. డాక్టర్ నీలిమవైపు జాలీగా చూసాడు. ఆ చూపుల్లోని పిటీనెస్‌ని కనిపెట్టిన నీలిమ మనసు భయంగా కలవరపడింది.

మనసేదో కీడు శంకించింది.

"సారీ మీ పాప విషయంలో మరో ఇద్దరు డాక్టర్స్ హాస్పిటల్‌కి వస్తున్నారు. మీపాపలో విచిత్రమైన జబ్బు బయటపడింది. అందుకోసం ఇప్పటికిప్పుడు హాస్పిటల్ సూపరెంటెంట్ డాక్టర్ ఝాన్సీమణి ఆధ్వర్యంలో అయిదుగురు డాక్టర్లతో ఒక కమిటీ వేసాం" అన్నాడాయన.

డాక్టర్ మాటలు సగం వరకూ అర్థమై నిర్ఘాంతపోయింది నీలిమ.

అప్పుడ్ నర్స్ మూడు బ్లడ్ బాటిల్స్ తెచ్చిపెట్టింది.

"మా పాపకి... మాపాపకి ఏం జబ్బు డాక్టర్?" మనసు అపశకునాన్ని తలుస్తుంటే మాటలు కూడదీసుకుంటూ అడిగింది.

"నాన్ క్లాటింగ్ డిఫీషియన్సీ"

"అంటే?" నీలిమకి అర్థంకాలేదు.

"అంటే ఇలాంటి జబ్బున్న వ్యక్తుల్లో రక్తం గడ్డకట్టుకుపోదు. బ్లీడింగ్ అవుతూనే వుంటుంది. ఎంత రక్తం ఎక్కించినాసరే. మరోవైపు బ్లీడింగ్ అవుతూనే వుంటుంది. బ్లడ్ క్లాటింగ్ అంటూ వుండదు. దాంతో రక్తస్రావం జరిగి ప్రాణాలకే ముప్పురావచ్చు. ఇలాంటి జబ్బు కోటిమందిలో ఒక్కరో, ఇద్దరికో వుంటుంది."

డాక్టర్ చెపుతుంటే నీలిమలో నవనాడులు కృంగిపోతున్నాయి. అప్పుడే హాస్పిటల్ ఆవరణలోకి సూపర్నెంట్ డాక్టర్ ఝాన్సిమణి కారు వచ్చి ఆగింది. కారు దిగుతూనే ఆమె మేఘన గదిలోకి వచ్చి ఏవో పరీక్షలు చేసింది. లాంజ్‌లోకెళ్లి ఏవో డిస్కషన్ చేసింది మిగతా డాక్టర్లతో. ఓవైపు నర్సులు, కాంపౌండర్లు హడావిడిగా తిరుగుతున్నారు. ఆ దృశ్యం చూస్తుంటే నీలిమ గుండె చెరువవుతోంది. మేఘన కాలిలోంచి ఇంకా రక్తం వస్తోంది. రక్తం పోయినకొద్దీ మరోవైపు ఎక్కిస్తున్నారు. తలపై చేయివేసి నిమిరింది.

హాస్పిటల్ అంతటా లైట్లు వెలిగాయి.

రాయిలా మారిందనుకున్న మనసు మళ్లీ వెన్నలా కరుగుతోంది. పేగుబంధం కాకపోయినా పెనవేసుకున్న బంధమై... అనురాగాల మధ్య బందీలా మార్చిన పాపసైతం తనని ఏ విషాదంలోకి తీసికెళ్తుందో అన్న భయం నీలిమ గుండె పొరల్ని చీల్చుతోంది.

"మేఘనా..." అంది భారంగా.

మేఘన కళ్లు మూతలు పడుతున్నాయి. మరోవైపు రక్తస్రావం జరక్కుండా పట్టుకున్న నర్స్ ఇద్దర్నీ జాలీగా చూసింది.

"మీవారికి ఫోన్ చేయలేకపోయారా?" అంది. నీలిమ ఆమెవైపు నిర్లిప్తంగా చూసింది.

"డాక్టర్స్‌తో కమిటీ వేసారంటే మామూలు జబ్బుకాదు. కారిపోయే రక్తం గడ్డకట్టుకుపోయేలా ఏం చేస్తారోగాని... ఈ జబ్బుకి ఎన్ని బ్లడ్ బాటిల్స్ ఎక్కించినా ప్రయోజనం వుండదు. ఎందుకైనా మంచిది. ఈలోపు మీవారిని పిలిపించుకోండి" నర్స్ మరోసారి అంది.

నీలిమకి ఏం చెప్పాలో అర్థంకాలేదు.

అప్పుడే గదిలోకి డాక్టర్ ఝాన్సీమణి, ఆమెతోపాటు మరో నలుగురు డాక్టర్లు వచ్చారు. ఏవో ఇంజక్షన్స్ ఇచ్చారు. కొన్ని టాబ్లెట్లు మింగించారు. మేఘన కోసం రెండు బ్లడ్ బ్యాంకులకి ఫోన్ చేసారు.

ఝాన్సిమణి నీలిమని పరిచయం చేసుకొని ప్రక్కగదిలోకి తీసికెళ్లింది.

నీలిమని కూచోమని చెప్పి "మీ ఆయనని పిలిపిస్తారా?" అంది.

"సారీ... ఆయనిప్పుడు ఇక్కడ లేరు" అంది తత్తరపడుతూ.

"అలాగా... మీపాపకి విచిత్రమైన జబ్బు బయటపడింది. ఎవరికైనా గాయం తగిలి రక్తం కారితే సాధారణంగా నిమిషంలోపు అది గడ్డకడుతుంది కానీ మీ పాపకి రక్తం గడ్డకట్టక కారిపోతూనే వుంటుంది. ఏదైనా బలమైన దెబ్బతగిలిప్పుడు ప్రాణాలకే నష్టం. రాష్ట్రం మొత్తమ్మీద ఇలాంటి పేషెంట్లు ఎనిమిదిమంది వరకూ ఉన్నారు. మీ వంశానికిగాని, మీ భర్త వంశానికిగాని చెందిన మాడుతరాల వ్యక్తులు మేనరికాలు చేసుకోవటం వల్ల వచ్చే చిత్రమైన జబ్బు ఇది. ఇది నయం కావడానికి ఎనిమిది డోసులు ప్రత్యేకమైన ఇంజక్షన్లు రోజుకి రెండు చొప్పున వేయాలి. కాకపోతే ఆ ఇంజక్షన్ ఒక్కో డోసుకి... పదివేల రూపాయలుంటుంది. దాదాపు మొత్తంగా హాస్పిటల్ ఖర్చుల్తో కలిపి లక్ష రూపాయల వరకూ ఖర్చవుతుంది. మీరు మరోరెండు గంటల్లో డబ్బు అరేంజ్‌చేయగలనంటే... ఆఇంజక్షన్స్ తెప్పిస్తాం. లేదంటే ఎంత రక్తం ఎక్కించినా మరోవైపు రక్తస్రావమవుతూనే వుంటుంది. పాప ప్రాణాలకు ముప్పు రావచ్చు. ఆలోచించుకోని... అరగంటలోగా మీ నిర్ణయాన్ని చెప్పండి. ఇంతకుమించి మేమేం చేయలేం" డాక్టర్ ఝాన్సీమణి చెప్పిన వివరాలు విన్నాక నీలిమ గుండె చిట్లిపోయింది. కళ్లల్లో కన్నీటి కెరటాలు ఢీకొంటున్నాయి.

రెండు గంటల్లో .... లక్ష రూపాయలు!!

రెండు గంటల్లో...

లక్ష రూపాయలు!!!

"మీరు, టైం వేస్ట్ చేయకుండా... ఏదో ఒకటి ఆలోచించికోండి. చాలా క్రిటికల్ కండిషన్. తప్పదు. ఇలాంటి స్థితిలోనే గుండె రాయి చేసుకోవాలి" ఝాన్సీమణి నీలిమ భుజం తట్టి బయటికి వెళ్లింది.

ఆమె అక్కడే నిల్చుంటే... నీలిమ బావురుమని ఏడ్చేదే.

ఆ క్షణాన... తను ఎంత ఒంటరిదో... తన బతుకు బాటలోకి గువ్వపిల్లలా వచ్చిన మేఘన కూడా తనని కష్టాల కడలిలో ముంచుతోందన్న బాధ... దుఃఖాన్ని తన్నుకొచ్చేలా చేస్తోంది. ఆ గదిలోవున్న గడియారం క్షణాల చప్పుడు చేస్తూ... కాలాన్ని గుర్తు చేస్తోంది.

రెండు గంటల్లో లక్ష రూపాయలు.

ఎలా వస్తాయి...?

ఎక్కణ్ణించి వస్తాయి...?

లేదంటే... ఒంట్లోని రక్తమంతా పోయి మేఘన కూడా తనని అన్యాయం చేసి పోతుందా?

పోనీ... పోనీ... పోతేపోనీ...

'ఛ' అనుకుంది కసిగా. మేఘనని దక్కించుకోవాలి. ఎలాగైనాసరే, లక్షరూపాయలు ఇప్పటికిప్పుడు ఎలా వస్తాయి?

ఆమెకు చప్పున గుర్తొచ్చారు.

నైమిష... నిరంజన్.

వాళ్లు కోరిన కోరికని ఒప్పుకుంటే...?

లక్ష రూపాయలు తీసుకొని బిడ్డని కనిస్తానని ఒప్పందం చేసుకుంటే...??

ఈ ఆలోచన రాగానే ఆమె ఆ గదిలోలేదు.

*　　*　　*　　*

తలుపు తీసిన నైమిష చూసి ఆశ్చర్యపోయింది. గంట క్రితమే నిరందజన్‌తో ఫోన్‌లో 'సారీ' చెప్పిన నీలిమ నేరుగా ఇంటికి రావటం విస్మయంగాను, అనుమానంగానూ తోచి ఇంట్లోకి ఆహ్వానించింది.

ఆమెను చూసి నిరంజన్ కూడా ఆశ్చర్యపోయాడు. వాళ్ల మోహాలలో ఏదో వెలుగు పాకుతోంది.

"రా అక్కా... కూచో..." సాదరంగా కూచోబెట్టి పళ్లరసం తెచ్చింది నైమిష.

నీలిమకి తాగాలన్పించలేదు. తలొంచుకొని కూచొంది.

ముగ్గురి మధ్యా నిశ్శబ్దం...

ఎవరికేం మాట్లాడాలో తోచటంలేదు. అప్పటికే అరగంట గడిచిందన్న ఆతృత నీలిమ అంతరంగాల్లో... చివరికి తనే మాటలు కూడదీసుకుంటూ...

"నైమీషా... మీకు బిడ్డని కనివ్వడానికి ఒప్పుకుంటున్నాను. కాని..." అంది.

వాళ్లలో ఒక్కసారిగా ఆనందం.

"కాని ఏంటి... చెప్పక్కా... నువ్వు ఒప్పుకున్నావ్... అంతే చాలు. ఏమిటో చెప్పు."

"ఒక షరతు..."

ఆ మాటతో వాళ్లు నివ్వెరపోయారు.

"ఏం కండిషనండి" నిరంజన్ కూల్‌గా అడిగాడు.

"మీకు... బిడ్డని కనిచ్చినందుకు... ల... లక్ష రూపాయలివ్వాలి... అదీ ఇప్పుడే కావాలి" చెప్పలేక చెప్పిందామె.

"మేఘనకి చిత్రమైన జబ్బు చేసింది. ఇప్పుడు ఆస్పత్రినించే వస్తున్నాను. ఎనిమిది డోసుల ఇంజక్షన్స్ ఇవ్వాలట. డోసుకి పదివేల రూపాయలు. దాదాపు లక్ష రూపాయలు రెండు గంటల్లో తెమ్మన్నారు. ఇప్పటికే అరగంట గడిచింది. అందుకోసమైనా... నేనీ నిర్ణయం

తీసుకోవాల్సి వచ్చింది. మేఘన చచ్చిపోతే నేను బ్రతకలేను నైమిషా..." అప్పటివరకూ దాచుకున్న దుఃఖం ఉప్పెనలా వచ్చి పెనుశోకమై తెగిపడగా నైమిషని చుట్టేసి బావురుమంది నీలిమ.

ఇద్దరూ ఆమెను ఓదార్చారు.

అయిదు నిమిషాల తర్వాత నిరంజన్ అడిగాడు. "మేఘన ఇప్పుడు ఏ హాస్పిటల్లో వుంది" అని.

"శ్రీదేవి హాస్పిటల్".

వెంటనే నిరంజన్ హాస్పిటల్‌కి ఫోన్ చేసి డబ్బు తెస్తున్నట్టు చెప్పాడు.

*　　*　　*　　*

మేఘనని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వుంచి 'టిఫికల్ కండిషన్డ్ పేషెంట్' గా చికిత్స మొదలెట్టారు. నిరంజన్ నైమిష దగ్గరుండి అన్నీ చూసుకున్నారు. ఎనభైవేల రూపాయలు ఇంజక్షన్ డోసుల కొరకు నిరంజన్ చెల్లించాడు. పదివేలు మిగతా ఖర్చులయ్యాయి. నైమిష మరో పదివేల రూపాయల్ని నీలిమ చేతిలో వుంచింది.

"మా జీవితంలో వెలుగు నింపడం కోసం నువ్వు చేస్తున్న సాయానికి ఇది వెలకట్టడం కాదక్కా... నీకు అన్నింటికి మేం వున్నామని గుర్తుంచుకో. మళ్లీ కలుస్తాం" అంది నైమిష.

"మేఘనకి ఇంకేం కాదు. వర్రీకాకండి. మీ నిర్ణయానికి మరోసారి థాంక్స్" నిరంజన్ చెప్పి ఇద్దరూ వెళ్లిపోయారు.

అప్పటికే రాత్రి ఎనిమిదిన్నర దాటింది.

ఆస్పత్రి వరండాలో ఒంటరిగా కూచుంది నీలిమ. ఆలోచనలు దాడి చేస్తున్నాయి. మేఘనకి ముప్పు తప్పినందుకు మనసు కుదుటపడ్డా... ఆలోచనలే తేనెటీగలానూ రొదపెడుతున్నాయి.

ఆస్పత్రి చాలా రిచ్‌గా వుండటంతో నిశ్శబ్దం కూడా డిగ్నిటీగా రాజ్యమేలుతోంది. కనీసం డెటాయిల్ వాసన కూడా రాకుండా నీట్‌గా, పూలమొక్కల మధ్య అందంగా, ఆధునికంగా వుంది.

నీలిమ ఆస్పత్రిని పరిశీలిస్తుంటే... కొంతదూరంలో సిగరెట్ తాగుతున్న కుర్ర డాక్టర్ల మాటలు విన్పించాయి మసక వెలుతుర్లో...

"ఆ పాప జబ్బు గురించి హాస్పిటల్ ఛైర్మన్‌గార్కి తెలిసిందట. ఆ డిసీజ్ రేర్ కేస్ అయినప్పటికీ... ఎనభైవేలు పెట్టి ఇంజక్షన్ డోస్‌లు వేరే హాస్పిటల్ నించి తెప్పించటంతో కోపంతో మండిపడుతున్నాడట"

"ఆ ఇంజక్షన్స్ అవసరం ఇప్పటివరకూ మన హాస్పిటల్‌కు రాలేదు. బయటనించి

ఏవైనా మెడిసిన్ తెప్పిస్తే ఇన్సల్టింగ్‌గా ఫీలవుతాడాయన."

"ఏమైనా... పాప కేసు తెల్సుకోవడానికి, పాపని చూడ్డానికి పది నిమిషాల్లో వస్తాడట."

"డాక్టర్ ఝాన్సీమణికి ఆయనేం తిడతాడేమోనని భయం పట్టుకుంది" అంటూ సిగరెట్లు గబగబా పీల్చేసి వెళ్లిపోయారు.

నీలిమ నిట్టూర్చింది.

చిన్నగాయమనుకుంటే... మేఘనకి ఎంత పెద్ద జబ్బు బయటపడిందో. దానికోసం ఎంతమంది హడావిడి పడుతున్నారో అనుకుంది. అప్పుడే హాస్పిటల్ ఆవరణలోకి తెల్ల సియోలో వచ్చి ఆగింది. సూట్‌లో నిండుగా వున్న యువకుడు దిగగానే... డాక్టర్ ఝాన్సీమణితోపాటు మరో నలుగురు డాక్టర్లు ఎదురుగా పరిగెత్తుకొచ్చారు.

ఆయన నడుస్తూనే వాళ్లనేవో అడుగుతున్నాడు. ఆయనే హాస్పిటల్ ఛైర్మన్ అయివుండాలి. బహుశా మేఘన గురించే అయివుంటుంది అనుకొంది.

వాళ్లు వరండాలోంచి వెళ్తుంటే నీలిమ అతణ్ణి చూచాయగా చూసింది. ఆ వెంటనే ఆమెకు అతణ్ణి ఏక్కడో చూసినట్టుగా తోచింది.

ఎక్కడ చూసింది?

ఎక్కడ?

ఎక్కడ??

ఎక్కడ???

ఒక శిలా జ్ఞాపకం గుండె పొరల్లోంచి. రాలిపడి...

ఒక అనుభూతి కెరటం చీకటి శిథిలాల్ని చీల్చుకొని...

ఓ కన్నీటి శకలం కళ్లల్లో అణువిస్ఫోటమై పెకిలించుకొని...

ఓ కన్నెపిల్ల కలల అంచుల మీద వాలిపోయిన నీలినీడ కదిలిపోయి... కమిలిపోయి... కుమిలిపోయిన జ్ఞాపకం ఫెటేల్మని మెదడుని ఢీకొట్టినట్టు...

అతడు గుర్తొచ్చాడు!!

చంద్రప్రభాకర్!!!

మెడికల్ రిప్రెజెంటేటివ్ ఉద్యోగం కోసం ఊరొచ్చి లాడ్జింగ్‌లో దిగాలన్నా డబ్బులేక పెళ్లిచూపుల పేర ఇంట్లో చొరబడి అతిథి పేర అన్ని అవసరాలు తీర్చుకొని... ఉద్యోగం రాగానే కట్నం కోసం తన ఫ్రెండ్‌ని పెళ్లాడిన... చంద్రప్రభాకర్.

తన మిత్రురాలు శైలజని కట్నం కోసం చంపిన... చంద్రప్రభాకర్.

డాక్టర్లతో కల్సి... అతడు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి వెడుతున్నాడు. ఆమె కళ్లలోంచి కన్నీరు రాలేదు. అవి తడిగా మారకముందే మనసు మొరాయించింది.

పోనీ... పోనీ... పోతేపోనీ...

* * * *

మూడురోజుల తర్వాత... ఆరోజు మేఘనని డిశ్చార్జి చేస్తున్నట్టు డాక్టర్ ఝాన్సీమణి చెప్పింది. ముందు ముందు రక్తం పోయేలా ఏ ప్రమాదం తెచ్చుకోకూడదని మేఘనకి జాగ్రత్తలు చెప్పింది. మిగతా ఫీజులన్నీ చెల్లించాక...

"వస్తాం డాక్టర్" అంది నీలిమ.

"హాస్పిటల్‌కీ, పోలీస్ స్టేషన్‌కి వెళ్లివచ్చేటప్పుడు మళ్లీ వస్తామని చెప్పకూడదు" నవ్వింది ఝాన్సిమణి. నీలిమ, మేఘన కూడా నవ్వారు.

"లేదు డాక్టర్... మళ్లీ రావల్సివుంది. ఈసారి పేషెంట్‌గా నేను వస్తాను" అంది నీలిమ.

"అదేంటి?" అడిగింది ఝాన్సీమణి.

"ఫెర్టిలిటీ క్లినిక్‌కి రావల్సివుంది. హాస్పిటల్ సూపర్నెంట్ మీరే కదా. అప్పుడు కలుస్తాను మళ్లీ."

ఝాన్సీమణి ఏదో అడిగేంతలో... నర్స్ వచ్చి "నీలిమగూరూ... మిమ్మల్ని ఛైర్మన్‌గారు పిలుస్తున్నారు" అంది నీలిమ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"వెళ్లండి" అంటూ వార్డులవైపు వెళ్లిపోయింది ఝాన్సీమణి.

మేఘనని అక్కడే వుంచి నీలిమ ఛైర్మన్ గదిలోకి అడుగుపెట్టింది ఏ భావమూ కన్పించనీకుండా.

"కూచోండి" అన్నాడతడు. అతడి ప్రక్కనే ఒకామె. పి.ఏ.నేమో అనుకుంది.

నీలిమ కూచుంది. గది చాలా అరిస్టోక్రాటిక్‌గా వుంది.

"నన్ను గుర్తుపట్టారా?"

"...."

"మీ పేరు నీలిమ కదూ?"

"అవును"

"నన్ను గుర్తుపట్టారా?"

"గుర్తుపట్టాను..." చాలా చిరాగ్గా అంది.

"ఈవిడ నా భార్య" ఆమె వినయంగా నమస్కరించింది. ఆమెవైపు జాలిగా చూసింది నీలిమ. శైలజ చావు తెరలు తెరలుగా మనసు తెరపై కదలాడుతోంది.

శైలజకు ప్రియుడున్నట్టుగా ఉత్తరాలు సృష్టించి... చివరికి కిరోసిన్ పోసి అంటించిన నికృష్టుడు. తనూ కాలిపోయి 'నిమ్స్' కి తరలించారని విన్నది కాని... ఇంకా బ్రతికున్నందుకు

ఆమెకు రోతపుట్టింది.

అతడి ఎదురుగా కూచోలేక ముళ్లకంపపై కూచున్నంత ఇబ్బందిగా ఫీలైంది.

"నామీద మీకు అసహ్యంగా వుండొచ్చు. మర్చిపోయిన జ్ఞాపకం మళ్లీ గుర్తుకు తెచ్చానని విసుక్కోకండి. నా జీవితంలో ఒక వ్యక్తికి క్షమాపణలు చెప్పుకోవాలని ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నాను. ఆ వ్యక్తి మీరే. మీ ఫ్రెండ్ శైలజ మంటల్లో చనిపోయాక... నేను మనిషినయ్యాను. మళ్లీ మావాళ్ల బలవంతం మీద సుచిత్ర అనే అమ్మాయిని చేస్కున్నాను. నా పెళ్లయ్యాక కొద్దిరోజులకు నా భార్యకి చెప్పాను. మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం కోసం మీ ఊరొచ్చినప్పుడు లాడ్జింగ్, బోర్డింగ్‌కి డబ్బుల్లేక పెళ్లిచూపుల పేర ఆడిన నాటకాన్ని. ఆ విషయం తెల్సి సుచిత్ర నన్నెంతో అసహ్యించుకుంది. మీకు క్షమాపణలు చెప్పించాలని ఓసారి మీ ఊరుకూడా తీసికొచ్చింది. కాని మీరక్కడ లేరు. మెడికల్ రిప్రజెంటేటివ్ నించి శ్రీదేవి హాస్పిటల్ ఛైర్మన్‌గా ఎదిగినా నామనసులో ఎక్కడో, ఏమూలో అశాంతి. అది మీకు చేసిన ద్రోహమే కావచ్చు. శైలజకి చేసిన అన్యాయమే కావచ్చు. కనీసం మీకు క్షమాపణలు చెప్పే అవకాశం కూడా లేకపోవటం... చివరికి మీరే ఇలా ఎదురుపడతారని ఊహించలేదు. పాప రిపోర్ట్ చూస్తుంటే గార్డియన్‌గా నీలిమ అన్న పేరు కనబడింది. మీరే అయివుంటారని నా సిక్స్ సెన్స్ పదేపదే చెప్పింది. అందుకే హడావిడిగా వేరే పనులున్నా భార్యని తోడ్కొని వచ్చాను. మీరు వెళ్లబోతుంటే చూసాను. ఆనాటి తప్పుకు ఈనాడు క్షమించండి. దానికి ప్రాయశ్చిత్తంగా మీరు కట్టిన ఫీజు వాపసు తీసుకోండి..." చంద్రప్రభాకర్ లక్ష రూపాయల చెక్కుని నీలిమ ముందుకి జరిపాడు. చేతులు కాలిన చర్మంతో కన్పించాయి.

నీలిమకి అయోమయంగా తోచింది.

"ఆయన మునుపటి చంద్రప్రభాకర్ కాదు. చాలా మారిపోయారు. ముందు డబ్బుకోసం ఎన్ని తప్పుడు పనులు చేసినా... తీరా డబ్బు వచ్చాక గతాన్ని తల్చుకుంటూ పశ్చాత్తాపపడటం మానవనైజం. మీకు చేసిన మోసం, శైలజగార్కి ద్రోహం ఆయన్ని వెంటాడుతున్నాయి. ఢబ్బు బాగా సంపాదించాకగాని... డబ్బే ముఖ్యంకాదు అని తెలిసొస్తుంది చాలామందికి. ఈయనకీ అంతే. తను చేసిన పాపాలకి అశాంతికి లోనవుతున్నాడు. మీరెదురయ్యారు. మీరు క్షమిస్తే ఆయనలోని సగం అశాంతి దూరమవుతుంది. ప్లీజ్, లక్ష తీస్కోండి" అందామె వినయంగా.

ఆమె మాటల్లో విధేయత ఉట్టిపడింది.

"మీరింకా నమ్మరేమో... అటువైపు చూడండి" అంది. నీలిమ తలత్రిప్పి కుడివైపుకి చూసింది.

సుగంధపు బెరడుతో చేసిన దండలమధ్య... నిలువెత్తు శైలజ ఫొటో.

ముగ్గురి మధ్యా కాసేపు మౌనం...

ఒకప్పుడు తన జీవితంతో చెడుగుడు ఆడుకున్న మగాళ్లంతా మళ్లీ ఇలా

ఎదురవుతున్నారేమిటి?

చంద్రప్రభాకర్ ఇస్తున్న లక్ష తీసుకుంటె... నైమిష నిరంజన్‌కిచ్చిన మాట ఏమవుతుంది.

"మీపాపకి అయిన ఖర్చు భరించే అవకాశమైనా ఇవ్వండి. ప్లీజ్, డబ్బు తీస్కోండి" అన్నాడతడు.

నీలిమ ఆలోచనల్లోంచి తేరుకోవడానికి మరో అయిదు నిమిషాలు పట్టింది. ఆ తర్వాత నెమ్మదిగా అంది-

"నా కలలతో, నా ఫ్రెండ్ జీవితంతో ఆడుకున్నప్పటికీ మానవత్వమున్న మనిషిగా మారినందుకు థాంక్స్- కానీ ఈ లక్ష నేను తీసుకుంటే మరో కుటుంబానికి ద్రోహం చేసిందాన్ని అవుతాను. వివరాలు ఏమీ అడక్కండి. సారీ..." చెక్కుని టేబిల్‌పై వెనక్కి జరిపి... నీలిమ చివ్వున లేచి బయటికి వచ్చింది.

ఉరుకులు.

పరుగులు.

తరగలు.

నురగలై పారే... ఆడపిల్లల కలల్ని దాచే కన్రెప్పల్ని కాటేసిన... మగపురుగులు మారితేనేం? మారకపోతేనేం. అనుకుంది.

* * * *

ఫెర్టిలిటీ క్లినిక్...

శ్రీదేవి హాస్పిటల్‌లో నైమిష, నిరంజన్, నీలిమ డాక్టర్ ఝాన్సీమణిని కలిసారు. ఆమె ఫెర్టిలిటీ క్లినిక్‌ని వాళ్లకి చూపించింది.

"సెమన్ డోనర్... ఎవరు?" అడిగింది ఝాన్సీమణి.

"మా ఆయనే... నేను ఓవరీ ఇస్తాను. నీలిమ బిడ్డని కని ఇస్తుంది. ఎందుకంటే నాకు గర్భాశయం దెబ్బతింది" అంది నైమిష.

"టెస్ట్‌ట్యూబ్ ద్వారా పిల్లల్ని కనటం గురించి వినటమేకాని ఎప్పుడూ చూడలేదు. కాని పురాణాల్లో కూడా టెస్ట్‌ట్యూబ్ బేబీలు, సెక్సువల్ చేంజెస్ వున్నట్టుగా కథలున్నాయిగదా" అన్నాడు నిరంజన్.

ఝాన్సీమణి నవ్వింది.

"అవును డాక్టర్ శారీరకంగా కలవకుండానే గర్భాలు ధరించటం. ఆంజనేయుడి ద్వారా మత్స్యవల్లభుణ్ణి కనడానికి ఒకామె అలాంటి గర్భమే ధరించినట్టు కథలున్నాయి" అంది నైమిష.

"యస్... ఆ కథ నేనూ విన్నాను" అంది గైనకాలజిస్ట్.

అన్నీ నిశితంగా పరిశీలిస్తొన్న నీలిమ "టెస్ట్‌ట్యూబ్ బేబీల్లాగా... సెక్స్‌వల్ ఛేంజెస్ కథలు కూడా మన పురాణాల్లో వున్నాయి" అంది.

"వ్వాట్... మేం విన్లేదు" అన్నారు. నైమిష, డాక్టర్ ఝాన్సీమణి.

"అవును. పురాణాల్లో సెక్స్‌వల్ చేంజెస్ వున్నాయి. దైవసత్వుడనే మనువు సంతానంలేక వసిష్టుడ్ని మార్గం చెప్పమంటాడు. కొడుకే కావాలనుకుంటే యజ్ఞం చేయమంటాడు వసిష్టుడు. అయితే దైవసత్వుడి భార్యకు కూతుర్ని కనాలనే కోరిక వుంటుంది. ఆ కోరికతేనే 'హోతా' నూ ప్రార్థించి మాట తీసుకుంటుంది. ఆ తర్వాత కూతుర్ని కని 'ఇల' అని పేరు పెడతారుకాని కొడుకు పుట్టనందుకు యజ్ఞం నిష్ఫలమైందే అని రోజురోజుకూ కృంగిపోతాడు దైవసత్వుడు. శిష్యుడి మనోవేదన అర్థం చేసుకున్న గురువు వశిష్టుడు వరం ఇస్తాడు. 'ఇల' గా వున్న ఆ అమ్మాయి 'సుద్యుమ్నుడు' అనే అబ్బాయిగా మారిపోతాడు. ఇది సెక్స్‌వల్ ఛేంజ్ కాదా!" అని చెపింది.

ఆ క్లినిక్‌లోని సైన్సు వాతావరణం వాళ్లని ఫ్రీ గా మాట్లాడుకునేలా చేస్తోంది.

"ఇంతకీ మన ప్రయోగాలు ఎప్పుడు మొదలెడతాం డాక్టర్" అన్నాడు నిరంజన్.

'ఇప్పుడే... ఇక మీరు బయటికి వెళ్లండి" అంది.

వాళ్లిద్ధరూ బయటికి వెళ్లగానే నైమిషకి హార్మోన్ ఇంజక్షన్ చేసింది. ఈ ఇంజక్షన్ ద్వారా నైమిషలోని అండాన్ని పరిపక్వం చెందించి, అండాశయం నుంచి బాగా ఎదిగిన అండాన్ని లాపరోస్కాపిక్ ద్వారా బయటికి తీసింది. ఇదంతా జరగడానికి దాదాపు మూడున్నర గంటల సమయం తీసుకుంది.

ఆ తర్వాత నిరంజన్‌ని మాత్రమే పిలిచి నిరంజన్ స్పెర్మ్‌లోంచి బలమైన శుక్ర కణాన్ని వేరుచేసింది. అధునాతన పరకరాల మధ్య, మైక్రోస్కోపుల ద్వారా పరీక్షిస్తూ అండాన్ని శుక్ర కణాన్ని టెస్ట్‌ట్యూబ్‌లో వేసి 'లైఫ్ సపోర్టింగ్ సొల్యూషన్' జాగ్రత్తగా కలిపి అతి తక్కువ వెలుతుర్లో వుంచింది. ఆ తర్వాత లాబ్ బయటికి వచ్చి వాళ్లతో అంది.

"స్పెర్మ్, ఓవరీ రెండూ కల్సిపోయి ఫెర్టిలైజ్ అవుతాయి. అవి ఎనిమిది కణాల విభజన చెందే బ్లాస్టోసిస్ట్ అనే పిండంలో ఒకదశ ఏర్పడేవరకూ పరీక్ష నాళికలోనే వుంచి.. మూడువారాల తర్వాత ఎదిగిన అండాన్ని నీలిమ గర్భాశయంలో ప్రవేశపెట్టాలి. నీలిమ గర్భాశయంలో ప్రవేశపెట్టిన తర్వాత నార్మల్ డెలివరీ ద్వారాగాని, ఎక్కువగా ఆపరేషన్స్ ద్వారాగాని బిడ్డని తీయాల్సివుంటుంది. బెస్టాఫ్‌లక్' అంది.

"మొత్తం ఫెర్టిలిటీ క్లినిక్‌లోనే బిడ్డ తయారయ్యే రోజులున్నాయా డాక్టర్" అనడిగాడు నిరంజన్.

అతడి ప్రశ్నకు ముగ్గురూ నవ్వారు.

"కష్టమైన పనే... కాని... దానికోసం కూడా ఈ ప్రపంచంలో ఎక్కడో ఓచోట అలాంటి

పిశోధనలు జరుగుతూనే వుంటాయి. ఫలదీకరణ చెందిన అండం ఏడు విభజనలు చెందేంతవరకే కల్చరల్ మీడియంలో వుంచొచ్చు. అలాగే పిండం పెరుగుదలకి స్త్రీల లోపలి ప్రకృతి సిద్ధమైన ప్లాసంటా (మావి లేదా పిండ అవలంభనం) అవసరం. అది లేకుండా లాబ్‌లో ప్రయోగాలు చేస్తే పిండంలో ఎదుగుదల వుండదు. అందుకని వైద్యరంగం 'కృత్రమమైన మావి' లను తయారుచేయడానికి ప్రయత్నిస్తోంది. అహర్నిశలూ శ్రమించి అలాంటి అర్టిఫిషియల్ ప్లాసంటా సృష్టించబడినరోజు మాత్రం బ్రహ్మను తలదన్నే ప్రతిసృష్టి సాధ్యమవుతుంది. అప్పుడు పిండం ఫలదీకరణ మొదలు శిశువుగా రూపొందటం వరకూ తల్లికడుపు అనవసరం. టెస్ట్‌ట్యూబ్‌లు, ఫ్లాస్క్‌లే అవసరమవుతాయి" అంది ఝాన్సిమణి.

"అప్పుడు మగాళ్లంతా టెస్ట్‌ట్యూబ్‌లకీ, ఫ్లాస్క్‌లకీ తాళికట్టాలి" నిరంజన్ మాటతో అంతా నవ్వుకున్నారు.

అగ్రిమెంట్ కాగితాలపై అంతా సంతకాలు చేసాక సెలవు తీసుకున్నారు. కాని నీలిమ మాత్రం నైమిష, నిరంజన్‌లని సాగనంపి వెనుదిరిగొచ్చింది. వరండాలోంచి వెళ్తున్న ఝాన్సీమణిని "డాక్టర్" అని పిలిచింది. ఝాన్సీమణి ఆగగానే "మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి" అంది భయంగా.

"ఏంటమ్మా... మేఘన గురించా?"

"కాదు డాక్టర్... ఈ విషయం గురించే... నాకు... నాకు పెళ్లికి ముందే పిల్లలు' పుట్టకుండా ట్యూబెక్టమీ జరిగింది. అందుకనీ..."

డాక్టర్ విస్మయంగా చూసి-

"నో ప్రాబ్లెమ్. ట్యూబెక్టమీ ఆపరేషన్ ద్వారా మగాడి స్పెర్మ్ గర్భాశయంలోకి చేరకుండా గర్భనాళాలు మాత్రమే ముడివేసేస్తాం. అయినా ఈ బిడ్డని ఎలా కనొచ్చు అనుకుంటున్నావా? ఎదిగిన అండాన్ని ఆపరేషన్ ద్వారా మాత్రమే నేరుగా నీ కడుపు అంటే గర్భాశయంలో ప్రవేశపెడతాం. ఆతర్వాత తొమ్మిది నెలలు నువ్వు మోయగానే తిరిగి ఆపరేషన్ ద్వారా బిడ్డని తీస్తాం" అంది.

"థాంక్యూ డాక్టర్" నీలిమలో ఏమూలో తొలిచేస్తున్న అనుమానం క్షణంలో వీగిపోయిన ఆనందం కనపడింది.

"కామన్‌గా రెంటెడ్ మదర్స్ మన ఇండియాలోనే అతి తక్కువ. విదేశాల్లో డబ్బు తీసుకొని బిడ్డల్ని కనిచ్చే కిరాయితల్లుల సంఖ్య ఎంతోవుంది. కాని ఇక్కడ ఇతరుల కోసం నీదికాని బిడ్డని నవమాసాలు మోసి కనిచ్చే తొలి తెలుగు రెంటెడ్ మదర్‌వి నువ్వే అవుతావేమో... బెస్టాఫ్‌లక్' డాక్టర్ నవ్వుతూ అనేసి వెళ్లిపోయింది.

ఆమె క్యాజువల్‌గానే అనేసిపోయినా... ఆమాట నీలిమ మనసుపై కొరడాతో కొట్టినట్టు జల్లుమంది.

గర్భసంచిని కిరాయికిస్తున్న తొలి తెలుగు తల్లిని నేనేనా? అన్న బావన ఆమెలో ఆనందమో, విషాదమో, సంతోషమో, దుఃఖమో అర్థంగాని స్థితిలోకి తీసికెళ్లింది.

ఇద్దరు మగాళ్లతో పెళ్లిళ్లయినా... కన్నెపొర కూడా చెరగని జీవితం తనది...

తనది కాని ఒక బిడ్డని పెంచుకుంటూ... లోకం దృష్టిలో తల్లిగానే వుంటోంది.

ఇప్పుడు...

పురుష స్పర్శ.... కనీసం చుంబనం కూడా తెలియకుండా కడుపులో పిండాన్ని మెయబోతోంది?? అంతర్జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడుకున్నట్టుగా... విధి తన జీవితంతో ఎంత దుర్భరంగా ఆడుకుంటోంది.

మళ్లీ మనసు మూగవోతుంటే... హాస్పిటల్‌నించి కదిలింది.

*　　　*　　　*　　　*

మేఘనని ఇంకా జాగ్రత్తగా చూసుకుంటోంది నీలిమ.

అపాయకరమైన ఏ తుంటరి పనులు చేయకుండా కనిపెడుతోంది. స్కూల్ ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడి నీలిమ జబ్బు గురించి చెప్పివచ్చింది.

ఓరోజు...

బ్లేడ్‌తో పెన్సిల్ చెక్కుతున్న దృశ్యం చూసి గాబరాగా లాక్కుంది.

"ఇంకోసారి ఇలాంటి పనులు చేస్తే వీపు చేరేస్తాను" అంది కోపంగా.

"పెన్సిల్ కూడా చెక్కుకోకూడదా?" రోషంగా అంది మేఘన.

"మళ్లీ నీకు బ్లడ్ బ్లీడింగ్ అవుతే బతికించుకునే శక్తి నాకులేదు."

"చస్తే ఛస్తానులే."

ఆ మాటకి నీలిమకి కోపం ముంచుకొచ్చింది.

"ఏమన్నావే... నీకోసం నేనెంత కష్టపడుతున్నానో నీకేం తెల్సు. ఛస్తుందట" అంటూ చెంప పగులగొట్టింది.

"నువ్వెవరు నన్ను కొట్టడానికి మా అమ్మవా?" బుగ్గ ఎర్ర కందిపోతుంటే బుసలుకొడుతున్న కోపంతో రెచ్చిపోయి అడిగింది మేఘన. ఆ మాటకి హతాశురాలైన నీలిమ సహనం చచ్చిపోయి మరో చెంప పగులగొట్టింది.

మేఘన పెద్దగా ఏడుస్తూ గదిలోకెళ్లింది.

మేఘన మాటలు నీలిమని బాగా కదిలించాయి. రెండు గంటలు ఏడుస్తూనే వుంది. నీలిమ కోపం తగ్గిపోయాక పాపని బుజ్జగించబోయింది. కాని కోపంగా ఆమె చేతిని విదిలించింది.

అలిగింది...

ఆమె ఎంత బ్రతిమాలినా.... ఆరాత్రి అన్నం తినలేదు.

మర్నాడు బుజ్జగించినా స్కూల్‌కి వెళ్లలేదు.

"ఇంత మొండిగా ఎందుకు తయారవుతున్నావ్?" అని ఓపిక నశించి మరోరెండు అంటించింది నీలిమ.

ఏడుస్తున్న మేఘన చటుక్కున ఏడుపు ఆపేసి గూట్లోని బ్లేడుని చేతిలోకి తీసుకుంది పౌరుషంగా.

"నన్ను కొడితే ఈ బ్లేడుతో కోసుకుంటా..."

మేఘన చర్యకి నీలిమ బిత్తరపోయింది.

"నన్ను ఇంకోసారి కొడితే బ్లేడుతో ఖచ్చితంగా కోసుకుంటా" మరోసారి కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ అందా పాప. నీలిమ చేష్టలుడిగిపోయిందానిలా కుర్చీలో కూలబడింది.

మరో పది నిమిషాల వరకూ బ్లేడుని పట్టుకునే వున్న మేఘన తర్వాత బ్లేడుని జామెట్రీ బాక్స్‌లో పడేసి తన గదిలోకి వెళ్లిపోయింది.

మేఘన మనస్తత్వం ఎలా మారుతోంది అన్న దీర్ఘాలోచనల్లో నీలిమ మునిగిపోయి వుండాగా ఎవరో కాలింగ్‌బెల్ నొక్కిన శబ్దం.

నీలిమ వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా ఓ యాభయ్యేళ్ల ముసలావిడ...

ఆమెవరో అర్థంకాలేదు నీలిమకి. ఆమె చేతిలో సంచి-

"భరణి ఇల్లు ఇదేనా తల్లి" అంది ఆవిడ.

"అవునండీ... మీరెవరు?"

"నేను భరణి తల్లిని"

నీలిమ ఆశ్చర్యంగా చూసి "లోపలికి రండి" అంది సాదరంగా. ఆవిడ లోపలికి రాగానే కూచోబెట్టి నీళ్లు అందించింది. భరణి దగ్గర వుండే ఆల్బంలో... పెళ్లయిన కొత్తలో ఓసారి అతడి తల్లిదండ్రుల ఫొటో చూసిందిగాని పోల్చుకోలేకపోయింది.

అతడు కూడా ఎప్పుడూ కనీసం తల్లిదండ్రుల గురించిన అతడి స్వంత విషయాలు కనీసం చెప్పకపోయేది.

కాసేపయ్యాక ఆవిడ ఇల్లంతా కలియజూస్తూ "నాపేరు సరస్వతమ్మ. మాది గుంటూరు. భరణిగాడి మనస్తత్వం వాళ్ల తండ్రికి సరిపడక గొడవలయ్యేవి. పదిహేనేళ్ల కిందే ఇల్లు విడిచిపెట్టి వెళ్లాడు. ఉద్యోగం సంపాదించుకొని ఎవరో అమ్మాయిని పెళ్లిచేసుకొని తెలంగాణాలో ఎక్కడో సెటిలయ్యాడని తెల్సింది. వాడు కొద్దిరోజులకిందే చనిపోయాడని తెల్సింది" అంది.

"భోంచేస్తారా?" అనడిగింది నీలిమ.

ఆవిడ చూపులు భరణి ఫోటోమీద పడ్డాయి. ఫోటో దగ్గరకెళ్లి కళ్లల్లో నీళ్లు తీస్కుంది. అప్పటికే భోజనం పెట్టింది నీలిమ.

"కాళ్లు కడుక్కొని భోంచేయండి" అంది. ఆవిడ భోజనానికి కూచుంది.

"కొడుకు చనిపోయాక కోడల్ని చూసుకునే దౌర్భాగ్యం కలిగిందమ్మా. మావాడికి ఒక కూతురు పుట్టింది అని కూడా విన్నాను" అంది.

"గదిలో చదువుకుంటోందిండీ. ముందు మీరు భోజనం చేయండి" అంటూ కొసరి కొసరి వడ్డించింది. ముసలావిడి ముఖం విప్పారింది. భోజనం అయ్యాక "ఏదమ్మా... నా మనవరాలు" అంది.

"మేఘనా... " నీలిమ పిలిచినా కోపంతో రాలేదు. మరోసారి పిల్చింది.

"మీ నానమ్మ నిన్ను చూడ్డానికి వచ్చింది."

ఈమాటతో అడుగులో అడుగేస్తూ గదిలోంచి వచ్చింది. బొద్దుగా వున్న మనవరాల్ని చూడగానే 'రామ్మా... నేను మీ నానమ్మని" అంటూ చేతులుసాచింది. మేఘన అనుమానంగా దగ్గరికి రాగానే ఆపిల్స్, అరటిపల్లు చేతిలో పెట్టింది.

మొహమంతా ముద్దులు పెట్టింది.

"నిజమేనమ్మా... మీనానమ్మని. గుంటూరునించి వచ్చాను" అంది.

"నా...న...మ్మా..." మేఘనలో ఏదో సంతోషం. కాసేపట్లోనే చనువేర్పడింది. అయినా నీలిమవైపు అప్పుడప్పుడు గుర్రుగా చూస్తుంటే... నీలిమ నవ్వుకుంది.

స్కూలు కబుర్లు చెప్పటం మెదలెట్టింది. వాళ్లిద్దర్నీ చూస్తుంటే నీలిమకి ఆనందంగా వుంది. ముసలావిడ మధ్య మధ్యలో నీలిమకి తన కుటుంబ విషయాలన్నీ చెప్తోంది.

"ఇల్లు విడిచిన భరణి మాకు ఒక్కడే కొడుకైనా... కనీసం తండ్రి చనిపోయినప్పుడు కూడా రాలేదు. వాడంతటి కఠినాత్ముడు. ఓసారి వాణ్ణి వెతుక్కుంటూ వస్తే నన్ను కొట్టి పంపించాడు తప్ప... వాడు కనీసం తల్లి అని కూడా చూళ్లేదు. అప్పటికే వాడిక్కడ పెళ్లి చేసుకున్నాడు. కాని పాప పుట్టలేదింకా... అప్పటి కోడలు కూడా నీలాగే ఆదరించింది. కాని వాడే కనికరించక కొట్టిపంపాడు. తర్వాత ఆమె చనిపోయిందని తెలిసినా రావడానికి భయమేసింది. చివరికి వాడు చనిపోయాడని తెల్సినప్పుడు ఏడ్చాను. మొత్తుకున్నాను. కాని ఈమధ్యే వాడికో పాప వుందని, వాడి రెండో భార్య దగ్గర ఆ పాప వుంటోందని తెలిసి మనవరాలి మీద మమకారం పెరిగి ఇలా అడ్రస్‌లు వెతుక్కుంటూ వచ్చానమ్మా..." అందావిడ.

"మీ మనవరాలు కూడా మీ కొడుకులాగే పెంకిఘటం. అయినా... ఈ చివరి దశలోనైనా మీరు మాతో వుండిపోండి" అంది నీలిమ.

"లేదమ్మా... నేను వెళ్లిపోవాలి. నామనవరాలిని తీసికెళదామనే అష్టకష్టాలు పడుతూ

వచ్చాను.

వేయి శతఘ్నుల విస్ఫోటాలు నెత్తిన పిడుగుల్లా కురిసినట్టు అచేతనంగా చూసింది నీలిమ ఆ మాటవిని.

"మేఘనని మీతో తీసికెళ్లిపోతారా?" అంది ఆందోళనగా.

"అవునమ్మా... అందుకే వచ్చాను. నా కొడుకు దూరమైనా... కనీసం వాడికి పుట్టిన బిడ్డలోనైనా వాణ్ణి చూసుకొని బ్రతుకుతాను" అందావిడ.

నీలిమకి నోటమాటరాలేదు.

విషయం అర్థం చేసుకుందేమో... మేఘన వెంటనే ముసలావిడని చుట్టేస్తూ "నేను నానమ్మ వెంట వెళ్తాను" అంది.

ముసలావిడ ప్రేమగా మేఘన తలను నిమిరింది.

"రాత్రి బస్సుకి తీసికెళ్తానమ్మా. తెల్లారితే గుంటూరు చేరుకోవచ్చు" అందావిడ.

నీలిమ అయోమయంలో పడిపోయి దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తోంది.

"ఇప్పుడే వెళ్దాం నానమ్మా."

మేఘన గారాబానికి ముసలావిడ మురిసిపోతూ "వెళ్దామమ్మా... నీకోసమే వచ్చాను తల్లీ. మరో గంటయితే సాయంకాలం అవుతుంది. అప్పుడు బయల్దేరదాం. సరేనా..."

"ఓ... సరే."

మేఘన తన గదిలోకి పరిగెత్తి అన్నీ సర్దుకోవటం మొదలెట్టింది. మెడికల్ రిపోర్ట్స్ కూడా పెట్టుకుంది.

"మేఘన లేకపోతే నాకేం తోచదండీ..." నీలిమ మాటల్ని కూడబలుక్కుంటూ అంది.

"నా మనవరాలి కోసమే... ఈ ముసలి శరీరాన్ని మోసుకుంటూ ఇంత దూరం వచ్చింది. వట్టి చేతుల్తో పంపించకమ్మా.... ఈ అఖరి బతుకులో కనీసం మనవరాలైనా నా చెంత వుండనీ... " అందావిడ.

నీలిమని ఏమీ మాట్లాడనిచ్చేలా లేదామె.

"నాకొడుకు నా రక్తం పంచుకు పుట్టాడు. నా కొడుకు రక్తం ఇది పంచుకొని పుట్టింది. రక్తసంబంధం కాబట్టే ఇంతదూరం వచ్చాను తల్లీ" ఆమె మాటలు సౌమ్యంగానే వున్నా... ఎక్కడో కలుక్కుమన్న బాధ.

వీళ్లవన్నీ రక్తసంబంధాలు...

తనేమౌతుంది...?

ఏమీకాదు...

మేఘన తన రక్తం పంచుకున్న బిడ్డకాదుగదా. నిజానికి... భరణి రక్తం పంచుకుపుట్టిన

బిడ్డకూడా కాదు. అసలు నిజం ఈ వృద్ధురాలికేం తెలుసు... అయినా మేఘన కూడా ఎంత తొందరగా తననించి వెళ్లిపోతోంది.

నీలిమ స్తబ్దుగావున్నా మెదడ్ని తొలిచేస్తున్న ఆలోచనలు...

ఇద్దరూ వెళ్తోంటే-

"మేఘనా... వెళ్లిపోతున్నావా?" అంది నీలిమ.

"నేను నీతో మాట్లాడను."

"నిజంగా వెళ్లిపోతున్నావా?"

"నిఝంగా..."

"ఈ అమ్మని విడిచిపెట్టిపోతావా?"

"నువ్ మా అమ్మవేం కాదు."

కళ్లు కన్నీటి చెలిమలయ్యాయి.

"కనీసం ఒక ముద్దు ఇచ్చి వెళ్లవూ..."

"నీకు ముద్దివ్వను ఫో..."

"ఎందుకురా?"

"మా నానమ్మ వచ్చింది కదా... నా ముద్దులన్నీ నానమ్మకే" ముసలావిడ నవ్వింది.

గుమ్మం దాటాక వాళ్లు ఆటోఎక్కి వెళ్లిపోయారు.

వెళ్తూ...వెళ్తూ... మేఘన కనీసం టాటా కూడా చెప్పకుండా పోయింది.

పోనీ... పోనీ... పోతేపోనీ...

* * * *

ఇల్లంతా నిశ్శబ్దమైపోయింది.

ఇంట్లోంచి శవం తరలిపోయింతర్వాత ఏర్పడే బాధాకరమైన స్మశాన నిశ్శబ్దం...

ఇంట్లో లైట్లు కూడా వేయాలన్పించలేదు.

మనసంతా శూన్యం నిండింది.

అప్పుడే ఇంటి ముందాగిన కార్లోంచి డ్రైవర్ దిగొచ్చాడు. చేతిలో ఏదో గిఫ్ట్ బాక్స్. సరాసరి ఇంట్లోకి వచ్చి...

"మేడమ్... నన్ను నైమిషగారు పంపించారు. రేపు హాస్పిటల్‌లో జాయినవ్వాలట. మిమ్మల్ని రేపు పదిగంటల వరకు రెడీగా వుండమన్నారు" అని చెప్పాడు.

నిర్లిప్తంగా 'సరే' అంది.

అతడు వెళ్లిపోబోతూ... "అమ్మా... మీ పాపకి ఆరోగ్యం ఎలావుందో అడిగి రమ్మన్నారు. పాపకోసం ఈ బొమ్మ కూడా పంపించారు" అంటూ బాక్స్ చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

నీలిమ బాక్స్ విప్పింది.

అందమైన బేబీ బొమ్మ...

దానిమీద 'అయాం ఎ గుడ్ గర్ల్' అని రాసివుంది.

ఆ అక్షరాలు చూసాక నవ్వుకుంది. బొమ్మ వెక్కిరించినట్టూ అన్పించింది.

ఆ వెంటనే... మేఘన కోసం పలవరించింది.

ఎవర్ని కాపాడుకోవడానికి... రెంటెడ్ మదర్‌గా మారాలనుకుందో... ఆ పాపే...

గుండెల మీద తన్నిపోయింది. తన ప్రేమ బూడిదలో పోసిన అమృతమైపోయింది.

అప్పుడు... మనసు పగిలిందేమో...

కన్నీళ్లు కాల్వలు కట్టాయి. మంచంపై బోర్లాపడి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఇంట్లోని నిశ్శబ్దం కూడా ఆమె బాధలకి సానుభూతి ప్రకటిస్తూ... మౌనం పాటిస్తోంది.

* * * *

ఫెర్టిలిటీ క్లినిక్‌లో టెస్ట్‌ట్యూబ్‌లో నైమిష అండం, నిరంజన్ శుక్ర కణం కల్సిపోయి ఫలదీకరణ చెందగానే ఆ బ్లాస్టోసిస్ట్‌ని... చిన్న ఆపరేషన్ ద్వారా నీలిమ గర్భాశయంలోకి ప్రవేశపెట్టింది డాక్టర్ ఝాన్సీమణి.

ఆమెకు మరో అయిదుగురు అసిస్టెంట్ డాక్టర్లు సహకరించారు. ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాక... ఆరోజు పెళ్లికాకముందే ట్యూబెక్టమీ కోసం ఆపరేషన్ థియేటర్‌కి వెళ్లిన సంఘటన గుర్తొచ్చింది.

మరి ఈరోజు...

ఆలోచనలన్నీ మత్తు ఇంజక్షన్‌లో కరిగిపోయాయి.

ఆపరేషన్ థియేటర్‌లో ఆ ప్రక్రియ జరుగుతున్నంతసేపూ బయట టెన్షన్‌గా గడిపారు నైమిష, నిరంజన్.

తర్వాత వాళ్లని ఝాన్సీమణి లోపలికి పిలిచింది.

"ఇక నీలిమని దాదాపు తొమ్మిది నెలలపాటు జాగ్రత్తగా చూసుకోవాలి. నెల నెలా బి.యు. టెస్టులతోపాటు బి.పి చెక్ చేయించుకోవాలి. బ్యాలెన్స్‌డ్ డైట్ తీస్కోవాలి" అని చెప్పి నీలిమవైపు చూసి "ఈ తొమ్మిద నెలలు ఎలాంటి టెన్షన్స్‌కి గురికాకూడదు" అంది కొన్ని మందులు రాసిస్తూ.

"థాంక్యూ డాక్టర్" అన్నారు ఆనందంగా నైమిష, నిరంజన్.

"థాంక్స్ చెప్పాల్సింది నాక్కాదు. ఈ పనికి ఒప్పుకున్నందుకు నీలిమకి చెప్పండి" అంది నవ్వుతూ.

ముగ్గురూ బయటికొచ్చారు.

"అక్కా... ఈ తొమ్మిది నెలలు మా ఇంట్లోనే వుండిపోవచ్చుకదా" అంది నైమిష.

"వద్దమ్మా... నాఇంట్లో నేను ఫ్రీగా వుండగలుగుతాను. కావాలంటే రోజూ నువ్వొచ్చి కబుర్లు చెప్పు" అంది నవ్వుతూ.

"మీ ఇష్టమండీ, ఏదేమైనా మీరు చేస్తున్న సాయం మా జీవితాలకి ఓ అర్థాన్నీ, పరిపూర్ణతనీ, పరమార్థాన్ని ఇస్తుంది. మీకు ఎలా కృతజ్ఞతలు తెలిపినా చాలా తక్కువే అవుతుంది" చెప్పాడు నిరంజన్.

"అంతంత పెద్దమాటలొద్దుగాని... నేను ఎప్పట్నించి ప్రెగ్నెన్సీ లీవ్ అప్లయ్ చేయాలి?" అనడిగింది.

"ఈక్షణంనించే... ఇంకా మీకు ఆఫీసా... నెలనెలా డబుల్ సాలరీ తెచ్చిస్తాను" అంది నైమిష, ముగ్గురూ నవ్వుకున్నారు.

"అన్నట్టు... మేఘన ఎలా వుంది?" అనడిగింది నైమిష.

"బావుంది. వాళ్ల నానమ్మ దగ్గరిగి పంపించాను... నేనే" కళ్లలో నీళ్లు కన్పించనీకుండా చెప్పింది.

తర్వాత వాళ్లు నీలిమని కార్లో ఇంటిదగ్గర డ్రాప్ చేసారు.

*　　　*　　　*　　　*

మేఘన లేని ఇల్లు బావురుమన్నట్టుగా వుంది. అనుక్షణం మేఘన తలపులు కలవరపెడుతుంటే అన్నీ అణచుకోవడానికి ప్రయత్నిస్తోంది. పాపని మర్చిపోవడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యపడట్లేదు.

మరోవైపు... తన కడుపులో శిశువు పెరుగుతుంది అన్న ఆలోచన ఓ విచిత్రానుభూతిని కలుగజేస్తోంది. తన్మయంగా కడుపుని నిమురుకుంటే... ఏదో అవ్యక్తానురాగం పెల్లుబుకుతోంది.

రోజూ ఎనిమిది గంటలవరకే టిఫిన్స్, ఫ్రూట్ జ్యూస్‌లతో ఠంచన్‌గా దిగుతుంది నైమిష. ఇంట్లోని పనంతా తానే చేసి వెళ్తుంది. నీలిమ కడుపువైపు ఆరాధనగా చూస్తుంది. పిల్లల పట్ల నైమిషకున్న ప్రేమానురాగాలు చూస్తుంటే నీలిమకి జాలిగా అన్పించింది. ఇల్లంతా బుడిబుడి బాబుల ఫొటోలు, క్యాలండర్లతో నింపేసింది.

"అక్కా... నీగ్రో పిల్లల బొమ్మలు ఎందుకు తేలేదో తెల్సా... గర్భంతో వున్నవాళ్లు ఆ బొమ్మల్నే చూస్తూ గడిపితే... పుట్టబోయే పిల్లలు కూడా అలాగే వుంటారట" అంటుంది అమాయకంగా.

మంచి సంగీతం పెట్టేది.

ఎప్పుడైనా నిరంజన్ వచ్చినా బెరుకుగా కాస్సేపు గడిపి వెళ్లిపోయేవాడు. నైమిష మాత్రం పొద్దంతా గడిపేది.

నైమిష సహచర్యంలో కాలం ఆరునెలలు మింగేసింది.

పెరుగుతున్న కడుపుని తానే విచిత్రంగా చూసుకుంది నీలిమ.

ఆరోజు...

మధ్యాహ్నం...

నైమిష వెళ్లిపోయింది. కాలింగ్ బెల్ మోగితే నీలిమ బారంగా వెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా తల్లి!!!

"అమ్మా..." కళ్లల్లో కన్నీటి కుండలు పగిలిపోయాయి. అనసూయమ్మ వస్తూనే కూతుర్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. పదనిమిషాల వరకూ మౌనంగా రోదించారు.

"ఎన్నాళ్లయిందే నిన్ను చూసి... ఇంకా ఇక్కడేం వుందని వుంటున్నావ్. ఆ పాప కోసమే బ్రతుకుతున్నావా?" అనడిగింది గద్గదంగా.

"లేదమ్మా... నీలిమ వెళ్లిపోయింది. వాళ్ల నానమ్మ తీసికెళ్లింది. నాన్నెలా వున్నారు?"

"బాగానే వున్నారు. నీ గురించే బెంగపెట్టుకున్నారు. నిన్ను తీసుకరమ్మన్నారు" అంటూ అప్పటిదాకా సరిగా గమనించని అనసూయమ్మ... నీలిమ కడుపు ఎత్తుగా వుండటంతో అనుమానంగా చూసింది.

తల్లి చూపుల్ని అర్థం చేసుకున్న నీలిమ జరిగిందంతా చెప్పింది.

అంతా విన్నాక తల్లి చీవాట్లు పెట్టింది.

"నీకసలు బుద్ధుందా? ఒకరికి బిడ్డని కనివ్వటమేంటి? లోకం ఏమనుకుంటుందో ఒక్కసారైనా ఆలోచించావా? అసలు తెలిసే చేస్తున్నావా ఈ పని? ఇప్పటిదాకా నీ జీవితం నీటి బుడగలా పగిలిపోయిందని మేం రోజురోజుకీ ఏడుస్తున్నాం. ఆరోజు వద్దన్నా బావని చేసుకున్నావ్. తర్వాత మాకు భారమని భరణిని చేస్కున్నావ్. ఇప్పుడు ఎవరికో బిడ్డని కనివ్వడానికి సిద్ధపడ్డావ్. స్వయంకృతాపరాధం కాకపోతే ఏమిటే ఇదంతా..." అంది కన్నీళ్లు పెట్టుకుంటూ.

"అమ్మా... జరిగిందేదో జరిగింది. నువ్వు అన్నీ గుర్తుచేయకు. కాసేపు నీ ఒళ్లో పడుకోనివ్వు.'

అనసూయమ్మ బిడ్డని ఒడిలో పడుకోబెట్టుకుంది. నీలిమ మౌనంగా కళ్లు మూసుకుంటే...

"నీలూ..." అంది తల్లి.

"ఏంటమ్మా..."

"నువ్వు నాకో మాటివ్వాలి."

"ఏం మాట."

"ఇస్తానంటేనే కోరుతాను."

"ఏంటమ్మా అది"

"నువ్వు వాళ్లెవరికో బిడ్డని కనిచ్చాక... మనింటికి వెళ్లిపోదాం."

నీలిమ చప్పున తల్లి కళ్లల్లోకి చూసింది.

"తల్లిదండ్రులకి బిడ్డలెప్పుడూ బరువుకారమ్మా... ఇప్పటికైనా మాతోనే వుండిపో."

"నన్ను ఆలోచించుకోనివ్వు" అని మళ్లీ కళ్లు మూసుకుంది.

"డెలివరీ ఎప్పుడన్నారు" అడిగింది తల్లి.

"ఏప్రిల్ థర్డ్ వీక్‌లో..."

"నేను మొదటి వారంలో వస్తాను. డెలివరీ అయ్యాక తీసికెళ్తాను. నువ్వు కడుపుతో గనక లేకపోతే ఇప్పుడే ఈడ్చుకుపోయేదాన్ని" అనురాగం, ఆవేశం అనసూయమ్మ మాటల్లో కలగలిపి వస్తున్నాయి.

అప్పుడే నైమిష రాగానే... నీలిమ తల్లిని పరిచయం చేసింది.

అనసూయమ్మ రెండురోజులుండి వెళ్లిపోయింది.

* * * *

ఏడోనెల నిండిపోగానే నీలిమని హాస్పిటల్‌లో జాయిన్ చేసారు.

గైనకాలజిస్ట్ ఝాన్సీమణి ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సులు అతి జాగ్రత్తగా చూసుకుంటున్నారు. నైమిషనైతే తనే బిడ్డని కంటున్నంతగా హడావిడి పడుతోంది.

నీలిమ 'జోలాలి...' పాట మనసులో పాడుకోబోయి... పుట్టబోయే బిడ్డమీద తనకే హక్కులేదనే నిజం గుర్తొచ్చి ఆగిపోయింది.

రెంటెడ్ మదర్‌గా... చాలా విచిత్రమైన స్థితిని ఎదుర్కొంటోంది. అక్రమంగా కనే తల్లిసైతం అలాంటి పరిస్థితిని ఎదుర్కొని వుండదేమో...

ఓరోజు డాక్టర్లు, నర్సులు తనగదిలో హడావిడి పడుతుంటే ఏమిటని అడిగింది నీలిమ ఓ నర్స్‌ని.

"భలేవారే... మీకు తెలీదా? మిమ్మల్ని చూడటానికి హాస్పిటల్ ఛైర్మన్‌గారు ఫ్యామిలీతో వస్తున్నారట" అంది. ఆమాట పూర్తికాగానే తలుపు దగ్గర ఫ్లవర్ బోకేలతో కన్పించారు.

సుచిత్ర... చంద్రప్రభాకర్.

సుచిత్ర దగ్గరకొచ్చి "బెస్టాఫ్‌లక్..." అని ఫ్లవర్‌బోకేలు అందించింది.

"టెస్ట్‌ట్యూబ్ పద్ధతిలో ఈ ఆస్పత్రిలో ఎందరో పాపల్ని కన్నా... తెలుగువారు మాత్రం ఈ పద్ధతిలో ఎవరూ బిడ్డని కనలేదు. ఒక తెలుగు మదర్ టెస్ట్‌ట్యూబ్ బేబీ కనబోతుందని తెల్సి ఆశ్చర్యపోయాం. తీరా రిపోర్టుల్లో మీరని తెలిసాక ఆశ్చర్యపోయి అభినందించకుండా

వుండలేకపోయాం" సుచిత్ర అంది.

చంద్రప్రభాకర్ డాక్టర్లతో మాట్లాడుతున్నాడు.

"మావారు సారీ చెప్పాక కూడా మీకోపం తగ్గలేదనుకుంటాను. చెప్పాను గదా, ఆయనిప్పుడు మునుపటి చంద్రప్రభాకర్ కాదు. ఇలా చనువుగా వచ్చి గ్రీటింగ్స్ చెబుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. బైదిబై.. ఈహాస్పిటల్‌లో ఏ బిల్లు మీరు చెల్లించక్కర్లేదు... అలా అయితేనే మామీద కోపం తగ్గిందనుకుంటాను."

సుచిత్ర మాటలకి నీలిమ నవ్వి 'థాంక్స్' అంది.

తర్వాత వాళ్లు వెళ్లిపోయారు.

ఛైర్మన్ వచ్చివెళ్లిపోవటంతో ఆస్పత్రి సిబ్బంది నీలిమని మరింత కంటికి రెప్పలా చూడటం మొదలెట్టారు.

* * * *

డెలివరీ టైం మరో అయిదు రోజులుందనగా నీలిమ తల్లి అనసూయమ్మ వచ్చింది. బిడ్డని అంటిపెట్టుకునే వుంది.

నైమిష, నిరంజన్ షిరిడీ వెళ్లారు బాబా దర్శనానికి.

డాక్టర్ ఝాన్సీమణి టెస్ట్‌లు చేసి "సిజేరియన్ అక్కర్లేదు. రేపోమాపో నార్మల్ డెలివరీ కావచ్చు" అని చెప్పింది.

కాని అనుకోకుండా ఆరోజు ఉదయాన్నే... నీలిమకి నొప్పులు ప్రారంభమయ్యాయి. కడుపులో బిడ్డ చిరుపాదాలతో నెట్టుతున్న ఒత్తిడి. నడుం పట్టుకొని సుడులు తిరిగిపోతుంటే... ఝాన్సీమణి లేబర్‌రూంకి తరలించింది.

ఏవో ఇంజక్షన్స్ చేసారు.

అరగంట పోరాటం తర్వాత నీలిమ అలిసిపోయింది. ఆ వెంటనే కేర్‌మన్న ఏడ్పు... గుండెల్లో గుడిగంటలై మ్రోగాయి. అరమోడ్పు కన్నులతో పక్కలోని పసిగుడ్డుని ఆప్యాయంగా చూసింది.

నిమ్మపండులా... ముద్దుగా...బొద్దుగా... మగబిడ్డ!!

అయిదు నిమిషాలు చూసిందో లేదో... కళ్లు మూతలుపడి నిద్ర ముంచుకొచ్చింది.

అరగంట తర్వాత మెలకున రాగానే ప్రక్కలోని బిడ్డని చూసుకుంది.

బోసి నవ్వుల్తో ఆడుతున్నాడు. శరీరమంతా కదల్లేనంతగా నొప్పుల్తో వుంది. చుట్టూ చూసింది.

డాక్టర్ ఝాన్సీమణి, తల్లి విషణ్ణవదనంతో కన్పించారు.

అనుమానంగా 'అమ్మా...' అని పిలిచింది.

"నైమిష ఏది? బిడ్డని చూసుకుందా?

అప్పుడు చెప్పింది తల్లి ఉద్విగ్నంగా...

గుండె మంచుముద్దలా గడ్డకట్టుకుపోయే వార్త...

శరీరంలోని ఇనుము కరిగి మంచు సముద్రమైపోయే సంఘటన... బయట ఎక్కడో... బరువైన మబ్బుతునకలు ఢీకొని ఉద్భవించిన తటిల్లత విద్యుత్తును మధిస్తూ గుండెల్లోకి చొచ్చుకుపోయినట్టు...

పిడుగులాంటి మాట...

శరీరం కంపించింది.... నాలుక పిడచకట్టుకుపోయింది.

"బాబా దర్శనం చేసుకొని బొంబాయినించి వస్తున్న నైమిష, నిరంజన్‌ల విమానం కూలిపోయింది. మృతుల్లో వాళ్లు కూడా వున్నట్టు ఇప్పుడే తెల్సింది."

క్షణాలు దౌర్భాగ్యంగా చచ్చిపోతూ నిశ్శబ్దపు గాంభీర్యాన్ని సంతరించుకుంటున్న ఆగదిలో స్మశాన వాతావరణం అలుముకుంది.

భయంగా... జేవురించిన మొహంతో బిడ్డని చేతుల్లోకి తీసుకుంది.

'ప్రస్తుతం ఈ బిడ్డ పరిస్థితేమిటి?'

'బిడ్డ భవిష్యత్తు ఏమిటి?'

అందరి కళ్లలోనూ ప్రశ్నలు...

బిడ్డవైపు నిర్వికారంగా చూసింది నీలిమ. ఏ బాధా తెలియని వాడు నవ్వుతూ కేరింతలు కొడుతున్నాడు.

భగవంతుడా... ఇంకా నామీద కసి తీరలేదా?

మనసు పగిలిపోతోంది.

కన్నీళ్లు కూడా రానంత భయంకర దుఃఖం.

'ఈ బిడ్డని ఏం చేయాలి?'

సుడులు తిరుగుతున్న ఆలోచనలు.

నైమిష నిరంజన్ కనీసం కూడా చూసుకోలేని దురదృష్టకర పరిణామం...

పాపం... నైమిష బిడ్డకోసం ఎంతగా కలవరపడింది?

ఎంత కష్టపడింది?

ఎన్ని కలలుకన్నది?

ఈ బిడ్డని ఇప్పుడేం చేయాలి? ఎవరికి అప్పగించాలి? తన శ్రమకి ఫలితంగా పుట్టిన బిడ్డనేం చేయాలి?

నీలిమలో ఉత్తుంగ తరంగాలై పొంగులెత్తుతున్న కన్నీటి కల్లోలం...

నిర్వేదంగా పసిగుడ్డుని అలాగే చూస్తుండిపోయింది. గుమ్మం దగ్గర అలికిడైతే అంతా అటువైపు చూసారు.

విషాద వదనంతో వచ్చిన సుచిత్ర, చంద్రప్రభాకర్!

"మాకిప్పుడే తెల్సింది. మీత్యాగాన్ని ఆ దురదృష్టవంతులు అందుకోలేకపోయారు. ఈ బిడ్డ మీకు భారమనిపిస్తే... మాకివ్వండి. అపురూపంగా పెంచుకుంటాం. మాకో పాప వున్నప్పటికీ... బాబుని మేం పెంచుకోవడానికి సిద్ధంగా వున్నాము. మీ జీవితానికి బరువు కాకూడదనే ఆ బిడ్డని అడుగుతున్నాము. మరోలా భావించక... ఆలోచించుకోండి" అన్నాడు. చంద్రప్రభాకర్.

"అవును. మా పాపతో సమానంగా బాబుని పెంచుకుంటాం. విధి ఎలా ఆడిస్తుందో గాని... బాబు మా ఇంట్లో మా బిడ్డగా ఆడుకునే అవకాశం ఇవ్వండి. మీ రుణం తీర్చుకోనివ్వండి" సుచిత్ర అంది.

నీలిమకేం చేయాలో పాలుపోలేదు.

తల్లి దగ్గరగా వచ్చి చెవిలో చెప్పింది.

"అవునమ్మా... ఇప్పటికే నీ జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. ఇంకా ఈ బిడ్డతో కూడా నువ్ కష్టాలు పడితే మేం చూళ్లేం. ఏమీ ఆలోచించకుండా బాబుని వాళ్లకిచ్చేయ్. మన వూరెళ్లిపోదాం..."

మంచు తుఫాన్‌లో చిక్కుబడిపోయినట్టు... మొద్దుబారిపోయింది నీలిమ మనసు.

ఇంకా ఆలోచిస్తే... మెదడు నరాలు చిట్లిపోతాయేమో అన్నంత బాధ.

ఓ కన్నీటి చుక్క బిడ్డపై పడింది.

ఒక్క ముద్దు...

ఒకే ఒక్క ముద్దు... బాబు నుదుటిపై అద్దింది.

తన సర్వస్వాన్ని ధారబోస్తున్నట్టుగా...

నిదానంగా... బిడ్డని సుచిత్ర చేతుల్లో పెట్టింది.

* * * *

బస్సు కదిలింది-

నీలిమ తల్లి ప్రక్కనే సీట్లో వాలిపోయి కళ్లు మాసుకుంది. బస్సులో వేసిన కేసెట్‌లోంచి ఓ లలితగీతం విన్పిస్తోంది.

'అత్తారింటికి దారేదమ్మా...

ఉరుకుల పరుగుల గోదారమ్మా...'

ఆ పాట వింటూ... బరువు గుండెల్లోని బాధనంతా కనుకొసల్లోని కన్నీటి బొట్టులోకి

చేర్చి... మనసు తగలబడిపోతుంటే... కుప్పకూలుతున్న దుఃఖాన్ని ముంచేసి... మండే గాయాల మైలురాళ్లని దాటి... అదుపు తప్పి అగాధంలోకి జారిపోయిన జీవితంలా... కన్నీటి బొట్టు కదిలిపోయి...

గుండెల మీద పడి ఇంకిపోయింది.

పోనీ... పోనీ... పోతేపోనీ...

With Best Complimets From



Dr. L. Ram Reddy
M.S.(Osm)

Dr. L. Geeta Reddy
M.B.B.S. DGO.

KARIMNAGAR

AMRITA SURGICAL NURSING HOME

With Best Complimets From

KARINAGAR HOSTELS
INTER & DEGREE
Vavilalapally, KARINAGAR

Addandi Prakash
Correspondent/Management
Phone: 20960

With Best Complimets From



SRI VENKATA DENTAL HOSPITAL

KARIMNAGAR

Dr. L. Raja Bhaskar Reddy

B.D.S., M.D.S., (Osm)

DENTAL SURGEON

With Best Complimets From

& Office: 22533
Plant: 21719

Resi. B. HariBabu 23933
M. Rajanna 22719

Navya SEEDS (P) Ltd.,

Near R.T.C. Bus Depot, **JAGTIAL**-505 327.
Dist: Karimnagar. (A.P.)

Regd. Office:

Plot.6 1st Flooor, New Vasavi Nagar,
Kharkhana, **SECUNDERABAD**-500 015,
Phone: 040-7740574.

All kinds of Paddy, Hybrid Maize Seeds available

With Best Complimets From

FERTILIZERS PESTICIDES & SEEDS
DEALERS ASSOCIATIONS

Phone: 21133	Phone: 21144
Bashetti HariBabu	**Erra Thirupathi**
President	Secretary

With Best Complimets From



Dr. L. Ram Reddy
M.S.(Osm)

Dr. L. Geeta Reddy
M.B.B.S. DGO.

KARIMNAGAR

AMRITA SURGICAL NURSING HOME

With Best Complimets From

KARINAGAR HOSTELS

INTER & DEGREE
Vavilalapally, KARINAGAR

Addandi Prakash
Correspondent/Management
Phone: 20960

With Best Complimets From



SRI VENKATA DENTAL HOSPITAL

KARIMNAGAR

Dr. L. Raja Bhaskar Reddy

B.D.S., M.D.S., (Osm)

DENTAL SURGEON

With Best Complimets From

Office: 22533
& Plant: 21719
Resi. B. HariBabu 23933
M. Rajanna 22719

Navya SEEDS (P) Ltd.,

Near R.T.C. Bus Depot, **JAGTIAL**-505 327.
Dist: Karimnagar. (A.P.)

Regd. Office:
Plot.6 1st Flooor, New Vasavi Nagar,
Kharkhana, **SECUNDERABAD**-500 015,
Phone: 040-7740574.

All kinds of Paddy, Hybrid Maize Seeds available

With Best Complimets From

FERTILIZERS PESTICIDES & SEEDS
DEALERS ASSOCIATIONS

Phone: 21133	Phone: 21144
Bashetti HariBabu	**Erra Thirupathi**
President	Secretary

With Best Complimets From

Phone: 21619, 21019

శ్రీరాం జువెల్లర్స్

టవర్ సర్కిల్, జగిత్యాల - 505 327.

మా వద్ద వెండి, బంగారు ఆభరణములు
అందమైన డిజైన్‌లలో సరసమైన ధరలకు
తయారు చేసి ఇవ్వబడును.

With Best Complimets From

MEGHA COMPUTERS

Thahasil Chowrastha, **JAGTIAL**-505 327

Vanamala Sahadev

With Best Compliments From



Vanamala Chandra Shekhar
Mandal Revenue Officer (Mallial)
JAGTIAL

With Best Compliments From



Smt. Israt Sultana
Lecturer
Girls Junior College
KARIMNAGAR

With Best Compliments From

Radha Krishnaiah (D.E.O.)
District Educational Officer
Karimnagar Dist.

With Best Compliments From

Y.S. Sharma
Dist. President - APPTA
Andhra Pradesh Primary Teachers Association
Karimnagar

With Best Complimets From

N. Laxma Reddy
Dist. President-PRTU
PANCHAYAT RAJ TEACHERS UNION
KARIMNAGAR

With Best Complimets From

B. Raghu Kishor
Dist. Secretary - UTF
UNITED TEACHERS FEDERATION
Karimnagar